శ్రీమతే రామానుజాయ నమః



# అమృతవర్షిణి

## తిరుప్పల్లాండు - గ్రన్థావతారిక

సంస్కృత వేదమునకు బీజభూతమైన ప్రణవమును వేదాధ్యయన ప్రారంభ కాలమున, సమాప్తి కాలమున కూడ "హరిః ఓం" అని హరిశబ్దముతో కలిపి ఉచ్చరించుట ప్రసిద్ధమై యున్నది. అట్లే ద్రవిడ వేదములు అనబడు ఆళ్వారుల దివ్య ప్రబన్ధములను అధ్యయనము చేయునపుడు ఆరంభముననూ, అధ్యయన సమాప్తిలో భగవత్సన్నిధానమున "శాత్తుముఱై" అను క్రమమున చివరకు కూడా శ్రీ విష్ణుచిత్తులు అనబడు పెరియాళ్వారుల ప్రబంధమైన ఈ పల్లాణ్డును అనుసంధించుట సంప్రదాయసిద్ధమైయున్నది. దీనినిబట్టి వేదమునకు ప్రణవము వలె దివ్య ప్రబంధములకు ఈ పల్లాణ్డు ప్రబన్ధము సారభూతమై మంగళార్థకమగు చున్నది. ఆద్యంతములలో ఓంకారరహితముగా చేయబడిన వేదాధ్యయనము నిష్ప్రయోజనమని శాస్త్రములందు చెప్పబడినది. అట్లే శ్రీ వరవరమునీన్ద్రులు ఉపదేశరత్నమాలా ప్రబన్ధమున "కోదిలవాం ఆళ్వార్గళ్" అను పాశురమునందు ద్రవిడ ప్రబన్ధ అధ్యయనారంభమున ప్రణవమువలె దీనిని పఠించుట ఆవశ్యకమని తెలిపి ఇది లేకుండా ఏ దివ్యప్రబంధమును కూడా అధ్యయనము చేయరాదని సూచించిరి. దీనినిబట్టి దివ్య ప్రబన్ధములలో ఈ గ్రన్థమునకు అత్యంత ప్రశస్తి కలదని తేలినది. సుమారు నాలుగువేల సంఖ్యగల ఆళ్వారుల ప్రబన్ధములన్నింటికీ వ్యాఖ్యానమును ప్రసాదించిన పెరియవాచ్చాంబిళ్లై అనబడు ఆచార్యులు పన్నెండు పాశురములు గల ఈ ప్రబన్ధమునకు సంప్రదాయార్థగర్భితమైన విపుల వ్యాఖ్యానమును ప్రసాదించిరి. ఇందలి పాశురములలోని ప్రతి పదమునకు నిగూఢమగు తాత్పర్యమును విశదీకరించిన ఆ వ్యాఖ్యానము పరమ ప్రామాణికమై పెద్దలచే పరిగ్రహింపబడినది. ద్రవిడ ప్రబన్ధములపై వారి వ్యాఖ్యానములే అవతరించని ఎడల ఆళ్వారుల అంతరంగ భావమును అవగాహనమొనర్చుకొనుటకు ఈనాడు ఎవరికినీ సాధ్యమయ్యెడిది కాదు అని వరవరమునీన్ద్రులు ఉపదేశరత్నమాలలో తెలిపియున్నారు. ప్రశస్తమైన రత్నమును

దాచుటకు అందమైన భరిణ అవసరమైనట్లు తిరుప్పల్లాండులోని సారమును తనలో ఇముడ్చుకొన్న వీరి వ్యాఖ్యానము సువర్ణపేటిక వంటిది అని గ్రహింపదగును. శ్రీవైష్ణవ సంప్రదాయనిష్ఠులైన భాగవతులందరకునూ ఈ ప్రబన్ధమును గురించి అర్థావగాహన కలుగుటకై ఆ వ్యాఖ్యానములోని అర్థ విశేషములను విశదముగా ఆంధ్రభాషలో వివరించుట ఆవశ్యకమని భావింపబడినది.

వ్యాఖ్యానకర్తలు ఎవరైనను మొదట అవతారికా రూపమున గ్రన్థకర్తయొక్క ప్రశస్తిని, గ్రన్థములో ప్రతిపాదింపబడు విషయవైలక్షణ్యమును, ఆ గ్రన్థరచనకు గల కారణమునూ వివరించుట ఆచారమైయున్నది. అదే విధముగా వ్యాఖ్యానారంభమున వ్యాఖ్యాతృ చక్రవర్తియగు పెరియవాచ్చాంబిళ్లై స్వామివారు ద్రవిడములో మధురమగు అవతారికను ప్రసాదించియున్నారు. దాని సారాంశమేమనగా –

**అవతారిక :**

తైత్తిరీయములోని నారాయణానువాకము **"పతిం విశ్వస్య ఆత్మేశ్వరం"** అనియు శ్వేతాశ్వరోపనిషత్తు **"తమీశ్వరాణాం పరమం మహేశ్వరం"** అనియూ పరమాత్మ యొక్క స్వరూపమును నిర్ణయించినవి. విశ్వమునకు ఆయన స్వామి, సర్వస్వతంత్రుడైన ఆయనకు పైన మరొక ఈశ్వరుడు లేడు. ఈశ్వరులు అని చెప్పబడు సర్వదేవతలకు కూడ ఆయన మహేశ్వరుడు అని పై ఉపనిషద్వాక్యములకు భావము. ఆ వాక్యములలోని "పతి" శబ్దము "ఈశ్వర" శబ్దము పరమాత్మయొక్క స్వామిత్వమునూ (అధికారమునూ), నియంతృత్వమునూ తెలుపుచున్నవి. **"తేన వినా తృణమపి న చలతి"** అను సంస్కృత న్యాయ ప్రకారము అంతర్యామియగు పరమాత్మయొక్క సంకల్పము లేనిచో ఏ పదార్థముకూడ చలింపజాలదు అనుటనుబట్టి ఆయన సర్వనియామకుడు అని తెలియుచున్నది.

అట్లే **"యస్యాస్మి"** అను యజుర్వేదవాక్యమునుబట్టియు, **"పరవానస్మి"** అను రామాయణ వాక్యమునుబట్టియు **"దాసోహం వాసుదేవస్య"** అను స్మృతి వాక్యమును బట్టియు జీవస్వరూపము పరమాత్మకు పరతంత్రమైనది అని నిర్ణయింపబడియున్నది. ఇట్లు జీవేశ్వర స్వరూపమును బాగుగా ఎరిగిన పిదప ఆ జ్ఞానమునకు తగినట్లుగా భగవత్పరతంత్రులై సర్వజీవులును ఆయననారాధించి ఉజ్జీవించుట కర్తవ్యమైయున్నది.

కాని అచేతనమైన త్రిగుణాత్మకమైన ప్రకృతియందు అనాదిగా కలిసిపోయి యున్న జీవులు ఆ ప్రకృతి సంబంధ ప్రభావమునుబట్టి స్వస్వరూపమును ఎరుగలేక ఆ ప్రకృతితో తమను అభిన్నముగా భావించుచున్నారు. వారికి ప్రకృతితోగల సంబంధము అయఃపిండమునకు అగ్నిసంసర్గమువలె అవిభాజ్యమైనది. అగ్నిలో ప్రక్షిప్తమైన అయఃపిండము (ఇనుపగుండు) కొంతసేపటికి తనలోగల నీలరూపమును కాఠిన్యమును కోల్పోయి అగ్నితాపాధిక్యముచే అగ్నివంటి భాస్వరవర్ణమును పొంది, మార్దవమునుగూడ పొంది ఇది అగ్నిపిండమే అని చెప్పదగినట్లుగా అభేద జ్ఞానహేతు వగుచున్నది. అట్లే సహజముగా జ్ఞానానందస్వరూపుడై భగవత్పరతంత్రుడైన జీవుడు గూడ అనాది ప్రకృతి సంసర్గముచే ఆచ్ఛాదితమైన తన స్వరూపమును గుర్తింపలేక ప్రకృతి కార్యమగు ఆయా దేహ సంబంధమునుబట్టి "దేవోహం" "మనుష్యోహం" అని తనను ఆయా దేహస్వరూపముగనే భావించుచున్నాడు. దేహాత్మాభిమాన రూపమైన ఇట్టి అజ్ఞానమునకు తోడుగా అతనిలో పుత్ర-మిత్ర-కళత్ర-క్షేత్రాదుల యందు మమతాబుద్ధి కూడ పెరిగినది. అనాదిగా ప్రవాహరూపమున వచ్చు ఈ అహంకార మమకారములచేత అతనిలో నేనే స్వామినని సర్వనియంతననియూ దృఢమగు దుర్బుద్ధి ఏర్పడినది. ఈశ్వరునికి చెందిన స్వామిత్వమును నియంతృత్వ మును తనపై ఆరోపించుకున్నాడు. సహజముగా తాను "భగవత్పరతంత్రుడను" అను సంగతి మరచినాడు. ఈ అచిత్సంబంధ ప్రభావము అతనికి సన్నిహితములైన రూపరసగంధాది విషయములపై భోగ్యతాబుద్ధిని కలిగించి వాటిపై గాఢమగు ప్రేమను, తనవలెనే వాటిని అపేక్షించు ఇతరులపై ప్రబల ద్వేషమును పుట్టించి క్రమక్రమముగా అనేక దుఃఖపరంపరలకు కారణమైనది. ఇట్లు అజ్ఞానముచే జన్మ జరామరణరూపమైన దుఃఖపరంపరలో పడి కొట్టుమిట్టాడుచున్న జీవులను చూచి పరమదయాళువైన ఈశ్వరుడు వీరికి తత్త్వమును తెలిపి "ఈ విధముగా నడుచుకొనుడు" అని హితమును బోధించి ఉజ్జీవింపజేయుటకై శాస్త్రమను దీపమును ప్రసాదించినాడు. శ్రీశ్రీ పరాశర భట్టరువారు శ్రీరంగరాజస్తవమున ఉత్తరశతకమునందు ఈ విషయమును క్రింది శ్లోకమున వివరించియున్నారు.

**శ్లో॥ హర్తుం తమః సదసతీ చ వివేక్తుమీశః**
**మానం ప్రదీపమివ కారుణికో దదాతి ।**
**తేనావగత్య కృతినః పరిభుంజతే తం**
**తత్రైవ కేఽపి చపలాః శలభీభవంతి ॥**

మానం అనగా ప్రమాణమైన శాస్త్రము. దయాశాలియగు ఈశ్వరుడు ఏది మంచియో ఏది చెడ్డదియో విడమరచి తెలిసికొనుటకై మరియు అజ్ఞానమను చీకటిని తొలగించుకొనుటకై ఈ శాస్త్రప్రమాణమను దీపమును మానవులకు ప్రసాదించినాడు. చీకటిలో అలమటించువాడు దీపమును గైకొని చీకటిని పారద్రోలి ఆయా వస్తువులను గుర్తించి కావలసిన వాటిని స్వీకరించి దుఃఖహేతువైలన వాటిని విసర్జించునట్లు జీవుడు కూడ ఈ శాస్త్రమను దీపముచేత తనలోని అజ్ఞానమును తొలగించుకొని ఈశ్వర స్వరూపమును జీవస్వరూపమును నిష్కర్షించుకొని కష్టహేతువు అయిన ప్రకృతి సంబంధమును త్యజించి, తనను సేవించగలడనియూ (ఉపాసించగలడనియూ) ఆ విధముగ తన సన్నిధికి చేరగలడనియూ భగవంతుడు అభిప్రాయపడెను. విజ్ఞానవంతులైన మహాత్ములు ఆ శాస్త్రమును స్వీకరించి ఏ కొందరో ఉజ్జీవించగలిగిరి. కానీ చపలబుద్ధిగల అనేకులు ఆ శాస్త్రమును ద్వేషించి దీపముపైబడి నశించిన మిడతలవలె వినాశమునే పొందిరి. వారిలో అట్టి సద్బుద్ధి కలుగకపోవుటకు కారణము పలుజన్మముల నుండి జిడ్డువలె పట్టుకొనియున్న వాసనా రూపమగు దుస్సంస్కారము.

ఈ విధముగా తన ఆజ్ఞారూపమైన శాస్త్రము ప్రజలపై పనిచేయకపోవుటచే ఈ జనులనుద్ధరించుటకై ఈశ్వరుడు మరొక ఉపాయమును పన్నెను. అహంకారముచే తన ఆజ్ఞను ధిక్కరించిన దేశముపై చక్రవర్తి తానే స్వయముగా దండెత్తి పోయినట్లు ఈశ్వరుడు స్వయముగా ఈ జీవులను దిద్దుబాటు చేయుటకై రామకృష్ణాది రూపమున అవతరించెను. ఆ అవతారములలో తాను కొన్ని ధర్మములను ఆచరించి లోకులకు తాను ఆదర్శమై తనవలె వారు వ్యవహరించగలరని ఆయన భావించెను. రాముడుగా అవతరించి **"పితుర్వచన నిర్దేశాత్ - భరద్వాజస్య శాసనాత్"** అన్నట్లు పిత్రాజ్ఞా పరిపాలనము అట్లే పెద్దల ఆదేశములను పాటించుట ఇవి ఉత్తమ ధర్మములని చాటెను. ఇక లక్ష్మణునిద్వారా తన స్వామి సన్నిధిలో నిష్కళంక భక్తితో సేవను చేయుటయే (శేషవృత్తియే) జీవుని ముఖ్యధర్మమని ప్రకటింపజేసెను. ఇక

**"రాజ్యంచ అహంచ రామస్య"** నేను, ఈ రాజ్యము కూడ రామునికి పరతంత్రులమే గనుక నాకు పరిపాలనార్హత లేదని త్రోసిపుచ్చిన భరతుడు మారుమాటాడక రాముని ఆజ్ఞకు పరతంత్రుడై వర్తించినట్లు జీవుడును వర్తింపవలెనని పారతంత్ర్యము అను గుణమును చాటిచెప్పెను. భగవత్పరతంత్రుడైన భరతునికి విధేయుడగు శత్రుఘ్నుని ద్వారా భాగవతులకు పరతంత్రుడై యుండుట అత్యుత్తమ ధర్మమని నిరూపించెను.

ఇక కృష్ణావతారమునందునూ పాండవులకు దూతగనూ, సారథిగనూ వర్తించి తనయొక్క భక్తపరాధీనతను వెలువరించెను. అంతేగాక **"యద్యదాచరతి శ్రేష్ఠః"** అని భగవద్గీతలో తానే చెప్పినట్లు అనేక ధర్మములను ఆచరించుటయేగాక ఉపదేశించిగూడ ఈ జీవరాసులనుద్ధరించుటకై ఎంతో పాటుపడెను. కాని భగవంతుడు చేసిన రెండవ ప్రయత్నముగూడ విఫలమైనది. సర్వజగత్కారణ భూతుడైన వ్యక్తి మనకు అతి సులభుడై అనుగ్రహించుచున్నాడు గదా అను జ్ఞానము లేని ఈ మూఢచేతనులు ఆయనయొక్క సౌలభ్యమును గుర్తించలేక **"అవజానంతి మాం మూఢాః"** అన్నట్లు ఆయనను అసమర్థుని క్రింద జమకట్టిరి. అపుడు ఈశ్వరుడు తన రెండు ప్రయత్నములుగూడ ఫలించకపోవుటచేత కొత్త ఉపాయమును పన్నెను. క్రూరములైన సింహ వ్యాఘ్రాది జంతువులను వశము చేసుకొనదలంచినవాడు సులభముగా వాటిని పట్టుకొనుటకై మరియొక మృగమును ఎరగా చూపి ఆ క్రూర జంతువులను బోనులో పడునట్లు చేసుకొనును. అట్లే ఈశ్వరుడునూ కొందరు మహానుభావులను ఈ జీవులతో సమానముగా లోకమందు అతరింపజేసి వారి ఉపదేశములచేతను అనుష్ఠానములచేతను ఈ ప్రజలను సన్మార్గనిష్ఠులను చేయ దలంచెను. తనతో సజాతీయులైనవారిని చూచి తానుకూడ నట్లే వర్తించి బాగుపడ వలెనని ఆశించుట జీవవర్గమున ఉండు సహజధర్మముగదా! ఆ అభిప్రాయముతోనే పరమాత్మ పలువురు ఆళ్వారులను అవతరింపజేసెను. అట్టివారిలో ఈ ప్రబంధ నిర్మాతయగు శ్రీ విష్ణుచిత్తులు ముఖ్యులు. ఇంతవరకు చెప్పబడిన ఈ ఉపోద్ఘాతమును బట్టి శాస్త్రావతరణముచేతగానీ స్వయముగా అవతరించుటచేతగానీ సాధ్యముగాని చేతనోజ్జీవనమును పరమాత్మ ఈ ఆళ్వారులద్వారా సాధింపగలిగినాడు అనుటచేత వీరి ఉపదేశ రూపములైన ప్రబన్ధములలో ఎంతటి ప్రభావము కలదో తేటతెల్ల మగుచున్నది.

## శ్రీ విష్ణుచిత్తుల వైభవము :

లోకసంరక్షణకై భగవంతుడే ఈ పెరియాళ్వారులను అవతరింపజేసినాడని చెప్పుకున్నాము. వీరు శ్రీవిల్లిపుత్తూరునందు పురశ్శిఖులు అనబడు ఒక సద్బ్రాహ్మణ శాఖలో అవతరించిరి. జీవరాశి అంతయూ పరమాత్మకు పరతంత్రమైనది అను వాస్తవమును ఎరిగిన వీరు తమ దాస్యమునకు తగినట్లు భగవత్సన్నిధానమున కైంకర్యమును చేయుచు జీవితకాలమును గడపదలచి తాము ఎట్టి కైంకర్యము చేయుట మంచిదాయని విచారించిరి. తమకు ఇష్టమువచ్చినది కాక భగవంతునికి ఇష్టమైన సేవయే తమకు కర్తవ్యమని నిర్ణయించుకొని రామకృష్ణాద్యవతారములలోని కొందరు భక్తుల చరిత్రలను పరామర్శించుకొని కృష్ణావతారమునందలి మాలాకారుని సేవయే తమకునూ ఆచరణీయమని గుర్తించిరి. కంసునికి సేవచేయుచు జీవించు చున్న మాలాకారుని గృహమునకు బలరామునితో కలిసి వెళ్ళిన కృష్ణుడు అతడు గ్రుచ్చిన మాలికల సౌందర్యమును చూచి వాటిని తనకిమ్మని కోరెను. ఈ బలరామ కృష్ణుల సౌందర్యమునుజూచి ఇంతకుముందే వీరి ప్రభావమును తెలుసుకొనియున్న మాలాకారుడు –

**శ్లో॥ ప్రసాదపరమౌ నాథౌ మమ గేహ ముపాగతౌ ।**
**ధన్యోహమర్చయిష్యామీ త్యాహ మాల్యోపజీవనః ॥**

అని ఆనందాతిరేకముతో కీర్తించినాడట. మూర్తీభవించిన దయాస్వరూపులైన ఈ బలరామకృష్ణులు అత్యల్పవ్యక్తినగు నా ఇంటికి విచ్చేసిరి గదా! ఏమి నా అదృష్టము! అని ఉప్పొంగివచ్చు ఆనందముతో తాను అల్లిన పుష్పమాలికలను వారికి సమర్పించి నాడట. అట్లే నేను కూడా స్వామికి పుష్పమాలాకైంకర్యమును చేయుదునని అపేక్షించిన ఈ ఆళ్వారులు ఒక చిన్నతోటను ఏర్పరచుకొని అందు తులసీ పుష్ప వృక్షములను పెంచుచూ నిత్యము మాలికలను కట్టి స్వామికి సమర్పించుచుండిరి. ఇట్లు నిరంతర భగవత్కైంకర్యమును చేయుచుండిన వీరికి భావనా విశేషమునుబట్టి తక్కిన ఆళ్వారులందరికంటె ఒక ప్రత్యేకత కలదు. అది ఏమనగా భగవంతుని దర్శించిన క్షణమున ఆ ఆళ్వారులందరునూ ఆయనవలన తమకు ప్రాకృతదుఃఖము తొలగిపోవలెనని, మోక్షము లభించవలెనని అపేక్షించిరి. ఇట్లు వారు భగవంతుని

వలన తమకు శ్రేయస్సు కలుగవలెనని అపేక్షింపగా ఈ ఆళ్వారులు మాత్రము భగవద్దర్శనమైనపుడు ఆయనయొక్క సౌందర్య సౌకుమార్యములకు పరవశులై తమ యోగక్షేమములను గుర్తింపక స్వామికి స్వామియొక్క పరివారమునకునూ మంగళము కలుగవలెనని పాడుచూ భగవత్సమృద్ధియే తమకు అపేక్షితమైన పురుషార్థమని పేర్కొనిరి. దీనినిబట్టి తక్కినవారు స్వసమృద్ధిని అపేక్షింపగా వీరు పరసమృద్ధిని అపేక్షించిరని వీరిలోగల భావనావిశేషము ప్రస్ఫుటమగుచున్నది. ఈశ్వరుడనే రక్షకుడని ఎంచి ఆయన వలన తమలోనుండు సంసారభయవిముక్తిని తక్కినవారు సాధించుకొనగా, వీరు యీ ప్రకృతిమండలమున ఉండు దుష్టవర్గముచేత స్వామికి ఏమి అపాయము కలుగునోయని ఆశంకించి స్వామికి తాము రక్షకులుగా నిలచి మంగళాశాసనమును చేయుచున్నారు. ఉన్మస్తకమగు భక్తివిశేషముచేత రక్ష్యరక్షక భావము వీరి విషయమున తారుమారైనది. ఆళ్వారులకంటె వీరిలో ఒక ప్రత్యేకత ఉన్నట్లు, ఆ ఆళ్వారుల ప్రబన్ధములకంటె వీరి ప్రబన్ధములలోగూడ ఒక విశిష్టత కలదు.

సంస్కృత భాషామయమైన వేదవేదాంతములుగాని, వాటికి ఉపబృంహణము లైన ఇతిహాస పురాణములుగాని ఏ కొందరికో మాత్రమే అధ్యయనము చేయుటకు, ఆచరణమునకు అధికారము నిచ్చుచున్నవి. ఆళ్వారుల దివ్యప్రబన్ధములు అట్లుగాక అందరికినీ అధ్యయన యోగ్యములై భగవత్సేవకు అర్హత కలదని నిరూపించుచున్నవి. ఈ ఆళ్వారుల ప్రబన్ధములలో నమ్మాళ్వారులు ప్రసాదించిన తిరువాయ్మొழி అను గ్రన్థము అతి ప్రశస్తమైనది. సుమారు పదకొండువందల పాశురములుగల ఈ ప్రబన్ధము అధ్యయనము చేసినపుడు పరతత్త్వమెవడు? అని నిర్ణయించుకొనుటకు కొంత శ్రమపడవలసివచ్చును. ఆ గ్రన్థారంభమున **'అరి' 'అయన్' 'అరన్' 'ఎన్నుమివరై'** అనియూ **'ఒన్ఱనుమ్మనత్తువైత్తు'** అనియూ వారు ఉపదేశించియున్నారు. హరి-బ్రహ్మ-హరుడు అను ఈ ముప్వురిలో ఏ ఒకరిపైననైనను మీ మనస్సునుంచి ఆరాధింపుడు అని ఈ వాక్యములనుబట్టి తెలియుచున్నది. అట్లే ఆ గ్రన్థమున ఉపసంహారములో **'మునియే నాన్ముకనే ముక్కణ్ణప్పా'** అని ఒకే పరమాత్మను బదరికాశ్రమమున మునిరూపమున ఉన్న నారాయణా అనియూ చతుర్ముఖా అనియూ త్రినేత్రుడా అనియు వారు సంబోధించియున్నారు. ఈ ఉపక్రమ ఉపసంహారములను బట్టి త్రిమూర్తి సామ్యమును తీర్చుకొనుటకై కొంత శాస్త్రచర్చలు చేసి సమాధానములు

లభించుకొనవలసియుండును. సర్వస్వామియగు భగవంతుడు ఆయా అవతారములలో రఘువంశ రాజులతో సజాతీయుడుగనూ, యదువంశరాజులతో సజాతీయుడుగనూ ఆవిర్భవించి తన సౌలభ్యమును ప్రకటించుకొన్నాడు గదా! అట్లే దేవతల మధ్య తానుగూడ ఒక్కడుగా మెలగుచూ బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులలో ఈయన కూడ ఒకడు అన్నట్లు తన సౌలభ్యమును ఆవిష్కరించుకొనుటకై ఉపేంద్రాది రూపమున అవతరించినాడనియూ, దీనినిబట్టియే ఈ త్రిమూర్తులు సమానులు కాబోలు అను అపోహ కలుగుటకు అవకాశమేర్పడుననియూ, వాస్తవమునకు ఈ అవతారముల నెత్తిన పరమాత్మ ఆ బ్రహ్మ రుద్రాదులకంటె అతీతుడై వారికి గూడ సృష్టికర్తయనియూ పరతత్వనిర్ణయమును చేయవలసియుండును. ఈ నమ్మాళ్వారులే వేంకటాచలమున వేంచేసియున్న శ్రీనివాసుని స్తుతించుచూ "నోలాదాత్తేన్" అను పాశురమునందు సూక్ష్మజ్ఞానము కలవాడైన రుద్రుడునూ, వేదాధ్యయనములందు పూర్ణతనొందిన చతుర్ముఖుడునూ, త్రిలోకాధిపతియగు ఇంద్రుడునూ తమ పరివారముతో వచ్చి నిన్ను సేవించుచున్నారని వర్ణించియుండుటచేత ఈ ఆళ్వారులు నారాయణపరత్వమును స్పష్టముగా అంగీకరించినారనియూ, వారు చెప్పిన త్రిమూర్తి సామ్యమునకు భగవంతునికి సౌలభ్యమును ప్రకటించుటలో తాత్పర్యమేగాని ఆయనయొక్క పురుషోత్తమత్వమునకు భంగము ఏమియు లేదనియూ సమన్వయమును చేసుకొనవలసి వచ్చినది. ఆ నమ్మాళ్వారులే 'నీఱాయ్' 'నిలనాయ్' అనియూ 'శివనాయ్' 'అయనాయ్' అనియూ కొన్ని పాశురములలో కీర్తించుచూ, నీవే జలస్వరూపుడవు, నీవే బ్రహ్మవు అని చేతనాచేతన పదార్థములతో పరమాత్మను అభిన్నముగా వ్యవహరించియున్నారు. ఇందులకు కారణమేమని విచారించినపుడు ఆయన సర్వపదార్థములలోను అంతర్యామిగా వ్యాపించియున్నందున ఈ పదములన్నియూ ఆ అంతర్యామికే వర్తించుననియూ పరమాత్మకూ వాటికినీ గల విడదీయరాని అవినాభావ సంబంధమే అందులకు కారణమనియూ సమాధానము చెప్పుకొనవలసియుండును. ఇట్లు నమ్మాళ్వారుల ప్రబంధములలోనూ, తక్కిన ఆళ్వారుల గ్రన్థములలోను తాత్పర్య నిర్ణయమునకై కొంత శ్రమపడవలసిన గ్రంథగ్రంధులు కలవు. ఈ విష్ణుచిత్తుల ప్రబంధమునందు అట్లు శ్రమపడవలసిన అవసరము లేకుండా అష్టాక్షరీ వివరణ పూర్వకముగా నారాయణ పరత్వమును అతిస్పష్టముగా పాఠకులు గ్రహింపగలరు. అట్లే ఈ పల్లాణ్డు ప్రబన్ధము మహాభారతాదులవలె అతి విస్తృతముగాక ఓంకారము

వలె అతి సూక్ష్మముగూడ కాక పన్నెండు పాశురములతో కూర్చబడి సకల వేదార్థములనూ స్పష్టముగా వివరించుచున్నది. శ్రీమన్నారాయణుడే పరతత్త్వమనియూ, ఆయన యొక్క సేవయే ఉత్తమపురుషార్థమనియూ, లౌకికమై నశ్వరమైన ఐశ్వర్యముగానీ, భగవత్సంబంధములేని కేవలాత్మానుభవ రూపమగు కైవల్యమను మోక్షముగాని పురుషార్థములు కావనియు ఈ ప్రబన్ధమున వివరింపబడినది. ఈ ప్రబన్ధమును నేర్చుకొన్నవారికి పరమాత్మ కరతలామలకమువలె స్వాధీనుడగుననియూ, ఆయన యొక్క అనుగ్రహముచే నిత్యమగు శ్రీవైకుంఠమున అనంత గరుడ విష్వక్సేనాదులవలె భగవత్కైంకర్య సామ్రాజ్యము పొందగలరనియూ ఫలము నిరూపింపబడియున్నది.

ఇక ఇట్టి గ్రంథమును వీరు రచించుటకు కారణమైన సందర్భమేదో వివరించెదము. ఒకప్పుడు పాండ్యదేశపు రాజైన శ్రీవల్లభదేవుడు ధార్మికుడై రాజ్యము నేలుచుండెను. అతడు నిత్యమును మారువేషములో రాత్రి సమయములలో రాజ్యములోని విశేషములను తెలుసుకొనుటకై ప్రచ్ఛన్నరూపుడై తిరుగుచుండెను. అట్లు మధురానగరమున తిరుగుచుండిన ఆ రాజునకు ఒకనాటి రాత్రియందు అరుగుపై పడుకొనియున్న పరదేశీయుడైన ఒక బ్రాహ్మణుడు కనపడెను. అతనివద్దకు వెళ్ళి ఈ రాజు అతని యోగక్షేమాదులను తెలుసుకొని ఏదైన ఒక మంచి శ్లోకమును చెప్పుమని అడుగగా ఆ బ్రాహ్మణుడు ఈ క్రింది శ్లోకమును చదివెను.

**శ్లో॥ వర్షార్థమష్టౌ ప్రయతేత మాసాన్**
**నిశార్థమర్థం దివసం యతేత**
**వార్ధక్య హేతోః వయసా నవేన**
**పరత్ర హేతోః ఇహ జన్మనా చ ॥**

మానవుడు వర్షాకాలమున నాలుగు మాసములు ఇల్లు కదులుటకు సాధ్యము కాదు కావున ఆ నాలుగు మాసములకు కావలసిన సామగ్రినంతయూ పై ఎనిమిది మాసములలో సంపాదించుకొని దాచుకొనవలెను. ఒక రోజులో సగమైన రాత్రియందు హాయిగా తిని విశ్రాంతి తీసుకొనుటకై పగలంతయు శ్రమపడవలెను. ముసలితనమునందు కాలుసేతులు పనిచేయని స్థితిలో సుఖముగా నుండుటకై యౌవన వయస్సులోనే తగిన సౌకర్యములను సమకూర్చుకొనవలెను. పరలోకమునందు శాశ్వతస్థితిని పొందుటకై అన్ని సౌకర్యములుగల ఈ మానవజన్మలోనే ప్రయత్నించ

వలెను. అని ఈ శ్లోకమునకు భావము. ఇందు పై మూడు పాదములలో మూడు దృష్టాంతములను చెప్పి అదేవిధముగా పరలోకమున తనకు రావలసిన సద్గతికై ఈ జన్మలోనే మానవుడు ప్రయత్నించవలెనని, అపుడే జన్మ సార్థక్యమని శ్లోకమునకు సమన్వయము చేసుకొనవలెను. ఈ శ్లోకమును విన్నవెంటనే రాజుయొక్క మనస్సులో మార్పు కలిగెను. నాకు భౌతికముగా ఐశ్వర్యాదులలో ఏ లోటునూ లేదు. ఆముష్మిక మైన సద్గతిని పొందుటకు నేను చేయవలసిన కర్తవ్యమేమి? అని వ్యాకులతనొంది తన పురోహితుడైన శెల్వనంబి అను బ్రాహ్మణునికి ఈ విషయమును విన్నవించెను. అతడు **"ధర్మజ్ఞ సమయః ప్రమాణమ్"** అను ఆపస్తంబ సూత్రమును ఉదాహరించి తత్త్వజ్ఞులైన పెద్దలు చేసిన నిర్ణయమే మనకు ప్రమాణమనియూ, కనుక అట్టి విద్వాంసులను సమావేశపరచి వారిద్వారా వేదార్థమును నిర్ణయించి పరమపురుషు డెవ్వడో మోక్షపురుషార్థమెట్లు లభించునో నీవు నిర్ధారణ చేసుకొనుము అనియు ఉపదేశించెను. ఆ రాజు రత్నసువర్ణాది రూపమగు అమూల్యధనమును విద్యాశుల్క ముగా ఏర్పరచి తన దేశములోని విద్వాంసులందరినీ ఆహ్వానించి మీలో పరతత్త్వ మును నిర్ణయించగలవారు నేనేర్పరచిన ఈ విద్యాశుల్కమును బహుమానముగా స్వీకరింపుడని నిండు సభలో ప్రార్థించెను.

ఆ సమయమున మధురానగరమునకు సమీపమునగల శ్రీవిల్లిపుత్తూర్ అను క్షేత్రమున భక్తులచే ఆరాధింపబడుచుండిన వటపత్రశాయియగు శ్రీమన్నారాయణుడు తనకు మాలాకైంకర్యమును చేయుచుండిన ఈ పెరియాళ్వారులను పిలచి "మీరు ఆ సభకు పోయి వాదించి నారాయణుడే పరతత్త్వము అను విషయమును చాటిచెప్పి ఆ బహుమానమును సంపాదించుకొని రండు" అని ఆదేశించెను. శాస్త్రాధ్యయన మును అసలే చేయని నేను ఆ విద్యాశుల్కమును సంపాదించుట ఎట్లు సాధ్యమగును? నిత్యమూ పూలచెట్లకు పాదులను త్రవ్వుటచే చేతులకు కాయలుకాసియున్న నావంటి మొరటువానికి సూక్ష్మబుద్ధి కలవారికే సాధ్యమగు పరతత్త్వనిర్ణయము చేయుట అసంభవము కదా అని ఈ ఆళ్వారులు తమ అసమర్థతను ప్రకటించుకొనిరి. అంతట భగవంతుడు "మీ జిహ్వాగ్రముపైనుండి నేనే పరతత్త్వమును ఆవిష్కరింతును. మీరు నిమిత్తమాత్రులే. మీకు ఎట్టి శ్రమయు లేదు. సభకు పోయి రండు" అని నిర్బంధింపగా ఈ ఆళ్వారులు తమ పరిజనముతో కలిసి ఆ సభకు వెళ్లిరి. ఆ మహారాజు మరియు శెల్వనంబి మొదలగు అధికారులు వీరికి ఎదురేగి స్వాగతము

చెప్పి నమస్కారపూర్వకముగా గౌరవించి సభలోనికి పిలుచుకొనివచ్చిరి. తక్కిన విద్వాంసులందరును ఆ రాజును అధిక్షేపించిననూ ఆయనయు పురోహిడుతునూ వేదాంతసారమును దెలిపి మీరు పరమ పురుషార్థమును నిర్ణయింపుడని వీరిని ప్రార్థించిరి. పూర్వము వాల్మీకి మహర్షి చతుర్ముఖుడు ప్రసాదించిన వరమునుబట్టియు తపశ్శక్తిని బట్టియు రామచరిత్రము నంతయు ఉన్నదున్నట్లుగా యోగదృష్టితో తెలుసుకొన్నట్లునూ, బాలుడైన ధ్రువుడు తపస్సుచేత పరమాత్మను సాక్షాత్కరించుకొని ఆయన చేతిలోని దివ్యశంఖముయొక్క స్పర్శముచే సర్వజ్ఞత్వమును పొందినట్లును ఈ ఆళ్వారులు కూడా భగవదావేశముచే అనర్గళముగా వేదవేదాంతాది ప్రమాణములను ప్రతిపాదించి పరతత్త్వనిర్ణయమును చేసిరి. మొదట ఆక్షేపించిన పండితులునూ, శెల్వనంబితోపాటు మహారాజునూ ఆశ్చర్యచకితులై వీరి నిర్ణయమును శిరసావహించిరి. పిదప మహారాజు వీరికి విద్యాశుల్కమును సమర్పించి ఏనుగుపై కూర్చుండబెట్టి సబహుమానముగా నగర వీధులలో ఊరేగింపును జరిపించెను.

విద్వాంసుడగు తన పుత్రునికి బ్రహ్మరథోత్సవము జరుగుచుండగా ఆనంద ముగా చూచుటకై వచ్చిన తల్లిదండ్రులవలె లక్ష్మీనారాయణులు బ్రహ్మాది సమస్త దేవతా బృందముతో ఆకాశమునందు సాక్షాత్కారమునిచ్చి అభినందించిరి. అపుడు తాము సాక్షాత్కరించిన ఆ పరమాత్మయొక్క దివ్యమంగళ విగ్రహ వైభవమును కనులార దర్శించిన వీరు ఇదంతయూ నా విజయముగదా అని గర్వించక భగవదనుగ్రహముచే తనకు లభించిన భక్తి విశేషమునుబట్టి ప్రేమావేశముతో ఆ స్వామికి మంగళాశాసనము చేసిరి. వీరిలో భగవంతుని గురించిన తత్త్వజ్ఞానము నిరవధికమైన భక్తియును సంపూర్ణముగ ఉన్ననూ ఈ సమయమున భక్త్యావేశమే పెల్లుబికి ఈ మంగళాశాసనము నకు కారణమైనది. భగవానుడు సర్వజ్ఞుడు సర్వశక్తిసంపన్నుడు సర్వరక్షకుడు అను యథార్థమును ఎరిగికూడ భగవంతుని సౌందర్యమును సౌకుమార్యాదులను దర్శించి నపుడు వ్యామోహమును పొందిన వీరు కలికాల ప్రభావమునకు అధీనమైయుండు ఈ పాపిష్ఠి లోకమున ఏ అపాయము సంభవించునోయని ఆవేదనతో ఏనుగుపై అలంకారముగా ఏర్పరచబడిన గంటలను చేతబట్టుకొని ఉచ్చైస్స్వరముతో ఆశువుగా ఈ పల్లాణ్డు ప్రబన్ధమును పాడుచూ మంగళాశాసనము చేసిరి. **"అతిస్నేహః పాపశంకీ"** అను సంస్కృతన్యాయమునుబట్టి వీరిలో ఏర్పడిన ప్రేమావేశము భగవంతుడు సర్వరక్షకుడుగదా అను విషయమును మరపింపజేసినది. ఇది భక్తియొక్క పరాకాష్ఠ.

**మంగళాశాసన సమర్థనము :**

శాస్త్రము పరమాత్మనుగూర్చి అవాప్తసమస్తకాముడనీ, సత్యసంకల్పుడనీ చెప్పుచున్నది. తన సంకల్పమహిమచేత ఏ ఫలితమునైననూ పొందగలడని ఆయనకు పొందరాని కొరత అన్నది ఏదియును లేదు అని ఆ శాస్త్రవాక్యములకు తాత్పర్యము. సర్వ ప్రపంచమును నియమించగల అట్టి పరమాత్మను దర్శించినప్పుడు ఆయన వలన తమకు మంగళములు కలుగవలెనని ప్రార్థింపవలసియుండగా దీనికి విరుద్ధముగా ఆయనకే మంగళములు కలుగవలెనని తాము ఆశాసించుట అసంగతమే కదా! అని కొందరాక్షేపించవచ్చును. కానీ భగవదనుగ్రహముచేత పరిపూర్ణమగు భక్తిని పొందిన వీరు భక్తిపరవశులై తమ దృష్టికి గోచరమైన భగవద్విగ్రహ సౌందర్య సౌకుమార్యాదులను భావించినపుడు భక్తి పారవశ్యము అనబడు తన్మయత్వముచేత స్వామి సర్వరక్షకుడుగదా అను విషయమును మరచిపోయి తమ స్వరూపమునుగూడ మరచిపోయి తమనే రక్షకుడుగా భావించి ఆ సౌందర్య సౌకుమార్యాదులకు ఏ విధమైన అపాయము కలుగకుండునట్లు మంగళాశాసనమునందు ఉద్యుక్తులగుట ఉచితమే. ఇందు అసాంగత్యము ఏదియు లేదు. వీరిలోగల భక్తి పూర్తిగా భగవత్సౌందర్యమును అనుభవించుటకు కారణము కావలెను. అది మోక్షమునకు హేతువు కావలెను. అంతేకానీ భగవంతుడే రక్షకుడను యథార్థమును మరపింపజేయుటకు ఇది కారణమగునా అనియును శంకింపరాదు. ప్రేమావేశముచే స్వామిని దర్శించినవారు ఎందరో ఇదే విధముగా మైమరచి (ప్రేమాంధ్యముచేత) స్వామికి మంగళాశాసనములు చేసినట్లు పలు ఉదాహరణములు కలవు గనుక ఈ మంగళాశాసనమను వ్యవహారము శిష్టాచార సిద్ధమే. ఈ క్రింది ఉదాహరణములు గమనింపుడు.

1) శ్రీ రామాయణమున అయోధ్యాకాండములో వాల్మీకి ఇట్లు చెప్పెను –

**శ్లో॥ స్త్రియో వృద్ధాః తరుణ్యశ్చ సాయం ప్రాతః సమాహితాః ।**
**సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే యశస్వినః ॥**

తాటకా తాటకేయాది రాక్షసవధముచేతనూ, శివధనుర్భంగ పరశురామ గర్వభంగాదులచేతనూ శ్రీరాముడు పరమపురుషుడని దేవాధిదేవుడని ఎరిగిన ప్రజలందరుకూడా స్త్రీలు, వృద్ధులు, యువతీయువకులు అగు అయోధ్యానగరవాసులు

మొత్తముగా నిత్యమును రాముని క్షేమమునకై ఉభయ సంధ్యాకాలములయందు ఆయా దేవాలయములకు వెళ్లి మా రాముడు క్షేమముగ నుండవలెనని ప్రార్థింతురట. ఇది రామునిపై ప్రజలకు గల ప్రేమాంధ్యమే గదా!

2) సీతాదేవిని వివాహమాడి కల్యాణరాముడు సపరివారముగా వచ్చు సమయమున పరశురాముడు అహంకారముతో ఎదురుపడగా భయపడిన దశరథుడు బాలురైన తమ కుమారులకు అభయమును ఇమ్ము, వారికి అపాయమును కలిగింపక క్షమింపుము అని శరణాగతి చేసి మూర్ఛపోయినాడట. శ్రీరాముడు భార్గవరాముని లోని వైష్ణవశక్తిని ఆకర్షించి అతనిని నిర్వీర్యుని చేసి పంపివేసిన పిదప మూర్ఛలోనున్న దశరథుని లేపి కొందరు ఈ విజయవార్తను చెప్పగా అతడు తానూ తన కుమారులునూ పునర్జన్మనెత్తినట్లు తలంచినాడట. రాముని పరాక్రమమును ఎరిగి కూడా పుత్ర వ్యామోహముచే ఆ విషయమును మరచి దశరథుడు పరశురామునివద్ద అభయమును కోరినాడు కదా!

3) వనవాసమునకు వెళ్లు సమయమున కౌసల్యకూడా యాగ సంరక్షణాదులచే రాముని పరాక్రమము అప్రమేయమని ఎరిగినదైననూ పుత్రప్రేమచే పలు విధములుగ మంగళాశాసనము చేసినది అమృతభాండము తెచ్చుటకై దేవతలతో పోరాడుటకు బయలుదేరిని గరుత్మంతునికి అతనితల్లి వినతాదేవి ఏ మంగళ వాక్యములు పలికినదో నీకును అట్టి మంగళములగుగాక యని వనవాసములో ఎట్టి అపాయములు కలుగకుండుగాకయని ఆశీర్వదించినది.

4) రాక్షసులవలన తమకు కలుగుచున్న బాధనలు తెలుపుకొని నీవు మాకు రక్షకుడవు కమ్ము అని ప్రార్థించుటకు వచ్చిన దండకారణ్యవాసులైన మహర్షులు కూడా అప్పుడే ఉదయించు బాలచంద్రునివంటి సౌందర్యము కలిగిన శ్రీరాముని చూచి పరవశులై ఆయనకు మంగళము కలుగవలెనని ఆశీర్వదింపనారంభించిరి. విజ్ఞాన నిధులు అని చెప్పదగిన ఆ మహర్షులే ఆయనయే రక్షకుడను తత్త్వమును మరచి మంగళాశాసనము చేయుటకు కారణము స్వామి సౌందర్యమును దర్శించినపుడు వారిలో కలిగిన పరవశత్వమే కదా!

5) వెనుక చెప్పినవారందరివలె కాక కర్మ సంబంధమునకు అవకాశమే లేనందున సర్వజ్ఞురాలు అనదగిన సీతాదేవి కూడా భగవత్ప్రభావమును సంపూర్ణముగా

ఎరిగియున్ననూ దశరథుని పిలుపుచే సభామండపమునకు వెళ్లుచున్న శ్రీరామ చంద్రునితో ద్వారమువరకూ వెంటవచ్చి ఆయనకు మంగళములను చెప్పినదట. మరియు దిక్పాలకులందరునూ నీకు మంగళములను కలిగింతురుగాకయని ప్రార్థించినదట. ఇట్లు ప్రార్థించుటకుకూడ శ్రీరామునిపై సీతాదేవికిగల ప్రేమాంధ్యమే కారణముగదా! ఇవన్నియూ రామావతారములోని దృష్టాంతములు.

6) ఇక కృష్ణావతారమునందు – శ్రీకృష్ణుడు జన్మించిన వెంటనే శంఖచక్రాది భూషితమైన ఆయనయొక్క దివ్యమంగళ విగ్రహమును చూచి దేవాధిదేవుడీయన అని తెలుసుకొనిగూడా కంసునివలన ఏ అపాయము కలుగునో అని శంకించి వసుదేవుడు ఈ దివ్యరూపమును ఉపసంహరించుకొనుమని ప్రార్థించినాడట. అట్లే దేవకియునూ సర్వాంతర్యామియగు పరమాత్మయే చతుర్భుజుడై అవతరించినాడని తెలుసుకొనిగూడ కంసుని క్రౌర్యమునకు భయపడి ఈ దివ్యరూపమును ఉపసంహరించుకొనుమని ప్రార్థించెనట.

ఇట్టి దృష్టాంతములనుబట్టి ప్రేమావేశము యథార్థజ్ఞానమును మరపింప చేయును అని స్పష్టమగుచున్నది. ఈ విషయము కేవల పురాణప్రసిద్ధమే కాక లోకప్రసిద్ధము కూడ. ఎన్నో నోములు నోచి భగవంతుని వరప్రసాదముచే లభించు కొన్న తన పుత్రుడు మహాశక్తిసంపన్నుడని తెలిసికూడ అతని తల్లిదండ్రులు అనుక్షణమూ అతనికేమి అపాయము వచ్చునోయని భయపడుచుందురుగదా! ఒక బీదవాడు అనర్ఘమైన గొప్పరత్నము తనకు దొరికినపుడు దానిని అతిజాగ్రత్తగా తాను దాచిపెట్టుకొనిగూడ గాలివాటముచే ఆకు కదలిననూ ఎవరో వచ్చి ఈ రత్నము నపహరింతురేమోనని భయపడునుగదా! కనుక ఇట్లు మనస్సు కరిగి తన ప్రీతిపాత్ర మైన వస్తువుకు అపాయమును శంకించుట మానవ సహజధర్మము. అచేతనములైన సూర్యకాంత చంద్రకాంతమణులు సూర్యచంద్ర కిరణస్పర్శముచే తమ సహజ స్వభావమును కోల్పోవుచున్నవి. ఇట్లుండగా పరంజ్యోతి అని శాస్త్రములలో ప్రశంసింపబడిన తేజోరాశియగు పరమాత్మయే తన దివ్యమంగళ విగ్రహముతో సాక్షాత్కారమునిచ్చినపుడు అతి కోమలమనస్కులైన ఈ పెరియాళ్వారులు ఈ క్షుద్ర ప్రపంచమున స్వామికి ఏ అపాయము వాటిల్లునో అని వ్యాకులత నొందుటలో ఆశ్చర్యమేమున్నది? అతి కఠినమైన ఇనుపగుండు కూడా అగ్ని సంతాపముచే

మెత్తబడిపోవుచుండగా సుకుమార శరీరులైన మానవులనుగూర్చి చెప్పవలెనా! అను దృష్టాంతముగా చూపిన అగ్నితప్తాయఃపిండమునుబట్టి ఈ క్రింది కాళిదాసుని సూక్తి ఇచట స్మరింపదగును.

**"అభితప్త మయోపి మార్దవం భజతే కైవ కథా శరీరిషు"**

ఇది రఘువంశములోని సూక్తి.

భగవద్దర్శనముచేత హృదయములోని భక్తి పొంగిపొరలి బహిర్గతమై ఈ పల్లాణ్డు ప్రబన్ధరూపమున శ్రీ విష్ణుచిత్తుల ముఖమునుండి ఆవిర్భవించినది అని తెలుసుకున్నాము. అరసికులైన కొందరి హృదయములలో అనేక దృష్టాంతములతో సమాధానములను చెప్పిననూ సంశయము తీరకపోవచ్చును. వారు ఇంకనూ తమ మౌఢ్యభావముచే ఇట్లు శంకింతురు. స్వామి రక్షకుడని తాము ఆయనకు దాసులమై రక్షింపబడువారమని యథార్థమెరిగిన ఈ ఆళ్వారులలో తామే స్వామికి మంగళాశాసన మొనర్చి రక్షణ కల్పింతుమని భావించుట విపరీత జ్ఞానము కాదా? ఇది దోషము కాదా? ఈ ఆశంకకు వ్యాఖ్యానకర్తలైన పెరియవాచ్చాంబిళ్లైస్వామివారు మంచి సమాధానమును ఇచ్చియున్నారు. పుణ్యపాపాది కర్మ సంబంధముచే ఏర్పడిన అజ్ఞానము దోషమగును కానీ ఆశ్చర్యమైన భగవద్విషయమును దర్శించినపుడు మైమరచుట అను ఈ అజ్ఞానము విషయ వైలక్షణ్యమునుబట్టి వచ్చినది గనుక దోషము కాజాలదు. దీర్ఘరోగముబట్టియో, వార్ధక్యాదులనుబట్టియో మతిమరుపు ఏర్పడుట హేయము కానీ భగవత్స్వరూపమును ధ్యానించినపుడో, ప్రత్యక్షమున దర్శించినపుడో ఆశ్చర్యవశమున మైమరచుట గుణమే కాని దోషము కాదు. అట్టి మార్పు అతనిలో కలుగనపుడు అతడు పాషాణహృదయుడేనని సహృదయులు అతనిని నిరసింతురు.

అథవా – స్వామిచే రక్షింపబడవలసిన దాసులు ఆయనకే మంగళాశాసనములు చేయుట దోషము కానే కాదు. ఈశ్వరుని యందలి స్వామిత్వమును తనలోగల శేషత్వమును బాగుగా ఎరిగిన దాసుడు తన యజమానికి సర్వాతిశయము కలుగునట్లు ఆకాంక్షించుట అతని స్వరూపమునకు తగిన వృత్తి గనుక తన క్షేమమును గూడ గుర్తింపక స్వామికి సర్వకైంకర్యములను చేయుచు ఆయన చిరకాలము వర్ధిల్లుగాక యని నిత్యమును భావించుట ఆవశ్యకమని ఈ తిరుప్పల్లాణ్డు ప్రబన్ధముచే నిరూపింపబడుచున్నది.

ఇందు మొదటి రెండు పాశురములలో ఆకాశములో సపరివారముగా తమకు దర్శనమిచ్చిన స్వామికి తామే మంగళాశాసనమొనర్చిరి. అంతటితో తమ మనస్సునకు తృప్తి కలుగనందున ఆపైన మూడు పాశురములతో శరణాగతి నిష్ఠులైన ప్రపన్నులను, కేవలులు అనబడు ఆత్మానుభవ నిష్ఠులైన భక్తులను, లౌకిక ఐశ్వర్యాది ఫలములను అపేక్షించు భక్తులను మీరుకూడ స్వామికి మంగళాశాసనము చేయుడని క్రమముగా ఆహ్వానించిరి. వీరు పిలిచిన విధముగా ఆ ముగ్గురునూ వీరితో వచ్చి విడివిడిగా కలిసినట్లు పై మూడు పాశురములలో చెప్పబడినది. అట్లే ఆ ముగ్గురునూ వీరితో కలిసి మంగళాశాసనము చేసినట్లు మరొక మూడు పాశురములలో నిరూపింప బడినది. ఇట్లు మంగళాశాసనము చేసినవారికి భగవదనుగ్రహముచే నిత్యసూరులతో సమానమగు స్థితి కలిగి భగవత్సన్నిధానమున నిత్యమగు మంగళాశాసన యోగ్యత లభించునని ఫలశ్రుతి చివరి పాశురమున తెలుపబడినది. ఇది సంగ్రహముగా పన్నెండు పాశురములుగల ఈ ప్రబన్ధములోని సారాంశము.

అవతారిక సమాప్తము

C

శ్రీమతే రామానుజాయ నమః



# తిరుప్పల్లాండు - ఆంధ్ర వివరణము

### మొదట అనుసంధించుకొనవలసిన గురుపరంపరా శ్లోకములు

శ్లో॥ శ్రీశైలేశ దయాపాత్రం - ధీభక్త్యాది గుణార్ణవమ్ ।
యతీన్ద్ర ప్రవణం వందే - రమ్యజామాతరం మునిమ్ ॥

శ్లో॥ లక్ష్మీనాథ సమారంభాం - నాథయామున మధ్యమామ్ ।
అస్మదాచార్య పర్యంతాం - వందే గురుపరంపరామ్ ॥

శ్లో॥ యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ
వ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే ।
అస్మద్గురోర్భగవతోస్య దయైకసింధో
రామానుజస్య చరణౌ శరణం ప్రపద్యే ॥

శ్లో॥ మాతా పితా యువతయస్తనయా విభూతిః
సర్వంయదేవ నియమేన మదన్వయానామ్ ।
ఆద్యస్య నః కులపతేర్వకుళాభిరామం
శ్రీమత్తదంఘ్రియుగళం ప్రణమామి మూర్ధ్నా ॥

శ్లో॥ భూతంసరశ్చ మహదాహ్వయ భట్టనాథ
శ్రీభక్తిసార కులశేఖర యోగివాహాన్ ।
భక్తాంఘ్రిరేణు పరకాల యతీన్ద్రమిశ్రాన్
శ్రీమత్పరాంకుశమునిం ప్రణతోస్మి నిత్యమ్ ॥

## శ్రీ పెరియాళ్వారుల స్తుతి శ్లోకము

శ్లో॥ గురుముఖ మనధీత్య ప్రాహ వేదానశేషాన్
నరపతి పరిక్లుప్తం శుల్కమాదాతు కామః ।
శ్వశుర మమరవంద్యం రంగనాథస్య సాక్షాత్
ద్విజకులతిలకం తం విష్ణుచిత్తం నమామి ॥

**భావము :** గురువువద్ద విద్య నేర్చుకొనకున్ననూ, ఏ భక్తాగ్రేసరుడు పాండ్యరాజగు వల్లభదేవుని మహాసభలో సర్వవేద ప్రమాణములను ఉపపాదించి శ్రీమన్నారాయణ పరత్వమును స్థాపించి ఆ రాజు సమర్పించిన ధనరాశిని సన్మానముగా స్వీకరించెనో, అట్టి బ్రాహ్మణోత్తముడును శ్రీరంగనాథునికి గోదాదేవిని కన్యాదానముగా సమర్పించిన మామగారుగా సుప్రసిద్ధుడును దేవతలకుగూడ పూజనీయుడును అగు శ్రీ విష్ణుచిత్తు డను పేరుగల పెరియాళ్వారులకు నమస్కరింతును.

**తనియన్ :**

1. మిన్నార్ తడమదిళ్ శూళ్ విల్లిపుత్తూరెన్నొరుకాల్
శొన్నార్ కళల్ కమలం శూడినోం, మున్నాళ్
కిళియరుత్తానెన్నురైత్తోం కీళ్ మైయినిల్ శేరుం
వళియరుత్తోం నెంజమే! వన్దు ॥

**భావము :** ప్రకాశమానములైన కోటలతో నొప్పునది శ్రీవిల్లిపుత్తూరు – అని ఒకసారి భక్తితో పెరియాళ్వారును ఆండాళమ్మవారును ఆవిర్భవించిన ఆ దివ్యక్షేత్రమును కీర్తించు భాగవతుల శ్రీపాద కమలములను శిరసావహింతుము. పూర్వము పరతత్త్వమును స్థాపించి మా పెరియాళ్వారులు పాండ్యరాజ సన్మానమును స్వీకరించిరని ప్రశంసింతుము. ఓ మనసా! మేము ఇకముందు అథోగతి రూపమగు నరకాది మార్గములకు పోవు దుర్గతిని ఈ పెరియాళ్వారుల వైభవ సంకీర్తనముచే తప్పించుకొన గలిగితిమి.

2. పాండియన్ కొండాడ పట్టర్‌పిరాన్ వందానెన్రు
ఈండియశంగమెడుత్తూద - వేండియ
వేదంగళోది విరైందు కిழியరుత్తాన్
పాదంగళ్ యాముడైయ పత్తు ॥

**భావము :** బ్రాహ్మణోత్తములైన శ్రీ పెరియాళ్వారులు (విష్ణుచిత్తులు) వచ్చినారని పాండ్య మహారాజు మహాసభలో ప్రశంసింపగా, భక్తులందరును గూడి సంతోషముతో శంఖ నాదములను చేయగా, అవసరమగు పలు వేదప్రమాణములను చూపి పరతత్త్వము శ్రీమహావిష్ణువేనని స్థాపించి సన్మానరూపమగు శుల్కద్రవ్యమును సంపాదించిన శ్రీ పెరియాళ్వారుల శ్రీపాదపద్మములే మాకు సర్వదా ఆశ్రయణీయములు.

h h

# తిరుప్పల్లాండు

## పాశురము - 1

నిరతిశయ సౌందర్యసౌకుమార్యాదులు కలిగిన దివ్యమంగళ విగ్రహముతో సర్వేశ్వరుడు తమకు దర్శనమును ప్రసాదింపగా ఈ విష్ణుచిత్తులు దుష్టమగు కాల ప్రభావముచే పలువిధములగు మార్పులకు అవకాశమున్న ఈ పాడు ప్రపంచమున ఈ దివ్యమంగళ విగ్రహమునకు ఎవరివలన ఈ అపాయము సంభవించునో అను ఆవేదనతో అనాది అనంతము అని కీర్తింపబడిన ఈ కాలమున్నంతవరకూ ఈ భగవద్విగ్రహములోని సౌందర్యమునకు ఎట్టి మార్పు లేకుండ నిత్యముగా క్షేమము కలుగవలెనని మంగళాశాసనముతో మొదటి పాశురమును ఆరంభించిరి.

**మూలము :**

**పల్లాణ్డు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డు పలకోడి నూఱాయిరమ్ ।**
**మల్లాణ్డ తిణ్డోళ్ మణివణ్ణా ఉన్ శెవ్వడి శెవ్వి తిరుక్కాప్పు ॥**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మల్ ఆణ్డ | = | చాణూరాది మల్లయోధులను జయించిన |
| తిణ్తోళ్ | = | దృఢమగు భుజములు కలవాడా! |
| మణివణ్ణా | = | ఇంద్రనీలమువంటి దేహకాంతి కలవాడా! |
| ఉన్ శెవ్వడి | = | నీ ఎర్రని శ్రీపాదములయొక్క |
| శెవ్వి | = | సౌందర్యమునకు |
| తిరుక్కాప్పు | = | పరిపూర్ణమగు రక్షణము |
| పల్ ఆండు, పల్ ఆండు | = | అనేక అనేక సంవత్సరములు |
| పలకోడి నూఱాయిరుమ్ | = | ఎన్నో కోట్ల వందల సంవత్సరములు కలుగుగాక! |

**వివరణము :**

పల్ ఆండు అను పదమునకు అనేక సంవత్సరములు అని యర్థము. అఖండమైన కాలమునకు విభాగమును తెలుపు పదములు నిమేషము, గంట, దినము, మాసము, యుగము, కల్పము మొదలైనవి ఎన్నో ఉండగా 'ఆండు' అను సంవత్సర

వాచక పదమును ఇచట ప్రయోగించి ఇట్టి సంవత్సరములను వేలు కోట్లుగా పెంచుచూ పోయి మంగళము చెప్పుటలో వీరి అభిప్రాయమేమి? అను సందేహము కలుగవచ్చును. అనంతమైన ఆయుష్యము స్వామికి కలుగవలెనని ప్రార్థించు అభిప్రాయము కలవారగుటచే ఆయుష్యబోధనమునకు సన్నిహితమైన 'ఆండు' అను సంవత్సర వాచక పదమునే తగినట్లుగా భావించి ప్రయోగించిరి. ఆశ్రమములో సీతాదేవి కనపడనందున దుఃఖావేశముతో ఆమెను వెతుకుచూ వచ్చుచున్న శ్రీరాముని చూచి రావణునిచే పక్షచ్ఛేదమును పొంది ప్రాణావశిష్టుడై పడియున్న జటాయువు 'ఆయుష్మన్' అని శ్రీరాముని సంబోధించుచూ నీకు శుభమగునని మంగళాశాసనము చేసెను. సీతావియోగ దుఃఖముచే శ్రీరామునకెట్టి అపాయము కలుగునో అని మనోవేదనను పొందిన జటాయువు తన అవస్థనుగూడ లెక్కించక ఆ స్వామిని ఆయుష్మన్ అని ఆశీర్వదించుట గొప్ప విశేషము.

**"వేతనూల్ పిరాయమ్ నూఱు"** అని తిరుమాలై ప్రబంధమునందు తొండరడిప్పొడి ఆళ్వార్ అనబడు శ్రీ విప్రనారాయణులు ఒక పాశురమున ప్రసాదించి యున్నారు. వేదములో చెప్పబడినట్లు నూరు సంవత్సరములు మనుష్యుని జీవితము అని దాని యర్థము. అచట ఆయుష్యవాచక పదమునకు పర్యాయముగా 'పిరాయం' అను సంవత్సర వాచక పదమును ప్రయోగించుట గమనింపదగినది. కనుక పల్ ఆండు అను పదమునకు అనంతమగు ఆయుష్యము కలుగగలదని కోరుటలో తాత్పర్యము. పల్ అను పదము బహువచనార్థకమైనందున ఇంత అని సంఖ్యా పరిమితి లేని అనంతకాలము ఈ సౌందర్యము నిత్యమై వెలుగొందవలెను అని పల్లాణ్డు పదమునకు సారాంశము.

ఒక విధముగా పల్లాణ్డు అను పదమే ప్రయోగించు వ్యక్తియొక్క స్వరూపము నకు సూచకమైయున్నది. ఒక గొప్ప మహాపురుషుని దర్శించిన సామాన్యమానవుడు ఆయనను గురించి "శుభమగుగాక" అని ప్రయోగించు శబ్దమువంటిదే ఈ పల్లాణ్డు పదము. దీనిచేత ప్రయోగించు వ్యక్తియొక్క అల్పత్వము సంబోధింపబడు వ్యక్తి యొక్క ఉత్కర్షము సూచింపబడుచున్నవి గదా! అనవధికాతిశయమగు సర్వేశ్వరుని స్వామిత్వమును, చరమావధి అనదగిన తమయొక్క శేషత్వమును సహజస్వరూపమని ఎరిగినవారైనందున ఈ విష్ణుచిత్తులు తమ ఉభయుల సహజస్వరూపమును

ఆవిష్కరించుటకై పల్లాణ్డు అని మంగళాశాసనమునారంభించిరి. ఋగ్వేదమునందు భగవంతుని స్తుతించునపుడు **"జితంతే పుండరీకాక్ష"** ఇత్యాది వాక్యములలో ప్రయోగింపబడిన **'జితం'** అను పదముగాని, అష్టాక్షరీ మొదలగు మంత్రములలో ప్రయోగింపబడిన **'నమః'** అను పదముగాని, **'తోత్తోమ్'** అని కొందరు ఆళ్వారులు ఉపయోగించిన పదముగాని, **'పోత్తి'** అని గోదాదేవి మొదలగువారు ప్రయోగించిన శబ్దముగాని, ప్రకృతమైన **'పల్లాణ్డు'** అను పదముగాని ఇవి అన్నియు ఒకే కోటికి చెందినందున పర్యాయపదములే అనవచ్చును. ఇవి భగవంతుని స్వామిత్వమును తన దాస్యమును సూచించుటకై ప్రయోగించిన శబ్దములే గదా! ఈ పదములకు ప్రకృతి ప్రత్యయ విభాగమునుబట్టి వచ్చు అర్థభేదము కొంత ఉన్ననూ మొత్తముమీద రూఢి అను పద్ధతిలో ఇవి ఆత్మ పరమాత్మ స్వరూపములను ఆవిష్కరించుటలో పర్యవసించినవి అయినందున పర్యాయపదములు అనుటలో తప్పులేదు. ఎట్లనగా–

1. **జితం** అను పదము – 'జి' అను క్రియపై 'త' అను ప్రత్యయము చేర్చగా సిద్ధమైనది. ఇది జయించినవాడు అను అర్థమును బోధించుచూ అతనియొక్క గొప్పదనమును, ప్రయోగించు వ్యక్తియొక్క 'దురభిమానము అణిగెను' అను అంశమును తెలుపుచూ, అహంకారమణగి నేను నీ దాసుడనగునట్లు నన్ను వశీకరించుకొంటివి అను అర్థమును సూచించును. ఈ విధముగా ఈ పదము స్వామియొక్క పరత్వమును పరతంత్రతారూపమైన తనయొక్క దాస్యమును స్వరూపముగా నిరూపించినట్లే కదా!

2. ఇక **నమః** అను పదము – న+మః అని రెండక్షరములుగా విభజింప బడినది. నాకు నేను రక్షకుడను కాను అను అర్థమును తెలుపుచూ, తనలో పూర్వము గల స్వాతంత్ర్య భ్రమము తొలగినట్లు సూచించుచున్నది. ఇట్లు ఈ పదముగూడా శేషత్వమే జీవుని స్వరూపమని స్వామిత్వమే ఈశ్వర స్వరూపమని ప్రకటించుచున్నది కదా!

3. **తోత్తోమ్** అను పదము ఓడిపోయితిమి అను అర్థమును బోధించుచూ స్వామి యొక్క విజయమును ప్రకటించుటయే ప్రధాన ఉద్దేశ్యమైనట్లు నిరూపించును. ఈ విధముగా ఈ పదముగూడ తన అహంకార నివృత్తిని తెలుపుచూ శేషత్వ స్వరూపమును నిరూపించుచున్నది.

4. **పోత్తి** అను పదము మంగళమగుగాక అను అర్థమునకు వాచకమై తనకై ఫలితమునపేక్షించక స్వామియొక్క అభివృద్ధియే తన ప్రయోజనమని భావించుటను సూచించును. ఇది ఉత్తమదాసుని స్వరూపమే కదా!

5. ఇట్లే **పల్లాణ్డు** అను పదము కూడా స్వామియొక్క అతిశయమును కోరి నిత్యము మంగళమును పాడు తనయొక్క సహజ స్వరూపమును తెలుపును అని చెప్పుకొనియున్నాము. మొత్తము మీద ఈ పదములన్నింటిలో అవాంతరార్థ భేదము లున్ననూ ఆత్మస్వరూపమగు దాస్యమునకు నిరూపకములైనందున పర్యాయ పదములుగనే భావించవచ్చును.

పల్లాణ్డు అను పదము ఇచట రెండుసార్లు ఆవృత్తిగా చెప్పబడినది. ఒకసారి చెప్పినపుడు దాని అర్థము ఎదుటివానికి అవగాహనకు రానిచో రెండుమూడుసారులు చెప్పవలసియుండును. సహజముగనే సర్వజ్ఞుడైన పరమాత్మ తదేక దీక్షతో అహంకార గ్రస్తమైన ఈ జీవరాశిని వశీకరించుకొనుటకై పాటుపడుచుండగా ఏమరపాటు లేకుండ మన దాస్యమును స్వీకరించుటకై ఎదురుచూచుచుండగా రెండుసార్లు పల్లాణ్డు పదమును చెప్పవలెనా? ఈ పునరుక్తి ప్రయోజనమేమి? అని సంశయము కలుగ వచ్చును. ఆయన గుర్తించలేదేమోనని శంకించి ఇచట ఈ పునరుక్తి చేయబడలేదు. ఆయన ఒకసారికే గుర్తెరిగిననూ ఆదరాతిశయముచేత ఉండబట్టలేక పలుసారులు తమయొక్క స్వరూపమును ఆవిష్కరించుకొనుటకై ఇట్లు ఉచ్చరించుచున్నారు. దప్పిగొన్నవాడు ఎదుటివ్యక్తి మంచినీటిని తెచ్చి ఇచ్చునంతవరకును తణ్ణీర్ తణ్ణీర్ అని పలుమారులు తన దాహార్తిని ప్రకటించుకొన్నట్లు వీరునూ తమ మనస్సులోని భయము తీరునంతవరకు ఆర్తితో పల్లాణ్డు పల్లాణ్డు అని పలుమారులు చెప్పుచున్నారు.

**(పల్ ఆయిరత్తాణ్డు)** – పలు వేల సంవత్సరములు అని దీని యర్థము. వెనుక చెప్పిన 'పల్' అను బహువచనముచేతనే లెక్కలేనన్ని సంవత్సరములు అని అర్థము వచ్చుచుండగా మరల ఈ పదమెందులకు? బహువచనము చేతనే వేల సంవత్సరములు అను అర్థము సిద్ధించునుగదా! అని సందేహము కలుగును. అందుకు సమాధానమేమనగా – సహజముగా కాలము ఆకాశమువలె అఖండమైనది. దానికి క్షణములు, నిముషములు, గంటలు, రోజులు, సంవత్సరములు మొదలైన భేదములు కల్పించబడినవి. ఈ భేదకల్పనను పరిచ్ఛేదము అందురు. సూర్య

సంచారాదులు కాలమునందు పరిచ్ఛేదము చేయుటకు కారణములగుచున్నవి. పరిచ్ఛేదకములైన ఆ సూర్య పరిస్పందాదులకు 'ఇన్ని' అని సంఖ్యా పరిమితి లేనందున (అవి అసంఖ్యాకములైనందున) వాటిని బట్టి పరిచ్ఛిన్నములుగా చేయబడిన క్షణ, నిమేష, ఘంటా, మాసాదులకు కూడా సంఖ్యాపరిమితి లేదని తేలును గనుక ఇవి కూడ అసంఖ్యాకములే. పగలు, రాత్రి, రోజు, మాసము అను విభాగములకు సూర్య చంద్రాదుల పరిస్పందనములు కారణమై ఇన్ని గంటలు ఒకరోజు, ఇన్ని రోజులు ఒక మాసము అని నిర్ణయము చేయబడుచున్నది. అట్లే మానవ పరిమాణమున ఒక సంవత్సరమునకు దేవతల యొక్క ఒకరోజు పరిచ్ఛేదకమగుచున్నది. ఈ దేవ పరిమాణమున దేవతల యొక్క కొన్ని వేల సంవత్సరములు బ్రహ్మకు ఒక దినమగు చున్నది. ఈ విధముగా అఖండ కాలమునకు పరిచ్ఛేదకములు అసంఖ్యాక ములై వాటిచే పరిచ్ఛేదింపబడు మాస సంవత్సరాదులు కూడ ఆయా పరిమాణములనుబట్టి అసంఖ్యాకములే అగుచున్నవి. ఈ విధముగా పరామర్శించినపుడు మానవకాల పరి మాణమునుబట్టి కొన్ని వందల సంవత్సరములు, దేవతల పరిమాణమునుబట్టి కొన్ని వేల సంవత్సరములు, బ్రహ్మ పరిమాణమునుబట్టి కొన్ని కోట్ల సంవత్సరములు లెక్కకు వచ్చునుగదా! వీటన్నింటినీ దృష్టియందుంచుకొని **(ఆయిరత్తాణ్డు)** వేల సంవత్సరములు **(కోటినూరాయిరం)** కొన్ని కోట్ల వందల సంవత్సరములు అని క్రమక్రమముగా కాలపరిమాణమును పెంచి చెప్పుటచేత అనాద్యనంతమైన ఈ కాలమునందంతయూ నిత్యముగా మంగళమగుగాక అని చెప్పుటయే ఈ పాశురము యొక్క ఉద్దేశ్యము. మరియు ఒక బ్రహ్మ యొక్క ఆయుఃపరిమాణమే కొన్ని వందల కోట్ల సంవత్సరములు అగుచుండగా అనంత బ్రహ్మాండములలో ఆ బ్రహ్మల సంఖ్యకు కూడ అంతు లేనందున ఆ బ్రహ్మలయొక్క ఆయుష్యరూపములగు సంవత్సరములకు గూడ సంఖ్యాపరిమితి లేదని స్పష్టమే గదా! నిరంతరముగా ఈ కాలము కొనసాగు చున్నంతవరకూ స్వామికి మంగళమగుగాక యని వీరు మంగళాశాసనము చేయు చున్నారు. కాలముయొక్క పరిణామమునకు అసలే అవకాశము లేని నిత్యవిభూతియనబడు శ్రీవైకుంఠమునందు ఉండు అనంత గరుడ విష్వక్సేనాదులు కూడా భగవ ద్విషయమునందలి దివ్య సౌందర్య సౌకుమార్యాది దర్శనముచే పరవశులై అచట ఏమి అపాయము జరుగునోయని అస్థానభయశంకచే మంగళాశాసనమును చేయు చుండగా, కాలముయొక్క ప్రభావము కలిగిన ఈ ప్రకృతి మండలములో పలు అపాయములు

సంభవించుటకు అవకాశమున్నందున ఈ ఆళ్వారులు భయావేశముతో కాలతత్త్వ మున్నంతవరకూ మంగళమగుగాకయని ప్రతిపాదించుటలో ఆశ్చర్యమేమున్నది?

ఇట్లు వీరు భయావేశముచే పల్లాణ్డు పల్లాణ్డు అని నిరంతరము మంగళా శాసనము చేయుచుండగా దర్శనమిచ్చిన ఆ పరమాత్మ వీరి భయమును నివారించుటకై పూర్వము చాణూర ముష్టికాదులతో యుద్ధమును చేసి వారిని జయించిన తన భుజము లను చూపినాడు. ఇట్టి భుజపరాక్రమముగల నాకు అపాయము కలిగించువారెవ్వరు? మీరు భయపడనవసరము లేదు. పులి పడుకొనియుండు గుహలోనికి, లేక పొదలోనికి మరొక జంతువు వచ్చి దానిని హింసింపగలదా? అని తెలిపి వారి ఆర్తిని శాంతింప చేయుటకు భగవంతుడు ప్రయత్నించినాడు.

విభీషణుడు శరణాగతుడైనపుడు ఇతడు రావణాసురుని తమ్ముడని ఇతనిని ముందుంచుకొని రావణుడు మనకు మాయోపాయముచే అపాయము కలిగించ వచ్చునని సుగ్రీవుడు శంకింపగా అతని భయమును శాంతింపజేయుటకై శ్రీరామ చంద్రుడు "పిశాచాన్ దానవాన్ యక్షాన్" అను శ్లోకముచేత తన పరాక్రమమును చాటిచెప్పినాడు. అప్పుడు సుగ్రీవుని సందేహము తీరినది.

సందర్భము వచ్చినందున ఆ శ్లోకమును వ్యాఖ్యానించెదము.

**శ్లో॥ పిశాచాన్ దానవాన్ యక్షాన్ పృథివ్యాంచైవ రాక్షసాన్ ।**
**అంగుళ్యగ్రేణ తాన్ హన్యాం ఇచ్ఛన్ హరిగణేశ్వర ॥**

ఇందు పిశాచములు దానవులు యక్షులు రాక్షసులు అను పదములు హింసా ప్రవృత్తిలో ఒకరిని మించినవారు మరొకరు అని తెలుపుచున్నవి. దొంగలు, దోపిడీ దొంగలు కొన్ని ఇండ్లనే గాక గ్రామములనే కొల్లగొట్టు దొంగలు అని విభాగమున్నట్లే రాక్షస జాతులలో గూడ పిశాచ దానవాది భేదములున్నవి. ఒక లంకానగరములోనే గాక పంచాశత్కోటి విస్తీర్ణమైన భూమండలముపైన రాక్షసులందరును ఎదురొడ్డి వచ్చిననూ అందరినీగూడ అనాయాసముగా నేను ఓడించగలను. అందులకై నాకు అస్త్రశస్త్రాదులు ఏవియును అవసరము లేదు. క్రిమికీటాదులను కాలివేలితో నలిపి వేసినట్లు సులభముగా వారిని జయించగలను. అయితే మనకు ప్రబల శత్రువైన వానిని నీవెందులకు నశింపజేయలేదని అడగవచ్చును. (ఇచ్ఛన్) ఇంతవరకూ నాకట్టి

సంకల్పము కలుగనందున నేనా పని చేయలేదు. అంతేగాని చేతకానందువలన కాదు. రావణుడో, కుంభకర్ణుడో ఈ రాక్షస నాయకులు బుద్ధి మారి ప్రాణములతో వచ్చి తలవంచెదరేమో, అట్టి అవకాశమున్నపుడు వ్యర్థముగా వారిని వధింపనేల అని దయాగుణముచే ఉపేక్షించినాను. ఈ శ్రీరామచంద్రునియొక్క వాక్యమును విన్న సుగ్రీవుని మనస్సులో సందేహము తీరినది. ఆ విధముగా విభీషణునికిగూడ అభయమిచ్చినాడను కీర్తి శ్రీరామునికి దక్కినది.

అదే విధముగా ఇపుడు ఈ ఆళ్వారుల మనస్సులోని భయముగూడ తీరగలదని భావించి భగవానుడు తన భుజపరాక్రమమును చూపినాడు. కాని వీరికి భయము తీరకపోగా ఈ భుజసౌందర్యమునకు దుష్టులవల ఏ అపాయము కలుగునో యని మరింత భయము పెరిగినది. మహావీరుడైన తన కుమారుడు యుద్ధమునకు పోవునపుడు కన్నతల్లి ఇతడు అతి సాహసముతో ప్రాణములను కూడ లెక్కచేయక యుద్ధరంగమున ప్రవేశించునేమో! పలు మాయలతో కూడిన యుద్ధములో ఏ అపాయము కలుగునోయని సందేహించినట్లే వీరు కూడ భయమునొంది మంగళా శాసనము చేయుచున్నారు. ఎపుడో కృష్ణావతారమున చాణూర ముష్టికులను జయించిన సంగతి ఇపుడు ఎందుకు చెప్పవలసి వచ్చెను అనగా – ఒకప్పుడు కుండలములతో దర్శనమిచ్చిన వ్యక్తి ఇపుడు అవి లేకుండ కనపడిననూ ఇతనివి కుండలములు ధరించిన చెవులు కదా అని గుర్తువచ్చినట్లు ఈ ఆళ్వారులు స్వామి భుజములను చూచి ఆనాడు మల్లురతో జరిగిన ఘోరయుద్ధము జ్ఞాపకమునకు రాగా భయకంపితమగు హృదయముతో మంగళాశాసనము చేయుచున్నారు.

**(మణివణ్ణా)** – ఇంద్రనీలమణి వంటి నీలవర్ణము కలవాడా! అని సంబోధనము. దేహకాంతినిబట్టి ఇంద్రనీలముతో సామ్యమును గ్రహింపదగును. కేవలము కాంతినిబట్టియే కాక సౌలభ్యము అను స్వభావమునుబట్టి కూడా భగవంతునికి మణితో సామ్యమును చెప్పవచ్చును. ఆ రత్నము తన యజమానికి కొంగులో మూటకట్టుకొనుటకుగానీ పెట్టెలో దాచుకొనుటకుగాని ఎట్లు అధీనమై యుండునో పరమాత్మ గూడ భక్తులకు అట్లు రత్నమువలె అధీనుడై యథేష్టముగా వినియోగించుకొనదగినట్లు సులభుడై యుండును అని భావము. ఇట్లు మణివలె మనోహర కాంతి కలిగి సుకుమారమగు ఈ స్వామి దేహమునకు మొరటువారైన

ఆ చాణూరాది మల్లయోధులతో ఎట్టి అపాయము కలుగునోయని ఈ ఆళ్వారుల మనస్సులో కలిగిన భయావేశమే ఇట్లు మంగళాశాసన హేతువైనది. బాలకృష్ణునికి ఆ మల్లయోధులతో యుద్ధము ఆరంభమగు సమయమున మధురానగరములోని స్త్రీలందరునూ ఈ యుద్ధము తగినది కాదు అని ఆవేదనతో క్రింది విధముగా చెప్పిరట-

**శ్లో॥ క్వ యౌవనోన్ముఖీ భూత సుకుమార తనుర్హరిః ।**
**క్వ వజ్రకఠినాభోగ శరీరోయం మహాసురః ॥**

ఇది విష్ణుపురాణములోని శ్లోకము. వెన్నలను ఆరగించుటచే సుకుమారముగా పెరిగిన సుందర శరీరముగల ఈ బాలకృష్ణుడెక్కడ? వజ్రమువలె అతి కఠినమైన మహాశరీరముగల చాణూరుడు అను ఈ రాక్షసుడెక్కడ? వీరిద్దరికినీ యుద్ధమును కల్పించుట సరికాదు అని చుట్టుప్రక్కలనున్న స్త్రీలు ఆక్రోశించిరి. భగవంతుని సౌకుమార్యమునుబట్టి భయపడుటకు అవకాశము ఉండవచ్చునుగాని ఆయన రత్నమువలె భక్తసులభుడు అని కీర్తింపబడిన సౌలభ్యము అపాయశంకకు కారణమగునా? అని సందేహింపవచ్చును. తన భక్తులైన దేవతలు ఎప్పుడు వచ్చి శరణాగతి చేసిననూ వారి ఆపదలను తొలగించుటకై ముందుపడి రాక్షసులతో యుద్ధమునకు దిగుట ఈ స్వామియొక్క అనుభవములో అలవాటుగా వచ్చుచున్నది. ఒకవేళ ఆ అలవాటే సాహసముతో రాక్షసవర్గములో యుద్ధార్థమై ప్రవేశించుటకు కారణమగును గనుక భయపడుటకు వీలున్నది గదా!

భక్తరక్షణకై ముందుకు దూకవలెనను నాలోని సౌలభ్యమును పరాక్రమమును గూడా చూచి మీరిట్లు భయపడుట మీ మనస్సులోని మెత్తదనమునకు నిదర్శనము. నాకెట్టి అపాయము కలుగదు. అని స్వామి తెలుపగా పిదప వీరు ఉన్‌శెవ్వడి శెవ్వి తిరుక్కాప్పు అని సమాధానము ఇచ్చుచున్నారు. ఎర్రని నీ పాదపద్మముల యొక్క అతి సుకుమారమగు కాంతినిబట్టియే నాకు భయమేర్పడుచున్నదిగాని అందులకు మెత్తని నా హృదయము కారణము కాదు సుమా, నీ దేహములోని సుకుమారచ్ఛాయను నీవే అద్దములో చూచుకొనియున్నచో సర్వజ్ఞుడవైన నీవే యుద్ధాదులచే ఈ దేహమునకు ఆపద కలుగునేమోయని వ్యాకులతను పొందియుండెడివాడవు. శెవ్వడి అను పదమునకు ఎర్రని కాంతి అనియూ మోసము లేకుండా అందరిచే ఆశ్రయింపదగిన

స్వభావము కలది అనియూ రెండర్థములు. కుటిల బుద్ధితో వచ్చువారికి కూడా ఆశ్రయింపదగినవి ఈ పాదపద్మములు. కాంతి విశేషముచే ఇవి శరీరమునకంతటి కినీ శోభాహేతువులు. శిశువునకు ప్రాప్యస్థానము తల్లియొక్క చనుదోయి అయినట్లు భక్తులకుగూడ ఆశ్రయణీయ స్థానము అర్ఘపాద్యాది కైంకర్యములు సమర్పించ వలసిన స్థానము భగవంతుని ఈ పాదద్వయమే కదా! నిత్యోజ్జ్వలమగు ఈ పాదకాంతికి సంపూర్ణ మంగళమగుగాక అని తిరుక్కాప్పు అను పదముచే సూచింపబడుచున్నది. ఆకస్మికముగా కలిగిన అపాయములు తొలగిపోవుటకునూ ఇంతకుముందు లేని శుభపరంపర నిరంతరముగా ఏర్పడుటకును ఈ మంగళాశాసనమే రక్షణకవచమైనది అని భావము.

ఈ పాశురమునందు వాక్యపరిసమాప్తిని సూచించు క్రియాపదమేదియును లేదే. దానిని ప్రయోగించకపోవుటకు కారణమేమి? అని కొందరికి సందేహము కలుగవచ్చును. నిజమే. (అస్తు) మంగళమగుగాక! అను క్రియాపదము ఉండ వలసినదే. తనకంటె తక్కువవారిని గురించి పెద్దలు మంగళాశాసనము చేయునపుడు నీకు శుభము అగును అని అనుగ్రహసూచకముగా ఆశీర్వదింతురు. తన తోటివారిని గురించిగానీ, తనకంటె కొద్ది ఉన్నతస్థాయిగల వ్యక్తులను గురించిగానీ "నీకు శుభము కలుగవలెనని ప్రార్థింతుము" అని చెప్పుదురు. కానీ సర్వాధికుడైన పరమాత్మ యొక్క వైభవమును చరమావధి అని చెప్పదగిన తనలోనుండు అల్పత్వమును (నైచ్యమును) భావించుకొన్నపుడు ఆ స్వామికి మంగళమును చెప్పుటకు నేనెంతటివాడను అను ఆవేదన వీరిలో ఏర్పడగా క్రియాపదము లేకుండనే ఈ వాక్యము ముగిసినది. ఇట్లు కొన్ని కొన్ని సందర్భములలో భావావేశముచే చెప్పదలంచిన మాటను పూర్తిగ చెప్పలేక ఆగిపోవుట సహజమే. అది దోషము కాదు.

ఒక మహర్షి చిన్నతనమునుండి తన ఆశ్రమములోనే తిరిగిన పాలిత పుత్రికను ఆమెను వివాహమాడిన భర్తవద్దకు సాగనంపినాడు. ఆ సమయమున ఆమె చిన్ననాటినుండి తాను పెంచి ప్రేమతో కాపాడిన ఒక గున్నమామిడి వృక్షమును దాని కొమ్మలను అల్లుకొని పెరిగిన సన్నజాజి తీగను చూచి దానివద్దకు పోయి నేను వెళ్ళిపోవుచుంటిననియూ, నీకు ఎట్టి అపాయముగూడ కలుగకుండవలెననియూ ఆర్ద్రమైన మనస్సుతో వాటికి ఆశీర్వాదము చెప్పుచూ యిట్లనుచున్నది –

**శ్లో॥ మా భవంతమనలః పవనోవా**
**వారణోమద కలః పరశుర్వా**
**వజ్రమింద్రకర విప్రసృతం వా**
**స్వస్తి తే స్తు లతయా సహ వృక్ష ॥**

ఓ చూతవృక్షమా! నిన్ను పెనవేసుకొని నీ ప్రక్కనే ఉండు సుకుమారమగు ఈ తీగతోపాటు నీకు స్వస్తియగుగాక (భవంతం అనలః మా) నిన్ను దావాగ్ని .... వద్దు (పవనః మా) ఝంఝామారుతము .... వద్దు (మదకలః వారణః మా) మదించిన ఏనుగు .... వద్దు (పరశుః మా) గొడ్డలి .... వద్దు (ఇంద్రకర విప్రసృతం వజ్రంవా మా) ఇంద్రుని చేతినుండి జారిన వజ్రాయుధము అనబడు పిడుగు... వద్దు. అని ఈ శ్లోకములో చెప్పబడుచున్నది. ఇందు ప్రతి ఒక్క వాక్యమునగూడా సందర్భమునుబట్టి ఉండవలసిన వేరు వేరు క్రియా పదములు ఏవియు ప్రయోగించ బడలేదు. వాటిని మనము ఊహించుకొని పూర్తి చేసుకొనవలెను. కాని ఆ మాటలను చెప్పుచున్న కన్యక ఆయా ఆపదలను తలచుకొనునపుడు కలుగుచున్న భయావేశముచే కంపితురాలై నోరు పెగలక వాటిని ఉచ్చరింపలేకపోవుచున్నది. నిన్ను ఎన్నటికినీ దావాగ్ని దహింపజేయవద్దు, ఝంఝామారుతము పెకలించవద్దు, మదగజము కొమ్మలను విరచివేయవద్దు, ఆటవికుని చేతిలోనుండు గొడ్డలి సమూలముగా నరికివేయవద్దు, పిడుగు నీపై పడి భస్మము చేయవద్దు అని స్పష్టముగా 'వద్దు' అను నిషేధమునకు పూర్వము ఆయా క్రియా పదములను ప్రయోగించవలసి యుండగా మెత్తని మనస్సుగల ఈ కన్యక ఆయా ఆపదలను మనస్సులో భావించు కొన్నపుడు కలిగిన దుఃఖావేశముచే పూర్తిగా క్రియాపదములను చెప్పలేక అసంపూర్తిగానే వాక్యములను ప్రయోగించినది. ఆయా దశలను తలంచుకొన్నపుడు పరిపరివిధములుగా ఆమె మనస్సులో కలిగిన వ్యాకులతకు ఈ అసంపూర్ణ వాక్యములు వ్యంజకమగుచున్నవి.

అట్లే ఈ పాశురమునగూడా క్రియాపదము లేకుండా ఈ ఆళ్వారులు వాక్యమును ముగించుట వీరిలోగల భావావేశమునకు వ్యంజకము అని గుర్తించ వలెను. అంతేకాని క్రియాపదమును ఛందస్సులో ఇముడ్చుటకు చేతగాక వదిలిపెట్టిరి అని భావించరాదు. పాండ్య మహాసభలో తమ వాగ్వైభవముచే వివిధ మతస్థుల

నోడించిన ప్రతిభగల వీరికి చిన్న క్రియాపదమును పాశురములో ఇముడ్చుట చేతకాలేదని ఊహించుట కవకాశమే లేదు.

లేక – నిరవధికమగు సౌందర్య సౌకుమార్యాది గుణసంపత్తిగల భగవద్విగ్రహ మును చూచినపుడు కొంతసేపు మంగళాశాసనమును చేసి నిలిపివేసినచో సంతృప్తి కలుగదు గనుక ఆ అసంతృప్తికి సూచకముగా క్రియాపదము ప్రయోగింపకుండనే వాక్యము నిలిపివేయబడెననియూ, నిరంతరము మంగళము కొనసాగవలెనని సూచించుటయే దీని భావమనియూ గ్రహింపదగును. మరియు ఈ పాశురము పైన చెప్పబోవు పదకొండు పాశురములకునూ ప్రధాన శీర్షిక వంటిది. ఉత్తరములను వ్రాయునపుడు శ్రీరామః శరణం మమ అనియో శ్రీమతే రామానుజాయ నమః అనియో శుభసూచక వాక్యమును మనము వ్రాయుచుందుము. వాటిలో 'అస్తు' (అగుగాక) అను క్రియాపదము కనబడకున్ననూ మనము తెచ్చిపెట్టుకొని అర్థమును పూరించుకొందుము. ఆ రీతిలో ఈ పాశురము ప్రబంధమునకు ఆముఖవాక్యము వంటిది గనుక క్రియాపదము లేకున్ననూ దోషము లేదని సమర్థింపవచ్చును.

h h

## పాశురము - 2

మొదటి పాశురమున భగవంతుని దివ్యమంగళ విగ్రహ సౌందర్యమునకును, ఆయనలోనుండు సౌలభ్యాది గుణములకును మంగళాశాసనమొనర్చిరి. ఈ పాశురమున ఉభయ విభూతి విశిష్టమగు సమగ్ర భగవత్స్వరూపమునకు మంగళా శాసనము చేయుచున్నారు. ప్రకృతి మండలమందుండు జీవరాశినంతయు కలుపుకొని (అడియోమోడుమ్) మేమందరము అనుటచేతనూ ఆ స్వామిని, ఆయన వక్షస్థలము నందుండు లక్ష్మిని, ఉభయ హస్తముల యందుండు సుదర్శన పాంచజన్యములను కలుపుకొని నిత్యవిభూతియందుండు సర్వ పరిజనవర్గమునకును పల్లాణ్డు పాడుటచేత సమగ్ర భగవత్స్వరూపము తాము చేయు మంగళమునకు ఉద్దేశ్యముగా చెప్పినట్లైనది గదా!

**మూలము :**

**అడియోమోడుమ్ నిన్నోడుమ్ పిరివిన్ఱి యాయిరమ్ పల్లాణ్డు**
**వడివాయ్ నిన్ వలమార్పినిల్ వాழ్ కిన్ఱ మంగైయుమ్ పల్లాణ్డు**
**వడివార్ శోతి వలత్తుఱైయుమ్ శుడరాழியుమ్ పల్లాణ్డు**
**పడై పోర్ పుక్కు ముழఙ్గు మప్పాఞ్చశన్నియముమ్ పల్లాణ్డే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అడియో మోడుమ్ | = | దాసులగు మాతోను |
| నిన్నోడుమ్ | = | స్వామివగు నీతోనూ (కలుపుకొని) |
| పిరివు ఇన్ఱి | = | ఎడబాటు లేకుండునట్లు |
| పల్ ఆయిరం ఆణ్డు | = | పలువేల సంవత్సరములు (మంగళమగుగాక) |
| వడివాయ్ | = | శోభావంతమై |
| నిన్ వలమార్పినిల్ | = | నీ వక్షస్థలమున కుడిప్రక్కన |
| వాழ్ కిన్ఱ | = | ఆనందముగా నివసించు |
| మంగైయుమ్ | = | లక్ష్మీదేవికిని |
| పల్లాణ్డు | = | అనేక సంవత్సరములు శుభమగుగాక |
| వడివు ఆర్ శోతి | = | గొప్ప తేజస్సుతో నొప్పు |
| వలత్తు ఉఱైయుం | = | కుడిహస్తమున నివసించియుండు |
| శుడర్ ఆழియుమ్ | = | జ్వలించు సుదర్శనమునకును |
| పల్లాణ్డు | = | పలు సంవత్సరములు మంగళమగుగాక |
| పడై పోర్ పుక్కు | = | సేనా సంకులమగు యుద్ధమునందు చేరి |
| ముழంగుమ్ | = | ధ్వనించునటువంటి |
| అప్పాఞ్చశన్నియముమ్ | = | పాంచజన్యము అనబడు ఆ శంఖమునకును |
| పల్లాణ్డే | = | పలు సంవత్సరములు మంగళమగుగాక |

**వివరణము :**

ఈ పాశురమున మొదటి పాదములో దాసులమగు మాతోపాటు నీకును మంగళమగుగాక యని చెప్పబడుచున్నది. స్వార్థమును కొంచెమైనను అపేక్షించక

భగవత్సమృద్ధినే ఆకాంక్షించు ఈ విష్ణుచిత్తులు ఇపుడు తమనుగూడ కలుపుకొని ఉభయులకునూ నిత్యమంగళమును అపేక్షించుట తగునాయని ఆక్షేపము రావచ్చును. మంగళాశాసనమనబడు ఈ కైంకర్యమునకు తమవంటి పరిజనవర్గముకూడ అవసరమైనందున తాము లేనిచో స్వామికి మంగళాశాసనము జరుగదేమో అని భావించుటచే తమవంటి భక్తవర్గమునుగూడ “అడియో మోదుమ్” అని కలుపుకొని చెప్పుటలో తప్పులేదు. ఒక ఫలితము నుద్దేశించి యజమాని కార్యములను ఆచరించినపుడు ఆ యజమానికి ఋత్విక్కులందరును “ఆయురాశాస్తే” అని ఆరంభించి యజ్ఞఫలము సిద్ధించవలెనని ఆశీర్వచనము చేయుదురు. నిజమునకు యజమాని అపుడు ఆయుష్యమును ఫలమును కోరకున్ననూ అతడు యజ్ఞఫలము సిద్ధించి దానిని అనుభవించుటకు కావలసిన ఆయుష్యముగూడ అవసరమే గనుక అచట ప్రధాన ఫలమునకు అంగముగా ఆయుష్యముగూడ కలుగుగాక యని ఆశీర్వచనము చేయబడినట్లే ప్రస్తుతము స్వామికి మంగళాశాసనము చేయునపుడు తాముగూడ అవసరమే గనుక తమకునూ మంగళమును చెప్పుకొనుటలో ఆక్షేపము లేదు.

ఐతే నాతో పాటు నీకును అని చెప్పక దాసులమగు మాతోపాటు అని విశేషించి చెప్పుటలో భావమేమి అని సందేహము కలుగవచ్చును. సర్వ జీవ వర్గమునకును భగవద్దాస్యమే సహజ స్వరూపము అని ఎరిగినవారైనందున ‘అడియోం’ అని ప్రయోగించిరి. జీవుని స్వరూపమేమో పామరునికి తెలియదు. కొందరు దేహమునే ఆత్మయని భావించుచు, (అహం) నేను అను పదమునకు దేహమును అర్థముగా చెప్పుచున్నారు. మాయావాదులు అనబడు అద్వైత శాస్త్రకర్తలు అంతః కరణమునే జీవునిగా తెలుపుచున్నారు. సాంఖ్యుడు అనబడు మరొక శాస్త్రకర్త జడప్రకృతికంటె భిన్నమై స్వయంప్రకాశము, స్వతంత్రమునగు జ్ఞానమునే ‘అహం’ శబ్దార్థమగు ఆత్మగా చెప్పుచున్నాడు. ఇట్లు పామరులు, కొందరు శాస్త్రకర్తలు కూడా తమ తమకు తోచినట్లు ఆత్మ లక్షణమును చెప్పిరి. ఈ విష్ణుచిత్తులు ఆత్మస్వరూప నిర్ణయమున అట్లు వ్యాకులత నొందినవారు కాక ఉపనిషత్సిద్ధాంతమును ‘యస్మాస్మి సోహం’ ఇత్యాది వాక్యములనుబట్టి నిశ్చితముగా తెలుసుకొన్నవారగుటచేత భగవంతునితో తమకున్న సంబంధమును గుర్తించి (అడియోమ్) దాసులమైన మేము అని చెప్పిరి. కర్మ సంబంధమునుబట్టి తాత్కాలికముగా వచ్చు ఆయా దేహ

సంబంధములు స్థిరములు కావు గనుక స్వామియగు భగవంతునితో స్థిరమగు సంబంధమే తమ స్వరూపమని వీరు సప్రమాణముగా నిర్ణయించిరి.

అయితే దాసుడనగు నాతోపాటు నీకు మంగళము అని ఏకవచనముగా చెప్పక **'అడియోమ్'** అను బహువచనముగా చెప్పుటలో భావమేమి? అనగా! వీరు ఏకాకిగా తామొక్కరే మంగళాశాసనము చేసినచో తృప్తినొందువారు కారు గనుక తమవలెనే ఇతర జీవులందరును కూడ భగవంతునికి దాసులే అయినపుడు ఈ మంగళాశాసన కైంకర్యమున వారినిగూడ కలుపుకొనవలెనని అభిప్రాయపడిరి. అందుకే మీరుగూడ వచ్చి మంగళాశాసనము చేయుడని పై పాశురములలో ఇతరులను గూడ ఆహ్వానించుచున్నారు. భాగవతగోష్ఠి సంపూర్ణముగా నుండవలెనని వీరి అభిలాష.

**(నిన్నోడుం) –** నీవు సర్వస్వామివి. ఇతర దేవతలవలెనో, మాతా పితృ ఆచార్యాదుల వలెనో ఏ కొందరికో స్వామివి కావు. అందరమూ కలసి నీకు మంగళాశాసనము చేసిననూ చాలదు అని చెప్పదగిన పరమపురుషుడవు. వెనుకటి పాశురములో "మణివణ్ణా" అని దివ్యమంగళ విగ్రహమునకు మంగళము చెప్పియున్నందున "నిన్నోడుమ్" అను ఈ పదము చేత భగవంతునియొక్క సత్యజ్ఞానానంద స్వరూపమగు దివ్యాత్మ స్వరూపమునకు మంగళము పాడుచున్నట్లు గ్రహింపదగును.

**(పిరివు ఇన్ఱి) –** ఏనాడును ఎడబాటు కలుగకుండునట్లు అని యర్థము. జీవేశ్వరులు ఇద్దరునూ నిత్యులే అయినట్లు వారికిగల సంబంధముగూడ తమ మంగళాశాసనముచే విచ్ఛేదము కలుగకుండ నిత్యమై కొనసాగవలెనని వీరు అభిప్రాయపడుచున్నారు. (ఆయిరం పల్లాణ్డు) కొన్ని వేల సంవత్సరములు, అనగా కాలతత్త్వము ఉన్నంతవరకును మంగళము కలుగుగాక యని ఈ మొదటి పాదమునకు భావము.

**"వడివాయ్ నిన్ వలమార్ పినిల్ వాழ్కిన్ఱ మంగైయుమ్ పల్లాణ్డు"**

ఇట్లు మంగళాశాసనము చేయుచున్న వీరి ఆవేదనను తొలగించుటకై భగవంతుడు తన వక్షస్థలమందున్న లక్ష్మీదేవిని చూపి మంగళదేవతయగు ఆమె నా వక్షస్థలమున నిత్యవాసము చేయుచుండగా నీకు భయమెందులకు? తన కటాక్ష మాత్రముచేత అన్ని విధములగు అమంగళములను తొలగించి, మంగళములను

ప్రసాదించగల ఈమె నావద్దనుండగా నా వద్దకు అమంగళములు చేరునా? అని భగవంతుడు తెలుపగా, మీరిద్దరునూ నిత్యముగా కలసియుండుడు. ఈ సన్నివేశము నకు శాశ్వత మంగళమగుగాక! దీనికి ఎట్టి అపాయము కలుగకుండుగాక! యని ఈ రెండవ పాదమున విష్ణుచిత్తులు మంగళాశాసనము చేయుచున్నారు. 'వడివు' అనగా ఉజ్జ్వలమగు తేజస్సు. లక్ష్మీదేవియొక్క సన్నిధానముచే భగవంతుని దేహము నకు గొప్ప తేజస్సు లభించినట్లు వడివాయ్ అను పదముచే వివరింపబడుచున్నది.

తనవద్దకు సహాయమునకై వచ్చిన రావణాసురునికి సదుపదేశమును చేయుచు మారీచుడు **"అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా"** అని రాముని ప్రభావమును చెప్పెను. జనకపుత్రికయగు సీతాదేవిని స్వీకరించి ఆమెయొక్క సన్నిధానముచే అజయ్యమైన తేజస్సుగా వెలుగొందిన శ్రీరాముని ఎదురించి గెలువ దలంచితివా? అది నీకు అసాధ్యము అని మారీచుడు బోధించెను. దీనినిబట్టి రాముని ప్రభావమునకు సీతా సన్నిధానము ప్రధాన కారణమని తెలుపబడినది. మరియు **"శ్రద్ధయా దేవో దేవత్వమశ్నుతే"** అను వేదవాక్యమునుబట్టి నారాయణుడు పరదైవము అగుటకు లక్ష్మీదేవియొక్క సన్నిధానమే కారణమని తెలుపబడుచున్నది. ఈ వేదమంత్రమున శ్రద్ధా శబ్దమునకు లక్ష్మి అని యర్థము. పురుషసూక్తములోని **"హ్రీశ్చ తే లక్ష్మీశ్చ పత్న్యౌ"** ఇత్యాది ప్రమాణములనుబట్టి లక్ష్మీదేవి యొక్క పతియైన వాడే పరమాత్మ యని నిర్ణయింపబడుచున్నదిగదా!

లక్ష్మీదేవియొక్క సంబంధమునుబట్టియే ఆయన పరమాత్మయైనాడు అన్నచో అది పరమాత్మను కించపరచుట కాదా? అని కొందరికి సందేహము కలుగవచ్చును. కాంతినిబట్టియే రత్నమునకు గొప్ప ప్రశస్తి కలిగిననూ రత్నము గొప్పది కాదు అనలేము కదా! అట్లే పుష్పమునకు ప్రాధాన్యము వాసననుబట్టియే వచ్చిననూ పుష్పముయొక్క గొప్పదనమునకు లోటులేదుగదా! అదే విధముగా రత్నముయొక్క ప్రభవలెను, పుష్పముయొక్క గంధమువలెను భగవంతుని నిత్యమును అంటిపెట్టుకొని యుండుటచే నిత్యానపాయినియగు లక్ష్మీదేవి సంపర్కముచేత భగవంతుని ప్రభావము ఇనుమడించినట్లు చెప్పబడిననూ అది భగవద్వైభవమేయగును కాని అందుచే ఆయనకు అపకర్షము చెప్పినట్లు కాజాలదు. శ్రీ పరాశరభట్టరువారు **శ్రీగుణరత్న కోశము** అను స్తోత్రమునందు **"స్వతశ్శ్రీః త్వం"** అను శ్లోకమునందునూ ఈ వెనుక

చెప్పిన రత్నదృష్టాంతమును, పుష్పదృష్టాంతమును చూపించి ఇదేవిధముగా లక్ష్మీ సంబంధముచే భగవంతునికి కలిగిన వైభవమును సమర్థించి చెప్పిరి. ఆ విషయము లను ఇచట గుర్తింపదగును.

లేక – **వడివు** అను పదమునకు ఆభరణము అనిగూడ అర్థమున్నందున కౌస్తుభరత్నాదులవలె ఈమె భగవంతుని వక్షస్థలమున ఆభరణమై ప్రకాశించుచున్నది అనియు అర్థమును చెప్పవచ్చును. అట్టి నీయొక్క వక్షస్థలమున కుడిప్రాంతమున హస్తాలింగనముతో దగ్గరకు తీసుకొనదగినంత సన్నిహితురాలై ఆమె ఉన్నది. పద్మవాసిని అగు ఆమెకు అంతకంటెగూడ ఈ వక్షస్థల నివాసమే ఆనందప్రదమై హృద్యముగా నున్నందున క్షణముగూడ నేను స్వామియొక్క వక్షస్థలమును విడిచి యుండజాలనని ఆమె చెప్పుచున్నది. **"మంగై"** అను ద్రవిడ పదము కౌమారావస్థలో నుండి అపుడే యౌవనమునకు చేరుచున్న ముగ్ధనాయికను బోధించును. కౌమారము పోయి యౌవనము తొంగిచూచు వయస్సులో ఆమె యున్నది. దీనినిబట్టి **"యువా కుమారః"** అను శ్రుతివాక్యమున చెప్పబడినట్లు భగవంతుని విగ్రహముగూడ అపుడే యౌవనావిర్భావము పొందిన దశలో ఉన్నందున **"తుల్యశీలవయోవృత్తాం"** అని రామాయణమున చెప్పబడినట్లు పరస్పరము సమానమైన దశలో ఇద్దరును కలరని గ్రహింపదగును. లక్ష్మీదేవికి మంగళాశాసనము చేయు ఈ వాక్యముచేత ఆమెతో బాటు భగవత్సన్నిధిలో నిత్యసన్నిహితులైయుండు భూదేవి, నీళాదేవి మొదలగు దివ్య మహిషీ వర్గమునుగూడ ఇచట గ్రహింపదగును. అందరకును మంగళములను ప్రసాదించు లక్ష్మీదేవికి కూడ రాక్షస భూయిష్ఠమైన ఈ ప్రపంచమున అపాయము కలుగునేమోనను భయముచే వీరు మంగళమును పాడుచున్నారు.

**"వడివార్ శోతి వలత్తురైయుమ్ శుడరాழியుమ్ పల్లాణ్డు"**

భగవంతుని దేహమునకు క్రొత్త కాంతిని ప్రసాదించు ఆయనయొక్క శ్రీహస్తమున ఉజ్జ్వలముగా ప్రకాశించుచున్న చక్రాయుధమునకు మంగళమగుగాక! అని దీనియర్థము. నాకు ఎట్టి అపాయముగూడ లేకుండ రాతికోటవలె రక్షణము కల్పించుచున్న సుదర్శనాయుధము నావద్దనుండగా మీరు భయపడనేల? అని భగవంతుడు పలుకగా ఆ చక్రాయుధమునకు కూడ ఏమైన అపాయము కలుగునేమో యని మంగళాశాసనము చేయుచున్నారు. నీలమేఘమువంటి కాంతిగల భగవంతుని

విగ్రహముపై పచ్చని కాంతితో జ్వలించు ఈ సుదర్శనము యొక్క శోభా విశేషము ప్రసరించుటచే రమణీయమగు సౌందర్యమేర్పడినది. కనుకనే ఉపనిషత్తుగూడ **"పురుషం కృష్ణ పింగళం"** అని కీర్తించినది. దేహముయొక్క నీలవర్ణముపైన బంగారము వంటి పచ్చని సుదర్శనకాంతి ప్రసరించినది అని భావము. భగవంతుని హస్తములో నుండి ఈ సుదర్శనము ఆయుధమై రక్షకమైననూ స్వామియొక్క దేహకాంతిని ఇనుమడింపజేయు ఆభరణమువలె గూడ ప్రకాశించుటచేత ఈ సుదర్శన తేజము నిత్యమై వెలుగొందుగాక! యని మంగళము చెప్పబడినది.

**"పడైపోర్ పుక్కుముழంగు మప్పాఞ్చశన్నియముమ్ పల్లాణ్డే"**

సేనాసంకులమైన యుద్ధమునందు ప్రవేశించి గంభీరముగా ధ్వనించు పాంచజన్యమనబడు ఆ శంఖమునకుగూడ మంగళమగుగాక అని యర్థము. పాంచజన్యముయొక్క ధ్వని శత్రువుల హృదయములను భేదించునట్లు భయంకరము గనూ భక్తుల హృదయములకు ఆనందమును కలిగించునట్లు గంభీరముగనూ ఉండునని చెప్పబడియున్నది. భారత యుద్ధారంభమున కృష్ణుడు పూరించిన పాంచజన్య ఘోష వర్ణనమున **"స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్"** అను శ్లోకమున చెప్పబడినది. మరియు విష్ణుపురాణమున దేవదానవ యుద్ధము నందు భగవంతుడు పూరించిన పాంచజన్య ధ్వనిచేత దానవులలో బలము సన్నగిల్లి నట్లుగా **"యస్య నాదేన దైత్యానాం బలహానిః అజాయత"** అని వర్ణింపబడినది. ఇట్టి ప్రభావముగల శంఖమునకు మంగళమును చెప్పనేల అన్నచో దీనియొక్క ధ్వని భగవంతుడీచోట నున్నాడు అని గుర్తించుటకు అవకాశమునిచ్చుచున్నందున ఆ శంఖమునకు భగవంతుని విగ్రహమునకు రాక్షసులచే అపాయము కలుగకుండుగాక యని మంగళాశాసనము చేయబడెను.

ఈ రెండు పాశురములును అష్టాక్షరీ మహామంత్రముయొక్క అర్థమును బోధించునని పెద్దలు వివరింతురు. ఎట్లగా – అడియో మోడుమ్ అను పదము ప్రణవముయొక్క అర్థమును తెలుపుచున్నది. అకారవాచ్యుడైన పరమాత్మకు మకార వాచ్యమైన జీవుడు దాసుడు అని చెప్పుటయే ప్రణవముయొక్క ముఖ్యార్థము. అడియోమ్ అను పదము దానిని ఆవిష్కరించినది. ఇక మొదటి పాశురములోని పల్లాణ్డు అను పదము నమశ్శబ్దముయొక్క అర్థమును సూచించుచున్నది. నమశ్శబ్దము

వలె పల్లాణ్డు అను పదముగూడ భగవత్సన్నిధిలో తన విధేయతను ప్రకటించుచున్నదని వెనుకనే చెప్పియున్నాము. ఇక **"మల్లాణ్డ తిణ్డోళ్"** **"మణివణ్ణా"** అను రెండు పదములు భగవంతుని దివ్యమంగళ విగ్రహమును "అడియో మోడుమ్" అను పాశురము మొత్తముగా భగవంతునియొక్క లక్ష్మీ సుదర్శన పాంచజన్య అనంత గరుడ విష్వక్సేనాది నిత్యవిభూతియోగమును తెలుపుటచే నారాయణ పదార్థమును వివరించి నట్లయినది. ఉభయ విభూతులకు తాను ఆధారమై వ్యాపించియున్నాడు అని నారాయణ శబ్దార్థము శాస్త్రములలో వివరించబడినది. ఆ మంత్రములో చివరనుండు **"ఆయ"** అను చతుర్థీవిభక్తి యొక్క అర్థమైన కైంకర్య పురుషార్థ ప్రార్థనమే పల్లాణ్డు అనియూ **"ఉన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు"** అనియూ వివరింపబడినది. స్వామికి నిరంతరము మంగళమును చెప్పుటయే దాసుని ఉత్తమ కైంకర్యమని అష్టాక్షరీ మంత్ర సారమైన ఈ రెండు పాశురములలోని సారాంశము.

h h

## పాశురము - 3

గరుడ వాహనారూఢుడై ఆకాశమునందు తమకు సపరివారముగా దర్శన మిచ్చిన భగవంతుని అద్భుతమగు సౌందర్య సౌకుమార్యాది మహాగుణములను దర్శించి భక్తిపరవశులై ఈ పెరియాళ్వారులు వెనుక రెండు పాశురములచే తామే భగవంతునికి మంగళాశాసనమును చేసియున్నారు. అంతటితో తమ మనస్సుకు తృప్తి కలగనందున భగవద్భక్తులైన ఇతరులనుకూడ స్వామికి మంగళాశాసనమును చేయుటకై మీరుకూడ రండు అని పై మూడు పాశరములలో పిలుచుచున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ ఏడవ అధ్యాయమున **"చతుర్విధాః భజంతే మాం"** అను శ్లోకమున తనను ఆశ్రయించు భక్తులు నాలుగు విధములైయుందురని తెలిపి యున్నాడు. **ఆర్తుడు, జిజ్ఞాసువు, అర్థార్థి, జ్ఞాని** అని ఆ నలుగురికినీ ఆయనయే పేర్లు పెట్టినాడు. వారిలో ఆర్తుడు అర్థార్థి అను ఇద్దరునూ కొద్దిభేదముతో ఒకే వర్గమునకు చెందినవారగుటచే వీరిని ఐశ్వర్యార్థులు అని ఒకే పదముతో వ్యవహరింప వచ్చును. వీరిలో ఆర్తులు పలు కష్టములచే తొలగిపోయిన తమ ఐశ్వర్యమును భగవంతునివద్ద అపేక్షింపగా, అర్థార్థి అనువాడు ఉన్న తన ఐశ్వర్యమును క్రమముగా మరింత అధికము కావలెనని కోరుచున్నాడు. ఇట్లు ఈ ఇద్దరునూ ఐశ్వర్యమును

కోరువారే గనుక ఏకరాశికి చెందుదురు. ఇక జిజ్ఞాసువు అనువాడు దుఃఖపరంపరకు హేతువైన ఈ ప్రకృతి సంబంధమును తనకు పూర్తిగా తొలగించి పరిశుద్ధము జ్ఞానానందరూపమగు తన ఆత్మస్వరూపమును అనుభవించు కైవల్యమను మోక్షమును ప్రసాదింపుమని భగవంతుని ఆశ్రయించినాడు. ఈ జిజ్ఞాసువు భగవత్సన్నిధిలో లభించు శాశ్వత బ్రహ్మానందమునుగాక కేవలము తన ఆత్మానందానుభవమునే కోరుకున్నందున అతనికి అభించిన ఆ మోక్షము నిత్యమేగాని సంపూర్ణము కాజాలదు. ఇక చివరివాడు జ్ఞాని. ప్రకృతి బంధము తొలగిపోయి భగవంతుడే తనకు సర్వస్వము అని పరమభక్తి సంపన్నుడై స్వామిని ఉపాసించియో, శరణాగతి చేసియో సంపూర్ణ మోక్షమును భగవత్సన్నిధిలో అపేక్షించినవాడు. ఇట్లు ఐశ్వర్యార్థినీ, కైవల్య మోక్షార్థినీ, పరమభక్తుడగు జ్ఞానిని ఈ ముగ్గురినిగూడ పై మూడు పాశురములలో స్వామికి మంగళాశాసనము చేయుదము రండు అని పిలుచుచున్నారు.

మొదట తమవలెనే పరమభక్తులై ఏ ఇతర ప్రయోజనములను అపేక్షింపక భగవత్కైంకర్యమునే ప్రధానమని ఎంచు జ్ఞాని అనబడు పరమభాగవతులను తమకు దగ్గరివారు గనుక పిలుచుచున్నారు. పిదప కైవల్యార్థులను, ఆపైన ఐశ్వర్యార్థులను విడివిడిగా రెండు పాశురములలో పిలిచెదరు. ఇట్లు వారినిగూడ పిలుచుటకు “నేనొక్కడనే ఈ కైంకర్యమునకు చాలను” అను అసంతృప్తి వీరి మనస్సులో కలుగుట ఒక కారణము కాగా **“ఏకః స్వాదు న భుంజీత”** అను లోకోక్తి ప్రకారము మధురమైన వస్తువును తామొక్కరే భుజించక దానిని నలుగురికినీ పంచిపెట్టుట ఉత్తమపురుషుని లక్షణము గనుక వీరు ఈ మంగళాశాసనమును సత్కార్యమున ఇతరులనుగూడ అన్వయించవలెనని భావించుట రెండవ కారణము. మరియు భాగవత గోష్ఠితో కలసి మంగళాశాసనము చేయుట తమకు ఆనందహేతువగుటచేత, లేనిచో మంగళాశాసనమునకు కొరతయని భావించి ఇతర భక్తులను గూడ ఆహ్వానించు చున్నట్లు చెప్పవచ్చును. ఇది మూడవ కారణము. నమ్మాళ్వారులు కులశేఖరులు మొదలగు వారందరునూ భాగవతగోష్ఠితో నిండిన భగవత్సేవనే ఎప్పుడు పొందగలమా అని అపేక్షించినట్లు తెలియుచున్నది.

**మూలము :**

**వాఞాట్పట్టు నిన్ఱీరుళ్ళీరేల్ వన్దు మణ్ణుమ్ మణముమ్ కొణ్మిన్**
**కూఞాట్పట్టు నిన్ఱీర్ కళైయెజ్గళ్కుఘువినిల్ పుకుత లొట్టోమ్**
**ఏఞాట్కాలుమ్ పఞిప్పిలోమ్ నాజ్గళిరాక్కతర్ వాఞిలజ్గై**
**పాఞాళాక ప్పడై పొరు తానుక్కు పల్లాణ్డు కూఱుతుమే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| వాఞ్ -ఆళ్-పట్టు | = | ఉజ్జీవన హేతువగు భగవత్కైంకర్యమను వృత్తిని పొంది |
| నిన్ఱీర్ | = | స్థిరబుద్ధి కలవారై |
| ఉళ్ళీరేల్ | = | మీరు ఉంటిరేని |
| వన్దు | = | వచ్చి |
| మణ్ణుమ్ | = | అంకురార్పణకై మృదాహరణము అను కైంకర్యమును |
| మణముమ్ | = | ఉత్సవ నిర్వహణ భారమును |
| కొణ్మిన్ | = | స్వీకరింపుడు |
| కూఞాట్పట్లు | = | కూటికొరకై దాస్యవృత్తిలో దిగి |
| నిన్ఱీర్ కళై | = | ఉన్నవారిని |
| ఎజ్గళ్కుఘువినిల్ | = | మా గోష్ఠిలోనికి |
| పుకుతల్ ఒట్టోమ్ | = | ప్రవేశించుటకు అంగీకరించము |
| ఏఞాళ్ కాలమ్ | = | ఏడు తరములుగా |
| పఞిప్పుఇలోమ్ | = | ఎట్టి దోషములు లేనివారము |
| నాజ్గళ్ | = | మేము |
| ఇరాక్కతర్వాఞ్ | = | రాక్షసులు నివసించియుండు |
| ఇలజ్గై | = | లంకానగరమును |
| పాఞాళాక | = | సమస్తజనము నశించునట్లుగా |
| పడైప్పొరు తానుక్కు | = | యుద్ధమును చేసిన శ్రీరామచంద్రస్వామికి |
| పల్లాణ్డు కూఱుతుమే | = | రక్షణమగుగాక యని మంగళాశాసనము చేయువారము |

**వివరణము :**

వాళ్ = సుఖరూపమైన, ఆళ్ = దాస్యవృత్తి అని ఈ రెండు పదములకు అర్థము. భగవంతునికి చేయు కైంకర్యము అను ఈ వృత్తి అతిసుఖహేతువే కాని దుఃఖమయము కాదు. భగవద్వ్యతిరిక్తుల విషయమున చేయు దాస్యము కష్టరూప మైనది. క్షుద్రుడగు ఒక యజమానికి పరతంత్రుడై జీవనమును గడుపుట నీచకృత్యము గనుక అది కుక్క బ్రతుకు వంటిది అని **"సర్వంపరవశం దుఃఖం" "సేవాశ్వవృత్తిః"** అను మనుస్మృతి వాక్యములు తెలుపుచున్నవి. కనుక భగవత్సేవయే ఉజ్జీవన హేతువు. ఇక భగవంతునే ఆశ్రయించినను క్షుద్రఫలములు అపేక్షించుట తగదు. **"సంగాత్ సంజాయతే కామః కామాత్ క్రోధః అభిజాయతే"** అని భగవద్గీతలో చెప్పబడినట్లు లౌకిక క్షుద్రఫలములయందు ఏర్పడిన సంబంధము క్రమముగా వ్యసన రూపమగు ఆసక్తిగా పరిణమించి అది అతనికి బంధకమే యగును గనుక ఫలాపేక్షతో చేయు భగవద్దాస్యముగూడ సరియైనది కాదు. ఇతర ఫలములన్నింటినీ వదిలి భగవత్సాన్నిధ్యమే పరమప్రయోజనమని భావించు భక్తుడు కూడ కర్మ జ్ఞాన భక్తి యోగాది రూపమగు దుష్కర సాధనములను అవలంబించి స్వప్రయత్నముతో నేను ఫలితమును సాధించుకొనగలనని భగవదాశ్రయణమునందు దిగుటగూడ అసాధ్యము అనుచితమునగు వ్యవహారమే. కష్టతరమైన ఆ వ్యవహారమునందు దిగక తన పారతంత్ర్యమును గుర్తించి సర్వభారమును భగవంతునిపైననే ఉంచి ఆయనయే నాకు రక్షకుడని శరణాగతిని చేయుట ఉత్తమ మార్గము. ఈ శరణాగతి నిష్ఠుడు చేయు భగవత్సేవయే దుఃఖగంధరహితమై సుఖమయమై ఉజ్జీవన హేతువగును. భగవంతునిపై తనకు నిరతిశయ ప్రేమయున్నందున అతనికి తాను చేయు దాస్యము కూడ అతిప్రియమై యుండును కదా! సర్వస్వామియగు భగవంతునికి దాసుడగుటయే తన స్వరూపము గనుక ఈ భగవత్సేవ తన స్వరూపమునకు తగినది కాని క్షుద్రులగు ఇతరుల సేవ అట్టిది కాదు గనుక అది పరిత్యాజ్యమైనది. స్వప్రయత్నముతో కర్మయోగాది మార్గముల నవలంబించు భక్తునికి గూడ శాస్త్రీయములగు ఎన్నో కట్టుబాట్లు అవిచ్ఛిన్నమగు ఉపాసనము, దేహత్యాగ సమయమున భగవంతుని గూర్చి అంతిమస్మరణము మొదలైన ఎన్నో అంశములున్నవి. ఇటువంటి నిర్బంధము లేమియు లేక స్వసుఖమును అపేక్షింపక భగవద్వైభవ అభివృద్ధిని అపేక్షించి సంతోష పూర్వకముగా చేయు మంగళాశాసన కైంకర్యమే భగవదనుగ్రహమును పొందుటకు

ప్రధాన కారణమగును. ఇతడు చేయు ఇట్టి కైంకర్యమును అతి ప్రేమతో స్వీకరించిన భగవంతుడు కూడ తన అంతరంగ భక్తునిగా ఇతనిని అభిమానించును. ఇట్టి భగవన్ముఖోల్లాసమే నాకు వలసిన పరమపురుషార్థమని ఎంచు ఉత్తమ భక్తినిష్ఠ మీలో స్థిరముగా నున్న ఎడల రండు అని వీరు ఆహ్వానించుచున్నారు. ఉప్పు సముద్రములో మంచి ముత్యము దొరుకునా అన్నట్లు "నేను-నాది" అను అహంకార మమకారము లతో నిండియుండు ఈ నిత్య సంసారులలో పైన చెప్పిన ఉత్తమభక్తిగల వ్యక్తి లభించుట అలభ్యలాభము అనియే చెప్పదగును. ఈ అంశమును **(నిన్టీరేల్)** (మీరిట్టి భావన కలవారైన ఎడల) అను సందిగ్ధార్థకమగు పదము సూచించుచున్నది. ప్రబల వాయు ప్రేరణకు లోనై కొట్టుకొనిపోవు గడ్డిపోచవలె పుణ్యపాపరూప ప్రబల కర్మపాశమునకు పరతంత్రుడై జన్మ జరామరణ రూప సంసార ప్రవాహమున కొట్టుకొని పోవుచున్న ఈ జీవునికి భగవంతునిపై అభిలాష తత్కైంకర్యమే నాకు కర్తవ్యమను నిష్ఠయూ కలిగినపుడే అతని జన్మ సార్థకమైనట్లు భావింపదగును. ఇట్టి భక్తులు కలుగుట దుర్లభము గనుకనే పరమాత్మ గూడ **"సమహాత్మా సుదుర్లభః"** అని భగవద్గీత యందు చెప్పియున్నాడు. రామరావణ యుద్ధమునందు శత్రువు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు వానరవీరులందరును మూర్ఛపడిపోయియుండగా హనుమంతుడు విభీషణుడునూ ఈ వానరులలో ఒకరిద్దరైనను ప్రాణము కలిగియున్నారా అని వెతక నారంభించిరట. ఆ విధముగనే ఈ సంసారమండలమున భగవత్సేవయే నాకు పరమార్థమని ఎంచు వైష్ణవభక్తుడు ఒకడైననూ కనపడునా అని వెతకవలసియుండును అని **ఉళ్లీరేల్** అను పదము సూచించుచున్నది.

**(మణ్ణుమ్ మణముమ్ కొణ్మిన్) –** వెంటనే వచ్చి **(మణ్ణుమ్)** మృత్తికను తెచ్చు కైంకర్యమును **(మణముమ్)** ఉత్సవ నిర్వహణ భారమును స్వీకరింపుడు అని సాదరముగా వీరు ఆ పరమభాగవతులను పిలుచుచున్నారు. ప్రధానములైన ఈ రెండు కైంకర్యములకు సమర్థులైన అంతరంగ దాసులనే వినియోగించుట ఆచారమై యున్నది. కొత్తగా ఒక వ్యక్తిని భృత్యుడుగా పనిలోనికి చేర్చుకొనునపుడు వ్రాసుకొను ఒడంబడిక పత్రములో అవసరమైనపుడు మట్టితట్టలు మోయవలెను అన్ని పనులు నిర్వహించుటకు సిద్ధపడవలెను అని వ్రాసుకొనుట లోకవ్యవహారములో నున్నది. యజమాని గృహమున ఏదైన శుభకార్యము చేయునపుడు ఆ ఉత్సవాంగముగా అంకురార్పణము జరిపించుట, అందుకొరకై పుట్టమట్టిని తెప్పించుట ఆచారమై

యున్నది. దేవాలయములలో జరుగు ఉత్సవారంభమున కూడ ఈ అంకురార్పణకై పుట్టమన్ను తెచ్చుటకు విష్వక్సేనులను శ్రీ సుదర్శనమూర్తిని గ్రామము వెలుపలకు పుట్టవద్దకు పల్లకీలో తీసుకొని పోవుదురు. ఆ కైంకర్య నిర్వహణలో విష్వక్సేన సుదర్శన మూర్తులు నియమింపబడినట్లు, మీరు కూడ అంతరంగ భక్తులై ఈ మృత్సంగ్రహణ కార్యక్రమములో మొదట అన్వయింపుడు, పిదప ఉత్సవ నిర్వహణ బాధ్యతను సంపూర్ణముగా వహింపుడు అని భావము. ఇచట కొణ్మిన్ అను పదము మీరు స్వీకరింపుడు అనుటవలన ఆదరభావము సూచితమగుచున్నది. ఇచ్చువారును తీసుకొనువారును అహంకార మమకార రహితులై వర్తింపవలెనని దీనినిబట్టి సూచితమగుచున్నది.

**(కూళ్ళాట్పట్టు)** - వీరు ప్రత్యేకముగా నిర్దేశించి పరమభాగవతులనే పిలచిననూ పామరజనులుకూడా వీరి గోష్ఠిలోనికి త్రోసుకొని రాగా ఇట్లు చెప్పు చున్నారు. అట్టివారిని మా గోష్ఠిలో చేర్చుకొనము అని నిషేధించుచున్నారు. **కూళ్** అనగా అన్నము. **ఆళ్‌పట్టు** అనగా దాస్యమును స్వీకరించుట. పొట్టకూటికొరకై ఒక యజమానివద్ద దాస్యమును స్వీకరించుటను హేయమని తెలుపుచున్నారు. నేను భగవంతునికి నిత్యదాసుడనుగదా అని ఎరుగక లౌకిక ఫలములకై భగవంతుని గాని ధనికులనుగాని ఆశ్రయించువారు ఉందురు. తాము ఏ ప్రయోజనమును అపేక్షింపని ఉత్తమభక్తులమని మొదట చెప్పుకొని సేవలో ప్రవేశించి పిదప అది కావలెను, ఇది కావలెను అని కోరికలను తెలుపు దొంగభక్తులు కూడ కొందరుందురు. అట్టివారిని ఎవ్వరినీ కూడ మా గోష్ఠిలోనికి రానీయము అని ఖండితముగా చెప్పుచున్నారు. “మా గోష్ఠి” అని ప్రత్యేకముగా చెప్పుటచేత దేహమునే ఆత్మయని భ్రమించు పామరులకు గాని దేవతాంతర భక్తులకుగాని అల్పఫలితమునకై భగవంతుని సేవించు ఐశ్వర్యార్థు లకుగాని మోక్షము కొరకైననూ స్వప్రయత్నముచే ప్రవర్తించు సాధనాంతరపరులకు గాని ఇచట చోటులేదని సూచింపబడినది.

ఇంతకుముందు ఈ కైంకర్యములో అన్వయించుటకు తమకు తోడు ఎవరును లేరేయని భావించిన వీరు వచ్చిన పామరజనమును మీకిందులో ప్రవేశము లేదు, పొండు అని త్రోసివేయుట తగునాయని సందేహము రావచ్చును. నిజమే. అర్హత లేని క్షుద్రులను పవిత్ర కార్యములలో నియమించకూడదు గదా! వశిష్ఠుడు తాను

చేయు యజ్ఞకార్యమునకు చండాలుని ఋత్విక్కుగా స్వీకరించునా? ఇట్లు అనర్హులను తిరస్కరించుటనుబట్టి భగవత్సేవయే ప్రధానమని ఎంచు వీరివంటి పరమభక్తులకు బుభుక్షువులైన లౌకికులతో అసలే సహవాసము కుదరదని స్పష్టమగుచున్నది.

**(ఏழாட்காலும் பழிப்பிலோம் நாங்கள்) –** మేము ఏడేడు తరములుగా ఎట్టి కళంకము లేని ఉత్తమభక్త కుటుంబమునకు చెందినవారము. **'ఏழாட்காலும்'** అను పదమునుబట్టి ఈ ఆళ్వారులు తమ తరువాత నుండు మూడు తరములనూ తమకు పూర్వముండు మూడు తరములను మధ్యలోనుండు తననుగూడ కలుపుకొని సప్త పురుషాంతరమును చెప్పిరి అని గ్రహింపవలెను. **"సప్త సప్తచ సప్తచ"** అను ప్రమాణ వాక్యమునుబట్టి తమతో కూడిన ఈ సప్త పురుషాంతరమును, వెనుక గడచిపోయిన ఏడు తరములను, ముందు రాబోవు ఏడు తరములను, మొత్తము కలుపుకొని ఇరువదియొక్క తరములను గ్రహించుట శాస్త్రసిద్ధమైయున్నది. బోధాయన సూత్రములో ఈ ఇరువదియొక్క తరములనుగూర్చి **"దశపూర్వాన్ దశ అపరాన్ ఆత్మానం చ ఏకవింశతిం పంక్తిమ్ పునాతి"** అని మరొక విధముగా చెప్పబడియున్నది. బ్రహ్మవేత్తయైనవాడు తనకు పూర్వము పదిమందినీ, తరువాతనుండు పదిమందినీ తనతో కలుపుకొని మొత్తము ఇరవైఒక్క మందితో కూడిన వంశమును పవిత్రము చేయగలడు అని ఆ సూత్రమునకు అర్థము. దీనినిబట్టి ఒక వంశమునందు ఒక పరమభక్తుడు జన్మించినచో అతనినిబట్టి భగవదనుగ్రహము ఆ వంశములో ఇరువదియొక్క మందిపైననూ ప్రసరించునని నిరూపితమైనది. మా వంశములోని అందరూ అట్టివారమే గాని ఏ ఒక్కరిలోగూడ బాహ్యవిషయములపై అపేక్ష దేవతాంతరసేవ మొదలైన కళంకములు లేవు అని తెలుపబడినది. భగవదనుగ్రహముచే మా వంశమునకు లభించిన గొప్పతనమిది అని సాధికారముగా చెప్పుచున్నారు.

కేవలము మీరు చెప్పిన మాటలుబట్టి మీ గొప్ప సేవను మేము విశ్వసింపబోము. మేము నమ్ముటకు తగిన విధముగా భగవత్కైంకర్యమునందు మీ ప్రవృత్తి ఎట్లుండునో తెలుసుకొనగోరుచున్నాము అని సామాన్యజనము అడుగవచ్చును. అందులకు సమాధానముగా **(இராக்கதர் வாழ் இலங்கை)** ఇత్యాది వాక్యము చెప్పబడినది. స్వామికి మంగళాశాసనమును నిత్యము అవిచ్ఛిన్నముగా చేయుటయే మాకు వృత్తి. కలిగిన దుఃఖములను తొలగించుకొనుటకో, ఉన్న శ్రేయస్సును

మరింతగా పెంచుకొనుటకో మేము స్వామికి మంగళాశాసనము చేయువారము కాము. ఎపుడో గడచిపోయిన సన్నివేశములను తలంచుకొని ఆనాడు లంకానగర యుద్ధములో స్వామికి ఎంతో రాక్షసబాణ ప్రయోగముచే అపాయము కలిగెను గదా యని తలంచుకొని ఇప్పటికినీ భయపడుచూ అట్టి స్థితి పునరావృత్తము కాకుండుగాక! యని స్వామికి మంగళాశాసనము చేయు స్వభావము మాది అని "ఇరాక్కతర్ వాౘ్ఱిలంగై" ఇత్యాది వాక్యముచే వివరించుచున్నారు. దుష్టులగు రాక్షసులు మదించి యుండు ప్రదేశము ఆ లంకానగరము. ఇతర ప్రాంతములకు పోయి పరహింసను చేసి ఆ మధు మాంసాదులను తెచ్చుకొని తేనెటీగలు తెట్టెలోనికి చేరినట్లు గుంపుగా రాక్షసులు అందరును జేరి దిగంబర జైనులవలె ఉన్మస్తక మదావేశముతో తైతక్కలాడు ప్రదేశమది. సముద్రమునంతయు అగడ్తగా కలిగి పర్వతములతో కట్టబడిన కోట కలిగి దేవతలకు కూడ దుర్భేద్యమైన నగరమది. అట్టి లంకానగరమును సమూల ముగా భస్మమగునట్లు యుద్ధమును చేసిన రామచంద్రునికి మేము మంగళాశాసనము చేయుదుము. విధేయుడైన భక్తుడగు ఒక్క విభీషణుని కుటుంబ తప్ప **'న నమేయం'** అని చెప్పుచూ ఇతరులకు తలవంచి దురహంకారుడగు రావణుడునూ అతనికి సహాయపడిన రాక్షసులందరునూ ఆ యుద్ధమున నశింపగా **"శ్మశాన సదృశీ భవేత్"** అని సీతాదేవి శపించినట్లు లంకానగరము శ్మశానప్రాయమైనది. ఈ విధముగా లంకను జయించినది తన సంకల్పమాత్రముచేత గాదు. మరి ఏమనగా తాను స్వయముగా రాక్షసులకు ఎదురొడ్డి నిలచి వారి ఆయుధ ప్రహారములచే తన దేహము రక్తసిక్తమగుచుండగా ఘోరమగు యుద్ధమును సలిపిన వీరమూర్తియగు కోదండపాణి యైన మా శ్రీరాముని దివ్యమంగళ విగ్రహమునకు ఇప్పుడు మేము మంగళాశాసనము చేయుచున్నాము. ఆనాడు అచటనుండిన వానరవీరులందరునూ యుద్ధమునందు తమ ప్రాణరక్షణకై ఆరాటపడినవారేగాని ఒక్కరునూ రామునికి మంగళాశాసనము చేయలేదు. ఇక బ్రహ్మాది దేవతలుకూడ రావణునిచే సీతాదేవి అపహరింపబడిన నాటినుండియే ఇక రావణుని వధ ఖాయమనియు మనకు శాశ్వతముగా క్షేమమగు ననియు సంబరపడినవారే గాని వారుగూడ స్వామికి కలిగిన గాయములను గుర్తించి మంగళాశాసనము చేయలేదు. ఆ కొరత తీరుటకై మేమిప్పుడు మంగళాశాసనమును శ్రీరామునికి చేయుచున్నాము. ఇది ఒక విధముగా గతజల సేతుబంధనము వంటిదే అయిననూ ఇక ముందెప్పుడు కూడ మా స్వామికి ఇటువంటి అపాయములు

కలుగరాదని భయపడు మెత్తని హృదయము కలవారు ఈ ఆళ్వారులు అని స్పష్టమగుచున్నది.

h h

## పాశురము - 4

వెనుక భగవత్సేవా పరాయణులైన ప్రపన్నులను పిలిచిరి. మంగళా శాసనము చేయు విషయమున వారు ఈ ఆళ్వారులవలె భావశుద్ధి కలవారగుటచే నీటిలో నీరు కలిసినట్లు ఈ ఉభయుల సమావేశము సరిపడినది. కాని వీరికి ఇంకను తృప్తి లేనందున కైవల్యనిష్ఠులను ఐశ్వర్యార్థులను కూడా తమ గోష్ఠిలోనికి పిలువదలంచి నారు. అభీష్టఫలప్రాప్తికై వారుకూడ భగవంతుని సేవించువారే గదా అని భావించిరి. ఆ ఇద్దరిలోనూ మొదట ఆత్మానందమును అపేక్షించు కైవల్యనిష్ఠులనే పిలుచుచున్నారు. ముందు వీరిని పిలుచుటకు కారణము ఐశ్వర్యార్థులకంటె వీరు గొప్పవారని కాదు. వారు కోరుకొను మోక్షము అస్థిరమైన ఐశ్వర్యాదులకంటె శాశ్వతమైనదే అయిననూ, భగవదనుభవమును పొందు సదవకాశము పూర్తిగా కోల్పోయినందుననూ, తిరిగి సంసార మండలమునకు వచ్చుటకు వీలులేని విధముగా పునరావృత్తి రహితమైన మోక్షమని చెప్పబడినందుననూ, త్రిశంకుస్వర్గము వంటి ఈ మోక్షము ఒక మహానర్థమే అని శాస్త్ర నిర్ణయము. ఐశ్వర్యార్థియైన వానికి ఏనాటికైననూ అనన్యభక్తి కలిగి భగవంతుని పొందుటకు వీలున్నది. అట్టి అవకాశము కైవల్యార్థికి అసలే లేదు కదా! అయ్యో! ఇతడు అజ్ఞానముచే భగవదనుభవరహితమైన కైవల్యమను గోతిలో పడిపోవుచున్నాడే అని దయతో ముందతనినే పిలుచుచున్నారు.

ఇతర ప్రయోజనములను అపేక్షించి వచ్చు ఈ భక్తులు మంగళాశాసనము చేయుటకై రమ్మన్నచో వచ్చెదరా అని సందేహింప పనిలేదు. బ్రహ్మానందానుభవము నందు కల ఆధిక్యమును కైవల్యములోనున్న లోపమును బాగుగా వివరించి చెప్పినచో తప్పక మనస్సు మార్చుకొని వీరు రావచ్చును. వీరు వివేకజ్ఞానము కలవారే కదా అను అభిప్రాయముతో పిలుచుచున్నారు.

**మూలము :**

**ఏడునిలత్తి లిడువతన్ మున్నమ్ వన్దెఙ్గళ్ కూழாమ్పుకున్దు**
**కూడుమనముడైయార్‌కళ్ వరమ్బొழிవన్దొల్లై క్కూడుమినో**
**నాడు నగరముమ్‌నన్గఱియ నమో నారాయణాయ వెన్ఱు**
**పాడుమనముడై ప్పత్తరుళ్ళీర్ వన్దు పల్లాణ్డు కూఱుమినే.**

**ప్రతిపదార్థము :**

ఏడునిలత్తిల్ = బ్రహ్మానంద రహితమగుటచే నీచమైన కైవల్యమోక్షమందు
ఇడువతన్‌మున్నమ్ = మీరు మిమ్ములను చేర్చుకొనుటకు ముందే
వన్దు = వచ్చి
ఎఙ్గళ్‌కుழாంపుకున్దు = అనన్యభక్తులమగు మా గోష్ఠిలో చేరి
వరమ్బు ఒழி = పరిమిత విషయకమగు అభిలాషను విడిచి
ఒల్లై = శీఘ్రముగా
వన్దుక్కూడుమినో = వచ్చి మాతో కలియుడు
నాడుమ్ = జనపదప్రాంతములోనివారును
నగరముమ్ = పట్టణములోనివారును
నన్గు అఱియ = బాగుగా తెలుసుకొనునట్లు
నమో నారాయణాయ వెన్ఱు = ఈ నారాయణ మంత్రమును అనుసంధించుచూ
పాడుం మనం ఉడై = గానము చేయుటకు తగిన మనస్సు కలిగి
పత్తరుళ్ళీర్ = భక్తి కలవారైనచో
వన్దు పల్లాణ్డు కూరుమిన్ = వచ్చి మంగళాశాసనము చేయుడు.

**వివరణము :**

**(ఏడునిలత్తిల్ ఇడువతన్ మున్నమ్) –** ఏడు అను పదమునకు క్షుద్రము అని యర్థము. ఏడు నిలమ్ అనగా క్షుద్రమగు కైవల్య ప్రదేశమనియు, అట్టి స్థలము నకు మీరు పోయి చేరుటకు ముందే విమర్శించుకొనుడు అనియూ 'పిళ్ళై అముదనార్' అను ఆచార్యులు అర్థమును వివరించియున్నారు. లేక, పాలమీద సారముగా తేలిన మీగడను ఏడు అందురు. ప్రకృతి సంబంధమునుబట్టి జీవునికి సంక్రమించిన సూక్ష్మ

శరీరము స్థూలశరీరమునకంటె సారమై ప్రధానమైనది గనుక దానిని ఏడు అన వచ్చును. అసలు ఏడు శబ్దమునకే శరీరమని గూడ అర్థము కలదు. ఇట్లు **(ఏడు)** సూక్ష్మ శరీరమును **(నిలత్తిల్)** మూలకారణమైన ప్రకృతియందు **(ఇడువతన్మున్నమ్)** లయము చేయుటకు ముందే అనిగూడ మరియొక అర్థమును చెప్పవచ్చును. అనగా ప్రళయములో మీ స్థూల సూక్ష్మ శరీరములు లయమై పోవుటకు ముందే – అనగా స్థూల సూక్ష్మ శరీరములను విడిచిపెట్టుట అను మోక్షము మీకు కలుగుటకు ముందే అని భావము. **(వందు)** పూర్తిగా శరీర సంబంధము పోయిన పిదప కైవల్యమను అనర్థములో పడిన మీకు వెనుదిరిగి వచ్చుటకు అవకాశము లేదు గనుక ముందుగనే మేల్కొని మా గోష్ఠిలోనికి రండు అని పిలుచుచున్నారు. **(ఎజ్గళ్కుழாమ్పుకున్దు)** మా గోష్ఠిలో చేరుడు. కైవల్యనిష్ఠులమగు మాకు గూడ ఒక గోష్ఠి (గుంపు) కలదు గదా అందురేమో! మీ గుంపులో ఎవరికి వారు స్వతంత్రులే. ఎవరి ఆత్మానుభవము వారిదే కాని స్వయంపాకము చేసుకొనువారివలె ఒకరితో నొకరికి పట్టదు. మా గోష్ఠి అట్టిది కాక **'బోధయంతః పరస్పరం'** అన్నట్లును **'పరస్పర నీచభావైః'** అన్నట్లునూ అన్యోన్యముగా విధేయులమై వర్తించుచూ ఒకరికొకరము భగవదనుభవములో సహకరించుకొందుము. ఇది మాలో గల విశేషము.

**(కూడు మనముడైయార్)** – మా గోష్ఠిలో జేరుటకు అధికార యోగ్యతలుగాని నియమములుగాని ఏమియు లేవు. ఇందులో చేరవలెనను అభిలాషయుండిన చాలును. క్షుద్ర ఫలితములను పొందుటకై చేయు మంత్ర, జప, యజ్ఞ యాగాదులను అనుష్ఠించుటకు పూర్వాంగముగా తీర్థయాత్రాది నియమములను పాటించి శుద్ధిని పొందియుండుట అవసరము. ఆ ఫలితములుగాని వాటి సాధనములుగాని భక్తుని స్వరూపమునకు విరుద్ధములు. భగవంతుని సేవించుటకు ఏ అర్హతను గూడ సాధించుకొనవలసిన అవసరము లేదు. తల్లిదండ్రులను సేవించుటకు అభిలాష ఉండవలెనుగాని వేరే నియమములేవియు లేవు కదా!

**(వరమ్బు ఒழிవొన్దు)**– 'వరమ్బు' అనగా పరిమితి, 'ఒழிవన్దు' అనగా విడచి రండు. మాతో వచ్చి కలియుటకు ముందు పరిమితమగు ఆత్మానుభవముపై మునుపు మీకుగల అభిలాషను మార్చుకొని వచ్చుటయే ఇపుడు మీ కర్తవ్యము. భగ వంతునికి అన్ని విధములుగా అంశభూతుడై ఆయనయొక్క స్వరూపరూపగుణవిభూతులను పరిపూర్ణముగా అనుభవించుటకు యోగ్యతగల ఈ జీవుడు **"జరామరణ మోక్షాయ"**

అని భగవద్గీతలో చెప్పబడినట్లు అతి పరిమితమగు ఆత్మానుభవమును మాత్ర మపేక్షించుట అనుచితమే కదా! **(ఒల్లైక్కూడుమినో)**–శీఘ్రముగా రండు. భగవన్మంగళా శాసనముచే లభించు ఫలితము సంపూర్ణ భగవదనుభవరూపమైనందున మహానంద ప్రదమైనపుడు ఆర్తితో దానిని పొందుటకు ఆలసింపక అతి శీఘ్రముగా రావలెను గదా! అస్థిరమైన శరీరము నశించుటకు ముందే ఈ మంగళాశాసనమునకై రండు. మీలో వివేకజ్ఞానము, కోరికయు ఉన్నపుడు ఆలసింపవలదు సుమా! అని భావము.

**(నాడు నగరముం నన్గఱియ యిత్యాది) –** ఈ గోష్ఠిలో చేరుటకు కోర్కెయున్న చాలునని వెనక చెప్పిరి. ఇప్పుడు వారు మంగళాశాసనమును చేయుటకు కావలసిన భావశుద్ధిని తెలుపుచున్నారు. **'నమో నారాయణాయ'** అను మంత్రమున చెప్పబడినట్లు దాస్యమే తన స్వరూపమనియూ, ఆ స్వరూపమునకు తగిన వృత్తి కైంకర్యమే అనియూ తెలిసికొని విష్ణుభక్తి కలవారై రండు. మీరు చేయు ఆ మంత్రోచ్చారణము **(నాడు)** పల్లె ప్రాంతములలోని సామాన్య జనులును **(నగరముం)** పట్టణములోని విజ్ఞాన వంతులైన జనులును **(నన్గఱియ)** బాగుగా తెలుసుకొనగలుగునట్లు ఉచ్చరించుచు రండు. పల్లెటూరు జనులు రాజునకు దూరముగ నుందురు. కనుక వారు కొన్ని ప్రత్యేక విషయములను ఎరుగరు. నగరవాసులు రాజునకు సమీపములో నుందురు. కనుక విజ్ఞానవంతులైనవారు విశేష విషయములను ఎరుగుదురు. వారందరునూ గట్టిగా మీరు చేయు అష్టాక్షరీ మంత్రోచ్చారణముచే ఇందలి విశేషమును తెలుసుకొని వచ్చునట్లు మీ ప్రవృత్తిచేత వారిలో ప్రేరణ కలుగవలెను. వేదములోని **'అహమపి నమమ' 'భగవత ఏవాహమస్మి'** అను రెండు వాక్యములును నేను స్వతంత్రుడను కాను, భగవంతునికే దాసుడను అని బోధించుచు నమః శబ్దార్థము ఇదియని వివరించుచున్నవి. ఇక నారాయణాయ అను చతుర్థీ విభక్త్యంత పదము సర్వస్వామి యగు నారాయణుని తెలిపి ఆయన సన్నిధిలో చేయు కైంకర్యమే జీవునికి స్వరూపాను రూపమైన పురుషార్థమని తెలుపుచున్నది. **(పాడుమనముడయీర్)** ఇట్టి సద్భావన మీలో కలిగినంత మాత్రమే చాలదు. అది ప్రీతిపూర్వకమై సంతోషము పైకి పొంగివచ్చునట్లు లోకులకు తెలియవలెను. **(వందు పల్లాణ్డు కూఱుమినే)** వచ్చి మాతో పాటు కలిసి స్వామికి మంగళాశాసనము చేయుడు అని ఈ పాశురమున కైవల్య నిష్ఠులను ఆహ్వానించిరి.

h h

## పాశురము - 5

వెనుక వివరించిన క్రమమున ప్రస్తుతము ఈ పాశురమునందు ఐశ్వర్యాది లౌకిక ఫలాపేక్షగల భక్తులను పిలుచుచున్నారు.

**మూలము :**

**అణ్ణక్కులత్తుక్కతిపతి యాకి యశురరిరాక్కతరై**
**ఇణ్ణక్కులత్తై యెడుత్తుక్కళైన్ద విరుడీ కేశన్ఱనక్కు**
**త్తొణ్డక్కులత్తి లుళ్ళీర్ వన్దడి తొழுతాయిరనామమ్ శొల్లి**
**ప్పణ్డైక్కులత్తైత్తవిర్న్దు పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డెన్మినే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అణ్డక్కులత్తుక్కు | = | అనేక బ్రహ్మాండముల సమూహమునకు |
| అతిపతియాగి | = | నిర్వాహకుడైయుండి |
| అశురర్ ఇరాక్కదరై | = | అసురులు రాక్షసులు అను రెండు వర్గములకు చెందిన |
| ఇణ్డక్కులత్తై | = | గుంపులుగానున్న దుష్ట సమూహములను |
| యెడుత్తుక్కళైన్ద | = | సమూలముగా నశింపజేసిన |
| విరుడీ–కేశన్–తనక్కు | = | ఇంద్రియములకు నియామకుడైన పరమాత్మకు |
| తొణ్డక్కులత్తిల్ | = | దాసవర్గమునందు |
| ఉళ్ళీర్ | = | ఉన్నటువంటి మీరు |
| వన్దు | = | వచ్చి |
| అడితొழுదు | = | శ్రీపాదములను సేవించి |
| ఆయిరనామంశొల్లి | = | వేయి భగవన్నామములను ఉచ్చరించుచూ |
| పణ్డై కులత్తై | = | మునుపటి మీ జాతి వృత్తిని |
| త్తవిర్న్దు | = | వదిలి |
| పల్లాణ్డు | = | పలు సంవత్సరములు మంగళమగుగాక |
| పల్లాయిరత్తాణ్డు | = | కొన్ని వేల సంవత్సరములు మంగళమగుగాక |
| ఎన్మినే | = | అని పాడుడు. |

**వివరణము :**

ఇందు పిలవబడుచున్నవారు ఐశ్వర్యము కావలెనని భగవంతుని వద్ద కోరువారు. మానవులకంటె దేవతల ఐశ్వర్యము గొప్పది. ఆ దేవతల ఐశ్వర్యమున కంటె గూడ మొత్తము బ్రహ్మాండమునకు అధిపతియగు చతుర్ముఖ బ్రహ్మయొక్క ఐశ్వర్యము గొప్పది. చతుర్దశ భువనాత్మకమైన బ్రహ్మాండమునకు అధిపతియగు ఆ బ్రహ్మకంటె గొప్ప ఐశ్వర్యవంతుడు బ్రహ్మాండమున లేడు. అతనికంటె తక్కువవారగు ఐశ్వర్యార్థులైన ఇంద్రాదులుగూడ తాము ఆ పదవిని సాధించుకొనుటకై శ్రీమహా విష్ణువును ఉద్దేశించి 'అండాధిపతయే నమః' అను మంత్రమును జపహోమాదులలో అనుసంధించుచుందురు. అనంతకోటి బ్రహ్మాండములకు నిర్వాహకుడైన ఆ పరమాత్మయే వారివారి ప్రార్థనలను అనుసరించి బ్రహ్మేంద్రాది పదవులను ప్రసాదించుననని తెలియుచున్నది. **'వ్యాహరన్ మామనుస్మరన్'** అని భగవద్గీతలో చెప్పబడినట్లు తమకు కావలసిన ఫలమును స్ఫురింపజేయు ఆ భగవన్నామము నుచ్చరించుట, దాని అర్థమును మనస్సులో నిత్యమును భావించుట ఈ ప్రకారముగా వారు భగవదుపాసనమును చేయగా స్వామి వారి కోరికలను తీర్చును. 'అండాధి పతయే నమః' అను ఆ మంత్రము భగవంతుడు బ్రహ్మాండ నాయకుడు అని తెలుపునుగాని ఆయనను ఆశ్రయించు పద్ధతిని గాని, మాకీ ఫలితమునిమ్మని కోరు ఈ భక్తులయొక్క అభిప్రాయమునుగాని తెలుపుటలేదే! అని సందేహించవలసిన పని లేదు. మంచి దాతయగు ఒక పెద్దమనిషి తన చేతిలో అందమైన పండును పట్టుకొని యుండగా అచటికి వచ్చిన మరియొక వ్యక్తి దానిపై అభిలాష కలిగి నేరుగా తన కోరికను నోటితో వెలువరించక, ఈ పండు ఎంతో బాగున్నదే అని ఒకటికి రెండుసారులు మెచ్చుకొనును. అపుడా యజమాని ఇతడు అడుగకున్ననూ, భావము నెరిగి అపేక్షయున్నచో తీసుకొనరాదా అని స్వయముగా అతనికి దానిని అందించును. అట్లే భగవంతుడును 'అండాధిపతయే నమః' అని ఈ భక్తులు జపించుటతో వీరి భావమును ఎరిగినవాడు గనుక ఆ అండాధిపత్య ఫలితమును ప్రసాదించగలడు. లౌకిక ఫలములనుద్దేశించి తనవద్దకు వచ్చు భక్తులను కూడా ఆదరముతో చేరదీసి **'ఉదారాః సర్వ ఏవైతే'** అని భగవద్గీతలో చెప్పబడినట్లు ఆదరపూర్వకముగా వారి కోర్కెలను తీర్చుటచే భగవంతుని భక్తవాత్సల్యము సూచితమగుచున్నది. **'అండానాంతు సహస్రాణాం'** అనియూ **'కోటి కోటి శతానిచ'** అనియూ అనంతకోటి బ్రహ్మాండములకు

ఆయన నాయకుడైనందున ఎందరు భక్తులు ఆయా లోకాధిపత్యములను కోరిననూ వాటిని వారికి ప్రసాదించగల ప్రభావము ఆయనకు కలదని **'అదిపతియాగి'** అను ఈ పాశురములోని పదము సూచించుచున్నది. ఐశ్వర్యార్థులకు ఐశ్వర్యమును, కైవల్యార్థులకు కైవల్యమును దేనిని కోరినచో దానిని ఇవ్వగల సమర్థుడేగాని లేదని చెప్పువాడు కాదని భావము.

**(అశురర్ ఇరాక్కదరై) –** అసురులు, రాక్షసులు అను రెండు పదములునూ రాక్షసజాతికే చెందిననూ వారిలో నుండు క్రౌర్యమునుబట్టి విడివిడిగా రెండు వర్గములుగా విభజించుట జరిగినది. వీరు అండాధిపత్యమును పొందిన ఆయా బ్రహ్మేంద్రాది దేవతలకు అపుడపుడు అపాయమును కలిగించుచుందురు. వీరిని నశింపజేసి భక్తులయిన ఆ ఐశ్వర్యార్థుల యొక్క పదవులను పదిలపరచుట రక్షకుడైన భగవంతునియొక్క విధియే కదా! వెనుక చెప్పిన ఐశ్వర్యార్థులగు ఆ బ్రహ్మాది దేవతలే తమ వేదములను రాక్షసులు అపహరించిరనియూ, స్వర్గమును కొల్లగొట్టిరనియూ ఆర్తితో వచ్చి స్వామిని ప్రార్థింతురు. అపుడు అర్థార్థులైన ఈ భక్తులే ఇపుడు ఆర్తభక్తులై **'అసురశత్రవే నమః'** అని మరొక నామముతో భగవంతుని ప్రార్థింతురు. పుట్టినప్పటి నుండి పరహింసను చేయుటయే స్వభావముగా గల ఈ రెండు విధములైన అసుర రాక్షస వర్గములను అనాయాసముగా భగవంతుడు నశింపజేయును.

**'సమోహం సర్వభూతేషు'** అని చెప్పబడినట్లు భగవంతునికి అందరునూ సమానులే కదా! అందరికినీ ఆయన సృష్టికర్తయగు దైవమే కదా! అట్టివాడు ఈ రాక్షసులను పక్షపాత బుద్ధితో వధించుట తగునా అని కొందరు సందేహింతురు. భగవంతుడు రాక్షసులను ప్రత్యేకించి తనకు శత్రువులుగా భావించువాడు కాదు. కాని ఆశ్రితులగు భక్తులను వారు పీడించుచుండుటచే అట్టి క్రూరులను శిక్షింపనిచో, లోకక్షోభమేర్పడును గనుక ఆయన వారిని దండించుట అవసరమగుచున్నది. ఇది తప్పు కాదు.

**(ఇణ్డక్కులత్తై యెడుత్తుక్కళైన్ద) –** ఇణ్డర్ + కులం – ఇండర్ అనగా చండాలురు, నీచులు అని అర్థము. ఎవడు ఇతరుల క్షేమమునకే నిరంతరము పాడుపడునో అతనిని ఉత్తముడు అందురు. ఇతరుల వినాశమునే నిరంతరము కోరుచూ ఎవడు హింసాపరుడైయుండునో అతనిని అధముడు – పరమనీచుడు

అందురు. ఇట్టి దుర్మార్గులను అనాయాసముగ నిరసింపగల సమర్థుడు అని యర్థము. (ఎడుత్తు+కళైంద) అను యీ రెండు పదములకు, కలుపులోని మొక్కలను సులభముగా తీసిపారవేసినట్లు అని యర్థము వచ్చును. ఆ కలుపు మొక్కలను పీకినపుడు ప్రక్కనుండు మంచిమొక్కలకు ఎట్టి ప్రమాదము రాకుండునట్లు, భగవంతుడీ దుష్టులను వధించినపుడు పక్కనే ఉండు భక్తులకు ఏ అపాయము కలుగదని సూచితమగుచున్నది. వెనుక మూడవ పాశురమున (ఇలంగై పొఝాళాక) అనుచోట నిరూపింపబడినట్లు విభీషణుని కుటుంబమునకు హాని కలుగని విధముగా హనుమంతుడు లంకా దహనము చేసిన విధము ఇచట సూచితమగుచున్నది.

**(ఇరుడీకేశన్ ... తనక్కు) –** అట్లు రాక్షస వర్గమును నశింపజేసిన హృషీకేశు నికి అని దీని యర్థము. హృషీకములు అనగా ఇంద్రియములు అనియూ, వాటికి ఈశుడు అనగా నియామకుడు గనుక పరమాత్మ హృషీకేశుడు అనియు ఈ పదముచే బోధింపబడుచున్నది. సర్వప్రాణుల హృదయములలో అంతర్యామిగా నుండి వారి వారి ఇంద్రియముల యొక్క ప్రవృత్తికి ప్రేరకుడై వర్తించునని **"భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా"** అను గీతాశ్లోకము తెలుపుచున్నది. వారివారి కోరికలను ఎరిగి ఫలితములనిచ్చు అంతర్యామియగు ఆ పరమాత్మకు మీరు అనన్య భక్తులు కాదలచినచో ఆయనయొక్క దివ్యమంగళ విగ్రహముపై ఒకసారి ప్రేమతో మీ దృష్టిని ప్రసరింపజేయుడు. ఆయన తన విగ్రహ సౌందర్యముచే మీ మనస్సు నాకర్షించి క్షుద్రఫలములపై మీకు గల రుచినిగూడ మార్చివేసి మిమ్ములను అనన్య భక్తులనుగా మార్చగలవాడు. అపుడు మీరు శాశ్వత మోక్షపురుషార్థమునకే అర్హులు కాగలుగుదురు.

**(తొణ్డక్కులత్తి లుళ్ళీర్) –** భక్తుల కులములోనికి చేరిన మీరు అని యర్థము. ఇంతకుముందు మీకు లౌకిక ఐశ్వర్యాదులపై ఉండిన అభిలాష తొలగిపోయి భగవద్భక్తుల వర్గములో ఇపుడు చేరితిరి గనుక మీ కులమే మారినట్లైనది. భక్తకులము అని వేరే ఒక కులము కలదా? అన్నచో ఔననియే సమాధానము చెప్పవలయును. దేహపోషణమునే పరమావధిగా నెంచు సామాన్యులకునూ భగవద్దాస్యమే తమ సహజ స్వరూపమని భావించు ప్రపన్నులకునూ ఎంతో తేడా కలదు గనుక ఆ పామర కులము వేరు, ఈ శ్రీవైష్ణవ ప్రపన్న కులము వేరు అని విభజించి చెప్పుటలో దోషము లేదు. మీరు ఆ కులమును వదలి మా కులములోనికి రండు అని పిలుచుచున్నారు.

**(వన్దడితొழு తాయిరనామమ్ శొల్లి) –** ఇట్లు భావ పరివృత్తిని పొందిన మీకు కర్తవ్యమేదో ఇపుడు చెప్పెదము వినుడు. వచ్చి సాష్టాంగముగా స్వామి శ్రీపాదములను సేవింపుడు. తత్సేవయే మాకు పరమ ప్రయోజనమని, ఇట్లే మా జీవయాత్ర కొనసాగవలెనని నిర్ధారణ చేసికొనుడు. ఇంతకుముందు ఐశ్వర్యసాధనమే ప్రధానమనియూ ఆ ఐశ్వర్యముతో భౌతిక సుఖములను అనుభవించుటయే పరమ ప్రయోజనమనియూ భావించియుండిన మీరు అట్టి స్థితి మారిపోయి, భగవత్సేవా పరాయణులగుట గొప్ప విశేషము. మీరు ఆ పూర్వదశలో 'అండాధిపతయే నమః' అనియూ, 'అసురశత్రవే నమః' అనియూ రెండు భగవన్నామములనే అనుసంధించు కొని యుంటిరి. ఇపుడట్లుగాక భగవంతుడే సర్వస్వమని భావన ఏర్పడిన మీకు వేలకొలది భగవన్నామములు నోరార ఉచ్చరింపదగును. ఆ పదములచే బోధింప బడిన భగవంతుని అద్భుత చేష్టితములను, గుణములను కీర్తింపదగును.

**(పణ్డై క్కులత్తై త్తవిర్న్దు) –** ఇప్పుడు మీలోని ఆ పాత పామరకులము తొలగిపోయి ఉత్తమకుల సంస్కారము కలిగినది. ఒకే జన్మములో రెండు కులము లుండునా? అది ఎట్లు సాధ్యము అని శంకింపరాదు. భగవత్ప్రభావముచే సాధ్యము కానిదేమున్నది? విశ్వామిత్రుడను మహర్షి స్వయంకృషితో తపస్సును చేసి క్షత్రియ కులమునుండి బ్రాహ్మణకులమును ఒకే జన్మములో సంక్రమించినాడని మనకు తెలియుచున్నది గదా! అక్కడ క్షత్రియవర్ణమునుండి బ్రాహ్మణవర్ణములోనికి మారుటకు తపస్సు కారణముగా కాగా ఇక్కడ భగవదనుగ్రహముచే పామర స్వరూపము పోయి నిజమగు భక్త స్వరూపజ్ఞానము ఏర్పడినది కదా!

(పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డెన్మినే) – మీరు మొదటిసారిగా స్వామికి పల్లాణ్డు అని మంగళాశాసనమును చేసిన తోడనే, ఆ స్వామి 'ఇతనిలో మంచి మార్పు వచ్చినదే, ఐశ్వర్యముపై క్షుద్రాభిలాష పోయి నాకు మంగళము నాశించు ఉత్తమ భక్తి ఏర్పడినదే' అని ప్రేమతో మీపైకి చల్లని చూపును ప్రసరింపజేయును. అపుడు వెంటనే మీరు 'పల్లాయిరత్తాండు' అని పలుకుడు. స్వామీ! నీకునూ, నీ కృపాదృష్టికినీ నిరంతర మంగళమగుగాక! అని రెట్టించి మంగళాశాసనము చేయుడు. ఇట్లు భగవత్కృపాపాత్రులైన మీకు శాశ్వతముగా ఉజ్జీవించు నవకాశము ఏర్పడినది గనుక ఆలసింపనేల? వచ్చి మా వర్గములో చేరుడు.

h h

## పాశురము - 6

ఇంతవరకు మూడు, నాలుగు, ఐదు పాశురములలో తమతో కలసి స్వామికి మంగళాశాసనము చేయుటకై మొదట తమవలె దాస్యైక నిష్ఠులైన ప్రపన్నులను, పిదప కైవల్యనిష్ఠులను, ఐశ్వర్యనిష్ఠులను వరుసగా పిలిచిరి. తమవంటి ప్రపన్నులనే పిలవక ఇతర ప్రయోజనముల నపేక్షించు భక్తులను పిలుచుట ఎందులకు? పిలచిననూ ఇతర ఫలితములపై అభిలాషగలవారు ఫలము చేజిక్కగనే భగవంతుని విడిచిపోవుదురుగాని ఇక్కడ స్థిరముగా నుండరుగదా! అని ఒక ఆక్షేపము రావచ్చును. కాని భగవంతుడు తన భక్తులను నాలుగు విధములుగా చెప్పి **'ఉదారాః సర్వ ఏవైతే'** అని వీరందరినీ మంచి స్వభావము గల ఉదారభక్తులేనని ప్రేమతో కీర్తించియుండుటచేత స్వామియొక్క అభిప్రాయము ప్రకారము వారుకూడ ఆయనకు ప్రియులే గనుక వారికిగూడ భగవంతునితో విడదీయరాని అవినాభావ సంబంధమే ఉన్నందున ఈ రెండు కారణములచేత మంగళాశాసనమునకు రండని వారినిగూడ పిలుచుటలో ఆక్షేపము లేదు.

ఇకపైన అదే క్రమములో ఆ ముగ్గురునూ ఆరు, ఏడు, ఎనిమిది పాశురము లలో తమతో వచ్చి కలిసినట్లు తెలుపుచున్నారు. వెనుక మూడవ పాశురమున సాత్వికులగు ఉత్తమభక్తులను పిలచినపుడు ఏழாట్కాలుమ్ పழிప్పిలోమ్ అని ఏడేడు తరములుగా భక్తి నిష్ఠులైనట్లు తమ వంశప్రతిష్ఠను వీరు చెప్పుకొనియున్నారు. ఇపుడు ఆ పిలువబడిన పరమభాగవతులుగూడ తాముగూడ అట్టి వంశమున జన్మించిన వారమేనని చెప్పుకొనుచు వీరివద్దకు వచ్చినట్లు ఈ ఆరవ పాశురమున చెప్పబడు చున్నది. శాంతస్వభావులైన ఆళ్వారులుగాని, ఈ వచ్చిన భక్తులుగాని తామింతటి గొప్ప వంశమున పుట్టినవారమని అహంకారముతో చెప్పుకొనుట తగునా? అని కొందరిలో ఆశంక కలుగవచ్చును. ఇతరులకు వాస్తవము తెలియుటకై ఉన్నదున్నట్లు చెప్పుటలో తప్పు లేదు. తమ భావశుద్ధిని తెలుపుకొనుట అహంకారము కాజాలదు. సముద్రమును లంఘించుటకై వానరులు ఒక్కొక్కరు తమ తమ శక్తిని గురించి వివరించి చెప్పగా హనుమంతుడు సముద్రమును దాటివెళ్ళి తిరిగి వెనుకకు రాగల శక్తి తనకు కలదని తెలుపుచూ ఇట్లనెను –

**శ్లో॥ పన్నగాశనమాకాశే పతంతం పక్షిసేవితే ।**
**వైనతేయమహం శక్తః పరిగంతుం సహస్రశః ॥**

"ఆకాశమునందు అతివేగముగా సంచరించగల గరుత్మంతునిగూడా అతిక్రమించి నేను అంతకుమించిన వేయిరెట్ల వేగముతో దాటి వెళ్ళగలను". ఇది అహంకారముతో చెప్పిన అసత్యవాక్యము కాక వానరులను నమ్మించుటకై చెప్పినట్టి యథార్థ వచనమే గనుక ఇందు అహంకార దోషము లేనట్లే, ఈ పాశురమున ఈ భాగవతులు తమ వంశప్రతిష్ఠను చెప్పుకొనుట గూడ వాస్తవమే గనుక దోషము లేదు.

**మూలము :**

**ఎన్దై తన్దై తన్దై తమ్మూత్తప్పన్ ఏழ் పడికాల్ తొడఙ్గి**
**వన్దు వழிవழிయాట్చెయ్ కిన్టోమ్ తిరువోణత్తిరువిழవిల్**
**అన్దియమ్పోతి లరియురువాకి యరియై యழித్తవనై**
**ప్పన్దనై తీర ప్పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డెన్టు పాడుతుమే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఎన్దై | = | నేను, నా తండ్రియు |
| తన్దై | = | వారి తండ్రియు |
| తన్దై | = | వారి తండ్రియు |
| తన్దై | = | వారి తండ్రియు |
| తమ్మూత్తప్పన్ | = | వారి తండ్రియు తాతయు |
| ఏழ் పడికాల్ తొడఙ్గి | = | ఇట్లు ఏడు తరముల నుండియు |
| వన్దు వழிవழிయాట్చెయ్‌కిన్టోమ్ | = | వచ్చి వరుసగా దాస్యమును చేయుచున్నాము |
| తిరువోణత్తిరువిழవిల్ | = | శ్రవణా నక్షత్రమునకు చెందిన అవతార మహోత్సవమునందు |
| అన్దియమ్పోతిల్ | = | మంచి సంధ్యా సమయమునందు |
| అరియురువాకి | = | సింహరూపమును దాల్చి |
| అరియై | = | శత్రువైన హిరణ్యకశిపుని |
| అழித్తవనై | = | నశింపజేసిన నరసింహస్వామిని |

| | | |
|---|---|---|
| పన్దనైతీర | = | ఏ దోషములు రాకుండునట్లుగా |
| పల్లాణ్డు | = | పలు సంవత్సరములు |
| పల్ ఆయిరత్తాణ్డు | = | పలువేల సంవత్సరములు మంగళమగుగాక |
| ఎన్ఱు పాడుతుమే | = | అని మంగళాశాసనము చేయగలము |

**వివరణము :**

ఈ పాశురమునందు మంగళాశాసనమునకు వచ్చిన పరమభక్తులు కూడ తాము ఏడు తరములుగా తెంపులేకుండా భగవత్సేవను చేయుచున్నామని ఇందు తెలుపుచున్నారు. పాశురముయొక్క మొదటి పాదములో తమతో కలుపుకొని ఏడు తరములవారిని విడివిడిగా చెప్పుచున్నారు. (ఎన్దై) తాము తమ తండ్రి అనియూ, మూడుసార్లు "తన్దై" అనుటచేత వారి తండ్రి, వారి తండ్రి, వారి తండ్రి అని మువ్వురు, తమ్మూత్తప్పన్ అనుటచేత వారి తాత అనియూ చెప్పబడినది. ఇట్లు ఎన్దై పదముచే ఇద్దరు, తమ్మూత్తప్పన్ అను పదముచే ఇద్దరూ, మధ్య ముగ్గురూ కలిపి మొత్తము ఏడుగురైరి. ఇట్లు విడివిడిగా ఒక్కొక్కరినీ చెప్పవలెనా? 'ఏழுపడికాల్' ఏడు తరముల వారు అని ఒక్కుమ్మడిగా చెప్పిన చాలదా అని కొందరడుగవచ్చును. ఇట్లు చెప్పుటలో ఒక విశేషమున్నది. మా వంశములో నడుమ ఒక్కరు గూడ భగవత్కైంకర్యపరులు కాకుండ వ్యర్థముగా జీవితము గడిపినవారు లేరు. అందరునూ మహాభక్తులే అని తెలుపుటయే ఇట్లు విడివిడిగా చెప్పుటలో తాత్పర్యము.

మరియొక ఆక్షేపము. శాస్త్రములు **'సహి విద్యాతః తం జనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ'** అనియూ **'గరీయాన్ బ్రహ్మదః పితా'** అనియూ విద్యావంశమును ప్రశంసించుట కలదు. ఆచార్యుడు విద్యనుపదేశించి - లేక గాయత్రీ మంత్రమునుపదేశించి శిష్యునికి మరియొక ప్రశస్తమగు జన్మను ప్రసాదించినవాడగును. వారి గురువు, వారి గురువు ఇట్లు గురుపరంపర అంతయూ బ్రహ్మవేత్తలే. కృతజ్ఞతా పూర్వకముగా విద్యా సంతానము అను ఇట్టి గురుపరంపరను ప్రశంసించుకొనుటలో తప్పు లేదు. కానీ రామానుజులవారు శరణాగతి గద్యమునందు **"పితరం, మాతరం, దారాన్, పుత్రాన్, పౌత్రాన్, సఖీన్ తథా క్షేత్రాణిచ గృహాణిచ - సంత్యజ్య సర్వకామాంశ్చ శరణం తే వ్రజం విభో"** అని శరణాగతి సమయమున త్యజింపదగినట్లుగా చెప్పిన దేహబంధువులైన తండ్రి తాత ముత్తాతల పరంపరను గొప్పగా చెప్పుకొనుట తగునా?

మా తాత ముత్తాతలిటువంటివారని పొగడుకొనుట ఆత్మస్తుతి కాదా? అను ఈ ఆక్షేపమునకు సమాధానమేమనగా –

భగవత్సంబంధము అవశ్యము స్వీకరణీయముగనుక అదృష్టవశముచే తన వంశములోని తండ్రులు తాతలు పుత్రపౌత్రాదులు అట్లు భగవద్భక్తులే ఐనచో అట్టి దేహబంధువులు త్యజింపదగినవారు కారు. ఈ యోగ్యత లేనివారినే పై శరణాగతి శ్లోకములో త్యజింపవలెనని శ్రీ రామానుజులవారు తెలిపియున్నారు. కనుకనే కొందరు మహాత్ములు ఈ క్రింది శ్లోకమును చెప్పినట్లు పురాణములలో తెలియవచ్చు చున్నది.

**శ్లో॥ మా జనిష్ట స నో వంశే జాతో వా ద్రాక్ విపద్యతామ్ ।**
**ఆజన్మ మరణం యస్య వాసుదేవో న దైవతమ్ ॥**

పుట్టిననాటినుండియూ చచ్చువరకునూ ఎవడు వాసుదేవుని దైవముగా భావింపడో అట్టి భక్తిహీనుడైన వ్యక్తి మా వంశమున పుట్టనే వద్దు. పుట్టిననూ వెంటనే నాశనమైపోవలెను. అని ఈ శ్లోకమునకర్థము. కనుక దేహ బంధుత్వము నకు చెందిన వంశమునందు కూడ భక్తినిష్ఠులు ఉన్నచో అట్టి తమ వంశమున ప్రస్తుతించుకొనుటలో తప్పు లేదు. విద్యా వంశమని చెప్పబడు గురుపరంపరలో కూడా భక్తిహీనులెవరైనా జన్మించినచో అట్టి వ్యక్తిని త్యజింపవచ్చునని పెద్దలు చెప్పుదురు. ఇట్లు మొదటి పాదముచేత తమ వంశములో భగవన్మంగళాశాసనమను కైంకర్యమును అనుష్ఠించుట అవిచ్ఛిన్నముగా కొనసాగుచున్నదని చెప్పబడినది.

మనుస్మృతియందలి ఈ క్రింది శ్లోకము ఇచ్చట గమనింపదగినది.

**శ్లో॥ యస్య వేదశ్చ వేదీచ విచ్ఛిద్యేతే త్రిపూరుషమ్ ।**
**స వై దుర్బ్రాహ్మణో జ్ఞేయః సర్వకర్మ బహిష్కృతః ॥**

ఈ శ్లోకమునుబట్టి ఎవనికి మూడు తరములుగా వేదాధ్యయనమునకు విచ్ఛేదము కలిగినదో గృహమునందు అగ్నిహోత్ర వేదికపై మూడు తరములుగా నిత్యాగ్నిహోత్ర హోమమునకు విచ్ఛేదము కలిగినదో ఆ వంశమున తర్వాత జన్మించిన వాడు బ్రాహ్మణుడు కాదనియూ, అట్టివానిని ఏ వైదిక కర్మలలోనూ స్వీకరింప రాదనియూ తెలియుచున్నది. ఇట్లు బ్రాహ్మణ్య విచ్ఛేదమునకు మూడు తరములుగా

వేదాధ్యయన నిత్యహోమానుష్ఠాన విచ్ఛేదములు కారణమైనట్లు భగవద్భక్తి కైంకర్యములకు విచ్ఛేదము కలిగినపుడు తరువాత ఆ వంశములో జన్మించినవారికి కూడా వైష్ణవత్వము ఉండదు అని సూచింపబడుచున్నది.

**(వழி వழி యాట్చెయ్‌కిన్టోమ్)** – వழி అనగా మార్గము. ఈ పదమును రెండుసార్లు చెప్పుటనుబట్టి శాస్త్రములో చెప్పినమార్గముననూ, శిష్టులు ఆచరించిన మార్గమున కూడా మేము స్వామికి మంగళాశాసనము చేయుచుంటిమని తెలుప బడినది. **"శాంతిశ్శాంతిశ్శాంతిః"** అనియూ, **"పశ్యేమశరదశ్శతం"** అనియూ శాస్త్రోక్తమైన మార్గము. అయోధ్యానగరవాసులైన ప్రజలునూ, అరణ్యవాసులైన మహర్షులునూ శ్రీరామునికి క్షేమము కలుగవలెనని మంగళాశాసనము చేసినట్లు వాల్మీకి మహర్షి చెప్పిన **"సర్వాన్ దేవాన్ నమస్యంతి"** అను శ్లోకమూ **"మంగళాని ప్రయుంజనాః"** అను శ్లోకమూ ఈ శిష్టాచారమునకు ప్రమాణములు. పాశురములో "ఆళ్‌శెయ్‌గిన్టోం" అనియున్నది. సేవను చేయుదుము అని దాని యర్థము. ఇచట మంగళాశాసనమును చేయుటయే అట్టి ముఖ్యసేవగా గ్రహింపదగును.

ఇక పాశురములోని పై సగభాగముచేత తాము ఎవరికి మంగళాశాసన మును చేయుదురో వివరింపబడినది. **(తిరువోణత్తిరువిழవిల్)** శ్రవణా నక్షత్రమునకు చెందిన మహోత్సవమునందు అని దీని యర్థము. జన్మ నక్షత్రము స్పష్టముగా తెలియని కొన్ని అవతారములకు విష్ణుదేవతాకమైన శ్రవణ నక్షత్రమే అవతార దినముగా భావించబడుచున్నది. సంధ్యాసమయమున నృసింహరూపమున ఆవిర్భవించి శత్రువును నశింపజేసిన స్వామికి మంగళాశాసనమును చేయుదుమని ఇచట చెప్పబోవుచున్నారు. **"వృషభే స్వాతినక్షత్రే స్తంభోద్భూతో నృకేసరీ"** అను శ్లోకమును బట్టి నృసింహావతారము స్వాతి నక్షత్రమున జరిగినట్లు చెప్పబడుచున్ననూ ఆ నక్షత్రమును మరుగుపరచి పాశురములో శ్రవణా నక్షత్రమును చెప్పుటనుబట్టియూ, శ్రవణ నక్షత్రమునకు చెందిన జన్మదినోత్సవమునందు అని చెప్పకుండా (తిరువిழవిల్) ఉత్సవమునందు అని మాత్రమే సామాన్యముగా చెప్పుటనుబట్టియూ ఒక విశేషమును గమనింపదగును. అది ఏమనగా – దుష్టబుద్ధి గల కొందరు భగవంతుని ద్వేషించు పాపిష్ఠులు భగవదవతార నక్షత్రమును మనము స్పష్టముగా చెప్పినచో ఆ నక్షత్ర నామమును తెలిసికొని సంకల్పములోజేర్చి భగవద్వినాశమునకై అభిచారములు

అనబడు క్షుద్ర యాగములను చేసి ప్రమాదము తెచ్చిపెట్టుదురేమో అను భయముతో ఈ ఆళ్వారులు నృసింహావతారమునకు సరియగు 'స్వాతి' నక్షత్రమును కీర్తించక దాచిపెట్టిరి. ఇది ఈ ఆళ్వారుల భక్తికి నిదర్శనము. ఈ పెరియ ఆళ్వారులే తాము ప్రసాదించిన మరియొక ప్రబంధములో "అత్తత్తిన్ పత్తానాళ్" అని చెప్పి కృష్ణుని అవతార నక్షత్రమును మరుగునపెట్టిరి. కృష్ణుడెప్పుడు జన్మించెనని అడుగగా హస్త నక్షత్రమునకు పదియవ రోజు అని చెప్పిరి. హస్త నక్షత్రమునకు తరువాతిదగు శ్రవణా నక్షత్రమా? లేక హస్త నక్షత్రమునకు వెనుకటిదగు పదియవ రోహిణీ నక్షత్రమా అని సందేహము కలుగు విధముగా అనిశ్చయముగా చెప్పుటచేత కృష్ణుని జన్మనక్షత్ర మును గ్రహించి అభిచార యాగమును చేయవలెనని దుస్సంకల్పముగల కంసాదులకు అవకాశమియ్యకూడదని ఈ ఆళ్వారులు "అత్తత్తిన్ పత్తానాళ్" అని చెప్పినట్లు పెద్దలు వ్యాఖ్యానింతురు.

**(అన్దియమ్బోది లరియురువాకి యరియై యழித్తవనై)** – సంధ్యా సమయము రాక్షసులకు బలమునిచ్చు సమయము. హిరణ్యకశిపుని వధమునకై ఆ సమయమున ఆవిర్భవించిన భగవంతుడు స్వీకరించిన రూపము నరసింహావతారము. ఆ రూపము శత్రువులకు భయంకరమైననూ భక్తులకు అతిసుందరముగా భావింపదగియుండెను అని "నారసింహవపుః శ్రీమాన్" అను విష్ణు సహస్రనామ శ్లోకమునుబట్టి, "అழగియన్ తానే అరియురువన్ తానే" అను నామ్మగన్ తిరువందాది వాక్యమునుబట్టియూ తెలియుచున్నది. ఇందు శ్రీమాన్ అను పదము అழగియన్ అను పదము ఆ యవతారమునందలి సౌందర్యము నిరుపమానమని తెలుపుచున్నది. అట్టి రూపమునెత్తి సహజ శత్రువైన హిరణ్యకశిపుని నశింపజేసిన నరసింహస్వామికి మంగళాశాసనము చేయుదుము. శత్రువు నశించిన పిదప ఇక మంగళాశాసన మెందులకు అనగా అతని వంశములోనివారు ఎవరైనా పగబట్టి స్వామికి ద్రోహమును చేయుదురేమో అను భయముతో అట్టి అపాయము రాకుండుటకై ఈ మంగళాశాసన మును చేయుచున్నట్లు ఊహింపదగును.

**(పన్దనై తీరప్పల్లాణ్డు పల్లాయిరత్తాణ్డెన్ఱు పాడుతుమే)** – పన్దనై అను పదమునకు బాలురకు వచ్చు ఒక వ్యాధి అని యర్థము. అపుడే జన్మించిన శిలలకు భవిష్యత్తులో కొంతకాలము వరకూ వారికేవిధమగు బాలారిష్టాదులు రాకుండుటకై

శుభావహమగు నక్షత్రశాంతి మొదలగు కార్యక్రమములను జరిపించుట లోక వ్యవహారమున కలదుగదా! అపుడే స్తంభమునుండి అవతరించిన నరసింహస్వామి శత్రువును వధించుటచే భవిష్యత్తులో ఈ అవతారమూర్తికి శత్రుగ్రహ బాధలు రావచ్చునేమోనను భయముచే వీరు ఇచ్చట నిత్య మంగళాశాసనమును చేయు చున్నారు. వేదవేత్తలైన బ్రాహ్మణులచేత వైదిక మంత్ర పారాయణములను చేయించి బాలారిష్టములు రాకుండ శాంతిని కలిగించినట్లే ఇచట వీరును పల్లాణ్డును ఒకసారి కాక పలు వేల సంవత్సరములు క్షేమము కలుగవలెనని మంగళమును పాడుచు ఇదియే మాకు వృత్తి అని చెప్పుచున్నారు.

h h

## పాశురము - 7

వెనుక ''ఏడునిలత్తిల్'' అను పాశురమున కైవల్యార్థులైనవారిని పిలిచియున్నారు. అందులోనే అల్పమైన ఆత్మానుభవమనే ఫలితమునందు మీకు గల అపేక్షను వదలి రండు అని కోరియున్నారు. అట్లే "నమో నారాయణాయ" అను మంత్రములో చెప్పబడినట్లు భగవత్కైంకర్యమాత్రనిష్ఠులై రండు అని గ్రామముల లోనూ నగరములలోనూ గల సామాన్యజనులు, విశేషజ్ఞులూ కూడ తెలుసుకొనునట్లు గట్టిగా ఉచ్చరించుచూ రండనియూ పిలచిరి. ఇపుడు వారు తమ భావమును మార్చుకొని వచ్చి పరిశుద్ధ స్వభావులై తమలో కలిగిన ఈ మార్పును లోకులు గ్రహించుటకు మనమేమి చేయవలెనని ఊహించి వైష్ణవ చిహ్నములైన తప్త చక్రాంకనము మొదలైన ప్రధాన లక్షణములను స్వీకరించి వచ్చిరి. కొందరు వీరిలో గల ఈ శ్రీవైష్ణవ చిహ్నములను చూచి అనుకూలులై వీరివలె సద్భావనతో ఆశ్రయించిరి. వీరిని చూచినవారికి కూడ మనము కూడ ఇట్లుండవలెను అను భావన కొందరు భాగ్యవంతులలో కలిగియుండును. భాగ్యహీనులైనచో వీరు మనకు చెందినవారు కారని విడిచిపెట్టుదురు. కైవల్యనిష్ఠులు తమ భావమును వేషభాషలను కూడ మార్చుకొని పరమవైష్ణవులై వచ్చినట్లు ఇందు చెప్పబడుచున్నది.

**మూలము :**

> **తీయిఱ్పొలికిన్ఱ శెఙ్జుడరాఴితికழ் తిరుచ్చక్కరిత్తిన్**
> **కోయిల్ పొరియాలే యొత్తుణ్డునిన్ఱు కుడికుడి యాట్చెయ్‌కిన్ఱోమ్**
> **మాయప్పొరుపడై వాణనై యాయిరన్దోళుమ్ పొழி కురుతి**
> **పాయచ్చుழత్తియ వాழி వల్లానుక్కు ప్పల్లాణ్డు కూఱుదుమే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తీయిల్ | = | అగ్ని మొదలగు తేజః పదార్థములకంటె |
| పొలికిన్ఱ | = | అధికముగా వెలుగొందుచున్న |
| శెఙ్జుడర్ | = | ఎఱ్ఱని కాంతి కలిగిన |
| ఆழிతికழ் | = | గుండ్రని ఆకారముతో ఒప్పుచున్న |
| తిరుచ్చక్కరత్తిన్ | = | సుదర్శనాయుధమునకు |
| కోయిల్ | = | స్థానమైన |
| పొరియాలే | = | చిహ్నముచేత |
| ఒత్తుణ్డునిన్ఱు | = | భుజములయందు ముద్రలు కలవారమై |
| కుడి కుడి | = | తరతరములుగా |
| ఆట్చెయ్‌కిన్ఱోమ్ | = | సేవను చేయుచుంటిమి |
| మాయప్పొరుపడై | = | మాయాయుద్ధము చేయు సైన్యము కలిగిన |
| వాణనై | = | బాణాసురుని |
| ఆయిరంతోళుమ్ | = | వేయి భుజములనుండి |
| పొழிకురుతి | = | ప్రవహించుచున్న రక్తము |
| పాయ | = | వ్యాపించునట్లుగా |
| శుழత్తియ | = | త్రిప్పబడుచున్న |
| ఆழிవల్లానుక్కు | = | సుదర్శనమును ధరించిన స్వామికి |
| పల్లాణ్డు కూఱుతుమే | = | మంగళాశాసనము చేయుదుము. |

**వివరణము :**

ఈ కైవల్యార్థులు శంఖచక్రాది ముద్రలను ధరించి వచ్చుటచేత ఈ గోష్ఠిలో వారికి ప్రవేశము లభించినది. ఈ శ్రీవైష్ణవ చిహ్నమే మనలనుజ్జీవింపజేసినది అను ఉపకార స్మృతితో మొదట ఆ సుదర్శనస్వామియొక్క తేజో విశేషమును "తీయత్తొలికిన్ఱ" అని ప్రశంసించుచున్నారు. సూర్య చంద్ర అగ్ని రూప తేజః పదార్థములన్నిటికంటె ఉజ్జ్వలమైనది సుదర్శనముయొక్క ప్రకాశము. పరమపదమును గూర్చి 'అత్యర్కానల దీప్తం తత్స్థానం' అని వర్ణింపబడియున్నది. తేజోమయమగు ఆ పరమపదమునకంటె అచటనుండు భగవంతుని దివ్యమంగళవిగ్రహము అత్యంత తేజోవంతమైనది. నీలకాంతిగల ఆ స్వామియొక్క దివ్య శరీరమునకు కూడా శోభను కలిగించునది కుడిహస్తములోనున్న ఈ సుదర్శనము అని చెప్పుటచేత దీని ప్రభావిశేషము ఎంత గొప్పదియో మనము గ్రహింపవచ్చును. "తస్య భాసా సర్వమిదం విభాతి" అని చెప్పబడినట్లు భగవంతుని తేజస్సుచే లోకమంతయు ప్రకాశించు చుండగా ఆయనయొక్క దివ్య దేహమునకు ఇది ప్రకాశకమగుట విశేషము. ఈ సుదర్శనముయొక్క తేజస్సు స్వేచ్ఛగా వ్యాపించుటకు చోటు చాలక అక్కడక్కడనే మండలాకారముగా గుంటలో సుడితిరిగిన ప్రవాహజలమువలె గుండ్రని ఆకారము ధరించినది. (తిరుచ్చక్కరత్తిన్ పొరియాలే) గుండ్రని ఆకారము గల అట్టి సుదర్శనముయొక్క ముద్రచేత మా భుజములను అలంకరించుకొన్నాము. ఇచట చక్రముద్రతో పాటు శంఖముద్రనుగూడ గ్రహింపదగును. శాస్త్రములయందు –

**తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః ।**
**అమీ పరమ సంస్కారాః పారమైకాంత్య హేతవః ॥**

అను శ్లోకమునందు శ్రీవైష్ణవత్వ సిద్ధికి ఐదు సంస్కారములు చెప్పబడియున్నవి. అందు మొదటిది "తాపః" అనబడు తప్తశంఖచక్రాంకన ముద్రధారణము. రెండవది ఊర్ధ్వపుండ్రధారణము, మూడవది భగవద్దాసుడు అనుటకు సూచకమగు దాస్యనామ ధారణము, నాల్గవది ఆచార్యుడుపదేశించు అష్టాక్షరీ ద్వయ చరమశ్లోకరూప మంత్రగ్రహణము, ఐదవది ఆచార్యులు ప్రసాదించిన ఒక భగవదర్చామూర్తిని ఆరాధించుకొనుట అను యాగము. ఈ పాశురమున చక్రాంకనము ఒకటియే చెప్పబడిననూ శ్లోకములో చెప్పబడిన ఐదు సంస్కారములనూ తాము గ్రహించినట్లు

కైవల్యనిష్ఠులు సూచించుచున్నారు. ఈ సంస్కారము వీరు భగవంతుని దయకు పాత్రులు అని తెలుపుచూ పునర్జన్మము లేకుండా మోక్షప్రాప్తికై సాధనమైనట్లు చెప్పబడినది. ఒకప్పుడు శ్రీకృష్ణ పరమాత్మ ద్వారకానగరమునుండి శత్రువులపై దండెత్తుటకై వెళ్ళబోవుచుండగా ద్వారకలోని స్వామియొక్క ద్వారపాలకులు, స్వామీ! మీరు తిరిగివచ్చువరకునూ ఈ రాజభవనములోనికి ఎవరిని ప్రవేశపెట్టమనెదరు? ఎవరిని నిరోధించమందురు? అని ప్రశ్నించిరట. అపుడు కృష్ణపరమాత్మ **“చక్రాంకితాః ప్రవేష్టవ్యాః నాముద్రితాః ప్రవేష్టవ్యాః”** అని సమాధానము చెప్పినాడట. ఎవరి భుజములయందు వైష్ణవ సంబంధ చిహ్నములు శంఖచక్ర ముద్రలు కలవో అట్టివారిని నిస్సందేహముగా ప్రవేశపెట్టుడు. ఎవరికి ఆ ముద్రలు లేవో అట్టివారిని మీరు స్వభావ పరీక్షను చేసి అనుకూలురైనచో లోపలికి పంపుడు అని ఆజ్ఞనిచ్చుటచేత భగవంతుడు భక్తుని అంగీకరించుటకు ఈ ముద్రాధారణము అవసరమైనది. దీనిని పొందినవాడు నేను భగవద్దాసుడను ఇక నాకే లోటునూ లేదు అని నిశ్చింతగా ఉండవచ్చుననీ పురాకృతములైన పాపములను బట్టి దండించుటకై నరకమును తీసికొనిపోవుటకు వచ్చిన యమభటులు కూడా ఈ ముద్రలను చూచి భయముతో వెనుదిరిగి పోవుదురనియూ చెప్పబడియున్నది. కూర్మ పురాణములోని ఈ క్రింది శ్లోకము ఇందులకు ప్రమాణము.

**శ్లో॥ చక్రాది ధారణం పుంసాం పరసంబంధవేదనమ్ ।**
**పతివ్రతా నిమిత్తంహి వలయాది విభూషణమ్ ॥**

శంఖచక్రాది ముద్రాధారణము ఇతడు భగవంతునికి సంబంధించినవాడు అను విషయమును తెలుపును. ఈ లక్షణమునుబట్టి అతనిపై ఎవరునూ చేయివేయజాలరు. ఈమె పతివ్రత అనుటకు కంకణాది సువర్ణాభరణధారణము ఎట్లు గుర్తు అగుచున్నదో దానిని బట్టి ఆ పతివ్రతను ఇతరులు ఎట్లు స్పృశింపజాలరో అట్లే ఇది అని భావము.

**(కుడికుడియాట్చెయ్‌కిన్ఱోమ్)** – వంశపరంపరగా భగవంతునికి అనన్యార్హ దాసులమై “సపుత్ర పౌత్రః సగణః” అని చెప్పబడినట్లు ఒక్కుమ్మడిగా మంగళాశాసనము చేయుటకు వచ్చితిమి అని కైవల్యార్థులు చెప్పుచున్నారు.

**(మాయప్పొరుపడై వాణనై)** – ఈ కైవల్యార్థులు ఏ సుదర్శన ముద్రా ధారణముచే శ్రీవైష్ణవత్వ సిద్ధిని పొంది వచ్చిరో అట్టి సుదర్శనమూర్తియొక్క వీరచరిత్ర

మును కీర్తించి చక్రధారియగు భగవంతునికి మంగళాశాసనము చేయుచున్నారు. మాయ అను పదమునకు ఆశ్చర్యకరమైన అనియూ, కపటమైన అనియూ రెండు అర్థములు. అట్లే పడై అను పదమునకు సేన అనియూ ఆయుధము అనియూ రెండర్థములు. వాణన్ అనగా బాణాసురుడు. అతడు అతని సేనయూ ఆశ్చర్యకర మగు యుద్ధమును చేయుటలో సమర్థులు. పలురకములైన ఆయుధములతో మాయా యుద్ధమున శత్రువులను జయించగలవారు.

**(ఆయిరన్దోళుమ్ ఇత్యాది) –** బాణాసురుడు శ్రీకృష్ణుని మనుమడైన అనిరుద్ధుని బంధించినాడు. అతని కూతురైన ఉష అనిరుద్ధుని ప్రేమించుటయే అందులకు కారణము. ఆ విషయము తెలిసికొన్న శ్రీకృష్ణుడు బాణాసురునిపై దండెత్తి యుద్ధమున అతనిపైకి చక్రాయుధమును ప్రయోగించినాడు. బాణాసురుని వేయి భుజములు ఈ చక్రాయుధముచే అడవిలోని మద్దిచెట్లు నరికినట్లు నరికివేయబడగా ఆ భుజములనుండి రక్తము ప్రవాహరూపమున భూమినంతనూ తడిపివేసినది. అవలీలగా కృష్ణుడు తన హస్తమున ధరించిన చక్రాయుధమును ఒక్కసారి త్రిప్పిన వెంటనే ఆ చక్రాయుధము అతి వేగముగా పరాక్రమించి ప్రబల వాతమున పర్వత శిఖరములు ఒక్కసారి నేలకూలునట్లు అతని వేయి భుజములను నరికి కుప్పగా కూల్చివేసినది. అయితే బాణాసురుని తల ఏల నరకలేదు? ప్రాణము తీయదగినంత పాపమునాతడు చేయలేదా? అని చిన్న సందేహము కలుగును. అతని అపరాధము పెద్దదే కాని తన మనుమనిని వరించిన ఉష పితృహీనురాలై దుఃఖించరాదు అను దయతో కృష్ణుడు బాణుని శిరచ్ఛేదమును చేయలేదు. మరియు భగవంతుని విడిచి దేవతాంతరములను ఆశ్రయించి చివరకు భగవంతునికే ద్రోహము చేయువారికి ఈ బాణాసురునివంటి దుర్గతియే పట్టును అని లోకమునకు చూపుటకై ప్రాణములతో భగవంతుడు వీనిని మిగిల్చినాడు. ఏదైన ఒక బంగారు ఆభరణమును తయారు చేయుటకు స్వర్ణకారులు కొన్ని నమూనా వస్తువులను తమవద్ద అట్టిపెట్టుకొందురు. వాటిని చూపి ఎవరికి ఏది కావలెనన్నచో ఆ రీతిలో ఆభరణములను చేయుదురు. భగవంతుని ద్వేషించి దేవతాంతరభజనపరులైనవారికి ఎట్టి గతి కలుగునో దానికి ఈ బాణాసురుడు ఒక నిదర్శనము అని భావము. బాణాసురుని నేను కాపాడెదనని చెప్పి అతని ఆరాధ్యదైవమైన శివుడు అతని నగర ముఖద్వారమున సపరివారముగా

రక్షక భటునివలె కాపలా ఉన్నాడు. ఈ యుద్ధమున ఆ రుద్రుదు కూడా బాణాసురుని వదిలిపెట్టి తన పరివారముతో సహా వెన్నుచూపి సుదర్శనజ్వాలకు తాళలేక పారిపోయినాడు. యుద్ధము ముగిసిన పిదప నిన్ను రక్షించుటకు వచ్చిన నాకు పరాభవము కలిగినదని శివుడున్నూ, నన్ను రక్షించగలవని నిన్నాశ్రయింపగా నాకీ గతి పట్టినదని బాణాసురుడున్నూ ఒకరినొకరు కౌగలించుకొని మొత్తుకొనుటయే వారి అహంకారమునకు పర్యవసానముగా మిగిలినది.

**(ఆழிవల్లానుక్కు ప్పల్లాణ్డు కూఱుతుమే)** – యుద్ధమునందు వీరవిహారమును చేసి విజయమును సాధించిపెట్టిన అట్టి సుదర్శనమూర్తిని నిత్యము శ్రీహస్తమున ధరించుటచే చక్రపాణి అనబడు ఆ పరమాత్మకు మేము మంగళాశాసనము చేయుదుము భగవంతుని యొక్క పరత్వమును నిరూపించుటకు శ్రియఃపతిత్వము ప్రధాన లక్షణమైనట్లునూ గరుత్మంతుడు వాహనముగా భుజములపై స్వామిని ధరించి ధ్వజముపై చిహ్నముగా నుండియు పరత్వమునకు నిరూపకమైనట్లునూ హస్తమందున్న ఈ సుదర్శనముగూడ కృష్ణుడే పరతత్త్వమనుటకు మరియొక ప్రధాన లక్షణము అని ఆழிవల్లాన్ (చక్రధారి) అను పదము సూచించుచున్నది. ఆ యుద్ధ సమయమున చక్రాయుధమునకుగాని, కృష్ణపరమాత్మకుగాని మంగళాశాసనము చేసినవారు ఎవ్వరును లేరేమో, ఆ కొరత తీరునట్లు వీరిపుడు మంగళమును పాడిరి.

h h

## పాశురము - 8

వెనుక అణ్డక్కులత్తు అను ఐదవ పాశురమున ఈ ఆళ్వారులచే మంగళా శాసనార్థమై పిలువబడిన ఐశ్వర్యార్థులైన భక్తులు అందులకు సమ్మతించి వచ్చి వీరితో కలసినట్లు ఈ పాశురమున చెప్పబడుచున్నది. తాము భగవంతుని వద్ద అత్యల్పమైన లోకాధిపత్యము బ్రహ్మాండాధిపత్యమూ మొదలైన ఫలములను కోరిననూ స్వామి మనకు అతి ప్రేమతో తన సాక్షాత్కారమునిచ్చి కోరిన ఫలమునిచ్చుచున్నాడు గదా! ఇట్టి పరమదయాళువు మహోదారుడునూ అగు పరమాత్మ మననుగూడా తన అంతరంగ భక్తులతోపాటు అతి ప్రేమతో కటాక్షించుచుండగా ఇట్టి స్వామిని కాదని అల్ప ఫలితమునకై విడచివెళ్ళిపోవుట ఉచితమా అని వివేకమును పొంది మనస్సును

మార్చుకొనిరి. నిత్యమూ స్వామికి మంగళాశాసనము చేయుచూ దాసులమై యుందుముగాక యని నిశ్చయించుకొనిరి. అనంతకోటి బ్రహ్మాండ నాయకుడైన భగవంతునిపై దృఢమగు భక్తి ఏర్పడిన పిదప నశ్వరములును, దుఃఖభూయిష్ఠములును, అల్పకాలానుభవ్యములనూ అగు బ్రహ్మరుద్రేన్ద్రాది పదవులపైగూడ ఆ భక్తులకు విరక్తి కలుగుట సహజము. ఈ విషయమునే శ్రీ యామునాచార్యులవారు స్తోత్రరత్నమున-

**శ్లో॥ తవ దాస్య సుఖైక సంగినాం భవనేష్వ స్త్వపి కీటజన్మ మే**
**ఇతరావసథేషు మా స్మ భూత్ అపి మే జన్మ చతుర్ముఖాత్మనా ॥**

అను శ్లోకమునందు తెలిపిరి. స్వామీ! నీ దాస్యమను మహానందమునందు నిరంతరము మునిగి తేలు పరమభాగవతుల భవనములలో నేనొక కీటముగానైన జన్మించెదనుగాక! అంతేకాని నీపై భక్తిలేనివారి ఇండ్లలో చతుర్ముఖ బ్రహ్మగానైననూ జన్మించు అవకాశము నాకు కలుగరాదని కోరుకొందును. ఆ క్షుద్ర ఐశ్వర్యము అహంకార హేతువై సంసారబంధకము గనుక వలదని తిరస్కరించుచున్నాను అని ఈ శ్లోకమునకు భావము. మరియు శ్రీ వేదాన్తదేశికులవారు వరదరాజపంచాశత్ అను స్తోత్రమున ఇదే భావమును ఈ క్రింది శ్లోకములో తెలిపియున్నారు.

**శ్లో॥ సద్య స్త్యజంతి వరద! త్వయి బద్ధభావాః**
**పైతామహాదిషు పదేష్వపి భావబంధమ్ ।**
**కస్మై స్వదేత సుఖ సంచరణోత్సుకాయ**
**కారాగృహే కనకశృంఖలయాపి బంధః ॥**

ఓ వరదరాజా! నీ పాదములపై నిరతిశయ ప్రేమబంధమును పొందిన భక్తాగ్రేసరులు చతుర్ముఖ బ్రహ్మపదవి వంటి క్షుద్ర పదవులను అపేక్షింపరు. ఆ పదవి లభించినచో అది ఒక లోకాధికారము గనుక ఆ బ్రహ్మయొక్క ఆయుర్దాయమున్నంతకాలము ఆ పదవి నుండి బయట పడుటకు అవకాశము లేదు. సుఖముగా సర్వత్ర సంచరించుటకు అభిలషించువాడు ఎవడైననూ నీకు బంగారపు సంకెళ్ళు తగిలించి కారాగారములో ఉంచెదనన్నచో అంగీకరించునా? ఆ బ్రహ్మాదిపదవులు అట్టివే గనుక భగవత్సంబంధము లేనివి, అహంకారపూరితమైనవి గనుక అవి నాకు వద్దు అని భావము.

కృష్ణునికి పరమభక్తుడైన ఉద్ధవుడు ఈ క్రింది శ్లోకమును చెప్పినట్లు పురాణము చెప్పుచున్నది –

**శ్లో॥ పత్యుః ప్రజానాం ఐశ్వర్యం పశూనాం వా న కామయే ।**
**అహం కదంబో భూయాసం కుందోవా యమునాతటే ॥**

నేను ప్రజాపతి అనబడు ఆ బ్రహ్మయొక్క అశ్వర్యమునుగాని పశుపతి అనబడు శివునియొక్క ఐశ్వర్యమునుగాని నాకు కావలెనని కోరను. శ్రీకృష్ణుడు విహరించు యమునానదియొడ్డున బృందావనములో ఒక కడిమి చెట్టుగానైననూ, మల్లెతీగగా నైననూ జన్మించెదను. కృష్ణునికి ఆశ్రయమిచ్చిన ఆ చెట్టుగానగుటయూ పుష్పమాలిక లందించిన మల్లెతీగగా నగుటయు నా భాగ్యమనుకొందును. ఇట్లు పరమభక్తులైన వారందరునూ భగవత్స్వభావమునెరిగిన పిదప క్షుద్రైశ్వర్యములపై అపేక్షను విడిచిపెట్టిరనుటకు ఎన్నో ఉదాహరణములు కలవు. మొదటిలో ఐశ్వర్యార్థులుగా భగవంతుని ఆశ్రయించిన భక్తులు కూడ భగవత్స్వభావముచే మనస్సు మారి ఆ కోరికలను త్యజించి, ఇపుడు ఈ పాశురమున ఇట్లు మంగళాశాసనము చేయుటకు వచ్చుచున్నారు.

**ఆక్షేపము :** ఈ ఐశ్వర్యార్థులను పిలచిన వెనుకటి ఐదవ పాశురమునందు బ్రహ్మాండాధిపత్యము సర్వైశ్వర్యములకు పైమెట్టుగా చెప్పబడినది. ఇపుడు ఈ పాశురములో తాము అట్టి ఐశ్వర్యము నపేక్షింపగా పరమాత్మ తమకు మధురమైన ఆహారమును, రత్నభూషణాదులను, చందనతాంబూలాదులనూ ప్రసాదించినట్లు చెప్పబడుచున్నది. ఈ రెండు పాశురములకునూ ఫలములో ఎంతో తేడా కనపడు చున్నది కదా! అని శంకింపవచ్చును.

**సమాధానము :** ఈ భక్తులలో యథార్థమగు స్వరూపజ్ఞానము కలుగుటకు పూర్వము ఆ అండాధిపత్యాదులే గొప్పగా భావింపబడినవి. తాము భగవంతునికి సహజ దాసులము అను జ్ఞానము కలిగిన పిదప వెనుక చెప్పినట్లు వారి దృష్టిలో మార్పు వచ్చి శరీర పోషకములైన ఈ ఆహారములు, భోగములు అన్నియూ క్షుద్రములే అని ఈసడింపు కలిగినది. బ్రహ్మపదవినందిన అతనికి కూడా ధారక పోషకములైన ఆహారాదులును వివిధ భోగములును ఇవే కదా కావలసినవి. వాటిపై అపేక్ష కలిగి భగవంతుడిచ్చిన ఆ అండాధిపత్యాదులను తమవిగా నెంచి అహంకరించుటచే కలిగిన

ఫలము స్వరూపజ్ఞానమును కోల్పోయి భగవంతునికి దూరమగుటయే కదా! ఇపుడు వీరు అట్టి భావకాలుష్యమును విడచి పరిశుద్ధ స్వభావులై వచ్చిరి అని గ్రహింపదగును.

**మూలము :**

**నెయ్యిడై నల్లతోర్ శోరుమ్ నియతము మత్తాణిచ్చేవకముమ్**
**కైయడై క్కాయుమ్ కఝుత్తుక్కు ప్పూణొడు కాతుక్కు క్కుణ్డలముమ్**
**మెయ్యిడ నల్లతోర్ శాన్దముమ్ తన్దెన్నై వెళ్ళుయిరాక్కవల్ల**
**పైయుడై నాకప్పకై క్కొడియానుక్కు ప్పల్లాణ్డు కూఱువనే**

**ప్రతిపదార్థము :**

నెయ్–ఇడై = నెయ్యితో నిండిన
నల్లదు = మంచిభావముతో పెట్టిన
ఓర్ శోరుమ్ = రసవంతమైన అన్నమున్నూ
నియతముమ్ = సర్వకాలములయందు
అత్తాణిచ్చేవకముమ్ = నిరంతరమగు సేవయును
కై = చేతియందు
అడైక్కాయుమ్ = తమలపాకులు వక్కలును
కఝుత్తుక్కు = మెడకు
పూణ్ ఒడు = ఆభరణముతో పాటు
కాతుక్కు = చెవులకు
కుణ్డలముమ్ = పోగులును
మెయ్ యిడ = శరీరమందు పూసుకొనుటకు
నల్లదు ఓర్ శాన్దముమ్ = శ్రేష్ఠమగు వాసనగల చందనమును
తన్దు = యిచ్చి
ఎన్నై = నన్ను
వెళ్ఉయిర్–అక్కవల్ల = పరిశుద్ధాత్మనుగా చేయగలిగిన
పై ఉడై = పడగలు గలిగిన
నాగ = సర్పములకు

| | | |
|---|---|---|
| పకై | = | శత్రువైన గరుత్మంతుని |
| క్కొడియానుక్కు | = | ధ్వజముగా గల భగవంతునికి |
| పల్లాణ్డు కూరువనే | = | మంగళమును చెప్పుదును. |

**వివరణము :**

భగవంతుడు నాకు కోరినదే తడవుగా ధారక, పోషక, భోగ్య పదార్థములను అన్నింటిని యిచ్చినాడు. మంచి ఆహారములను భూషణములను ఇతర భోగ్య వస్తువులను అనుభవించుటకు తగిన ఐశ్వర్యమును ఇచ్చినాడు అని వివరముగా ఐశ్వర్యార్థి భగవదనుగ్రహముచే తనకు పూర్వము లభించిన అన్ని అంశములను యిచట తెలుపుచున్నాడు. నెయ్యితో నిండిన ఆహారమును అతి ప్రేమతో ప్రసాదించినాడు. అన్నము శరీరమునకు ధారకము కాగా నెయ్యి పోషకము అనగా బలవర్ధకమైనది. అంతేకాక ఆ ఆహారము షడ్రసోపేతము అని **"ఒర్ శోరు"** అను పదములచే సూచింపబడుచున్నది. **'నల్లదు'** అను పదము ఇచ్చుచున్న భగవంతునియొక్క ప్రేమ భావమును తెలుపును. తల్లి పుత్రునికి పెట్టినట్లునూ దాసుడు భగవంతునికి అహంకార రహితముగా సమర్పించినట్లును భగవంతుడు ఎంతో ఆదరమును నాపై చూపుచూ, స్వీకరింపుమని యిచ్చినాడు. పూర్వము విదురుడు తన యింటికి వచ్చిన కృష్ణ పరమాత్మకు పవిత్రము, భోగ్యము అగు అన్నమును పెట్టినాడని భారతమునందు **"విదురాన్నాని బుభుజే, శుచీని గుణవంతిచ"** అను శ్లోకము తెలుపుచున్నది. ఇచట విదురుడు పెట్టిన అన్నము శుచియైనది. అనగా అహంకార రహితమైనది. రాయబారమునకు వచ్చిన ఆ కృష్ణుడు తనయింటికే రాగలడని దుర్యోధనుడు అహంకారముతో వివిధ పదార్థములను సిద్ధము చేయించినాడు. వాటిలో మాధుర్యాది గుణములున్ననూ అవి అహంకారముతో మలినమైనవి. అట్లే భీష్ముడును తన ఇంటికే కృష్ణుడు వచ్చునని నేను బ్రహ్మవేత్తనుగదాయని అహంకరించినాడు. అదే విధముగ ద్రోణాచార్యుడు నేను అగ్రవర్ణమునకు చెందినవాడనుగనుక నా ఇంటికి రావచ్చునని అభిమానించినాడు. వారందరి గర్వమును గుర్తించిన కృష్ణుడు పిలవకున్ననూ భక్తుడైన విదురుని ఇంటికి వెళ్ళినాడు. భక్తితో అతను పెట్టిన ఆహారము ఎంతో పరిశుద్ధమైనదిగా ఇష్టముగా స్వామి స్వీకరించినాడు. అట్టి సద్భావముతోనే ఇపుడు పరమాత్మ నాకు కోరిన ఆహారమును సమకూర్చినాడు. ఇది ఆయనయొక్క మహౌదార్యమేకదా!

**(నియతముమ్ అత్తాణిచ్చేవగముమ్)** – సర్వకాలములయందు నేను తనను విడిచిపెట్టకుండునట్లుగా నాలో సేవాభావమునుగూడ కలిగించినాడు. తాను నాకిచ్చిన ఐశ్వర్యమును దుష్టులు అపహరింపవచ్చినపుడు ఆయనయే వెంట ఉండి కాపాడు చున్నాడు. ఐశ్వర్యముయొక్క అభివృద్ధిని కోరుట, దానికి అపాయము కలిగినపుడు రక్షింపుమని కోరుట అని రెండు విధములు ఆశ్రయించు భక్తులలో ఉండునని అర్థార్థీ, ఆర్తః అను పదములతో భగవంతుడు గీతలో వివరించియున్నాడు.

లేక – 'నియతమ్' అను పదమునకు మరొక విధముగా కూడ భావము చెప్పవచ్చును. ఈ జీవులు భగవద్దాసులే ఐననూ దేవతాంతరములను ఆశ్రయించి వాడే తప్ప వేరే ఈశ్వరుడు లేడని ఎంచి వారివద్ద ఏవో కోరికలు కోరిననూ ఆ ఇతర దేవతలద్వారా గూడ తానే వారికి కోరికలనందించును. **"మయైవ విహితాన్ హితాన్"** అని గీతలో చెప్పబడినట్లు అసలు భగవంతుడే వారికి ఆ ఫలమును ఇచ్చువాడైనను ఈ పరమార్థమును గుర్తింపలేని జీవులు కృతఘ్నులై ఆ స్వామిని ద్వేషించుచున్నారు. తనను గుర్తించకున్ననూ ఆయన మహోదారుడై ఇతరులద్వారా వారికి ఇచ్చుచునే యున్నాడు. "అత్తాణిచ్చేవగముమ్" అనగా అవిచ్ఛిన్నమగు సేవ. ఫలమును స్వీకరించిన పిదప నాలో భక్తిభావము భగవదారాధన వ్యవహారము క్రమముగా సన్నగిల్లిపోవలెను. కాని అట్లుగాక ఆ స్వామియే నా హృదయమున నిరంతరమగు ఆ భక్తిని పెంపొందించుచున్నాడు. ఈ నిరంతర భక్తులకు మరణ సమయమున కలుగవలసిన అంతిమ స్మృతియు ఐశ్వర్యార్థియగు భక్తునికిగూడ అవసరమేనని శాస్త్రము చెప్పుచున్నది. అట్టి భక్తి తొలగిపోకుండా నాలో నిలబెట్టుట ఆ భగవంతుడు చేసిన మహోపకారమే అని ఐశ్వర్యార్థి ప్రశంసించుచున్నాడు.

**(కై అడై క్కాయుం)** – భోజనమైన పిదప గౌరవముతో ఇంటి యజమాని అతిథులకు కర్పూరాది సుగంధి ద్రవ్యములతో కూడిన భోగ్యమగు తాంబూలమును బహుమానముగా అందించినట్లు భగవంతుడుకూడ నాకు అట్టి భోగ్యములను సాదరముగా అందించుచున్నాడు.

**(కழుత్తుక్కు ప్పూణోడు కాతుక్కు క్కుణ్డలముమ్)** – ఈ ఐశ్వర్యార్థులకు తన దేహపోషణము దేహాలంకారము ఇదే ప్రధానాపేక్షితముగాని భగవంతునికి రత్నాభరణాదులతో అలంకారమును చేసి ఆ మూర్తిని దర్శించవలెనని ఆరాటపడువారు

కారుగదా! తన మలిన దేహమునకు ఈ క్షుద్ర భూషణములు తగవు. తన ఆత్మ స్వరూపమునకు జ్ఞాన భక్తి వైరాగ్యములే ఉండదగిన భూషణములు అను వివేకము ఈ భక్తునిలో పూర్వము లేదు కదా! ఐననూ భగవంతుడు, కోరిన రత్నాభరణాదు లన్నింటినీ ఇతనికి అందించుచున్నాడు. అర్థార్థియగు ఈ సంసారి చేతనునికి తన మెడలో రత్నాలహారములను చెవులకు కుండలములను చేతులకు కడియములను ధరించవలెననీ, వీటిని ధరించిన తనను లోకులు చూచి ఓహో! యనవలెనని ఎంతటి పేరాశయో దీనినిబట్టి తెలియుచున్నది. ఇట్టి ఐశ్వర్యార్థికి కూడా భగవంతుడు ప్రియభక్తుడైన హనుమంతునికి సీత చేతితో రత్నహారమును కానుకగా అందించినట్లు సాదరముగా అందించుచున్నాడు. ఆ స్వామియొక్క ఔదార్యము ఎంత గొప్పదియో గదా!

**"ప్రదేహి సుభగే హారం – యస్య తుష్టాసి భామిని"** పట్టాభిషేక సమయమున ఇంద్రుడు కానుకగా అమూల్యమైన రత్నాభరణమును శ్రీరామునికి పంపెను. దానిని స్వీకరించిన శ్రీరాముడు సీతమ్మకు అందించెను. ఆమె దానిని చేతపట్టుకొని, ఒక కంటితో హనుమంతుని, మరియొక కంటితో శ్రీరాముని ఇటునటు చూడదొడంగినది. ఆ చూపులోనే స్వామి ఆమెయొక్క మనోభిప్రాయమును గ్రహించినాడు. **"ప్రేక్షిత జ్ఞాస్తు కోసలాః"** అన్నట్లు చూపులనుబట్టియే అంతరంగములోని భావమును గుర్తించ గలవారు కోసల దేశవాసులు గదా! ఇట్లు సీతయొక్క ఆశయమును గుర్తించిన స్వామి అతనికి కానుకగా యివ్వరాదాయని తన అనుమతిని తెలిపినాడు. ఇచట శ్రీరాముడు సీతాదేవిని 'సుభగే' అని సంబోధించుటలో ఒక విశేషమున్నది. భక్తుల సేవలను గుర్తించి వారికి తగినట్లు కానుకలివ్వగల పరిజ్ఞానము నీలో కలదు అని స్వామి సూచించుచున్నాడు. మీ అభీష్టమును కాదని నేను స్వతంత్రించి యివ్వగలనా? యని ఆమె స్వామి ప్రక్క మరొకమారు చూచినది. భక్తుల కోరికలు తీర్చుటలో నాకంటె నీవే ముందు నిలుచుదానవు గనుక నీ అభిప్రాయమే నా అభిప్రాయమని మన ఇద్దరికినీ ప్రాణదాతయగు హనుమంతునికి ఈ కానుకనిచ్చుటలో నీతో నేను ఏకీభవింతునని శ్రీరాముని అభిప్రాయము. ఆనాడు హనుమంతునిపై చూపిన అంతటి ప్రేమతో ఇప్పుడు నాపైగూడ స్వామి ఆదరమును చూపుచు కోరిన సర్వాభరణ ములను ఇచ్చుచున్నాడని ఈ భక్తుడు ఆనందపడుచున్నాడు.

**(మెయ్యిడ నల్లతోర్ శాన్దముమ్ తన్దు)** – ఈ పాదు శరీరమునకు నేను కోరిన వెంటనే ఉత్తమమైన సుగంధి చందనమును ప్రసాదించినాడు. కృష్ణావతార మున మధురా నగరములో కృష్ణబలరాములు ప్రవేశించినపుడు కంసునికై సిద్ధము చేసిన సుగంధి చందనమును కుబ్జ కృష్ణుడు కోరగనే సమర్పించినదట.

**శ్లో॥ సుగంధమేతత్ రాజార్హం రుచిరం రుచిరాననే ।**
**ఆవయోః గాత్ర సదృశం దీయతాం అనులేపనమ్ ॥**

ఇది విష్ణుపురాణములోని శ్లోకము. కంసునికై చందనమును పట్టుకొని పోవుచున్న కుబ్జతో కృష్ణుడు ఇట్లన్నాడు – “ఓ కుబ్జా! నాకు మా అన్నకునూ మంచి చందనమునివ్వగలవా?” ఆ ఇద్దరు బాలుర సౌందర్యమును చూచిన కుబ్జ కాదనలేక పోయినది. “సరే!” అని బదులుచెప్పి తన భరిణలోని ఒక రకమైన చందనమును వారికి అందించినది. వారు గొల్లపిల్లలు కదా! చందనములోని విశిష్టతను గుర్తించ లేరు అని తలచినది. ఆమె ఇచ్చిన చందనము అంత మంచిది కాదు. సహజ పరిమళము లేనందున కొంచెము అత్తరుపోసి పరిమళవంతముగా చేయబడినది. ఆ కిటుకును గమనించిన కృష్ణుడు “సుగంధమేతత్” అన్నాడు. దీనిలోని వాసన సహజమైనది కాదు. మరియొక ద్రవ్యమును కలుపుటచే వచ్చినది. ఇది మాకు వద్దు అన్నాడు. ఇచటనొక వ్యాకరణ విశేషాంశము ఇమిడియున్నది. సహజమైన గంధము కలది అని చెప్పవలసినపుడు సంస్కృత వ్యాకరణ ప్రకారము సుగంధి అని ‘ఇ’కారాంతముగా చెప్పబడును. సుగంధం అని కృష్ణుడు ప్రయోగించుటవలన ఈ చందనములోని గంధమును సహజము కాదని, వేరొక ద్రవ్యముయొక్క సమ్మేళనముచే ఆరోపితమైనదనీ సుగంధం అను కృష్ణుని వాక్యముచే తెలియవచ్చు చున్నది. కనుక ఆయన ఇది మాకు వద్దన్నాడు. పిదప ఆమె మరొక పాత్రలోనుండి వేరే చందనము తీసి ఇచ్చినది. దానిని చూచి కృష్ణుడు ఇది రాజార్హము, నాకు వద్దన్నాడు. అది మీ రాజగు కంసునికొరకు తయారుచేసిన చందనము, గర్వాంధుడైన మీ రాజునకు పూయు చందనము నాకెందుకు? నీకు మాపై ప్రేమయున్నచో అందుకు తగిన మంచి చందనమును మరొకటి యిమ్మన్నాడు కృష్ణుడు. అపుడామె మంచి రంగు, సహజపరిమళముగూడ కలిగిన మరియొక రక్తవర్ణముగల చందనమును తీసినది. దానిని కృష్ణుడు “రుచిరం” గంధమునకు తగినట్లు ఇది మంచి ముదురు

రంగు గల చందనము అని మెచ్చుకున్నాడు. వీరిని వట్టిగొల్లపిల్లలనుకుంటినే! చందనములోని మర్మములెరిగిన రసికులవలె ఉన్నారే! అని కుబ్జ మొగమెత్తి వారిని తేరబార చూచినది. అపుడు కృష్ణుడు రుచిరాననే! ఓ సుందరీ! నీ ముఖమున కనపడు ఆదరమునకు తగినట్లుగా ఈ చందనముగూడ గొప్పగా ఉండవలెనుగదా! అన్నాడు. అపుడామె ఎంతో ప్రేమతో మన్మథ మన్మథుడు అని చెప్పదగిన ఆ కృష్ణునికి మంచి చందనమును పూసినదట. నీవు ప్రేమతో ఇచ్చిన ఈ చందనమే మా ఇద్దరి శరీరములకు తగినట్లున్నది, అని వారునూ సంతోషించిరట. అపుడు ఆ కుబ్జ యిచ్చిన చందనమువంటి దివ్యచందనమునే నేను కోరగా భగవంతుడు నాకు అందించినాడు. పూర్వము వివేకహీనుడనయి క్షుద్రమగు దేహముకొరకు నేను చందనమును కోరిననూ మహోదారుడైన స్వామి ఇట్లు ఉత్తమచందనమును ఇచ్చుట, పైగా నాపై ఎంతో ఆదరమును చూపుట, ఆ పరాత్పరుని యొక్క వాత్సల్యగుణవిశేషమే గదా!

**(వెళ్ళుయిరాక్కవల్ల)** – భగవంతుని వాత్సల్యమును ఇపుడు గుర్తించిన ఈ ఐశ్వర్యార్థియగు భక్తుడు లౌకిక క్షుద్రఫలములకై ఆశించిన తన అల్పబుద్ధిని మార్చుకొని సర్వస్వామియగు ఈ పరమాత్మునివద్ద దాసుడనై సేవను చేయుటకంటె నాకు వేరేమి కావలయును అని పరిశుద్ధమనస్కుడైనాడు. ఇపుడు అర్థార్థిత్వము పోయి జ్ఞాని అని చెప్పదగిన ఉత్తమభక్తుడైనాడు. నన్ను ఇట్లు మార్చినది భగవంతుని ప్రభావమే అని చెప్పుకొనుచున్నాడు.

**(పైయుడై నాకప్పకై కొడియానుక్కు ... యిత్యాది)** – ఇక నేను శాశ్వతముగా గరుడధ్వజుడైన ఈ స్వామికి మంగళాశాసనమును చేయుదును అనుచున్నాడు. తన శరీరమును మెత్తని పాన్పుగా మార్చి దానిపై స్వామి శయనించియుండగా సుకుమార మగు భగవంతుని శరీరస్పర్శచే ఆనందమును పొందుచు తన పడగలు విప్పి ఆదిశేషుడు ఆడించుచుండును. ఆ శేషునిపై శయనించిన స్వామికి నిత్యమంగళమగు గాక! మరియు ఆ సర్పరాజునకు విరోధియగు గరుత్మంతుని తనకు వాహనముగనూ ధ్వజముపై చిహ్నముగనూ అమర్చుకొన్న ఆ భగవంతునికి నిత్యమంగళమగుగాక అని పల్లాణ్డు పాడుదును. స్వామి తనయొక్క ఆలయమునకు ముందు ఈ గరుడ ధ్వజమును కట్టుకొనుట ఎందులకనగా – భక్తులు ఏయే ఫలితములను కోరిననూ అన్నింటినీ వారికి ప్రసాదించి నా ప్రభావముచే వీరిని ఉత్తమ దాసులుగా మార్చివేయ గలనుసుమా అని చాటిచెప్పుటకే ఈ ధ్వజము కట్టబడెను కాబోలు.

ఇచట మరియొక విశేషము సూచింపబడుచున్నది. ప్రకృతి మండలములో నిత్య శత్రువులు అనదగిన సర్పరాజు మరియు పక్షిరాజగు గరుత్మంతుడు వీరిద్దరినీ సహజవైరము విడిచి తనకు దాసులగునట్లు చేసుకొనుట భగవంతుని అపూర్వ ప్రభావమే గదా!

సహజ వైరముగల ఆదిశేషుని గరుత్మంతునికూడా నిర్వైరముగా తన దాసులై మసలుకొనునట్లు వశీకరించుకొన్న భగవంతుని ఈ ప్రభావమును చమత్కారముగా అధిక్షేపించుచు ఒక కవి ఈ క్రింది శ్లోకమును చెప్పినాడట.

**శ్లో॥ ఏకా భార్యాః ప్రకృతి చపలా సుస్థిరా సా ద్వితీయా**
**ఏకః పుత్రః బహుజన సృజః మన్మథో దుర్నివారః**
**శేషశ్శయ్యా వసతి రుదధిః వాహనం పన్నగారిః**
**స్మారం స్మారం స్వగృహ చరితం దారుభూతో మురారిః**

జగన్నాథ క్షేత్రమునందు ఉండు భగవంతుని విగ్రహము దారుమయము, అనగా కర్రమొద్దుతో తయారుచేయబడినది అనియూ, అరువది సంవత్సరముల కొకసారి సముద్రమునుండి వెలుపలికి కొట్టుకువచ్చిన కర్రమొద్దుతో ఆ మూర్తిని తయారుచేయుదురనియూ వాడుక కలదు. జగత్కారణభూతుడైన పరమాత్మ ఈ కర్రమొద్దు రూపములో ఎందుకు ఆవిర్భవించినాడు? అని కవి తానే ప్రశ్నించుకొని చమత్కారముగా ఇట్లు సమాధానమిచ్చుచున్నాడు. ఆ స్వామికి ఇద్దరు భార్యలు. లక్ష్మీదేవియను మొదటి భార్య ఒకచోట నుండక చంచల స్వభావురాలై నిరంతరము తిరుగుచుండునది. ఇక రెండవ భార్య భూదేవి ఉన్నచోటినుండి కదలలేని స్తబ్ధురాలు. ఇక పెద్దకుమారుడు బ్రహ్మ, లోకమున బహుసంతానమును పుట్టించుటయేగాని మరేమియు నెరుగడు. రెండవ కుమారుడైన మన్మథుడు పెద్దలు చిన్నలు అను వివేకములేక ప్రతివారిపైననూ రాళ్ళురువ్వినట్లు పుష్పబాణములను ప్రయోగించి వ్యాకులతను కలిగించుచుండును. ఇక తనకు పానుపైన ఆదిశేషుడు పడగవిప్పి నిరంతరము బుసకొట్టుచుండును. తనకు నివాసము, పైన ఆవరణము లేని సముద్రమే తప్ప ఎండకూ వానకూ రక్షణము నిచ్చు భవనమేదియు లేదు. తనకు వాహనమగు గరుత్మంతుడు సహజశత్రువైన ఆదిశేషునిపై మాటిమాటికినీ కలహముతో కాలుదువ్వుచుండును. ఇట్టి తన కుటుంబ విషయములను తలంచుకొని ఆ

భగవంతుడు వీరిని సవరింపలేక, ఏమి చేయుటకును పాలుపోక ఇట్లు మొద్దుబారి పోయినాడు కాబోలు. ఈ శ్లోకము వినోదార్థముగా చెప్పబడినదైననూ సర్వేశ్వరుని ప్రభావముచే ఎట్టివారైననూ ఆయన సన్నిధిలో విధేయులై అణగిమణగియుందురు అని తెలుపుచున్నది.

ఈ పాశురమునకు చివర "కూరువనే" అని ఏకవచనము కలదు. నేను మంగళాశాసనము చేయుదును అని యర్థము. వెనుకటి పాశురములలో 'కూఱుదుమే" అని బహువచనముగా చెప్పుట కనబడును. వాటిలో చెప్పబడిన పరమభక్తులునూ, కైవల్యార్థులునూ పరిమిత సంఖ్యలో వచ్చినవారే. ఆ వచ్చిన కొందరు కలసి బహువచనములో తమ సంగతిని చెప్పుకొనిరి. ఇచట మంగళా శాసనమునకై వచ్చిన ఐశ్వర్యార్థులు ఇద్దరు ముగ్గురు కారు. వేలకు వేలు ఇట్టి భక్తులు గుంపులు గుంపులుగా వత్తురు. వారిని సంఖ్యతో లెక్కించుట సాధ్యము కాదు. ఒక ఊరిలో నుండు జనుల స్వభావమును చెప్పదలచి ఈ గ్రామములోని మనిషి ఇట్లుండును అని ఏకవచనముతో చెప్పినట్లు అర్థార్థియైన భక్తుడు ఇట్లు మంగళాశాసనము చేసెనని ఏకవచనముతో చెప్పబడినది. దీనిని "జాత్యేకవచనము" అందురు.

h h

## పాశురము - 9

వెనుక శ్రీ విష్ణుచిత్తులు తమతోపాటు భగవంతునికి మంగళాశాసనమును చేయుటకై ఉత్తమాధికారులగు ప్రపన్నులను, కైవల్యనిష్ఠులను, ఐశ్వర్యార్థులను వరుసగా మూడు నాలుగు ఐదవ పాశురములలో పిలిచినారనియూ, అదే క్రమములో ఆ ముగ్గురు అధికారులును తమ తమ స్వరూపములను చెప్పుకొని ఆరు, ఏడు, ఎనిమిది పాశురములలో వచ్చి వీరితో కలసినారనియు చెప్పుకున్నాము. ఇపుడు ఇచటినుండి అదే క్రమములో ఆ ముగ్గురునూ ఈ ఆళ్వారులతో కలసి స్వామికి మంగళాశాసనము చేయుచున్నట్లు తొమ్మిది, పది, పదకొండవ పాశురములలో చెప్పబడుచున్నది. ఈ తొమ్మిదవ పాశురములో ఏ ఫలమును అపేక్షింపక స్వామి సేవయే తమకు ప్రధానమని భావించు ఉత్తమాధికారులగు ప్రపన్నులు మంగళాశాసనము చేయుచున్నారు.

**మూలము :**

> **ఉడుత్తుక్కళైన్ద నిన్‌పీతకవాడై యుడుత్తుక్కలత్త తుణ్డు**
> **తొడుత్త తుళాయ్‌మలర్, శూడిక్కళైన్దన శూడుమిత్తొణ్డర్ కళోమ్**
> **విడుత్తతిశై క్కరుమన్దిరుత్తి త్తిరువోణత్తిరువిళవిల్**
> **పడుత్త పైన్నాకణై ప్పళ్ళికొణ్డానుక్కు ప్పల్లాణ్డు కూఱుదుమే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఉడుత్తు | = | నీవు ధరించి |
| కళైన్ద | = | విడచిన |
| నిన్‌పీతకవాడై | = | నీయొక్క పీతాంబర వస్త్రమును |
| ఉడుత్తు | = | ధరించియును |
| కలత్తతు | = | నీవారగించిన శేషప్రసాదమును |
| ఉణ్డు | = | భుజించియు |
| తొడుత్త | = | మాలికగా గ్రుచ్చబడిన |
| శూడిక్కళైన్దన | = | నీవు అలంకరించుకొని విడిచిన |
| తుళాయ్‌మలర్ | = | తులసీ పుష్పములను |
| శూడుం | = | ధరించునటువంటి |
| ఇత్తొణ్డర్ కళోమ్ | = | ఇట్టి దాసులమైన మేము |
| విడుత్తదిశై | = | మమ్ములను పంపిన ఆయా దిక్కులలోని |
| కరుమం | = | వ్యాపారములను |
| తిరుత్తి | = | చక్కగా నెరవేర్చి |
| తిరువోణత్తిరువిళవిల్ | = | శ్రవణా నక్షత్రమునకు చెందిన మహోత్సవమునందు |
| పడుత్త | = | పడకగా ఏర్పడిన |
| పైన్నాకణై | = | విశాల ఫణములుగల శేషుడు అను పాన్పుపై |
| పళ్ళికొణ్డానుక్కు | = | శయినంచి ఉండు భగవంతునికి |
| పల్లాణ్డు కూఱుతుమే | = | మంగళాశాసనమును చెప్పుదుము. |

**వివరణము :**

ఉత్తమభక్తుడు తనకు అవసరమగు ప్రతి వస్తువును భగవంతునికి ఉపయోగపడి తీసివేయబడిన శేషమైనదానినే అపేక్షించును. అందు మొదట స్వామి ధరించి విడచిన పీతాంబర శేషవస్త్రమునే మేము ధరింతుము అనుచున్నారు. అభిషేక సమయమందు అలంకారాది సమయమందును స్వామికి ఒక్కొక్క రకమగు వస్త్రమును ధరింపజేయుట, ఆ కార్యము నెరవేరగనే వాటిని తొలగించి వేరొక వస్త్రమును ధరింపచేయుట ఆలయములలోగల ఆచారమై యున్నది. ఆ ప్రకారము అభిషేక సమయమున ధరింపజేయబడిన స్నాన వస్త్రముపై పసుపు, నూనె, సుగంధముగల నలుగుపిండి మొదలైన వాటి గుర్తులునూ నలిగిన ముడతలునూ కనబడుచుండును. స్నానాసనమునుండి అలంకారాసనముపైకి ఆ భగవన్మూర్తిని జేర్చిన పిదప పూర్వ వస్త్రమును తొలగించి మరియొక శుద్ధవస్త్రమును సమర్పించి దానికి అత్తరూ, చందనము మొదలగు పరిమళ వస్తువులను చేర్చుదురు. ఇక శయనోత్సవ సమయమున వాటిని మార్చి వేరు వస్త్రములను ధరింపజేయుదురు. ఇట్లు స్వామిచే ధరింపబడి విడువబడిన ఆయా గుర్తులును పరిమళమును గల శేషవస్త్రములను మేము ధరించెదము. అవియే కదా భక్తునికి అపేక్షితమైనవి. విరహదశలోనున్న ఆండాళమ్మ వారు కూడా తమ విరహ తాప శాంతి కొరకై ...

**"పెరుమాన్ అరైయిల్ పీతకవణ్ణ ఆడై - కొణ్డు**
**ఎన్నై - వాట్టమ్ తణియ వీశీరే"**

అని నాచ్చియార్ తిరుమొழிలో చెప్పుకొనియున్నారు. నా విరహతాపము శాంతించుటకు ఆ కృష్ణపరమాత్మయొక్క నడుమునకు చుట్టిన పీతాంబర వస్త్రమును తెచ్చి దానితో నాకు చల్లగాలి వచ్చునట్లు వీచుడు, అని చెలికత్తెలతో చెప్పుకొనుచున్నారు. భగవంతుని శరీర స్పర్శముగల ఆ వస్త్రముయొక్క గాలి సోకిననూ తమకు తాపశాంతి కలుగునని ఆ అమ్మవారి అభిప్రాయము. అర్చామూర్తులకు ధరించు ఈ శేష వస్త్రములు పరమపదములోని వైకుంఠనాథుడు ధరించిన పీతాంబరముయొక్క ఆవేశావతార రూపమైనవి అని పాంచరాత్ర గ్రంథములలో చెప్పబడియున్నది.

**శ్లో॥ స్రగ్వస్త్రాభరణైః యుక్తం స్వానురూపైః అనూపమైః ।**
**చిన్మయైః స్వప్రకాశైశ్చ అన్యోన్య రుచిరంజితైః ॥**

ఈ పాంచరాత్ర శ్లోకమునగల "చిన్మయైః" అను పదము స్వామి ధరించు పుష్ప మాలలు, వస్త్రములు, ఆభరణములు యివన్నియూ చైతన్యముగలిగిన పదార్థములే ననియూ, జడములు కావనియూ సూచించుచున్నది. ఆలయములలో స్వామికి ధరింప జేయబడు వస్త్రాభరణాదులపై పరమపదములోని ఆ చిన్మయ వస్త్రాభరణాదుల యొక్క ప్రాభవము ఆవేశ రూపముగా సంక్రమించునని తెలుపబడుచున్నది. లోకమునందు మహారాజునకు ధరింపజేయుటకై తయారుచేయు కంచుకాదులను వివిధ రత్నములతోను, బంగారపు దారములతోను నానా రకములైన నగిషీలతోను అల్లి ఇవి రాజునకు సరిపోవునా అని మొదట తమ శరీరమున ధరించి సరిచూచుకొని పిదప ప్రభువునకు సమర్పించుట జరుగును. **"తథాపి పురుషాకారః భక్తానాం త్వం ప్రకాశసే"** అని జితంతా స్తోత్రమున చెప్పబడినట్లు భగవంతునికి చెందిన వస్త్రాభరణాది పదార్థములన్నియూ తిరిగి ప్రేమతో ఆయా భక్తులకు కానుకగా సమర్పించుట కొరకే గనుక వాటిని ఈ భక్తులు మహాప్రసాదమని స్వీకరింతురు.

**(కళైన్ద నిన్ పీతకవాడై యుదుత్తు, క్కలత్త తుణ్డు)–** భగవత్ శేష ప్రసాదమును దేహధారణ పోషక భోగ్యముగ మేము స్వీకరింతుము. స్వామి అంగీకరించిన పాత్రములోని ఉచ్ఛిష్ట శేషప్రసాదమే మాకు అతిభోగ్యమగు ఆహారము. వైకుంఠమున భగవద్భక్తులలో ప్రధానుడుగా పరిగణింపబడు శ్రీ విష్వక్సేనస్వామి శేషప్రసాదమును స్వీకరించువారిలో మొట్టమొదటివాడని **"త్వదీయ భుక్తోజ్ఝిత శేషభోజినా"** అను శ్లోకము నందు శ్రీ యామునాచార్యులవారు స్తోత్రరత్నములో తెలిపియున్నారు. "గురూచ్ఛిష్టం భుంజీత" ఇత్యాది శాస్త్రవాక్యములచేత ఆచార్యుడు ఆరగించిన పాత్రములోని శేష ప్రసాదము శిష్యునికి పావనమై ధారకముగా స్వీకరింపదగినది అని శాస్త్రవిధి కలదు. శాస్త్రము చెప్పుచున్నది అనిగాక దాసుడనగు నా స్వరూపమునకు ఉచితమగు ఆహారమదియని కొందరు స్వీకరింతురు. ఇక పరమభక్తులైనవారు భగవత్శేషము తప్ప మరియేదియు తమకు ఇష్టము కాదన్నట్లు శేషప్రసాదమునే అతి ప్రేమతో స్వీకరింతురు. భగవద్దాస్యము భాగవత దాస్య పర్యంతము పర్యవసించినపుడే పరిపూర్ణత నొందినట్లు ఈ భగవచ్ఛేష ప్రసాద స్వీకారాపేక్ష కూడ భాగవత శేషప్రసాద మును అపేక్షతో స్వీకరించునంతవరకు పర్యవసించినపుడే పరిపూర్ణత నొందునని అది భగవత్ప్రసాదమునకంటె పావనము భోగ్యముకూడనని శ్రీ తొండరడిప్పొడి యాళ్వారు (విప్రనారాయణులు) తిరుమాలై ప్రబంధమునందు **"వానుళార్**

**అరియలాగా .... తరువరేల్ పునిదమన్రే"** అని నలుబదియొకటవ పాశురమున చెప్పిన విషయము ఇచట గుర్తింపదగును. ఈ విషయమున మరికొన్ని విశేషాంశములు మా శ్రీమాలికాస్తుతి వ్యాఖ్యానములో ఆ పాశురమువద్ద పాఠకులు గమనింపవచ్చును. భగత్ప్రసాదము సర్వభక్తులకు సాధారణమైనది. ఈ భాగవత ఆచార్య శేషప్రసాదము పరిపూర్ణ శ్రీవైష్ణవ నిష్ఠాగరిష్ఠులకే సాదరముగా స్వీకరింపదగినది.

**(తొడుత్తతుళాయ్‌మలర్)** – తులసితోనూ పుష్పములతోనూ గ్రుచ్చిన పుష్ప మాలికను భక్తులు ఆదరముతో సమర్పించగా స్వామి ప్రేమతో దానిని స్వీకరించును. ఆయన ధరించిన పిదప తీసివేయబడిన ఆ నిర్మాల్యమును ఆయనయొక్క శరీర స్పర్శము గల మాలిక గదా అను ఆదరముతో మేము స్వీకరింతుము. మాలికలోని సౌగంధ్య సౌకుమార్యములకంటె అందు అభీష్టమైనది భగవంతుని శరీర స్పర్శగల మాల అను విషయమే. తనకు అతి ప్రియమైన వ్యక్తి స్పృశించినదిగాని, ధరించినదిగాని, భుజించినదిగాని ఐన వస్తువు తనకు అతి ప్రియమైనట్లు రసికుడు భావించును. భగవంతుడు పరమరసికుడు కదా! ఆయనయే గోదాదేవియొక్క కేశస్పర్శముగల మాలికలను అతిప్రియముగా స్వీకరించినాడు. అట్లే తన భక్తులకు తాను ధరించిన మాలలు ఇష్టమగునని ఎంచి ఆ నిర్మాల్యములనే మాకును ప్రసా దించును. దీనినిబట్టి ప్రత్యేకించి మాకొరకు అని వేరే ధరింపదగిన వస్త్రములుగాని, ఆహారముగాని, భూషణాద్యలంకారములుగాని లేవనియూ, భగవచ్ఛేషమైనవియే మాకు దేహయాత్రకు ఉపయోగపడుననియూ చెప్పుటచే వీరి ఉత్తమభక్తి నిరూపితమైనది.

**(విడుత్త తిశైక్కరుమన్దిరుత్తి)** – "న అకించిత్కుర్వతః శేషత్వం" అను శ్రీ భాష్యకారుల సూక్తినిబట్టి తమ శేషత్వమును నిలుపుకొనుటకై కేవలము భగవదుచ్ఛిష్ట పదార్థములను స్వీకరించుటయేగాక స్వామి ఆదేశించిన సర్వకార్యములను సంపూర్ణ ముగా నెరవేర్చగల కింకరులమని ఈ వాక్యమున చెప్పుచున్నారు. ఆయన ఏ దిక్కునకు వెళ్ళి ఏ కార్యమును సాధించుకొని రమ్మని ఆదేశించిననూ మేము ఆ పనిని సక్రమ ముగా నిర్వహించగలవారము. మాకు అప్పజెప్పిన పనిని పూర్తిచేయుటకై మరల మరొకరిని ఆదేశించనవసరము లేదు. యజమానియొక్క ఆజ్ఞను పూర్తిగా సాధించలేక కొంతవరకే నెరవేర్చినవాడు అధముడు. కొరతలేకుండ పూర్తిచేయువాడు మధ్యముడు. తాను సాధించిన కార్యమునకు ముందుముందు ఏవైనా అంతరాయములు వచ్చునేమో యని మొదటనే ఊహించి వాటినన్నిటినీ తొలగించి కోరినదానికంటే అధిక ఫలిత

ములు సంభవించునట్లు కార్యమును సాధించువాడు ఉత్తముడు. అట్టి ఉత్తమదాసుడు హనుమంతుడేనని రామాయణమునుబట్టి మనము గ్రహింపదగును.

**శ్లో॥ కార్యే కర్మణి నిర్దిష్టే యో బహూన్యపి సాధయేత్ ।**
**పూర్వకార్యావిరోధేన సకార్యం కర్తుమర్హతి ॥**

అని సుందరకాండములోని శ్లోకము. యజమాని ఆదేశించిన ప్రధాన కార్యమును ఒకదానినేగాక దానితో అనుబంధముగల ఇతర కార్యములనుగూడ ప్రధానాంశములకు భంగము కలుగని విధముగా ఎవడు సాధించునో అతడు ఉత్తమ కార్యకర్తయని పై శ్లోకమునకర్థము. సీతయొక్క జాడను ఎరిగిరమ్మని మాత్రమే శ్రీరాముడు హనుమంతునికిచ్చిన ఆదేశము. దానినిమాత్రమే తెలుసుకొనివచ్చినచో శత్రువుయొక్క బలముగాని, సైనికశక్తి మొదలగునవిగాని ఎట్టివో గమనించితివా అని శ్రీరాముడడిగినచో తాను లేదని సమాధానము చెప్పవలసి వచ్చును. అందులకై హనుమంతుడు అశోకవనమును విరచి, తనను బంధింపవచ్చినవారిని వధించి, కోటనూ, లంకానగరమును ధ్వంసముచేసి వారి బలము ఇంతటిది అని గుర్తించివచ్చి శ్రీరామునికి తెలియజెప్పినాడు కదా! మేమును అట్లే స్వామి కార్యమును సాధించు కింకరులము.

**(తిరువోణత్తిరువిழవిల్)** – అప్పజెప్పిన పనినిమాత్రమే చేసి కూర్చొనకుండా భగవంతుని జయంతీ ఉత్సవము మొదలగు వివిధ కార్యములలో స్వయముగా అన్వయించి సేవ చేయుదుము. **(పడుత్త పైన్నాకణై ప్పళ్ళికొణ్డానుక్కు ... ఇత్యాది)** ఉత్సవాది సమయములలోనేగాక **"అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చతే"** అని లక్ష్మణుడు చెప్పినట్లు మేల్కొనియున్నపుడునూ ఆదిశేషునిపై శయనించి యున్నపుడునూ ఆ దివ్యమంగళ విగ్రహమునకు దృష్టిదోషాదులు పడకుండునట్లు నిరంతరము మంగళాశాసనము చేయుచుందుము. శేషుడు తన శరీరమును విశాలము, ఉన్నతము అగు పడకగా మార్చుట ఒక అద్భుతము. దానిపై స్వామి శయనించినపుడు భగవత్ శరీర స్పర్శముచే కలిగిన ఆనందముతో పడగలు విప్పి శేషుడు తలలను ఊపుచుండును. ఈ శేషుదును పానుపులో వైశాల్యము, మార్దవము, సౌగంధ్యము, చల్లదనము, నునుపుదనము అను ఐదు గుణములున్నందున దీనిని "పంచశయనము" అందురు. దీనిపై నీలమేఘశ్యాముడైన భగవంతుడు శయనించి

యున్నపుడు దర్శింపదగిన మధురసన్నివేశ దృశ్యము మరీ అద్భుతము. ఆ దృశ్యము వెండికొండపై నీలమేఘము వ్రాలినట్లుండును. అట్లు శయనించి యోగనిద్రలో కన్నులను మూసుకొనియుండు భగవత్సౌందర్యమునకు నిరంతర మంగళమగుగాక!

h h

## పాశురము - 10

వెనుకటి పాశురమున తమయొక్క దేహయాత్రలోకూడా పారతంత్ర్య స్వరూపము కనబడునట్లు తమ విశిష్టతను చెప్పుకొని పరమభక్తులు వచ్చి మంగళా శాసనము చేసిరి. ఇకపై చెప్పబోవు ఇద్దరు భక్తులును స్వార్థమై కైవల్యమునో ఐశ్వర్యమునో అర్థించువారు గనుక ఉత్తమభక్తులవంటి భావశుద్ధి మొదట తమలో లేనందున ఎట్టి అతిశయమునుగూడ తాము చెప్పుకొనుటకు అవకాశము లేదు. ఇట్టి ఈ భక్తులిద్దరుకూడా భగవంతుని ప్రభావముచే ఇప్పుడు తమలో ఏర్పడిన భావశుద్ధి రూపమగు మార్పును చెప్పుకొని స్వామికి మంగళాశాసనము చేయు చున్నారు. వీరిలో ఐశ్వర్యార్థి వెనుకటి “నెయ్యిడై నల్లతోర్” అను పాశురమునందే “ఎన్నై వెళ్ళుయిరాక్కవల్ల” అని చెప్పుచూ తనలోగల క్షుద్ర లౌకిక ఫలాపేక్షను తొలగించి భగవత్సేవయే పరమార్థమను భావమును కలిగించి తనను భగవంతుడు పరమభక్తునిగా చేసినట్లు వెనుకనే చెప్పుకొనియున్నాడు. ఈ పాశురమున కైవల్యనిష్ఠులు తాము కోరిన ఆత్మానుభవమను అల్ప ఫలమునిచ్చి భగవదనుభవహీనమై శాశ్వతమగు ఆ కైవల్యమను అంధకార కూపములో తనను పడద్రోయకముందుగనే తనలోని ఆ క్షుద్రాపేక్షను తొలగించి మనస్సును మార్చి అంతరంగ దాసునిగా చేసుకొన్నాడుగదా అని ఆశ్చర్యముతో కృతజ్ఞత తెలుపుచూ ఈ పాశురమున మంగళాశాసనమును చేయుచున్నారు.

**మూలము :**

**ఎన్నాళ్ ఎమ్బెరుమానున్ఱనక్కడి యోమెన్ఱెళ్ళుత్తప్పట్ట**
**వన్నాళే యడియోజ్గళడిక్కుడిల్ వీడుపెత్తుయ్న్దతుకాణ్**
**శెన్నాళ్ తోత్తి త్తిరుమతురై యుళ్శిలై కునిత్తైన్దలైయ**
**పైన్నాకత్తలై ప్పాయ్న్దవనే యున్నై ప్పల్లాణ్డు కూఱుదుమే.**

**ప్రతిపదార్థము :**

| | |
|---|---|
| ఎమ్బెరుమాన్ | = ఓ మా స్వామీ! |
| ఉన్దనక్కు | = నీకు |
| అడియోమ్ ఎన్ఱు | = దాసులము అని |
| ఎడుత్తుప్పట్ట | = కాగితమును వ్రాసియిచ్చిన |
| ఎన్నాళ్ | = ఏ రోజు కలదో |
| అన్నాళే | = ఆ రోజుననే |
| అడియోంగళ్ | = మేము దాసులమైతిమి |
| కుడిల్ | = మా గృహములోనివారు కూడా |
| అడి | = దాసులై |
| వీడుపెత్తు | = కైవల్యాది ఫలితములను వదులుకొని |
| ఉయ్న్దతుకాణ్ | = ఉజ్జీవించిరి సుమా! |
| శెన్నాళ్తోత్తి | = ఉత్తమదివసమునందు అవతరించి |
| తిరుమతురైయుళ్ | = మధురానగరమునందు |
| శిలైకునిత్తు | = కంసుని ధనుస్సును విఱచి |
| ఐన్దలైయ | = ఐదు శిరస్సులుగల |
| పైన్నాకత్తలై | = పడగవిప్పిన కాళీయుని తలపైన |
| పాయ్న్దవనే | = దూకిన ఓ స్వామీ |
| ఉన్నైపల్లాణ్డు కూఱుతుమే | = నీకు మంగళాశాసనము చేయుదుము. |

**వివరణము :**

**(ఎన్నాళెమ్బెరుమాన్) –** ఏనాడు నీకు సేవకులముగా కాగితముపై వ్రాసి యిచ్చితిమో ఆ రోజు. ఇంతకుముందు ఇతరులవద్దయును నిరుపాధికశేషియగు భగవంతునివద్దనూ లౌకిక ఫలములను పొందుటకై ఆశ్రయించిన రోజులు ఎన్నో గడచిపోయినవి. అవి అన్నియూ వ్యర్థ దివసములే. అక్రూరుడు భగవద్దర్శన దివసమును **"సుప్రభాతా చ మే నిశా"** అని కొనియాడినట్లు నేడు కదా మేము నీ సన్నిధిలో ఉత్తమభక్తులముగా మారి మంగళాశాసనము చేయగలిగితిమి అని కైవల్యార్థు లిపుడు తామాశ్రయించిన దివసమును ఘనముగా కీర్తించుచున్నారు. భగవత్ప్రభావ

మునుబట్టి ఆయనకు దాసులైన దివసముగూడ ప్రశంసనీయమగుట సహజమే. రామకృష్ణాద్యవతారములను గురించి కీర్తించునపుడు తజ్జన్మదివసములైన శ్రీరామ జయంతి, శ్రీకృష్ణజయంతి మొదలైన దివసములలో ఉత్సవములను జరుపుకొనుట లోకప్రసిద్ధమే గదా! మేము అల్పములైన కైవల్యాదులనపేక్షించి వచ్చిననూ నీవు మా క్షేమమునుగోరు స్వామివి గనుక మా స్వరూపమనదగిన శేషత్వమునకు పర్యవసానముగా నిరంతర కైంకర్యఫలమే మాకు లభించినదిఅని ఎమ్బెరుమాన్ అను పదము సూచించుచున్నది. భగవంతుడు మనకు సహజముగా స్వామియేయైననూ ఆయననాశ్రయించిన మనలో ఫలమును పొందుటకు ఏదైన అర్హత ఉండవద్దా? ఆ యోగ్యత లేనిచో ఫలమెట్లు సిద్ధించును? అను ఆక్షేపమునకు సమాధానముగా **"ఉన్తనక్కడియో మెన్టెழுత్తుప్పట్ట"** అను వాక్యము చెప్పబడినది. "ఎழுత్తు" అనగా అక్షరము. నీ దాసులము అని కాగితముపై అక్షరములను వ్రాసి యిచ్చుట అని యర్థము. నిజముగా అట్లు ప్రమాణ పత్రమును వ్రాసి ఇవ్వకపోయిననూ భగవద్దాస్య వాచకమైన పదమును నోరార ఉచ్చరించుటయే ఇచట ప్రమాణముగా భావింప వచ్చును. మనస్సులో నిజమగు ప్రేమ లేకున్ననూ నోటితో నీ నామమునుచ్చరించి నంత మాత్రమున అనుగ్రహించు మహోదారుడవు నీవని **"హరిః హరతి పాపాని దుష్టచిత్తైరపి స్మృతః"** అను హర్యష్టక శ్లోకమే తెలుపుచున్నదిగదా!

అయితే ఈ కైవల్యపురుషార్థులు భగవద్దాస్యబోధకమైన అట్టి పదము నుచ్చరించిరా యని అడుగవచ్చును. భగవద్గీతలోని **"ఓమిత్యేకాక్షరం బ్రహ్మ వ్యాహరన్ మామనుస్మరన్"** అను శ్లోకమునుబట్టి వారుకూడ ప్రణవమును నిత్యము అనుసంధించుచున్నట్లు చెప్పియున్నందున అదియే ఇచట సమాధానము. ఓంకారము లోని విడదీసిన (అ-ఉ-మ) అను మూడక్షరములనుబట్టి ఇతడు భగవంతునికి దాసుడను అర్థము స్పష్టమగుచున్నది. లేక, లోకమున ఎవడో ఒకనివద్ద ఏదైన వస్తువును యాచించినపుడు మొదట అతనికి నమస్కారము చేయుట సహజమే కదా! అట్లే ఈ కైవల్యార్థి కూడ భగవంతునియొద్ద కనీసము నమశ్శబ్దమును ప్రయోగించి యుండకపోడు. ఆ నమశ్శబ్దము నేను నీ దాసుడను అని తెలుపుటకు సరిపోవును గదా! భగవంతుడు తననాశ్రయించు వ్యక్తుల నోటినుండి ఈ నమశ్శబ్దము వచ్చిననూ ఎంతో గొప్పగా భావించునని **"తే భూయిష్ఠాం నమ ఉక్తిం విధేమ"** అను మంత్ర వాక్యము చెప్పుచున్నది. అహంకారగ్రస్తులైన మానవుల హృదయములో దాస్యబుద్ధి

ఏర్పడుట అతి దుర్లభమైనట్లే, ఎన్నో వ్యర్థ ప్రసంగములను చేయుచుండు వారి నోటితో ఈ నమశ్శబ్దము ఉచ్చరింపబడుట అలభ్యలాభమని భగవంతుడు తలంచును. వాచికమగు ఈ నామోచ్చారణము తప్ప మా వద్ద మరియే అధికారముగూడ లేదని **"ఎఴుత్తుప్పట్టవన్నాళే"** అను నిర్ధారణ వాక్యముచే సూచింపబడుచున్నది.

**(అడియోజ్గళడిక్కుడిల్‌వీడు పెత్తుయ్‌న్దతుకాణ్)** – మేము చేసిన సాధనానుష్ఠానము నామోచ్చారణమాత్రమేగాని లభించిన ఫలము మాకు చాలా గొప్పది. అది ఒకటి కాదు, పలు విధములైనది. **(అడియోజ్గళ్)** ఉత్తమ భక్తులమైతిమి. **(అడిక్కుడిల్)** మా గుడిసెలో అనగా కుటుంబములో అందరము దాసులమైతిమి. **(వీడుపెత్తు)** కైవల్యాది క్షుద్ర ఫలితములను విడువగలిగితిమి. **(ఉయ్‌న్దతుకాణ్)** ఉజ్జీవనమగు నీ కైంకర్యమును పొందితిమి. ఇన్ని ఫలితములు మాకు లభించినవి. దురహంకార దూషితమైన మనస్సులో స్వస్వాతంత్ర్యభ్రమము పోయి నీ దాస్యమునే ఫలముగా భావించుట ఒక ఫలము. ఇంటిలోనుండు పుత్రపౌత్రాది సమస్త బంధువర్గము ఇట్టి మార్పును పొందుట రెండవ ఫలము. గృహస్థుడు భక్తుడైననూ అతని దారపుత్రాదులు అనుకూలురు కాకుండుట ఒక పాపఫలమే. అట్టి వ్యతిరేక స్థితికూడ మాకు తొలగిపోయినది. నామోచ్చారణము చేసినది ఒకడే ఐనపుడు అతనికి చెందిన వారందరునూ ఉజ్జీవించుట ఎట్లు కుదురును అను సందేహము కలుగ వచ్చును. ముత్యములు లభించు రేవును వశము చేసుకొన్న వ్యాపారస్థుడు దాని చుట్టుప్రక్కల ప్రాంతములనుకూడ తన వశములోనికి తెచ్చుకొన్నట్లు భగవంతుడుగూడ ఒక వ్యక్తిననుగ్రహింపబోవుచు అతని కుటుంబమునంతయు తన దాసులుగా మార్చి స్వీకరించుటలో తప్పులేదుగదా! 'కుడిల్' అను పదము గుడిసె అను అర్థము నిచ్చును. దాసుడైన వ్యక్తి గొప్ప ఐశ్వర్యాదులు కలవాడైననూ వినయముతో భగవంతుని ఎదుట గాని పూజ్యులగు ఆచార్యుదుల ఎదుటగాని తన భవనమును గుడిసెగా చెప్పుకొనుట అతని భక్తిభావనకు నిదర్శనము. **(వీడుపెత్తు)** ఉన్నతమగు ఫలమును పొందుట ఎంత ముఖ్యమో అంతకుముందు కోరిన క్షుద్రఫలితములపై త్యాగబుద్ధి కలుగుటకూడా అంత ముఖ్యమే. అవి అన్నియూ భగవత్ప్రాప్తికి ప్రతిబంధకములే కదా! **"అవిద్యయా మృత్యుం తీర్త్వా – విద్యయా అమృతమశ్నుతే"** అని ఉపనిషత్తులో చెప్పబడినట్లు విరోధి స్వరూపమును త్యజించుటతోపాటు భగవత్సేవను లభించుటయే సమగ్రమగు ఫలము అని భావము. **(ఉయ్‌న్దతుకాణ్)** మేము ఉజ్జీవించగలిగితిమి సుమా! నీ

దాస్యమే మా స్వరూపమునకు తగిన ఉజ్జీవనము. **(కాణ్)** సుమా! అని తెలియని వారికి చెప్పినట్లు ప్రయోగించుటలో రహస్యమేమనగా - ఉపకారకుడవగు నీకు మరచిపోవుట స్వభావము కావచ్చును కాని మేము మాత్రము నీవు చేసిన ఉపకారమును ఎన్నటికిని మరువజాలమని యీ పదముతో గుర్తుచేయుచున్నారు.

**(శెన్నాళ్ తోత్తిత్తిరుమతురైయుళ్ ....)** - ఒకానొక శుభదివసమున మధురలో దివ్యాయుధములతోను, చతుర్భుజములతోను ఆవిర్భవించి దేవకీ వసుదేవులకు సాక్షాత్కారమునిచ్చి ఆ నగరమును విడిచిపోయి బాల్యమంతయూ వ్రేపల్లెలో గడిపి, కపట బుద్ధితో కంసుడు పంపిన ఆహ్వానముచే తిరిగి మధురకు వచ్చి అతడు చేసిన ధనుర్యాగమున అతనికి రోషము వచ్చునట్లు ధనుర్భంగమును చేసితివి. అంతేగాక చివరకతనినే వధించితివి.

**(ఐన్దలైయ పైన్నాకత్తలై ప్పాయ్న్దవనే యున్నైప్పల్లాణ్డుకూఱుతుమే)**-బాల్యమున వ్రేపల్లెలో కృష్ణుడు ధూర్తుడుగా చేసిన ప్రమాదకరమగు సాహస వ్యాపారమొకటి కలదు. అది కాళియమర్దనము. బలరాముడు దగ్గరలేని సమయము చూచి కాళింగుడు అను విషసర్పముగల మడుగులో కృష్ణుడు దూకెను. రోషావేశముతో ఆ విషసర్పము ఐదు పడగలను విప్పి విషమును గ్రక్కుచుండగా దాని పడగలపై నాట్యమాడి పాదాఘాతముతో దానిగర్వమునణచెను. ఈ సన్నివేశమును తలంచుకొనుచున్న భక్తులు బాలకృష్ణునికి మహాప్రమాదము తప్పిపోయినట్లు భావింతురు. అట్టి స్థితి స్వామికి పునరావృతము కాకుండవలెనని భక్త్యావేశముతో మేము నిరంతరము మంగళాశాసనమును చేయుదుము.

ఇచట ఒక చిన్న ఇతిహాసము - తమ ఆచార్యులైన శ్రీ పరాశర భట్టరువారి సన్నిధిలో నంజీయర్ అను శిష్యులు ఒక ప్రశ్నను అడిగిరి. ఆళ్వారులందరునూ కృష్ణావతార కథలపై ఎంతో ప్రేమను చూపుచూ మంగళాశాసనము చేయుదురుగదా! రామావతారముపై వారు అంతగా అభిమానమును చూపలేదేమి?

ఈ ప్రశ్నకు భట్టరువారు ఇట్లు సమాధానమిచ్చిరి. రామావతారములో ఆ నలుగురు బాలురును పరాక్రమ సంపన్నులు. సద్గుణశీలురు. కనుక వారికి ఏ ఆపదలును కలుగవు. పైగా వారి తండ్రియగు దశరథుడు శంబరాసురుని వధించిన మహావీరుడు. మంత్రవేత్తలైన వశిష్ఠాదులు పురోహితులు. కోటలతో నొప్పు అయోధ్యా

నగరమున శత్రువులకెవరికినీ ప్రవేశింపనలవి కాదు. వారవతరించిన కాలముగూడ ధర్మపరిపూర్ణమైన త్రేతాయుగము. కనుక రామావతారమున స్వామికి అపాయము కలుగునేమోయని భయపడవలసిన అవసరముగాని, అందులకై మంగళాశాసనము చేయు అవసరముగాని ఈ ఆళ్వారులకు కలుగలేదు. ఇక కృష్ణావతారమట్లుగాక అవతరించినది శత్రువగు కంసుని గృహమునందు, అవకాశమును చూచి ఎందరో క్రూర రాక్షసులను కృష్ణుని వధకై పంపిన పాపాత్ముడు ఆ కంసుడు. తండ్రియగు నందుడు వెర్రి గొల్లవాడు. పెరిగిన ఊరు వ్రేపల్లె. ఇక ఈ బలరామకృష్ణులిద్దరునూ అల్లరి చేయు ధూర్తులే కాని సాధుస్వభావము కలవారు కారు. ఇక వారవతరించిన జీవించిన కాలముకూడ ద్వాపరాంతము. అనగా కలియుగమునకు అతి సమీపమై అధర్మభూయిష్ఠమైనది. ఇన్ని కారణములచే కృష్ణస్వామికి ఎన్నో అపాయములను శంకించి అతిప్రేమతో ఈ ఆళ్వారులందరునూ నిరంతరము మంగళాశాసనము చేయుటలో దోషము లేదుగదా! ఇది ఆళ్వారులకు కృష్ణునిపైగల భక్తియొక్క పరాకాష్ఠను సూచించును. ప్రమాదకరమగు ఆ సన్నివేశములను తలంచుకొనుచున్నపుడు మంగళాశాసనములు చేయుట తప్ప వీరు చేయగలిగినది మరేమియు లేదుగదా!

h h

## పాశురము - 11

ఐశ్వర్యార్థులైన భక్తులుగూడ వచ్చి ఇపుడు మంగళాశాసనము చేయు చున్నారు. వెనుక నెయ్యిడై అను పాశురమునందు అఘటిత ఘటనా సమర్థుడగు భగవంతుడే తన ప్రభావముచే తమను పరిశుద్ధ స్వభావులుగా చేసినట్లు "వెళ్ళు యిరాక్క వల్ల" అను పదముచేత వీరు తెలిపియున్నారు.

**మూలము :**

**అల్వఴక్కొన్ఱు మిల్లా వణి కోట్టియర్ కోనపిమాన తుఙ్గన్**
**శెల్వనై ప్పోల త్తిరుమాలే నానుమునక్కు ప్పఴవడియేన్**
**నల్ వకైయాల్ నమో నారాయణావెన్ఱు నామమ్ పల పరవి**
**ప్పల్ వకై యాలుమ్ పవిత్తిరనే యున్నై ప్పల్లాణ్డు కూఱువనే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పల్ వకై యాలుమ్ | = | అన్నివిధములకూడ |
| పవిత్తిరనే | = | పరిశుద్ధ స్వభావము గలవాడా |
| తిరుమాలే | = | లక్ష్మీపతివగు ఓ స్వామీ! |
| అల్వழక్కు | = | దుష్టమగు స్వభావములు |
| ఒన్రుమిల్లా | = | ఏమియు లేనటువంటి |
| అణికోట్టియర్ | = | శ్రేష్ఠమగు తిరుక్కోట్టియూరునందుగల భాగవతులకు |
| కోన్ | = | అధిపతియైనవాడును |
| అపిమానతుఙ్గన్ | = | గొప్ప వైష్ణవాభిమానము గలవాడును  అగు |
| శెల్వనైప్పోల | = | శెల్వనంబివలె |
| నానుమ్ | = | నేనుకూడా |
| ఉనక్కు పழవడియేన్ | = | నీకు చిరకాలముగ దాసుడనే |
| నల్వకైయాల్ | = | అర్థజ్ఞానపూర్వకముగా (మంచిరీతిలో) |
| నమో నారాయణావెన్రు | = | అష్టాక్షరి మంత్రములోని నారాయణనామమును చెప్పి |
| పలనామమ్ పరవి | = | ఇతర భగవన్నామములనుగూడ చెప్పి |
| ఉన్నై పల్లాణ్డు కూఱువనే | = | నీకు మంగళాశాసనము చేయుదును. |

**వివరణము :**

వழక్కు అనగా ఉచితమగు స్వభావము. అల్వழక్కు అనుటచేత అట్లు ఉచితములు (యోగ్యములు) కానివి అనేక దుష్టస్వభావములుండవచ్చును. అవి ఏవనగా దేహమును ఆత్మగా భావించుట ఉచితము కాదు. జడమైన ప్రకృతికంటె (జ్ఞానము కలవాడగుటచే) భిన్నుడైన ఆత్మను స్వతంత్రుడని భావించుట ఉచితము కాదు. అతడు పరమాత్మకు పరతంత్రుడే. మరియు దేవతాంతరములను పరమాత్మగా భావించుట ఉచితము కాదు. భగవద్భక్తికి ప్రయోజనముగా క్షుద్రఫలములను అపేక్షించుట ఉచితము కాదు. భగవత్సేవనే పరమార్థముగా భావించి ననూ అది ఉపాయాంతరములచేత సాధించవచ్చుననుకొనుట ఉచితము కాదు. భగవద్విభూతిలోని ఏ పదార్థమునందుగూడ ఇది నాదియని మమకారమును చూపుట ఉచితము కాదు. ఇట్లు ఎన్నో అనుచితములైన వ్యవహారములు లోకమున ఉన్నవి.

"ఒన్టుమిల్లా" అట్టి దుస్వభావములు ఏవియు లేనివారు తిరుక్కోట్టియూరులో నుండు భాగవతులు అని యర్థము. పైవన్నియు దుష్టస్వభావములే అయినపుడు ప్రపన్నునిలో ఉండవలసిన మంచి స్వభావమేది? అనగా – స్వామికి నిత్యదాసుడై మంగళాశాసనము చేయుటయే ఉత్తమ స్వభావమని గ్రహింపదగును. శ్రేష్ఠమగు కోట్టియూరులోనుండు అట్టి ఉత్తమస్వభావముగల భక్తాగ్రేసరులందరికినీ శెల్వనంబి అను పరమభాగవతుడు ఉత్తమ నాయకుడు.

**(అపిమానతుఙ్గన్ శెల్వనైప్పోల)** – అతడు నేను శ్రీవైష్ణవుడను అని తన స్వరూపమును అభిమానముతో చెప్పుకొనువాడు. నేనింతటివాడను – అంతటివాడను అని గర్వముతో చెప్పుకొనుట భక్తులకు తగునా అని ప్రశ్నింపరాదు. ఇది కర్మ సంబంధమునుబట్టి క్షుద్రైశ్వర్యాదులవలన కలిగిన అహంకారము కాదు. **"దాసోహం కోసలేంద్రస్య"** అని హనుమంతుడు చెప్పుకొన్నట్లు నేను భగవద్దాసుడను అని చెప్పుకొనుట ఉచితమే కాని దోషము కాజాలదు. ఈ కుటుంబము నాది అని గృహస్థుడు ఆత్మీయులను గూర్చి తన గృహారామక్షేత్రాదులనుగూర్చి వాటి మంచిచెడ్డలు తనవిగా అభిమానించినట్లు ఈ శెల్వనంబియును గొప్ప ధనికుడగు భక్తుడుగనుక తిరుక్కోట్టియూరు ప్రాంతములోని భగవదాలయములలో గల మంచి చెడ్డలను లాభనష్టములను మరియు అచటి శ్రీవైష్ణవులకు చెందిన నిత్య జీవిత విధానములోగల మంచి చెడ్డలనుగూడ తనవిగా అభిమానించి సరిదిద్దుకొనగల ఉత్తమస్వభావము కలవాడు అని దీని భావము. ఇతనికి శెల్వన్ అనియే నామధేయము. గొప్ప సంపన్నుడు అని దీనియర్థము. ఇంతనికంటె అధికమైన ఐశ్వర్యాదులు కలవారు ఎంతోమంది ఉండవచ్చు. కాని, తన భక్తి స్వరూపమునకు తగినట్లుగా ఉన్న ఐశ్వర్యమును భగవత్ భాగవత సేవకే ఉపయోగించు స్వభావము ఇతనిలోనే ఉన్నందున ఈయనకు ఆ పేరు తగియున్నది. ఉత్తమభక్తునికి జ్ఞాన భక్తి వైరాగ్యములే సంపదలు గనుక అవి పూర్తిగా కలిగియున్నపుడు అతనిని శ్రీమాన్ అని వ్యవహరింప వచ్చును. ఇట్టి యోగ్యత కలవాడు గనుకనే లక్ష్మణుడు రాజ్యసంపదలను వదలి రామసేవకై **"అహం సర్వం కరిష్యామి"** అని ఉత్సాహముతో వనమునకు వెళ్ళుచున్నందున వాల్మీకి అతనిని **"లక్ష్మణః లక్ష్మీసంపన్నః"** అని ప్రశంసించినాడు.

ఇట్లు ఈ ఆళ్వారులు ఆ శెల్వనంబిని ఉత్తమ భక్తునిగా ప్రశంసించి అతనివలె నేనునూ నీకు చిరకాలము నుండి దాసుడనే అని చెప్పుకొనుచున్నారు. ఇతడు వల్లభదేవుడు అను పాండ్యరాజువద్ద పురోహితుడై ఉన్నాడనియూ, అతడు చెప్పిన ఉపదేశమునుబట్టియే ఆ మహారాజు ఈ పెరియాళ్వారులను సభకు పిలిపించి పరతత్త్వనిర్ణయము చేయించి భగవద్దాసుడైనాడనియు వెనుక ఉపోద్ఘాతములో చెప్పుకొని యున్నాము. **"ఉపమానమశేషాణాం సాధూనాం యః సదా భవత్"** అని విష్ణు పురాణమునందు శ్రీ పరాశరులవారు ప్రహ్లాదుడు భక్తులందరకునూ ఉపమాన ముగా చెప్పబడిన మహనీయుడు అని ప్రశంసించినట్లు ఈ శెల్వనంబి కూడ ఆ కాలమున అందరిచే మెచ్చుకొనదగిన ఉత్తమభక్తుడని భావము. ఈ పాశురమునందు ఐశ్వర్యార్థియగు భక్తుడు ముఖ్యవక్త ఐననూ, "పழవడియేన్" పాతకాలమునుండియు నీకు దాసుడనే అని చెప్పుకొనుట అనుచితమేమోననిపించవచ్చునుగాని, ఇపుడు ఆ ఐశ్వర్య అపేక్ష తొలగిపోయి సహజదాస్యమును భావించి పరిశుద్ధ మనస్కుడుగా భగవదనుగ్రహముచే మారిపోయినందున తన నిజస్వరూపము అప్పుడు ఇప్పుడు కూడ ఇట్టిదేనని చెప్పుకొనుటలో తప్పు లేదు.

(తిరుమాలే) – శ్రియఃపతివగు ఓ స్వామీ! అను ఈ పదముచేత ఆ దివ్య దంపతులకిద్దరకును తాను నిత్యదాసుడను అని సూచింపబడుచున్నది. ఆయా జన్మలలో ఏర్పడిన తల్లిదండ్రులుగాని దేవతాంతరములుగాని కర్మసంబంధమును బట్టి తాత్కాలికముగా పూజ్యులు మాత్రమేగాని లక్ష్మీనారాయణులవలె నిత్య స్వాభావికముగా పూజ్యులైన స్వాములు కారు అని భావము. (నానుమునక్కు ప్పழవడియేన్) అనుటలో ఒక విశేషమున్నది. ఇంతవరకును నేను నీకు సహజ దాసుడననియు నీవు నిరుపాధిక స్వామివనియూ గుర్తించక నీవలన క్షుద్ర ఐశ్వర్యాది ఫలితములను కోరుకొంటిని. ఇది నేను చేసిన తప్పు. పతివ్రతయగు భార్య అతనికి సుఖమునిచ్చి అతనివద్ద ధనమును కోరి తీసుకొనుట ఎట్లు వ్యభిచార దోషముక్రింద పరిగణింపబడునో, నీకు సహజ సేవను చేయవలసిన నేను ఫలాంతరములనపేక్షించుటగూడ అట్టి దోషమే గదా! మన ఇద్దరకునుగల శేషశేషి భావ సంబంధము స్థిరమైనది అని పూర్వము గుర్తించలేకపోయితిని. ఇపుడు నీవే నాకు అట్టి సద్భావమును కలిగించి నన్ను ఉత్తమదాసునిగ మార్చుకొంటివి.

**(నల్వకైయాల్ నమో నారాయణావెన్ను) –** నాకిప్పుడు ఇట్టి స్వరూప జ్ఞానోదయము అగుటకు కారణమైనది అష్టాక్షరీ మహామంత్రమే. ఇది సకల ఉపనిషత్సారభూతమైనది. ఇది జీవునిలో అనన్యార్హ శేషత్వము, అనన్యశరణత్వము, అనన్య భోగ్యత్వము అను మూడు స్వభావములను గుర్తింపజేయును.

**1. అనన్యార్హ శేషత్వమనగా,** నేను భగవంతునికి తప్ప ఇతరులకు దాసుడను కాజాలను. ఆయనకే పరతంత్రుడను. నాకు నేను స్వతంత్రుడను కాను అను దృఢ నిశ్చయమును ఈ మంత్రము బోధించును. ఈ మహామంత్రోపదేశమును పొందిగూడ దేవతాంతరములనాశ్రయించి, వారికిగూడ తమను దాసులుగా భావించుట అత్యంతము అనుచితము. శ్రీకృష్ణబ్రహ్మతంత్ర పరకాలస్వాములవారు తమ అలంకార మణిహారము అను గ్రంథమున చెప్పిన ఒక శ్లోకము ఇచట గమనింప దగినది.

**శ్లో॥ త్వయి సర్వే వ్యుపచారాః వంధ్యాః స్యుః దేవతాంతరాసంగే ।**
**ఏకస్మిన్ స్వైరత్వే నాథ! సహస్రం వ్రతాని నశ్యంతి ॥**

ఓ శ్రీనివాసా! నీ సన్నిధిలో పలువిధములైన సేవలనుచేసి కూడా ఏదో ఒక ఫలితమునకై దేవతాంతరములకు సేవను చేసినచో నీపై ఇంతవరకు నేను చూపిన కైంకర్యభావనలు అన్నియూ వ్యర్థములే అనదగును. ఎన్నో నోములు నోచిన పతివ్రత ఒక్క రంకుతనము అను దోషమును చేసినచో ఈ నోములన్నియు వ్యర్థములైపోయినట్లే గదా! అని ఇచట దృష్టాంతము. కనుక అష్టాక్షరీ మంత్రముతో అనన్యార్హ శేషత్వమును గుర్తించిన పిదప దేవతాంతరాశ్రయణము అత్యంతానుచితము అని భావము.

**2. అనన్యశరణత్వము :** భగవంతుడే తప్ప ఇతరులెవ్వరునూ రక్షకులు కారనియు, తనకు తాను రక్షకుడు కాదనియూ దృఢాధ్యవసాయము కలిగియుండ వలెను. అష్టాక్షరీ మంత్రనిష్ఠునికి ఈ అధ్యవసాయము ఎన్నటికీ సడలిపోకూడదు.

**3. అనన్యభోగ్యత్వము :** భగవత్సన్నిధిలో తాను చేయు కైంకర్యములే తన స్వరూపమునకు ముఖ్యమగు ఫలములు కాని ఇతర ఫలములను అపేక్షింపరాదు. యావదాత్మ భావిగా తనకు అభీష్టమైన (భోగ్యమైన) ఫలము నిత్యకైంకర్యలాభమే.

కనుకనే తాను ఏ కైంకర్యము చేసిననూ భగవత్ ప్రీత్యర్థం అను సంకల్పమును చెప్పి తన సేవచే భగవంతుని ముఖమునందు కలుగు అనుగ్రహపూర్వక ముఖ వికాసమునే తనకు ఫలముగా భావించవలెను. ఆ సేవచే తనకేదో ఫలితమును ఎన్నడునూ అపేక్షింపరాదు. ఈ మూడు విధములైన పరమార్థములను బోధించు అష్టాక్షరీ మంత్రమును నేనిప్పుడు అర్థభావనతో అనుసంధించుకొనుచున్నాను. అంతేగాక నీ అనంత కల్యాణగుణములను తెలుపు సహస్రనామములనుగూడ నిత్యము అను సంధించుకొందును. పూర్వము నేను ఐశ్వర్యమునకై 'అండాధిపతయే నమః' అనియో శత్రువినాశమునకై 'అమరశత్రవే నమః' అనియో ఒకటి రెండు నామములను ఫలాపేక్షతో ఉచ్చరించియుంటిని. ఇకపైన అట్టి పొరపాటును చేయక నిరంతరము నీ నామానుసంధానమును మంగళాశాసనమును చేయుచునే జీవితము గడుపుదును.

**(పల్ వకై యాలుమ్ పవిత్తిరనే)** – నీవు సర్వవిధములుగా పరిశుద్ధ స్వరూపుడవు. అంతేగాక మాలోనుండు అపవిత్రతలనుగూడ తొలగించగల సమర్థుడవు. అహంకార మమకార దోషములను తొలగించుట క్షుద్ర ఫలములపైకి మనస్సును పోనీయకుండుట. దేవతాంతర శేషత్వ భావనను తొలగించుట ఇవన్నియూ నాకు కలిగించిన పవిత్ర స్వరూపుడవు గదా!

**(పల్లాణ్డు కూఱువనే)** – దివ్య సౌందర్య శోభితుడవైన నీకు మంగళమును చెప్పుదును. కూఱువనే అను ఈ ఏకవచనము ఐశ్వర్యార్థియొక్క భావనతో ఈ విష్ణుచిత్తులొక్కరే చెప్పుచున్నారు గనుక సమంజసమే అనవచ్చును. లేక జాత్యేక వచనము అని చెప్పవచ్చును. ఈ విషయమును "నెయ్యిడ" అను వెనుకటి పాశురము వద్ద చివరకు వివరించియున్నాము.

h h

## పాశురము - 12

ఈ చివరి పన్నెండవ పాశురమున ఈ గ్రంథమును అధ్యయనము చేసిన వారికి కలుగు ఫలితములు చెప్పుచూ సంతోషపూర్వకముగ అనుసంధించువారికిగూడ మంగళాశాసనము చేయుచున్నారు.

ఇంతవరకును తమవలె ఉత్తమభక్తులైన కైంకర్యనిష్ఠులను మొదట పిలచిరి. పిదప ఐశ్వర్య కైవలనిష్ఠులనుగూడ వచ్చి మా గోష్ఠిలో చేరుడు అని పిలచిరి. కాని భగవత్స్వరూపమునుగాని తమ స్వరూపమునుగాని అసలే ఎరుగని పామరులగు సంసారులను అసలే పిలువలేదే. మరి వారు ఉజ్జీవించుటకు అవకాశమే లేదా! అని కొందరికి సందేహము కలుగవచ్చును. అట్టివారికి ఈ చివరి పాశురము సమాధానము నిచ్చుచున్నది. ఇంతకు పూర్వము భగవంతునిపై ఆభిముఖ్యమే లేని నిత్య సంసారులైనవారుకూడా ఎవరైననూ ఈ ప్రబంధమును అర్థ జ్ఞాన పూర్వకముగా అనుసంధించినచో వారుగూడ భగవత్సన్నిధిలో చేరి స్వామియొక్క దివ్య అనుగ్రహము నకు పాత్రులు కాగలరని ఇందు చెప్పబడుచున్నది.

**మూలము :**

**పల్లాణ్డెన్రు పవిత్తిరనై ప్పరమేట్టియై చ్చార్ఙ్గ మెన్నుమ్**
**విల్లాణ్డాన్ఱన్నై విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్ విరుమ్బియశొల్**
**నల్లాణ్డెన్రు నవిన్రురైప్పార్ నమోనారాయణాయవెన్రు**
**పల్లాణ్డుమ్ పరమాత్మనై చ్చూழ్న్దిరున్దేత్తువర్ పల్లాణ్డే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పవిత్తిరనై | = | పరమపావనుడును |
| పరమేట్టియై | = | పరమపదమందు నివసించువాడును |
| శార్ఙ్గమెన్నుమ్ విల్ | = | శార్ఙ్గము అను ధనుస్సును |
| ఆణ్డాన్ఱన్నై | = | ధరించినవాడును అగు పరమాత్మను గురించి |
| విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్ | = | విల్లిపుత్తూరునందుండు పెరియాళ్వారులు |
| పల్లాణ్డెన్రు | = | నిరంతరము మంగళమగుగాక యని |
| విరుమ్బియ శోల్ | = | ప్రేమతో రచించిన ఈ గ్రంథమును |
| నల్లాణ్డెన్రు | = | నేడు మంచి దివసము అని ఎంచి |
| నవిన్రురైప్పార్ | = | నేర్చుకొని అనుసంధించువారు |
| నమో నారాయణాయవెన్రు | = | అష్టాక్షరీ మహామంత్రమును ఉచ్చరించుచు |
| పల్ ఆణ్డుమ్ | = | అనేక సంవత్సరములు |

| | | |
|---|---|---|
| పరమాత్మనై | = | భగవంతునికి |
| శూழ్న్దిరున్దు | = | చుట్టునూ చేరి |
| పల్లాణ్డు ఏత్తువర్ | = | మంగళాశాసనము చేయగలరు. |

**వివరణము :**

**(పవిత్తిరనై) –** సహజమగు పరిశుద్ధ స్వభావము కలవాడు. లోకమున కొన్ని వస్తువులకు అగ్ని, జలము మొదలగు అన్యపదార్థములచేత పవిత్రతను కలిగించవలసి యుండును. ఇతరములను పవిత్రము చేయు అగ్ని జలాది వస్తువులకు కూడా అట్టి శక్తి స్వతః లేదు. భగవంతుడే కలిగించినాడు గాని సహజముగ వాటికి ఆ పవిత్రత లేదు. **'పవిత్రాణాం పవిత్రం'** అనిన్నీ, **'మంగళానాం మంగళం'** అనియూ భగవంతునిగూర్చి చెప్పుటలో ఇదే భావము ఇమిడియున్నది. కనుకనే వేదముగూడా **'శాశ్వతం శివం అచ్యుతం'** అని చెప్పుచున్నది. ఈయన శాశ్వతముగా పవిత్రుడు అని యర్థము. అపవిత్రములగు పదార్థములయొక్క సంబంధము ఆయనకు కలిగిననూ వాటి దోషములు ఆయనకు అంటవు అనియూ పైగా తన సంస్పర్శముచే ఇతర వస్తువులనుగూడ పరిశుద్ధములుగా చేయునట్టి పరమపావనుడు ఆయన అనియూ దీని తాత్పర్యము. ఇచట భాగవతములోని ఈ క్రింది శ్లోకము గుర్తింప వలయును.

**శ్లో॥ యచ్ఛౌచ నిస్సృత సరిత్ప్రవరోదకేన**
**తీర్థేన మూర్ధ్ని అధిగతేన శివ శ్శివో భూత్.... ఇత్యాది**

భగవంతుడు పాదములను వామనావతారమున పైకి చాచగా సత్యలోకమున నుండు చతుర్ముఖబ్రహ్మ అత్యాదరముతో తన కమండలములోని జలముతో అభిషేకమును చేసినాడు. ఆ భగవత్పాద స్పర్శముచే పవిత్రమైన జలమే గంగానదిగా భూమికి ప్రవహించినది. దానిని శిరస్సునదాల్చి శివుడు పవిత్రుడైనాడు అని పై శ్లోకమునకు భావము. దీనినిబట్టి శివుని పవిత్రునిగా చేసిన గంగాజలమునకుగూడ పవిత్రతను కలిగించినది భగవంతుని శ్రీపాద సంబంధము అని తేలినది.

**(పరమేట్టియై) –** అట్టి పరమాత్మ స్థిరముగా నివసించు స్థానము పరమ పదము అనబడు శ్రీవైకుంఠము. **"వనమాలీ గదీ శార్ఙ్గీ శంఖీ చక్రీచ నన్దకీ"** అని సహస్రనామములలో చెప్పబడినట్లు శంఖచక్రములవలె శార్ఙ్గము కౌమోదకి

నందకము అను ఆయుధములు గూడ భగవంతుని స్వరూపమునకు నిరూపకములే. ఇచట శార్ఙ్గమను ధనుస్సును మాత్రము ధరించియున్నట్లు చెప్పబడిననూ శంఖ చక్రాది పంచాయుధ ధారణము కలిగియున్నట్లు గ్రహింపవచ్చును.

**(విల్లిపుత్తూర్ విట్టుశిత్తన్) –** పాండ్యరాజుయొక్క సభలో పరత్వమును స్థాపించి గొప్ప సన్మానమును పొంది ఏనుగుపై ఊరేగుచు వచ్చుచున్న విష్ణుచిత్తులు, ఆకాశవీధిలో ప్రేమతో తమకు దర్శనమిచ్చిన గరుడవాహనారూఢులగు లక్ష్మీ నారాయణులకు మంగళాశాసనమును చేయుచున్న ఈ సందర్భమున మూడు విధములగు భక్తులను తమతోపాటు మంగళాశాసనమునకై రమ్మని పిలచుటయూ, అదే విధముగా వారు వచ్చినట్లు భావించి వారితోపాటు తామూ మంగళాశాసనము చేయుటయూ జరిగినది. వాస్తవమునకు వారెవ్వరునూ వచ్చియుండకున్ననూ ఆ భావనతో వారి మాటలుగా వీరే ఆయా పాశురములను చెప్పినట్లు గ్రహింపవచ్చును. ప్రయోజనాంతరపరులుకూడ భగవంతునికి మంగళాశాసనము చేయుటకు అర్హత కలదు అని లోకమునకు తెలుపుటయే ఇందలి ప్రధానోద్దేశ్యము. వీరవతరించినది పవిత్రమగు విల్లిపుత్తూర్ అను క్షేత్రమున. అచట వేంచేసియుండు వటపత్రశాయి వీరికి ఆరాధ్యదైవము. భక్తి అనబడు ప్రేమపాశముచే శ్రీమహావిష్ణువు వీరి చిత్తమందు కట్టుబడి స్థిరనివాసము చేయుచున్నాడు అను అర్థము "విష్ణుచిత్త" అను వీరి నామ ధేయముచేతనే సూచితమగుచున్నది. తక్కిన ఆళ్వారులందరికంటె స్వామికి మంగళా శాసనములు చేయుటలో వీరికిగల ఆర్తృతిశయమునుబట్టి పెరియాళ్వార్ అను నామధేయముగూడ వీరికి సుప్రసిద్ధమై నిలచినది అని పెద్దలందురు.

**(నల్లాణ్డెన్రు నవిన్రురైప్పార్) –** వీరు ప్రసాదించిన ఈ ప్రబంధమును అను సంధించుటకు ఉపక్రమించిన రోజే భక్తుని జీవితములో ఉత్తమదివసము. కృష్ణుని దర్శనమును పొందిన దివసమును అక్రూరుడు 'అద్యమే సఫలం జన్మ' అని ప్రస్తుతించి నట్లు అనాదికాలముగా సంసారము అను చక్రపరివర్తనములో దిమ్మదిరిగియున్న తనకు ఈ ప్రబంధమును ప్రేమతో అభ్యసించిన రోజు ముక్తి సాధకమైన పవిత్ర దివసమైయున్నది. అంతేకాక "నమోనారాయణాయ" అను అష్టాక్షరీమహామంత్రమును అనుసంధించుచూ స్వామికి మంగళాశాసనము చేయుటచే కలుగు ఫలము శాశ్వతముగా శ్రీవైకుంఠమున భగవత్సన్నిధికి చేరి కైంకర్యమును చేయుట. ఆయన

పరమాత్మ. ఆయనకు పైన మరెవ్వరునూ నియామకులు లేరు. ఉభయ విభూతులను సంకల్పమాత్రముచే తన అధీనమునందుంచుకొన్న ఆయనకు ఇతరులు చేయు మంగళాశాసనములచే కలుగు అతిశయముగాని, అది లేనిచో కలుగు అనర్థముగాని లేదు. ఐనను తమ స్వామికి జయ విజయీభవ అను మంగళమును చెప్పుట భక్తునికి విధి గనుక స్వరూపానురూపముగా అచట ఇతడు స్వామికి నిత్య ప్రదక్షిణము చేయుచు, ఎదుట నిలబడినపుడు ముఖారవిందములోని స్మితశోభను, ఆయా ప్రక్కలలో నిలబడి దివ్యాభరణ శోభను వెనుక భాగమున నిలబడి శిరస్సునకును, కంఠమున కును, కటిప్రదేశమునకునూ అలంకారముగా ధరింపబడిన దివ్యభూషణ శోభలను కనులార సేవించుచు **"నమః పురస్తాత్ అథ పృష్ఠతస్తే"** అని భగవద్గీతలో చెప్పబడినట్లు అర్జునునివలె చుట్టును పరిభ్రమించుచు పునః పునః ప్రణామాదులను చేయుచు స్వామికి మంగళాశాసనము చేయగల యోగ్యతను పొందగలరు అని ఫలము చెప్పబడినది.

సకల వేదసారమైన ప్రణవమువలె ఈ తిరుప్పల్లాణ్డు ప్రబంధము ఆళ్వారు లందరునూ ప్రసాదించిన నాలాయిర ప్రబంధములలో నాయకమణివలె సర్వశ్రేష్ఠమైనది. దీనిని నిత్యమునూ భగవత్సన్నిధిలో అనుసంధించుకొననివానికి శ్రీవైష్ణవత్వసిద్ధి లేదు అని పెద్దలయొక్క నిర్ణయము.

C

శ్రీమతే రామానుజాయ నమః

# శ్రీ మధురకవి ఆళ్వారులు ప్రసాదించిన

# కణ్ణినుణ్ శిరుత్తామ్బు

## గ్రన్థావతారిక

కురుకాపురి అనబడు శ్రీ నమ్మాళ్వారుల అవతారస్థలమైన దివ్య క్షేత్రమునకు క్రిందుగాగల తామ్రవర్ణీ నదీతీరమున తిరుక్కోళూర్ అను దివ్యక్షేత్రమున శ్రీ మధురకవులు ఉత్తమ వైదిక కుటుంబమున అవతరించిరి. వారు నమ్మాళ్వారుల ప్రభావమును గుర్తించి శిష్యులుగా ఆశ్రయించిన పిదప వారిని స్తుతించుచూ రచించిన ఈ గ్రంథమే ఈ కణ్ణునుణ్ శిరుత్తామ్బు. మధురకవుల సంగ్రహ చరిత్రము ఆళ్వారుల దివ్యకథలు అను పేరుతో మా సత్సంప్రదాయ పరిరక్షణసభ ప్రచురించిన గ్రంథములో జిజ్ఞాసువులు గ్రహింపవచ్చును. నమ్మాళ్వారులే తమకు పరదైవము అని భావించి, ఆచార్య విషయముగా ఈ మధురకవులు రచించిన పదకొండు పాశురములు గల ఈ చిన్ని గ్రంథమును పూర్వాచార్యులు నాలాయిర ప్రబంధములో ముదలాయిరము నందు చివరి గ్రంథముగా జేర్చిరి. భగవద్భక్తులైన తమ ఆచార్యులగు శ్రీ నమ్మాళ్వారులపైన భక్తిపురస్సరముగా రచించిన ఈ గ్రంథము చరమోపాయము అనబడు ఆచార్యభిమానమే ఉజ్జీవన సాధనము అని బోధించుచూ భాగవత నిష్ఠా ప్రతిపాదకమైయున్నది. శ్రీమన్నాథమునులు కణ్ణినుణ్ శిరుత్తామ్బు అను ఈ గ్రంథమును కొన్ని వేల పర్యాయములు పారాయణమును చేసి నమ్మాళ్వార్లను సాక్షాత్కరింపజేసికొని వారి శ్రీముఖమునుండి నాలాయిర ప్రబంధములను ఉపదేశ రూపమున పొందగలిగిరి అను ఇతిహాసమునుబట్టి ఈ చిన్న ప్రబంధము సర్వ ద్రవిడ వేదావతరణమునకు మూలకారణమగుటచే తిరుప్పల్లాణ్డుతో పాటు దీనినిగూడ ద్రవిడ వేదాధ్యయనమునకు ముందుగా అనుసంధించుట ఆచారమై యున్నది.

ఈ గ్రంథమునకు ఐదుగురు పూర్వాచార్యులు వ్యాఖ్యానములను ప్రసాదించి యున్ననూ, వారిలో పెరియవాచ్చాంబిళ్లై అను ఆచార్యులు ప్రసాదించిన వ్యాఖ్యానమే విశిష్టమై ప్రవచనపరంపరలో నున్నది. ఆంధ్రదేశమునందలి శ్రీవైష్ణవభక్తులకు దాని అర్థమును విశదముగా తెలియబరచుటకై వారి వ్యాఖ్యానమునే ఇచట తెలుగులో అనువదించుచున్నాము. ఈ గ్రంథము మొదటి పాశురమున "కణ్ణినుణ్ శిఋత్తామ్బు" అని ఆరంభమైనందున గ్రంథమునకూగూడ అదేపేరు పెట్టబడినది. తిరుప్పాణ్

ఆళ్వారులు శ్రీరంగనాథుని దివ్యావయవ సౌందర్యమును వర్ణించుచూ 'అమలనాది పిరాన్' అని మొదలుపెట్టుటచేత ఆ చిన్న ప్రబంధమునకు 'అమలనాదిపిరాన్' అనియే పేరు వచ్చినట్లు ఈ గ్రంథమునకునూ ఆరంభమున గల పదములనుబట్టియే పేరు పెట్టబడినట్లు గ్రహింపదగును.

ఇపుడు ఈ గ్రంథమునకు వ్యాఖ్యానమును ప్రసాదించిన శ్రీ పెరియ వాచ్చాంబిళ్లై (శ్రీకృష్ణపాదులు అని సంస్కృతములో వీరికి వ్యవహారనామము) వ్యాఖ్యానారంభమున అవతారికలో వ్రాసిన విషయములను ఇచ్చట మనము తెలుసు కొనుట అవసరము. వ్యాఖ్యానకర్తలు మొట్టమొదట మూలగ్రంథకర్తయొక్క ప్రభావమును, పిదప అందులో ప్రతిపాదింపబడు ప్రధాన విషయమునూ, సంగ్రహముగా అవతారికలో వివరించి చెప్పుట ఒక పద్ధతి. ఆ రీతిలో మధుర కవులయొక్క వైభవమును, వారీ ప్రబంధమున చెప్పిన ఆచార్య నిష్ఠాప్రాధాన్యమును, తమ అవతారికలో శ్రీ పెరియవాచ్చాంబిళ్లై స్వామివారు ఈ క్రింది విధముగా వివరించియున్నారు.

మహర్షులందరూ వేదమందు ప్రతిపాదింపబడిన రీతిలో తమతమకు కావలసిన ధర్మార్థ కామ మోక్షరూప చతుర్విధ పురుషార్థములను జప దాన హోమ ధ్యానాది మార్గమున సాధించుకొనియున్నారు. ఇతరులకునూ ఈ వేదబోధిత పద్ధతినే తాము రచించిన స్మృతి పురాణాది గ్రంథములలో ఉపదేశించియున్నారు. వేదము కేవలము ఒక మోక్షపురుషార్థమునేగాక ప్రజలు అపేక్షించు ధర్మార్థకామములు అనబడు లౌకిక ఫలములను సాధించుటకు కావలసిన మార్గములను కూడ తెలుపుచున్నది. కనుకనే శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో రెండవ అధ్యాయమున **"త్రైగుణ్యవిషయాః వేదాః నిస్త్రైగుణ్యోభవార్జున"** అని ఉపదేశించినాడు. ప్రకృతిమండలములో నుండు జీవులందరునూ సహజముగా ప్రకృతికి చెందిన సత్త్వరజస్తమోగుణములయొక్క ప్రభావమునకు లోనైయుందురు గనుక ఆ గుణప్రభావమునుబట్టి వారిలో భిన్నభిన్నము లగు కోరికలు కలుగుచుండును. తమోగుణప్రధానులు శత్రువధాదిసిద్ధికై అభిచార యాగాదులను చేయుడని వేదము చెప్పుచున్నది. అట్లే రజోగుణము కలవారు స్వర్గాది ఫలములనో లేక లౌకిక ఐశ్వర్యాదులనో కోరినచో తత్సిద్ధికై దర్శపూర్ణ మాసాది యాగములు చేయుడని చెప్పుచున్నది. సాత్వికులైనవారు ప్రకృతిసంబంధమును

తొలగించుకొని శుద్ధాత్మ స్వరూపమును పొందుటకు కావలసిన తపోమార్గమును గూడ బోధించుచున్నది. కనుక వేదములు త్రిగుణవశులైన మనుష్యులకు కావలసిన సర్వవిధోపాయములను బోధించుటచేత అవి "త్రైగుణ్య విషయములు" అని చెప్పబడు చున్నవి. ఎవరికి ఏ వస్తువులు కావలసిననూ వారివారి కోరికలకు తగినట్లు కావలసిన అన్ని వస్తువులను అమర్చి పెట్టు దుకాణముల వంటివి యీ వేదములు అని పెద్దలందురు. మోక్షాభిలాష కలవాడవైన నీవు ఆ త్రిగుణములకు అతీతుడవుగా వేదమందు సామాన్యముగా చెప్పబడిన ఆయా ఇతరాంశములనన్నింటినీ విడచి నేను చెప్పు పద్ధతిలో వేదాంతములయందు బోధింపబడిన భగవత్తత్త్వమును పొందుటకు కావలసిన భక్తియోగము అను సాధనమునవలంబింపుము అని శ్రీకృష్ణుడు చెప్పిన పై శ్లోకమునకు తాత్పర్యము. మహర్షులు కూడ కొందరు వేదములలో చెప్పబడినట్లు ఆ ఇతర పురుషార్థసాధకములైన వేదబోధిత యజ్ఞాది కర్మలలోనే నిమగ్నులైరి. కాని ఉత్తమ పురుషార్థమగు భగవత్సాన్నిధ్యప్రాప్తిని అపేక్షింపలేదు. వారు తమ ఉపదేశము లను గూడ స్మృతి పురాణాది గ్రంథములలో వేదోక్తపద్ధతిలోనే కొనసాగించియున్నారు. వారిలో కొందరు జ్ఞానాధికులైన పరాశరాది మహర్షులు ఇతర పురుషార్థములతోపాటు ఉత్తమపురుషార్థమైన మోక్షమునుగురించికూడ తెలిపియున్నారు. ఇందులకు శ్రీ పరాశరమహర్షి ఉపదేశించిన విష్ణుపురాణమే ప్రమాణముగా చెప్పవచ్చును. **"ప్రాజాపత్యం గృహస్థానాం బ్రాహ్మ్యం సన్యాసినాం స్మృతమ్"** అను శ్లోకము ప్రారంభించి ఆయన మొదట గృహస్థులైనవారు ప్రజాపతి లోకాది మహైశ్వర్యములను అపేక్షించు గృహస్థులు ఈ యాగాదులను చేయుడు అనియూ, బ్రహ్మలోకప్రాప్తిని అపేక్షించు సన్యాసాశ్రమనిష్ఠులు యీయీ ధర్మములను అనుష్ఠించుడు అనియూ ఉపదేశించియున్నాడు. పిదప **"యోగినాం అమృతం స్థానం స్వాత్మ సంతోషకారిణామ్"** అను శ్లోకమున కైవల్యమను మోక్షమును పొందదలచినవారికి కావలసిన ఆత్మస్వరూప మును ఉపదేశించియున్నాడు. ఆపైన –

**శ్లో॥ ఏకాంతిన స్సదాబ్రహ్మధ్యాయినో యోగినోహి యే ।**
**తేషాం తత్ పరమం స్థానం యద్వై పశ్యంతి సూరయః ॥**

అను శ్లోకమున అనన్యభక్తితో పరబ్రహ్మధ్యానమును చేయు యోగీశ్వరులకు దివ్య వైష్ణవపదప్రాప్తిని ఫలముగా చెప్పియున్నాడు. కావున వేదములుగాని వాటి

అర్థములను వివరించు ఉపబృంహణములు అనబడు మహర్షుల గ్రంథములుగాని త్రిగుణవశులైన మానవులకు ఉపయోగించునవియేగాని త్రిగుణాతీతులైన శుద్ధ సత్త్వ నిష్ఠులగు ముముక్షువులకు అంతగా ఉపయోగించునవి కావు.

ఈ పద్ధతిలో విచారించినపుడు భగవదేకనిష్ఠులైన ఆళ్వారులకునూ, మోక్ష పురుషార్థైక ప్రతిపాదకములైన ఆళ్వారుల ప్రబంధములకునూ, ఆ మహర్షులకంటెను, ఆ వేద స్మృత్యాదులకంటెను ఎంతో ప్రాధాన్యము కలదని గ్రహింపవచ్చును. జన్మనుండియే భగవత్కటాక్షమునకు పాత్రులైన ఆళ్వారులు ఐశ్వర్యాది క్షుద్రపురుషార్థము లను విడిచి భగవత్సాన్నిధ్యమున లభించు మోక్షమునే ఉత్తమపురుషార్థముగా అపేక్షించిరి. వారు ఋషులవలె లౌకిక ఫలితములనుగూడ అపేక్షించినవారు కారు. తాము రచించిన ప్రబంధములలోకూడ ఇతరులకు ఉపదేశించినపుడు భగవత్పరత్వ మునే బోధించుచు ఐశ్వర్యాది పురుషార్థములు త్యాజ్యములు అని ఉపదేశించి భగవత్సాన్నిధ్యమును పొందుటయే ఉత్తమ పురుషార్థమని నిర్ణయించిరి. ఇట్లు మహర్షులకు మించిన దివ్యజ్ఞాన సంపన్నులైన ఆ ఆళ్వారులకంటె ఈ మధురకవులలో ఒక ప్రత్యేకత కలదు. వీరు మోక్షపురుషార్థమునందు కూడా సారము అని చెప్పదగిన భాగవత శేషత్వమునందే తమ నిష్ఠను ప్రకటించుకొనిరి. భగవద్భక్తులైన నమ్మాళ్వారులే వీరికి పరదైవము. వారిని సేవించుచూ వారి ప్రబంధములను గానము చేయుటయే వీరికి పురుషార్థము. తమ ఆచార్యులైన నమ్మాళ్వారులు తాము రచించిన నాలుగు ప్రబంధములలో తమకు కలిగిన భగవద్గుణానుభవమును ప్రకటించుకొనుచు సారతమము అని చెప్పి ఏ భాగవతనిష్ఠను నిరూపించిరో అట్లు ఆచార్యరుచి పరిగ్రహీతమైన ఆ నిష్ఠయే తమకునూ అభిమతమని వీరు స్వీకరించిరి. సాత్త్వికుడైన శిష్యుడు ఆచార్యునకు అభిమతమైన విషయమునే తనకు ప్రాప్యముగా స్వీకరించవలెను అనుటకు నిదర్శనము మహాభారతములోని సహస్రనామాధ్యాయము. భీష్మాచార్యుల వారివద్ద ధర్మసూక్ష్మములను అన్నింటినీ సంపూర్ణముగా విన్న ధర్మరాజు ఆయనకు అభీష్టమైన తత్త్వహిత పురుషార్థములే తనకును పరిగ్రహింపదగినవి అని భావించి **"కో ధర్మ స్సర్వధర్మాణాం భవతః పరమోమతః"** అని ప్రార్థించినాడు. అన్ని ధర్మములలో నీకు అభిమతమైన ఉత్తమ ధర్మమేదో నాకు ఉపదేశింపుమని భీష్మాచార్యు లను కోరినాడు. అపుడు భీష్మాచార్యుడు –

**శ్లో॥ ఏష మే సర్వధర్మాణాం ధర్మోఽధికతమో మతః ।**
**యద్భక్త్యా పుణ్డరీకాక్షం స్తవైరర్చేన్నర స్సదా ॥**

అని బదులు చెప్పినాడు. "భక్తిపూర్వకముగా భగవంతుని సహస్రనామములను అనుసంధించుచూ అర్చించుటయే పరమధర్మము అని నా అభిమతము" అని వివరించినాడు. ఇట్లే ఆచార్యాభిమతమైనదే శిష్యునికిగూడ పరిగ్రహ్యము అనుటకు మరియొక ఉదాహరణమునుగూడ గ్రహింపవచ్చును. అదేమనగా రాజభార్యయగు త్రిపురాదేవి భగవద్రామానుజులను ఆశ్రయించి శ్రీవైష్ణవమతనిష్ఠను పొందినది. ఆమెను కొందరు "మీరు శ్రీమన్నారాయణుడే పరతత్త్వమని ఆయనను ఆశ్రయించుటకు కారణమేమి? ఆ విషయమున వేదమునే పరమప్రమాణమని మీరు విశ్వసించు చున్నారా?" అని అడిగినారట. అందులకామె సమాధానమిచ్చుచూ "మాకు ఆ ప్రమాణములతో పనిలేదు. మా ఆచార్యులైన భగద్రామానుజులు ఈశాన్యదిక్కు నందుండు దేవతను (శివుని) ఆశ్రయించిననూ మేముగూడ వారితోబాటు అతని నాశ్రయించగలము. మా ఆచార్యులకేది అభీష్టదైవమో అదియే మాకును అభీష్టము" అని ఆమె తెలిపెను. ఈ రెండు ఉదాహరణములననుసరించి ఇపుడు ఈ మధుర కవులుగూడ తమ ఆచార్యులు తెలిపిన భాగవతనిష్ఠనే తమకు పరమప్రాప్యముగా నిశ్చయించుకొనిరి అని చెప్పుటలో తప్పులేదు.

రామాయణ పురుషులలో శ్రీ శత్రుఘ్నులవారి నిష్ఠగూడ ఇట్టిదేనని గ్రహింప వచ్చును. వేదార్థమును విశదీకరించుటకై అవతరించిన శ్రీమద్రామాయణము దశరథ పుత్రులు నలుగురునూ ధర్మసంస్థాపనార్థమై అవతరించి నాలుగు ఉత్తమధర్మములను తామనుష్ఠించి లోకమునకు చాటిచెప్పినట్లు తెలుపుచున్నది. అందు ప్రధానుడైన శ్రీరామచంద్రుడు "కర్తా కారయితా చ సః" అని చెప్పబడినట్లు పెద్దలు చెప్పిన మాటను విని ఆచరించుటయే బుద్ధిమంతుని లక్షణము అని తెలుపుచూ తాను పితృవచన పరిపాలనమును చేసి మీరుకూడ ఈ ఉత్తమధర్మమును అనుష్ఠింపుడని ప్రబోధించి నాడు. ఒకరు చెప్పినదానిని మనమెందుకు ఆచరింపవలెను? యథేష్టముగా మనమెందుకు ప్రవర్తింపరాదు? అను స్వతంత్రభావన ప్రజలలో అంకురించి వారు పెద్దలమాట వినకుండ తిరస్కరించు పరిస్థితి ఏర్పడగా శ్రీరామచంద్రుని అనుష్ఠానము ఉపదేశముగూడ అట్టివారికి మార్గదర్శకమైనది. ఆయన ఒక పితృవచన పరిపాలన

మునే గాక "అగస్త్యవచనాత్" "సుగ్రీవవచనాత్" ఇత్యాది వాక్యములనుబట్టి పెద్దలు చెప్పిన మాటలను గూడ పాటించుచుండెనని తెలియుచున్నది గదా!

ఇక లక్ష్మణుడు ఆభాసబంధువులెవ్వరునూ రక్షకులు కారనియూ భగవంతుడే నిరుపాధిక బంధువనియూ ఆ స్వామికి శేషభూతుడై నిరంతరము సేవించుటయే జీవుని కర్తవ్యమనియూ స్వానుష్ఠానముచే లోకమునకు బోధించినాడు. కనుకనే వనవాసమునకు పోవుచున్న అన్నగారి శ్రీపాదములను గట్టిగా పట్టుకొని, నన్ను దాసునిగ చేసుకొనుమనియు, **"అహం సర్వం కరిష్యామి"** అనియూ విన్నవించుకొన్నాడు.

ఇక భరతుడు లక్ష్మణునివలె శ్రీరామునికి దాసుడే ఐననూ అతనివలె స్వామిని నిర్బంధించి సేవచేయు పద్ధతిని అవలంబింపక స్వామికి అభీష్టమైన విధముగా ప్రవర్తించి తన సేవను కొనసాగించుటయే ప్రధాన కర్తవ్యమని భావించిన వాడు. భరతునిలో గల ఈ గుణమునకు 'పారతంత్ర్యము' అని పెద్దలు పేరు పెట్టిరి. స్వామియొక్క అభీష్టమునకనుకూలముగా పరతంత్రములై వర్తించు అచేతనవస్తువుల వలె, మారుమాటాడక విధేయుడై వర్తించుటయే పరతంత్రుడగు భృత్యునికి కర్తవ్యము అని భావించిన భరతుడు రాముని ఆదేశమును శిరసావహించి పదునాలుగు సంవత్సరములు రామవిరహమును సహించుటకుగూడ వెనుకాడక పాదుకలను స్వీకరించి వెనుదిరిగినాడు. దీనినిబట్టి ఉత్తమభక్తునిలో ఉండదగినది ఈ పారతంత్ర్య భావనయే అని తెలుపబడుచున్నది. లక్ష్మణుడు తన కోరిక నెరవేరుటకై శ్రీరాముని నిర్బంధించినాడా అని కొందరికి సందేహము రావచ్చును. అవును. ఈ విషయమున అతడు రామునివద్ద ప్రతిజ్ఞకూడ చేసినాడు అని బదులు చెప్పుచూ వ్యాఖ్యానకర్తలు ఇచట రామాయణములోని ఒక శ్లోకమునుదాహరించి వ్యాఖ్యానించుచున్నారు.

**శ్లో॥ రాజ్యం చ తవ రక్షేయం అహం వేలేవ సాగరమ్ ।**
**ప్రతిజానామి తే వీర మాభూవం వీరలోకభాక్ ॥**

ఇది లక్ష్మణుడు శ్రీరామునితో జబర్దస్తీగా చెప్పిన శ్లోకము. శ్రీరామా! నిన్నూ నీ రాజ్యమును కూడా ఏ అపాయము లేకుండా నేనొకడినే రక్షించగలను. ఈ విషయమున మీరు నన్ను నివారించుటకు వీలులేదు. **(అహం వేలేవ సాగరమ్)** నీవు సముద్రము వంటివాడవు. నేను దాని కరకట్టవంటివాడను. సముద్రము

ఎప్పుడునూ ఆ కట్టను మించి పైకి రానట్లే నీవు కూడ నీ దాసుడనైన నన్ను కాదని త్రోసిపుచ్చరాదు. నేను నీ దాసుడనైననూ సముద్రము కట్టకు లోబడియుండునట్లు మీరు నా ప్రార్థనను అంగీకరించితీరవలెనుగాని అతిక్రమింపరాదు. మీ ముందు యీ విషయమున నేను ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఎవడో అసమర్థుని ఎదుటగాక చేసిన ప్రతిజ్ఞను నెరవేర్చితీరగల పురుషోత్తముడవగు నీ ఎదుటనే యీ ప్రతిజ్ఞను చేయుచున్నాను. **(మా భూవం)** ఒకవేళ నేను నా ప్రతిజ్ఞను నిలబెట్టుకొనలేక పోయినచో **(వీరలోకభాక్)** నావలెనే పట్టాభిషేకము చేతునని ప్రతిజ్ఞ చేసి నెరవేర్చలేక వీరుడైన దశరథుడు పరలోకమునకు పోయినట్లే నేనుగూడ నీ సన్నిధిలో నుండు భాగ్యమును, మీ రాజ్యములో నుండు భాగ్యమునుగూడ కోల్పోయి, మీ పట్టాభిషేక దర్శనభాగ్యమునుకూడ కోల్పోయి లోకాంతరమునకు పోయెదనుగాక!

ఇట్లు భయంకర ప్రతిజ్ఞను చేసి రాముని ఒప్పించి లక్ష్మణుడు ఆయన సేవలో పాల్గొన్నాడు. ఇక ఈ భరతుడు అట్లు శ్రీరాముని ఇబ్బందిలో పెట్టక ఆయన ఆదేశించినదే తడవుగా తన కష్టమునుగూడ ఎంచుకొనక **"ఆరురోహ రథం హృష్టః"** అన్నట్లు సంతోషముగా పాదుకలను స్వీకరించి వెనుకకు మరలినాడు. భగవద్దాస్యమునందు శేషత్వమునకంటె పారతంత్ర్యమును అవలంబించుటయే ఉత్తమ ధర్మమని భరతుడు నిరూపించినాడు.

ఇక శత్రుఘ్నుడు అట్లు పరమభక్తుడైన భరతుని సన్నిధిలో దాసుడై వర్తించి, భగవచ్ఛేషత్వమునకంటె భాగవత శేషత్వమే పరమధర్మమని చాటినాడు. శత్రుఘ్నునిలో గల ఈ భాగవతనిష్ఠకు ప్రమాణముగా అయోధ్యాకాండములోని మొదటి శ్లోకమును ఇచట గ్రహింపదగును. ఆ శ్లోకమిది –

**శ్లో॥ గచ్ఛతా మాతులకులం భరతేన తదానఘః ।**
**శత్రుఘ్నో నిత్య శత్రుఘ్నః నీతః ప్రీతిపురస్కృతః ॥**

భరతుడు తన మేనమామ ఇంటికి పోవుచు పాపరహితుడు నిత్యశత్రువు లనబడు ఇంద్రియములను జయించినవాడు ప్రేమతో ఎల్లపుడును తన వెంటనుండు వాడునగు శత్రుఘ్నునిగూడ తీసుకొనిపోయెను అని ఈ శ్లోకమునకు సంగ్రహముగా అర్థము. **(గచ్ఛతా)** వెళ్ళుచున్న భరతుడు. ఇది సంస్కృతమున వర్తమానకాలమును నిర్దేశించు పదము. తాను పోవుచూ అదే సమయమున శత్రుఘ్నుని తీసుకొనిపోవు

చున్నాడు అనుటచేత, ఈ శత్రుఘ్నునికి భరతానువృత్తియే తప్ప వేరొక ప్రయోజనము లేదనియూ, తల్లిదండ్రుల అనుమతి తీసుకొనవలసిన అవసరముగూడ అతనికి లేదనియూ, పెద్ద అన్నగారి అనుమతిని గూడ పొందలేదనియూ, భరతుని సాన్నిధ్యము లేనిచో ఒక్క క్షణమైన తానుండలేడు గనుక వెంటనే అతనిని వెంబడించెననియూ సూచితమగుచున్నది. **(మాతులకులం)** భరతుడు పోవుచున్నది తన మేనమామ ఇంటికి. శత్రుఘ్నునికి అతడు మేనమామ కాడు. ఐననూ భరతుడు తనకు అవసరముగనుక అతనిననుసరించినాడు. **(భరతేన)** నలుగురుకినీ నామకరణము చేసినవాడు వశిష్ఠుడు. ఆయన భవిష్యత్తును దృష్టియందుంచుకొని వారివారికి ఉచితమైన విధముగా నామకరణము చేసినాడు. ఆయన ఇతనికే భరతుడని పేరుపెట్టుటలో ఒక ప్రత్యేకత కలదు. దశరథ చక్రవర్తి మరణించగలడు. రాముడు రాజ్యమును విడచి వనమునకు పోగలడు. లక్ష్మణుడు ఆయన వెంటనే సేవ చేయుటకు పోగలడు. శత్రుఘ్నుడునూ భరతుని వెంట పోగలడు. ఇట్టి స్థితిలో రాజ్యభారమును అతి సామర్థ్యముతో ఇతడొక్కడే భరించగలడు అను దూరదృష్టితో మహర్షి ఇతనికి ఈ భరతుడు అను పేరునుంచెను. కనుకనే శతానీకుడు **"భరత ఇతి రాజ్యస్య భరణాత్"** అని ఈ పేరునకు నిర్వచనమును చెప్పి ప్రశంసించినాడు. **(తదా)** అతడు బయలుదేరిన ముహూర్తముననే శత్రుఘ్నుడుగూడ వెంబడించినాడు. జన్మసమయమునుబట్టి భరతునిది పుష్యమీ నక్షత్రము. శత్రుఘ్నునిది ఆశ్లేషా నక్షత్రము. ఐననూ తారాబలము తన ప్రయాణమునకు సరిపడునా లేదా అని విచారించవలసిన అవసరము లేకుండ అదే ముహూర్తమున ఇతడునూ వెంబడించి నాడు. తనకు అనుకూలమైన ముహూర్తమును చూసుకొనవలసినచో ఒకటి రెండు రోజులు భరతునితో విశ్లేషమును పొందవలసివచ్చును. అది తనకు అనిష్టము. ఈ శ్లోకములోని "గచ్ఛతా" "తదా" అను రెండు పదములును అదే సమయమున బయలుదేరెను అని తెలుపుచున్ననూ, శత్రుఘ్నునిలో వేరెవరిపైనను మమకారము లేదనియూ తనకు ప్రత్యేకతను ఆపాదించు అహంకారముగూడ లేదనియూ ఈ రెండు పదములు సూచించుటచేత పునరుక్తి దోషము లేదని గ్రహింపదగును. **(అనఘః)** పాపరహితుడు అని చెప్పదగినవాడు నిజముగా ఈ శత్రుఘ్నుడు మాత్రమే. ఇచట పాపమనగా నేమి? అని విమర్శింపవలసియున్నది. తనకు ఉద్దేశ్యమగు ఫలితమునకు విరుద్ధమైనదంతయూ పాపముక్రిందనే పరిగణింపబడును. ఇతనికి భరతసేవయే

ముఖ్యోద్దేశ్యము గనుక దానికి విరుద్ధమైనది అంతయూ పాపమే. రామదర్శనమే మాకు ప్రాప్యమని భావించినవారందరునూ ఆ స్వామియొక్క సౌందర్యమునందు నిమగ్నులై తమ తమ కర్తవ్యములను మరతురు. శత్రుఘ్నుడుకూడ ఆ సౌందర్యము నకు లోబడినచో తనకు ప్రాప్యమగు భరతసేవకు దూరము కావలసివచ్చును. ఇట్లు తన ఉద్దేశ్యమగు భరతసేవకు రామభక్తి ప్రతిబంధకమగును గనుక అది తనకు వద్దు అని వదలినాడు. ఇదే "అనఘః" అను పదమునకు తాత్పర్యము.

ఇదేమి ఆశ్చర్యము! రామభక్తి పాపమగునా? అని కొందరాక్షేపించవచ్చును. తన ప్రధనోద్దేశ్యమునకు విరుద్ధమైనదంతయూ పాపమేనని వెనుక నిర్వచనమును చెప్పితిమిగదా! వాస్తవమునకు పాపమునకంటె పుణ్యము కొంత మంచిదే ఐనను మోక్షమనబడు ఉత్తమ పురుషార్థమును పొందగోరువానికి ఆ పుణ్యము, తత్ఫలముగూడ త్యాజ్యమే గనుక అతని దృష్టిలో పుణ్యముగూడ పాపముతోపాటు త్యాజ్యమైనట్లు, **"న సుకృతం నదుష్కృతం సర్వేపాప్మానః అతః ప్రదూయంతే"** అను శ్రుతిలో చెప్పబడినది. ఇట్లు ముముక్షువునకు పుణ్యముగూడ పాపమువంటిదే అయినపుడు భరతసేవకుడైన శత్రుఘ్నునికి తన ఉద్దేశ్యమునకు భిన్నమైన రామభక్తిగూడ పాపమువలె త్యాజ్యమైనది అని భావము. మహాజ్ఞానవంతురాలగు సుమిత్రకూడ రామునివెంట సేవకై పోవు లక్ష్మణునికి ఉపదేశము చేయుచు చామని సేవలో ఏమరుపాటును పొందకుము. **"రామే ప్రమాదం మాకార్షీః"** అని ఉపదేశించినది. పదునాలుగు సంవత్సరములు నిద్రను వదిలి సేవచేయు లక్ష్మణునికి ప్రమాదమేమి వచ్చును? అని భావింపరాదు. రామసౌందర్యమును చూచుచూ, పరవశుడై అట్లే నిలిచి పోయినచో కైంకర్యమునకు అంతరాయమేర్పడినట్లే గదా! అట్టి అజాగ్రత్తలో పడకుము అని సుమిత్ర ఉపదేశించెనట. రామసేవకుడైన లక్ష్మణునికే రామసౌందర్యము ప్రతిబంధకమగునేమోయని శంకించినపుడు భరతసేవకుడైన శత్రుఘ్నునికి అట్టి రామసౌందర్యము ప్రతిబంధకమనుటలో తప్పు లేదుగదా!

**(శత్రుఘ్నః)** వశిష్ఠుడు బాగుగా విచారించి నామకరణములను నలుగురికినీ చేసినాడని వెనుక చెప్పుకున్నాము. రాముడు తనను దర్శించినవారి దృష్టిచిత్తములను సౌందర్యముతో రంజింపజేసి ఆకర్షించువాడు గనుక (రమయతీతి రామః) అని పేరు పెట్టబడినది. రామకైంకర్యమే తనకు ప్రధానలక్ష్యమని, సంపదయని భావించినవాడు

గనుక **"లక్ష్మణో లక్ష్మీసంపన్నః"** అని పేరు పెట్టబడినది. రావణవధయైన తరువాత గూడ భూలోకమున ఎక్కడనో ఒక మూలన లవణాసురుడనువాడు దురాగతమునకు దిగినపుడు రామాజ్ఞచే ఇతడు దండెత్తిపోయి ఆ లవణాసురుని మట్టిగరిపించిన పౌరుషశాలి గనుక శత్రుఘ్నుడను పేరు ఇతనికి పెట్టబడినది. భరతనామమునకు సార్థక్యమును వెనుక చెప్పుకొనియున్నాము. **(నిత్యశత్రుఘ్నః)** బాహ్యశత్రువులనేగాక అంతశ్శత్రువులైన ఇంద్రియములను కామక్రోధాదులనుగూడ జయించినవాడు అని దీని అర్థము. ఇతడు అలవరచుకొన్న ఇంద్రియనిగ్రహము ఎంత గొప్పది అనగా **"పుంసాం దృష్టిచిత్తాపహారిణం"** అని కీర్తింపబడిన రామసౌందర్యముగూడ ఇతనిని చలింపచేయలేకపోయినది. ఒకప్పుడు భరతుడు రామదర్శనముకనకై వెళ్లిననూ అతనివెంటనుండు ఇతను రాముని దర్శించినది ఇష్టపూర్వకముగా కాదు. తన స్వామియగు భరతునికి ఇష్టమైనవాడుగదా అను భావముతోనే ఒకసారి మాత్రము రాముని దర్శించి తలవంచుకొనునట. జగదేకమోహనమగు సీతసౌందర్యమును కన్నెత్తిగూడ చూడక ఆమె పాదములయందే దృష్టినిల్పిన లక్ష్మణునికి తమ్ముడైన ఇతను అతనిని మించిన ఇంద్రియనిగ్రహము కలవాడని దీని సారాంశము.

**(నీతః ప్రీతి పురస్కృతః)** నీతః అను పదము భరతునిచే తీసుకొనిపోబడినాడు అను అర్థమునిచ్చును. రాజులు ఎచటికైనను పోవునపుడు తమవెంట ఒరలో దోపుకొని చురకత్తి మొదలైనవాటిని తీసుకుపోవునట్లు భరతుడు వెంటబెట్టుకొనిపోగా ఇతను పోయెనని భావము. అచేతన వస్తువులవలె ఇతడు భరతునికి అత్యంత పరతంత్రుడని సారాంశము. అన్నను వెంబడించుట తమ్ముని ధర్మము అను శాస్త్ర ప్రేరణతో ఇతడు వెళ్లలేదు. **"అహం సర్వం కరిష్యామి"** అని అడవిలో సర్వసేవలను నేనొక్కడనే చేయవచ్చునని ప్రీతితో లక్ష్మణుడు రాముని అనువర్తించినట్లు ఇతడునూ భరతునిపై తనకుగల అపారమగు ప్రేమ ప్రేరేపించగా అతనిని విడిచియుండలేక ప్రేమతో వెంబడించినాడు. "నీతః" "ప్రీతిపురస్కృతః" అను రెండు పదముల సమ్మేళనములో ఒక సరసమైన అర్థము సూచితమగుచున్నది. అది ఏమనగా – (నీతః) అచేతనవస్తువువలె మారుమాటాడక పరతంత్రుడై తీసుకుపోబడినాడు. కానీ తను చేతనుడుగనుక ప్రీతిపూర్వకముగా వెళ్లినాడు. అనగా అచేతనమువంటి పారతంత్ర్యము కలిగి చైతన్యముతో భరతకైంకర్యరసమును అనుభవించినాడని భావము. కులశేఖరులవారు వేంకటాచలమునందు నిత్యనివాసమును కోరుచూ

**"పడియాయ్క్కిందు ఉన్ పవళవాయ్ కాణ్బేనే"** అని తమ కోరికను ప్రకటించు కొన్నారట. నీ గర్భాలయమునకు ముఖద్వారమున గడపనై పడియుందునుగాక! ఇట్లు నేను అచేతనమై పడియున్ననూ, చిగురువంటి నీ అధరసౌందర్యమును నిత్యము దర్శించి ఆనందింతునుగాక అని కులశేఖరుల అభిప్రాయము. శత్రుఘ్నుని కోరిక కూడ పారతంత్ర్యముతోపాటు ప్రీతితో భరతసేవ చేయుటయే అని భావము.

ఒకప్పుదు భగవద్రామానుజులు శిష్యులతో కాలక్షేపగోష్ఠిలో నుండగా వారిలో నొకరు అనఘః, నిత్యశత్రుఘ్నః అను రెండు పదములకునూ రామభక్తి లేనివాడు అనియూ, రామసౌందర్యమును చూడనివాడు అనియూ అర్థమును శత్రుఘ్నునిగూర్చి వర్ణించుట తగునా అని ప్రశ్నించిరట. దానిని సమర్థించుచూ ఆచార్యులవారు రామానుగ్రహమునకు ఈ శత్రుఘ్నుడు ఆ విధముగా అత్యంత ప్రేమపాత్రుడయినాడు. తనను ప్రేమించు భరతుని సేవ లేనిచో నిలువలేని ఈ శత్రుఘ్నుడు తనను కాదని భరతునియందు అత్యంత ప్రేమను చూపుటచే **"మమ మద్భక్తభక్తేషు ప్రీతిః అభ్యధికా భవేత్"** అన్నట్లు మిక్కిలి రామానుగ్రహమునకు పాత్రుడైనాడు గదాయని వారు సమర్థించినారట. ఇట్లు భావమును గ్రహించి 'అనఘః' 'నిత్యశత్రుఘ్నః' అను రెండు పదములకునూ సార్థక్యము తెలిపినట్లగును. సామాన్యముగా పాపము లేనివాడని, ఇంద్రియములు జయించినవాడని అర్థమునే చెప్పినచో ఇచట ప్రత్యేకత లేదు. అయోధ్యానగరమున అందరును పాపరహితులే. అందరును ఇంద్రియ నిగ్రహము కలవారే. కనుక ఈ పదములకు శత్రుఘ్నునిగూర్చి వెనుక చెప్పిన విధముగా అర్థమును వివరించినపుడు స్వారస్యము సార్థక్యముగూడ నుండును అని రామానుజులవారి ఆశయము.

భాగవతుడైన భరతుని సేవలో ఈ శత్రుఘ్నుని నిష్ఠ ఎటువంటిదో, భగవత్సేవ కంటె ఈ శఠగోపులే నాకు పరదైవమని నిశ్చయించి వారిని సేవించు ఈ మధురకవుల భాగవతనిష్ఠగూడ అట్టిదేనని గ్రహింపదగును. ఇదియే తక్కిన ఆళ్వారులకన్న వీరిలోగల విశిష్టత. వారికి భగవంతుడు ఉద్దేశ్యము కాగా వీరికి భగవద్భక్తులైన ఆచార్యులే అత్యంత ప్రియమగుటకు కారణముగా ఏమనగా – ఇంతకుముందు తమలో నుండిన భగవద్వైముఖ్యము అను దుర్బుద్ధి పోయి ఆభిముఖ్యము ఏర్పడగనే ఈ ఆచార్యులే తనను దగ్గరకు తీసుకొనిరి. భగవద్గుణములలో అభిరుచిని కలిగించిరి.

క్రమముగా భగవద్గుణ చింతనము లేనిచో ఉండలేనంతటి పరిపాకదశ నాలో కలిగినపుడు **"బోధయంతః పరస్పరం"** అన్నట్లు మధురోపదేశములను చేయుచు జీవిత కాలక్షేపమునందు నాకు నిత్యసహాయులైరి. ఇక పరమపదమునకు పోయినపుడు కూడ **"యత్రపూర్వే సాధ్యా స్సంతి దేవాః"** అని వేదములో చెప్పబడినట్లు ఈ ఆచార్యులు అచట నిత్యసూరులలో ఒకరైయుండి నాకు భగవత్స్వరూపానుభవమునందు ఎన్నో విశేషములను తెలుపుచూ నిత్యము సహకరించెదరు. ఇట్లు సర్వకాలములలోను నాకు మహోపకారులై తోడు నీడగా వెంటనున్న ఈ ఆచార్యసన్నిధియే నాకు ఇచట, అచటగూడ పెన్నిధియని వీరు నిశ్చయించుకొని యున్నారు. కనుక వారినే పరదైవముగా భావించి ఈ స్తోత్రమును ప్రసాదించుచున్నారు.

**అవతారిక సమాప్తము**

h h

శ్రీమతే రామానుజాయ నమః

## శ్రీ మధురకవి ఆళ్వారులు ప్రసాదించిన

# కణ్ణినుణ్ శిరుత్తాంబు

## ఆంధ్ర వివరణము

**శ్లో॥ అవిదిత విషయాంతరశ్శఠారే-రుపనిషదాముపగాన మాత్రభోగః ।**
**అపిచ గుణవశాత్తదేకశేషీ-మధురకవిర్హృదయే మమావిరస్తు ॥**

**భావము :** శ్రీ నమ్మాళ్వారులనే పరదైవముగానెంచి, ఇతర విషయములను తలంపక వారి ద్రవిడవేద దివ్యసూక్తులనే నిత్యము గానము చేయుచూ పరమానందభరితులైన శ్రీ మధురకవి ఆళ్వారులను నా హృదయమున సదా ధ్యానించుకొందును.

**తనియన్ :**

**వేరొన్ఱుం నా నఱియేన్ వేదం తమిழ் శెయ్ద**
**మారన్ శడకోపన్ వణ్ కురుగూర్ ఏఱెంగళ్**
**వాழ்வామెన్నేత్తుం మధురకవియార్ ఎమ్మై**
**ఆళ్వారవరే యరణ్**

**భావము :** వేదమునంతయు ద్రవిడ ప్రబంధములుగా కూర్చినవారును, సుందరమగు కురుగూరునకు స్వామియును మారన్ అను నామధేయముగలవారును మా ఆచార్యులు నగు శ్రీ శఠకోప మునీన్ద్రులను (నమ్మాళ్వారులను) తప్ప మరెవ్వరినిగూడ నేను దైవముగా భావింపను, వారే మా రక్షకులు – అని ఆచార్యస్తుతిని చేయు శ్రీ మధురకవి ఆళ్వారులే మాకు శరణము.

h h

## పాశురము - 1

ఇపుడు మొదటి పాశురమున తమ ఆచార్యులైన శ్రీ నమ్మాళ్వారులయొక్క వైభవమును కీర్తించుచూ వారి నామానుసంధానము తమ నోటికి అమృతమువలె అతి మధురముగా నుండునని తెలుపుచున్నారు. అయితే తమకు అతిప్రియమైన ఆళ్వారుల ప్రభావమును చెప్పక ఆరంభములోనే యశోదచే బంధింపబడిన కృష్ణుని చరిత్రమును ఎత్తుకొనుచున్నారేమి? అని కొందరిలో సందేహము కలుగవచ్చును. కాని తమ ఆచార్యులు భగవంతుని సౌలభ్యమును తెలుపు ఆ కృష్ణచరిత్రమును ఆశ్చర్యముతో భావించి మూర్ఛనొందియున్నందున ఆ కృష్ణచరిత్రముతో నుపక్రమించిరి. ఆచార్యులకిష్టమైన భగవద్విషయమును తాము కీర్తించినచో వారు సంతోషపడుదురు గదాయని ఇట్లు స్తోత్రమును ప్రారంభించిరి.

తిరువాయ్‌మొழி ప్రబంధమున ప్రథమశతకములోని తృతీయదశకమునందు **"ఉరలినోడు ఇణైన్దిరుందు ఏజ్గియ వెళివు ఎత్తిఅమ్"** అని నమ్మాళ్వారులు ఆశ్చర్యముతో భగవంతుని సౌలభ్యమును కీర్తించుచూ మూర్ఛపోయిరి. సర్వదేవాధి దేవుడునూ జగత్కారణభూతుడునూ ఐన పరమాత్మ యశోదచే రోటికి కట్టబడి అతిదీనుడై వెక్కివెక్కి ఏడ్చుచున్నాడే! ఏమి ఈ భక్తపరాధీనత! ఆ పరాత్పరునిలో ఇంతటి సౌలభ్యము ఆశ్చర్యావహముగదా! అని ఆ చరిత్రమునే నిరంతరము భావించుకొనుచు మూర్ఛపోయిరి. ఇట్లే **"పిరందవాఋం వళర్న్దవాఋం"** అను పంచమ శతకములోని పదవ దశకము నందు కృష్ణుని అవతార వైభవమును బాల్యచేష్టలను అనుసంధించు కొనుచు ఆర్ద్ర హృదయులై మరియొకమారు మూర్ఛపోయిరి. ఇట్లు ఆళ్వారులకు అతిప్రియమైన కృష్ణచరిత్రవైభవమును చెప్పి వారు ప్రేమించిన ఆ భగవద్విషయమున కంటె నాకు ఈ ఆళ్వారుల నామోచ్చారణమే అమృతాయమానమైనట్లు ఇందు ప్రశంసించుచున్నారు.

**మూలము :**

**కణ్ణినుణ్ శిఋత్తామ్బినాల్ కట్టుణ్ణ**
**ప్పణ్ణియ పెరుమాయన్, ఎన్నప్పనిల్**
**నణ్ణిత్తెన్గురుకూర్ నమ్బి యెన్టక్కాల్**
**అణ్ణిక్కు మముతూఋ మెన్నావుక్కే**

**ప్రతిపదార్థము :**

| | |
|---|---|
| కణ్ణి | = ముడులు కలదియు |
| నుణ్ | = సన్ననిదియు |
| శిఱు | = చిన్నదియు అగు |
| తామ్బినాల్ | = త్రాడుచేత |
| కట్టుణ్ణప్పణ్ణియ | = తనను కట్టుపడునట్లు చేసుకొనిన |
| పెరుమాయన్ | = మిక్కిలి ఆశ్చర్యావహమైన స్వభావముగల |
| ఎన్నప్పనిల్ | = మా స్వామియైన భగవంతునికంటె |
| నణ్ణి | = (ఆచార్యుల) ప్రక్కనచేరి |
| తెన్గురు కూర్ నమ్బి | = దక్షిణకురుకాపురమునందు వేంచేసియుండు పూర్ణస్వభావులైన శఠగోపులు |
| ఎన్టక్కాల్ | = అని నోటితో ఉచ్చరించినచో |
| ఎన్నావుక్కు | = నా నాలుకకు |
| అణ్ణిక్కుమ్ | = మిక్కిలి రుచిగానుండును |
| అముదు ఊరుమ్ | = నోటిలో అమృతము ఊరినట్లుండును |

**వివరణము :**

పరాత్పరుడు యశోదచే చిన్నత్రాటితో రోటికి కట్టివేయబడినాడు అనెడు భగవంతుని సౌలభ్యగుణమును కీర్తించుచూ దానిని తలంచుకొని ఆర్ద్రహృదయులై మోహమునొందిన మా ఆచార్యుల సహృదయతను, కురుకాపురాధీశులైన పూర్ణ పురుషులు అను వారి దివ్యనామమును అనుసంధించుకొన్నపుడు నా నోటికి అమృతానుభవమువంటి మహానందమేర్పడును అని సంగ్రహముగా దీనికి భావము.

కృష్ణుని కట్టివేసిన త్రాడు ముడులు వేయబడి సన్ననిదై చిన్నదై ఉన్నట్లు వీరు వర్ణించుటచేత భగవంతుని సౌలభ్యగుణమునందు ఆయాళ్వారులు ఎంతగా మునిగిపోయిరో సూచింపబడుచున్నది. **(కణ్ణి)** నడుమునకు కట్టినపుడు ఒరుసు కొనునట్లు ఈ త్రాటిముడులు బాలకృష్ణునికి బాధలు కలిగించుచున్నవి. **(నుణ్)** కృష్ణుని దేహములో కలసిపోవునట్లు కంటికి కనపడని విధముగా దారమువలె సన్ననిదై యున్నది. **(శిఱు)** నడుమునకు కట్టిన పిదప రోటికి కట్టుటకు సరిపోకుండునట్లుగా

చిన్నదిగానున్నది. ఇట్టి త్రాటితో పరాత్పరుడు కట్టుబడినాడా? **(కట్టుణ్ణప్పణ్ణియ)** దానికి తాను కట్టుబడునట్లు కృష్ణుడు తన శరీరమును తానే సంకుచితము చేసుకొన్నాడు. రాతి రోటిని దగ్గరకు తెచ్చుటకు వీలుపడదు. ఇక తన చేతిలో పట్టుబడియున్న ఈ కృష్ణుని విడచి పొడుగైన త్రాటిని వెతుకుటకు ఆమె ప్రయత్నించినచో ఇతడు మరల చేతికందడు. గాలికంటె అతివేగముగా పారిపోవును. ఇకనేమి చేయవలెనా యని ఆమె ఏమియు తోచక తడబడుచుండగా ఆ కృష్ణుడే ఆ చిన్నత్రాటికి కట్టుబడునట్లు తన శరీరమును సంకుచితముగా చేసుకొన్నాడు. **"సదైక రూప రూపాయ"** అని చెప్పబడినట్లు మారుటకు అసలే వీలులేని తన దేహమును సంకోచింపజేసుకొని కట్టుబడుటకు అవకాశము కల్పించినాడు. ఆమె తనను బంధించుటకు ఇట్లకాశమునేల కల్పించవలసి వచ్చెను? ఆమెయే తగిన త్రాడు దొరకలేదని తిరిగిపోయెడిదిగదా! అన్నచో కృష్ణుడు తన అవతారమునకు ప్రధాన ప్రయోజనమైన భక్తపరాధీనత అనెడు సౌలభ్యమును ప్రకటించుకొనుటకు ఇట్టి సదవకాశము మరొకసారి దొరకదని భావించి తానే ఆ బంధములో చిక్కినాడు. తానప్పుడు కట్టుపడనిచో తన సౌలభ్యమును ప్రకటింపజేయు ఇట్టి సదవకాశము చేజారిపోవును కదా! ఈ భక్తవాత్సల్యమును కీర్తించుచూ తక్కిన ఆళ్వారులు కూడా పారవశ్యమునొందిరి. విష్ణు పురాణమున ఈ సందర్భము ఈ క్రింది రెండు శ్లోకములలో వర్ణింపబడియున్నది.

**శ్లో॥ దామ్నా చైవోదరే బద్ధ్వా ప్రత్యబధ్నా దులూఖలే ।**
**కృష్ణమక్లిష్టకర్మాణం ఆహ చేద మమర్షితా ॥**

**శ్లో॥ యది శక్నోషి గచ్ఛత్వం అతి చంచల చేష్టిత ।**
**ఇత్యుక్త్వాథ నిజం కర్మ సా చకార కుటుంబినీ ॥**

యశోద చిన్న త్రాటిని బాలకృష్ణుని నడుమునకు కట్టి రోటివద్దకు లాగుకొని పోయి దానికి ఇతనిని కట్టివేసి రోషముతో "ఓరి తుంటరివాడా! ఇక నీకు చైతనైనచో విడిపించుకొనుము" అనుచున్నది – అని పై శ్లోకములకు భావము. తల్లి కట్టిన బంధమును విడిపించుకొనలేనంతటి విధేయుడు అని ఇతరులకు తోచునట్లు రోటిప్రక్కనే ఒదిగియుండి ఏడ్చుచున్నాడు. శ్వేతాశ్వతరోపనిషత్తునందు **"సంసారబంధ**

**స్థితి మోక్షహేతుః"** అని పరమాత్మ వర్ణింపబడెను. జీవులను సంసారమునందు బంధించుటకుగాని విడిపించుటకుగాని హేతువైన సర్వసమర్థుడగు పరమాత్మ ఒక అబల చేతిలో కట్టుబడి ఆ కట్టును విడిపించుకొనలేని స్థితిలో పడినాడు. సమర్థుడైన ఒక చక్రవర్తి ప్రణయకోపముచేత తన ప్రియురాలు ఒక పుష్పమాలికతో బంధించినచో ప్రేమపరవశుడై దానిని విడిపించుకొనలేని స్థితిలో పడినట్లే, ఈ కృష్ణుడునూ ప్రేమ పాశమునకు బద్ధుడైనాడు. ఇతరులకు కర్మసంబంధముచే కలుగు అతి దృఢమైన సంసార బంధమునుగూడ విడిపించగలడు గాని ప్రేమతో భక్తులు విధించిన బంధమును మాత్రము తాను విడిపించుకొనలేకపోయినాడు. ఆ కర్మపాశమునకంటె భక్తులు చుట్టిన ఈ ప్రేమపాశము అంత గట్టిది.

మధుసూదనసరస్వతి యని ప్రసిద్ధుడైన ఒక అద్వైతయతి కృష్ణునిగూర్చి "ఆనందమందాకినీ" అను స్తోత్రమును వ్రాయుచు ఒక శ్లోకమున ఈ విషయమునే వర్ణించెను.

**యద్బంధస్య విధిత్సయాపి వివశః కీనాశపాశైః దృఢం**
**బద్ధః సానుగ పుత్ర పౌత్ర నికరః దుర్యోధనోస్తం గతః ।**
**తం త్వాం యేన నిబధ్య నందదయితా బృందారకైర్వందితా**
**జాతానందమయీ ముకుంద! మహతే భావాయ తస్మై నమః ॥**

దుర్యోధనుడు తనవద్దకు పాండవదూతగా రాబోవు కృష్ణుడు అతి ప్రసంగ మును చేసినచో ఆయనను బంధించవలెనని తగిన పరికరములను సిద్ధము చేసుకొన్నాడు. ఆ దుర్బుద్ధితో చివరకు అతడే పుత్రపౌత్రాది బంధువర్గముతో సహా యమపాశములచే బద్ధుడై వినాశమునొందినాడు. అదే శ్రీకృష్ణుని యశోదాదేవి ప్రేమపాశముతో బంధించి దేవతలచేతగూడ గౌరవపూర్వకముగా నమస్కరింపబడినది. పరమాత్మ అతి సామాన్యులకుగూడ భక్తిచే కట్టుపడును గాని అహంకారగ్రస్తులకు ఆయనను బంధించుట సాధ్యము కాదని భావము.

అసలు యశోద "అతి చంచల చేష్టిత" అనుచు ఇతనిని కట్టివేయుటకు కారణమేమో విచారింపవలెను. "నా బిడ్డను ఎత్తుకుపోయినాడు, మా ఇంట వెన్న దొంగిలించినాడు, ఊరంతటినీ ఒక మూలకు తెచ్చినాడు" అని వ్రేపల్లెలోని ఒక్కొక్క

స్త్రీయు వచ్చి కొండెములను చెప్పినది. ఈ బాలకృష్ణుడునూ అట్టి కృత్యములలో రాటుదేలినవాడైనందుననూ, ఇతరులు ఎన్ని కొండెములు చెప్పుచున్ననూ అలవాటు పడిపోయినందున మీరు[H] ఇంకనూ ఎన్నైన చెప్పుడు అని మిన్నకుండినాడుగాని నేనా పనులు చెయ్యలేదని తల్లివద్ద అబద్ధమాడలేదు. నిర్భయముగా నిలబడినాడు. అట్టి స్థితిలో కోపమును పట్టలేక, యశోద కట్టివేసి త్రాటితో కొట్టనారంభించినది. అప్పుడు ఈయన హృదయములో లేని దుఃఖమును దిగమింగుకొనుచు అతి దీనముగా మధ్యమధ్య తల్లిముఖమును చూచుచు శోకావేగముచే పెదవులదురుచుండగా ఆమె కోపమును శాంతింపజేయుటకై బేలిముఖముతో రెండు చేతులను జోడించినాడు. అట్టి బాలకృష్ణుని దృశ్యమును చూచి యశోద మనస్సులో ఎంతో పొంగిపోయినదట. అట్టి మనోహరమగు బాల్యచేష్టలను కన్నతల్లియగు నేను చూడలేకపోయితినేయని దేవకి దుఃఖించెనని కులశేఖరులు **"ముழுతుమ్ వెణ్ణెయళైందు"** అను పాశురమునందు చెప్పియున్నారు. దేవాధిదేవతలచేత తలపై నంజలిని జోడించి ప్రార్థింపబడు పరదైవము యశోదకు అధీనుడై చేతులు జోడించినాడనుట భక్తుల హృదయములను ద్రవింపజేయు సన్నివేశము. అంజలిముద్ర ఎంతటివారినైనను కరగింపజేయును అను రహస్యమును తానెరిగినవాడుగనుక దానినే తాను ప్రయోగించినాడు. తీరని అపరాధమును చేసినవారిపై భగవంతుడు సహింపలేక శిక్షయను అస్త్రమును అతనిపై ప్రయోగించుటకు సిద్ధపడినపుడు పశ్చాత్తాపభీతుడైన ఈ అపరాధి భగవంతునివద్ద

---

H ఇచట అరుంబుదము అను టిప్పణిలో తమిళభాషలో ఒక కథ వ్రాయబడియున్నది. దక్షిణ మధురకు సమీపములోనున్న అழగర్ కోయిల్ అని చెప్పబడు తిరుమాలిరుంశోలై అను పర్వత ప్రాంతములో సామాన్యులు అనియు శేరియర్ అనియూ రెండు తెగలవారుండిరి. ఆ రెండు జాతుల వారికినీ ఎప్పటినుండియో పరస్పర వైరభావము రగులుచున్నది. జనసంఖ్యలో ఎక్కువఉన్న శేరియర్ అనువారు సామాన్యవర్గమునకు చెందిన వ్యక్తి తమ కంటపడినపుడు చితకగొట్టుచుండిరి. ఒకనాడు చీకటిపడినపిదప ఈ శేరజాతీయులు తమ వర్గమునకు చెందిన ఒక వ్యక్తి వచ్చుచుండగా పొరపాటున అతనిని సామాన్యవర్గీయుడనుకొని క్రిందపడద్రోసి కొట్టనారంభించిరి. అతడు నేను మీ శేర జాతీయుడనే, నన్నెందుకు కొట్టెదరు అని మొత్తుకొనెను. నిన్ను సామాన్యవర్గీయుడని మేము భావించితి మని ఆ కొట్టుచున్నవారు బదులుచెప్పగా, ఈ దెబ్బలుతినుచున్న వ్యక్తి అయితే మరి రెండు దెబ్బలు కొట్టమని కోరినాడట. అనగా అతనిలో తనకు దెబ్బలవలన కలిగిన బాధకంటె సామాన్యవర్గీయులపై గల ద్వేషము అట్లు పలికించెను అని సూచితమగుచున్నది. అట్లే కృష్ణుడును వారు చెప్పుచున్న కొండెములను లెక్కచేయక దెబ్బలు తినుటకు సిద్ధపడినాడని గ్రహింపవలెను.

చేయు ఈ అంజలిబంధము ప్రత్యస్త్రమువలె ఉపయోగించునని దానితో స్వామియొక్క కోపము చప్పున చల్లారునని శ్రీ వేదాంతదేశికులవారు **"ప్రత్యస్త్రమంజలి రసౌ తవ నిగ్రహాస్త్రే"** అని అంజలి వైభవమును తెలిపియున్నారు.

**(పెరుమాయన్)** గొప్ప ఆశ్చర్యకరమగు చేష్టలు కలవాడు. తాను పరాత్పరుడై యుండి అవాప్తసమస్తకాముడైయుండిగూడ లేకివానివలె వెన్నకొరకై దొంగతనము అను చెడుమార్గమునకు దిగుట, సమర్థుడైయుండిగూడ ఆ దొంగతనమును దాచుకొన లేక పట్టుబడుట, కట్టుబడుట, దెబ్బలుతినుట, బేలిముఖముతో చేతులు జోడించుట ఈ స్థితి నిజముగా ఆశ్చర్యపడవలసిన విషయమే గదా! ఇంతకంటె మరొక ఆశ్చర్యమును లీలాశుకుడు కృష్ణకర్ణామృతములో క్రింది శ్లోకములో వర్ణించినాడు.

**శ్లో॥ అంతర్గృహే కృష్ణ మవేక్ష్య చోరం**
**బద్ధ్వా కవాటం జననీం గతైకా**
**ఉలూఖలే దామనిబద్ధ మేనం**
**తత్రా దృష్ట్వా స్తిమితా బభూవ.**

కృష్ణుడొక గోపిక ఇంటిలో వెన్నను దొంగిలించుచుండగా ఆ గోపిక ప్రత్యక్ష ముగా చూచినది. వెంటనే కృష్ణుడు తప్పించుకుపోకుండా ఇంటి తలుపులుబిగించి యశోదతో చెప్పుటకు ఆమె ఇంటికి వెడలినది. అక్కడగూడ తల్లిచే రోటికి కట్టబడియున్న కృష్ణుని చూడగనే ఆమె ఆశ్చర్యమునకు అంతులేకపోయినది. నేను మా ఇంటితలుపులు బంధించి వచ్చితిని గదా! ఇతడు ఇచటికెట్లు వచ్చెను? అని ఆమె ఆశ్చర్యముతో నివ్వెరపోయినది. ఇది కృష్ణుని అద్భుతమైన మాయయే కదా! ఇట్లు మహామాయావియగు కృష్ణునికంటె తమ ఆచార్యులగు శఠగోపమునీన్ద్రుల భక్తివైభవమే తమకు అతిప్రియమైనట్లు ఈ మధుర కవులు చెప్పుకొనుచున్నారు. వీరికి ఆళ్వారులే అంతగా ఇష్టమైనచో ఆ కృష్ణుని చరిత్ర మును అంతగా చెప్పనేల? అని కొందరికి సందేహము కలుగవచ్చును. కాని ఆ యాళ్వారులకు కృష్ణచరిత్రము ప్రియముగనుక వారి ప్రీతికై వీరు ఆ చరిత్రను ప్రస్తా వించక తప్పలేదు. ఆ భగవంతునితో నాకవసరము లేదు అన్న పక్షమున ఈ ఆళ్వారు లతో తమకుగల సంబంధము త్రెంచుకొన్నవారగుదురు. కనుక ఆ కృష్ణ చరిత్రము ప్రస్తావించిరి. **(ఎన్నప్పనిల్)** అని ఆయననుగూడ తమ స్వామిగా చెప్పుకొనిరి. లేక-

ఇష్టములేకున్ననూ భగవత్సౌందర్యము వంకకు ఒకసారి చూచినపుడు **"పుంసాం దృష్టి చిత్తాపహారిణం"** అన్నట్లు ఆ కృష్ణసౌందర్యముచే వీరు ఆకర్షింపబడి తమ ఆచార్యుల ప్రక్కనే యున్ననూ పరవశులై అట్లు వర్ణించిరి అని సమాధానమును చెప్పవచ్చును.

**(నణ్ణి)** నేను ఆ భగవంతుని విడచి ఈ ఆచార్యులనాశ్రయించితిని. ఇచట నొక విశేషమున్నది. అనాదిగా వచ్చు బాహ్య విషయములపైగల అభిలాషను వదలి భగవద్విషయముపై మనస్సు మరలుట అతి దుర్లభమైన విషయము. నూటికో కోటికో అన్నట్లు ఏ ఒకరిద్దరికో ఈ భాగ్యము కలుగును. **"మనుష్యాణాం సహస్రేషు"** అని కృష్ణుడే ఈ విషయమును చెప్పెనుగదా! కాని అట్టి భగవంతునిగూడ విడచి పరమ భాగవతుడైన ఆచార్యునిపై మనస్సును లగ్నము చేయుట అత్యంత దుర్లభము. అసాధ్యముగూడ. అట్టి అసాధ్యమైన ఆచార్యప్రతిపత్తి ఈ మధురకవులలో కలిగినది. వైరాగ్యమేర్పడి, బాహ్య సంబంధములను త్రెంచుకొని భగవంతుని ఆశ్రయించుట అసాధ్యముగాని, ఆచార్యుని ఆశ్రయించుటకై ఆయననుగూడ ప్రక్కకు పెట్టుట అసాధ్యమా? అని సందేహము కలుగవచ్చును. అవును. ఇది అసాధ్యమే. బాహ్య విషయములలో కొన్ని దోషములను గుర్తించి వాటిని విడువవచ్చునుగాని సకల కల్యాణగుణపూర్ణుడైన భగవంతునిలో ఏ దోషములు లేనందున ఆయనను విడచుట, ఆచార్యులకొరకై ఆయనపై ప్రేమను తగ్గించుకొనుట అత్యంతం అసాధ్యమే కదా!

**(తెన్గురుకూర్ నమ్బి) –** దక్షిణకురుకాపురమున వేంచేసియుండు ఈ ఆళ్వారులను (నమ్బి) అనగా పరిపూర్ణులు అని మధురకవులు కీర్తించుచున్నారు. **"పూర్ణమిదం పూర్ణమదః"** ఇత్యాది వేదమంత్రములుగాని పెద్దలుగాని ఇంతవరకును భగవంతుని మాత్రమే పూర్ణుడు అని వ్యవహరించుచుండిరి. ఇపుడు మధురకవులు తమ ఆచార్యులైన ఆళ్వారులకు ఈ పూర్ణతను ప్రతిపాదించుచున్నారు. **"నల్గి ఎన్నై విడాన్ నమ్బి నమ్బియే"** అని తమ ఆచార్యులు ఆ భగవంతుని నమ్బి అని (పూర్ణుడు అని) వ్యవహరించుచుండగా వీరు ఆచార్యులను ఇచట 'నమ్బి' అనుచున్నారు. ఆ భగవంతునికంటె వీరే పరిపూర్ణులు అని మధురకవుల అభిప్రాయము. ఎందుకనగా భగవంతుని ఆశ్రయించినంతమాత్రమున భక్తునికి పరిపూర్తి లభించదు. ఆపైన తదీయులను కూడ ఇతదాశ్రయించినపుడే పరిపూర్ణత సిద్ధించును. కాని ఆచార్యుల నాశ్రయించిన పిదప మరియొకరిని ఆశ్రయింపపనిలేదు గనుక ఆచార్యులలోగల పూర్తి పరాకాష్ఠకు చెందినది అని భావము. ఆచార్యులను నమ్బి శబ్దముతో

వ్యవహరించు మంచి అభ్యాసమును మధురకవులే మనకు మొదట కలిగించిరి అని నంజీయరువారు చెప్పుచుండిరట. **(యెన్ఱక్కాల్)** అట్టి సద్గుణ పరిపూర్ణులైన ఆచార్యుల నామమును నోటితో ఉచ్చరించిన చాలును. భగవంతుని ఆశ్రయించుటకు "కాయేన వాచా మనసా" అన్నట్లు త్రికరణముల ప్రవృత్తి కావలెను. ఆచార్యానుగ్రహమునకు వారి నామోచ్చారణము మాత్రమే చాలును. ఇదియే ఉజ్జీవనకు అతి సులభోపాయము.

**(అణ్ణిక్కు మము తూఱుం) –** వారి నామానుసంధానము నాకు అతి ప్రియమైనది. భగవద్గుణానుభవముచే వారికి కలిగిన ఆనందము నాకు నామానుసంధానముచేతనే కలిగినది. ఆళ్వారులకు "న చ పునరావర్తతే" అని చెప్పబడిన పునరావృత్తిరహితమైన మహానందమనబడు మోక్షము లభించినట్లు నాకు నిత్యమూ ఉచ్చరించుచుండిననూ నోరు ఊరించు అమృతమువలె వీరి నామానుసంధానము అపూర్వ ఆనందప్రదమైనది.

**(ఎన్నావుక్కే) –** నా నాలుకకు వారి నామోచ్చారణలో ఇంతటి రుచి ఏర్పడినది. ఆచార్యుల నామముపై మాకు అంతటి రుచి కలుగలేదే! మీకెట్లు కలిగినది అందురేమో! మొదటి మెట్టు అనబడు భగవంతునియందే నిష్ఠగల మీకు చరమావధి యనబడు ఆచార్యనిష్ఠలోగల వైభవము మీ అవగాహనకు రానందున మీకు అందలి భోగ్యత తెలియరాదు. ఇది నాకే అనుభవైకవేద్యము.

h h

## పాశురము - 2

మొదటి పాశురమునందు నమ్మాళ్వారుల దివ్య నామానుసంధానమునందు తమకు కలిగిన ఆనందమును తెలుపుకొన్నారు. వారు ప్రసాదించిన ప్రబంధములలోని పాశురములతోనే తమకు జీవయాత్ర కొనసాగుచున్నట్లు ఇచట వివరించుచున్నారు.

**మూలము :**

**నావినాల్ నవిత్తిన్బ మెయ్‌తినేన్**
**మేవినే నవన్ పొన్నడి మెయ్‌మ్మైయే**
**తేవు మత్తఱియేన్ కురుకూర్ నమ్బి**
**పావి నిన్నిశై పాడి త్తిరివనే.**

**ప్రతిపదార్థము :**

నావినాల్ = నాలుకతో

నవిత్తు = స్తుతించి

ఇన్బమెయ్‌తినేన్ = మహానందమును పొందితిని

అవన్ = ఆ శఠగోపులయొక్క

పొన్నడి = దివ్య శ్రీపాదములను

మెయ్‌మ్మైయే = నిజముగా

మేవినేన్ = ఆశ్రయించితిని

మత్తుతేవు = వేరొక దైవమును

అఱియేన్ = ఎరుగను

కురుకూర్‌నమ్బి = కురుకాపురమునందలి ఆళ్వారులయొక్క

పావిన్–ఇన్–ఇశై = ఛందోబద్ధమై మధురమైన గేయరూపమగు పాశురములను

పాడి తిరివనే = పాడుచూ తిరుగుచుందును.

**వివరణము :**

**(నావినాల్ నవిత్తు) –** వెనుకటి పాశురమున చెప్పినట్లు అతి భోగ్యమైన ఆచార్య నామానుసంధానముతో, లేక వారిని స్తుతించుటతో మిక్కిలి ఆనందమును పొందినట్లు చెప్పుచున్నారు. మనస్సహకారము లేకుండ నోటితో ఉచ్చరించినంత మాత్రముననే మహానందము కలుగుచుండగా ఆనందకరమై అతిభోగ్యమైన ఆ అనుసంధానమును విడచుట సాధ్యము కాదుగదా! భగవంతుడు ఇచ్చిన నాలుకకు ఇపుడు సార్థక్యము ఏర్పడినది. **"ప్రత్యక్షే గురవః స్తుత్యాః"** అన్నట్లు గురువును స్తుతించుటయే నాలుకకు ప్రయోజనము కదా! ఈశ్వరుడు ఇచ్చిన నాలుకను దురుపయోగము చేసినవారు ఎందరో ఉన్నారు. అట్లుగాక ఆచార్యస్తుతిచే భగవంతు డిచ్చిన నాలుకను సార్థకము చేసుకున్నవాడను నేనొక్కడనే సుమా!

**(ఇన్బమెయ్‌తినేన్) –** ఆళ్వారులు భగవద్విషయమును స్తుతించి ఎట్టి శాశ్వతానందమును పొందరో నేను వారిని స్తుతించి ఆ యానందమునే పొందితిని. వారు త్రికరణములతోనూ స్తుతించిరి. నేను నోటితో మాత్రమే స్తుతించి ఆనందించి తిని. పూర్వము నా ఈ నాలుకతో భగవంతుని, భగవద్భక్తులను దూషంచి ఎన్నో

పాపములను చేసితిని. సృష్టి ప్రళయములకు మధ్యనున్న కాలమంతయు నరలోకము ననే శిక్షననుభవించుటతో గడచిపోయినంతటి పాపమును చేసితిని. అట్టి నాలుకతో ఇప్పుడు ఆచార్యస్తుతిని చేసి పొందిన మహానందము ఇతర విషయములన్నింటినీ నేను మరచిపోవునట్లు చేసినది.

**శ్లో॥ "నవివేద ఆత్మనోగాత్రం**
**తత్స్మృత్యాహ్లాద సంస్థితః"**

అని విష్ణుపురాణమున చెప్పబడినట్లు కొండలపై నుండి పడద్రోసిననూ, ఏనుగులచే త్రొక్కించిననూ అగ్నిలోనూ సముద్రములోనూ పడవేసినను ప్రహ్లాదుడు భగవన్నామ స్మరణమను మహానందములో ఆ దుఃఖములన్నియు మరచినాడన్నట్లు నేనునూ అంతటి నిరతిశయానందము నొందితిని.

**(అవన్ పొన్నడి మెయ్మ్మైయే మేవినేన్)** – నాలోని దోషములను చూసి ఈశ్వరుడు కూడ రక్షింపదలంపక ఉపేక్షించినపుడు వీరి శ్రీపాదములే నాకు శరణమైనవి. భగవంతుని ఆశ్రయించుటకు లక్ష్మీ పురుషకారము అవసరముగాని, నాకు ఇచట ఏ పురుషకారముగూడ అవసరము లేకుండబోయినది. భగవదనుగ్రహ మును పొందుటకు ఎన్నో వర్ణాశ్రమాది ధర్మములు ఆచరించుటవంటి క్లేశములు అవసరముగాని, ఆచార్యులనాశ్రయించి వారి అభిమానమును పొందుటకు అట్టి కష్టములుగాని ఇతరుల పురుషకారములుగాని ఏమియు అవసరము లేదు.

ఇచట నంజీయరువారిని గురించి ఒక వార్తను స్మరింపదగును. అది ఏమనగా, గొప్ప అద్వైత వేదాంతవేత్తగా మొదటిలో పేరుపొంది, పిదప భట్టరువారి శిష్యులైన నంజీయరువారు కొంతకాలమునకు వైరాగ్యముచే సన్యాసమును స్వీకరించిరట. అపుడు 'ఆనందాళ్వాన్' అను మరియొక మహాచార్యులు ఆ నంజీయరును చూచి ఛలోక్తిగా ఇట్లు చెప్పిరట – "శ్రమకరమైన సన్యాసమునేల స్వీకరించితివి? ఓపిక యున్నపుడు స్నానముచేసి, ఆకలియైనపుడు ఇంత తిని, భట్టరువారి శ్రీపాదములే నాకు రక్షకమని ఏ మూలనో పడియున్ననూ నీకు మోక్షము రాకపోయినదా? అయినపుడు నీ ఆచార్యులైన భట్టరువారి సన్నిధిలో కైంకర్యమును చేయుటకు ప్రతిబంధకముగా తయారైన ఈ సన్యాసివేషమునేల స్వీకరించితివి?" ఈ వృత్తాంతమునుబట్టి ఆచార్యాభిమానపాత్రుడైనచో ఏ శాస్త్రీయ విషయములను

పాటించనవసరము లేకుండా ఉజ్జీవింపవచ్చునని తెలినది. నేను అట్లు ఆళ్వారుల పాదములనాశ్రయించి ధన్యుడనైతిని గదా యని వీరి ఆనందము.

**(మెయ్మ్మైయే మేవినేన్) –** దృఢముగా నాశ్రయించితినని ప్రమాణము చేయుచున్నారు. మహోపకారకులైన వీరిని ఆశ్రయించిన పిదప ఏదో ఫలితము నపేక్షించి ఇతరులనాశ్రయించవలసిన మార్పు కలుగకుండ గట్టిగ వీరి పాదములనే నమ్మితిని. ఈ లోకములో నున్నపుడు ఎన్నో అజ్ఞాత విషయముల నాకుపదేశించి పరమపదమును పొందుటకు పురుషకారభూతులై అచ్చటగూడ భగవత్సేవకు సహకరించిన వీరినే ఇచట, నచట గూడ నాకు గతియని ఆశ్రయించితిని. శ్రీ యామునాచార్యులు **"అత్ర పరత్ర చాపి నిత్యం యదీయ చరణౌ శరణం మదీయం"** అని చెప్పినట్లు నాకుగూడ ఈ లోకముననూ ఆ శ్రీవైకుంఠమునగూడా ఈ ఆళ్వారుల శ్రీపాదములే శరణము.

**(తేవు మత్తఱియేన్) –** వేరొక దైవము కలదని నమ్మను అను ఈ వ్యతిరేక వాక్యముచేత భగవంతునియందుగూడ తమకు దైవభావన లేనట్లు, వీరే పరదైవమైనట్లు దృఢనిశ్చయమును తెలుపుచున్నారు. వీరు ఈ మాటను **"ఆచార్య దేవో భవ"** అను శాస్త్రప్రమాణమునుబట్టిగాని, లేక ఆచార్యులే ఇట్లుపదేశించుటనుబట్టిగాని చెప్పుట లేదు. తమకు ఆళ్వారులపైగల ప్రగాఢ భక్తిభావనతోనే "వేరొక దైవమునెరుగను" అని శపథము చేయుచున్నారు.

**(కురుకూర్ నమ్బి పావినిన్నిశై)** కురుకాపురమునందు వేంచేసియున్న ఈ ఆళ్వారులను ఆశ్రయించిన పిదప మోక్షముకొరకై ఇతరులనాశ్రయింపవలసిన అవసరము లేనట్లుగా, సర్వగుణ పరిపూర్ణులైన శఠగోపులు నాకు లభించిరి. వారి ముఖారవిందమునుండి అవతరించిన దివ్యప్రబంధము తిరువాయ్మొழி. అది ఛందోబద్ధమై, పాడుటకు అతి మధురమై యున్నందున నిత్యము దానిని గానము చేయుచునే కాలము గడుపుదును. లేక, ఇచట "కురుకూర్ నమ్బిపా" అనగా వారిని గురించి తాను రచించిన ఈ చిన్నస్తోత్రము (కణ్ణినుణ్ శిరుత్తామ్బు) అనిగూడ అర్థము చెప్పుకొనవచ్చును. దీనిని పాడుకొనుచున్నంత మాత్రమున వీరి దేహయాత్ర ఎట్లు గడుచును? అందురేమో! నిత్యము ప్రీతితో ఈ ప్రబంధమునే పాడుకొనుచు సంచరించుచుందును. నాకు ఈ ప్రబంధగానమే ఆహారము. ఏ పనియూ లేనివానిని

గూర్చి 'వీడేమి చేయుచుండును' అని ప్రశ్నించినపుడు 'తినితిరుగుచుండును' అని లోకమున బదులు చెప్పుట ఒక వాడుక. అట్లే నేనును ఎక్కడెక్కడ తిరిగిననూ, ఈ ప్రబంధమును గానము చేయుచూ పోవుదును. ఇట్లు దివ్య ప్రబంధగానము చేయుచు తిరుగుచుండు నన్ను ఎవరునూ ఆపజాలరు. దివ్య ప్రబంధానుసంధానముతో నేను సాగించు ఈ సంచారము శ్రీవైకుంఠప్రాప్తి వరకు కొనసాగునుగాని యముడో అతని భటులో కర్మఫలానుభవమునకై రమ్మని మధ్యలో అడ్డగించి, నా సంచారమును నిరోధింపజాలరు అని పాడి-తిరివనే అను పదములచే సూచింపబడుచున్నది.

h h

## పాశురము - 3

వెనుకటి పాశురమున "తేవుమత్తఱియేన్" ఆళ్వారులను తప్ప మరొకరిని దైవముగా గుర్తింపను అని తెలిపియున్నారు. మీకు ధర్మార్థకామములు అను ఇతర పురుషార్థములతో అవసరము లేకున్ననూ మోక్షప్రదుడైన భగవంతుని సంబంధము కూడ ఇట్లు త్రోసివేయుట తగునా అను ప్రశ్నకు సమాధానముగా ఈ పాశురమును చెప్పుచున్నారు. నాకు ఆ భగవత్సంబంధము పురుషార్థము (అభీష్టము) కాదు అని మాత్రమే నేనా భగవంతునికి దూరముగా ఉన్నాను. మా ఆళ్వారులకు ఆయన అభీష్టము గనుక ఆ రీతిలో వారితోపాటు నేనుగూడ ఆయనను దర్శించి సేవింతును. ఆండాళ్ అమ్మవారు తాము ప్రసాదించిన నాచ్చియార్ తిరుమొழி అను ప్రబంధము నందు ఈ విషయమునే తెలిపియున్నారు.

**నల్ల వెన్ తోழி నాకణై మిశై నమ్బరర్**
**శెల్వర్ పెరియర్ శిఱుమానిడవర్ నామ్ శెయ్‌వతెన్?**
**విల్లిపుతువైవిట్టుశిత్తర్ తఙ్గళ్ తేవరై**
**వల్లపరిశు వరు విప్పరేలతు కాణ్డుమే.**

ఓ నా ప్రియసఖీ! ఆదిశేషునిపై శయనించి మనచే ఆశ్రయింపదగిన ఆ శ్రియఃపతి చాలా గొప్పవాడు. అల్పమానవులమైన మనము ఏమి చేయగలము? నేరుగా ఆయనను పొందలేము అని భావము. కనుక విల్లిపుత్తూరునందు వేంచేసి యుండు మా తండ్రిగారు శ్రీ విష్ణుచిత్తులు తమకు ప్రియమైన ఆ భగవంతుని ఎన్నో

మంచి పద్ధతులతో పిలచి రప్పించినచో అప్పుడు మనము ఆయనను దర్శించగలము. దీనినిబట్టి ఆచార్య పురస్సరముగనే భగవదాశ్రయణము ఉచితమని తేలినది. కనుక అట్లే వీరును ఆళ్వారులను ముందుంచుకొనియే వారికి ఇష్టమైన భగవంతుని నేను దర్శింతును అనుచున్నారు.

భీష్మాచార్యులు "ఏష మే సర్వధర్మాణాం ధర్మోధికతమోమతః" అని సహస్ర నామాధ్యాయమునందు భగవన్నామానుసంధానమే తనకు అత్యంతాభిమతమైనట్లు తెలుపగా అట్లు ఆచార్యులకు అభీష్టమైన ఉపాయమునే తమకును అభీష్టమైనట్లు ధర్మరాజు స్వీకరించియున్నాడుగదా! భగవద్రామానుజుల శిష్యురాలైన త్రిపురాదేవి అను మహాభక్తురాలు "విష్ణువునే ఏల నీవాశ్రయింతువు? ఇతర దేవతలనుగూడ సేవింపరాదా!" అని ఎవరో తనను అడిగినపుడు ఆమె చెప్పిన సమాధానము ఇచట గుర్తింపదగియున్నది. "మా ఆచార్యులైన రామానుజులు ఈశాన్యపుమూలనుండు దైవమును ఆశ్రయింపుమని చెప్పినచో మేమును అట్లే ఆశ్రయింతుము. అంతేకాని వారు పరదైవముగా చెప్పని ఇతర దేవతలను మేమాశ్రయింపము" అని ఆమె సమాధానము చెప్పినదట.

పుణమలైప్పాడి అను ఒక గ్రామమునందు గాంగేయుడు అను పేరుగల ఐశ్వర్యవంతుడైన ఒక జమీందారు కలడు. తనకు దక్షిణమందున్న మరియొక రాజుపైకి దండెత్తిపోయిన సమయమున మధ్యమార్గమున అతనికి కావలసిన ఆహారసామగ్రి తరిగిపోవగా, పిళ్లై ఆచ్చాన్ అను ఒక శ్రీవైష్ణవులు అతను కోరిన బియ్యము పప్పులు మొదలగు ఆహారసామగ్రిని అతనికి సహాయముగానందించిరి. ఆ గాంగేయుడు యుద్ధమునందు గెలిచి తిరిగివచ్చిన పిదప సహాయపడిన ఈ ఆచార్యులవారికి మీరు చేసిన ఉపకారమునకు కృతజ్ఞతగా మీకు ఏదైన సమర్పించెదను. ఏమి కావలెనో కోరుకొనుడు అని యడిగెను. అపుడు ఆ ఆచార్యులు "నీవలన పూర్వమే నేను ఉపకారమును పొందియున్నాను కదా అదే చాలును" అని బదులు చెప్పగా, అతడు "నాకు తెలియకుండానే నావలన మీకేమి యుపకారము జరిగినది?" అని మరల ప్రశ్నించెను. అపుడు ఆ పిళ్లై ఆచ్చాన్‌గారు చెప్పిన సమాధానమేమనగా–"నీవు మా ఆచార్యులకు శ్రీరంగమునందు నివసించుటకు భూమిని యిచ్చి ఇల్లు కట్టించి నివాసము ఏర్పరచినావట. మా ఆచార్యులు ఈ

విషయమును పలుసారులు చెప్పగా వింటిని. మా ఆచార్యులకు చేసిన ఉపకారమే నాకును ఉపకారముగా నేను భావింతును. ఇంతకంటె నీవు చేయవలసిన మహోపకారమేమున్నది?" ఈ సమాధానమునుబట్టి తమ ఆచార్యులకు ప్రియుడైన ఆ గాంగేయుడు తమకునూ ప్రియుడైనట్లునూ కనుకనే అతనికి తాము అవరమగు ఆహారసామగ్రిని ఇచ్చి సహకరించినట్లును తేలినది.

రామానుజులు ఒకప్పుడు ధూర్తుడైన చోళరాజుయొక్క బాధలను భరించలేక కర్ణాటక ప్రాంతమును వెళ్ళిపోయిన సమయమున ఆ రాజు శ్రీరంగ దేవాలయము లోనికి రామానుజుల సంబంధులైన శిష్యులను ఎవరినీగూడ ప్రవేశింపనీయరాదు అని భటులనాజ్ఞాపించెను. అది తెలియక కూరత్తాళ్వానులు భగవద్దర్శనమునకై వెళ్ళగా ఒక ద్వారపాలకుడు నిరోధించెను. మరియొక భటుడు "ఈయన సాధుస్వభావుడు. ఎవరినిగూడ నిరోధించువాడు కాడు. ఈయనను దర్శనమునకై ఆలయములోనికి పంపవచ్చు"నని తెలిపెను. అపుడు కూరత్తాళ్వానులు మొదటి ద్వారపాలకునివలన రాజాజ్ఞను గురించి విని, తాము ఆలయములోనికి వెళ్ళుటయా, మానుటయా అని కొంతసేపు తర్కించుకొనిరి. రెండవ రక్షకభటుడు చెప్పినట్లు నాలోని మంచి గుణములు మోక్షహేతువని భావించితిని గాని ఆ గుణములనుబట్టి నేను రామానుజులకు దూరమై భగవద్దర్శనమును చేయదలంపను. రామానుజ సంబంధమే నాకు చాలును అని వెనుదిరిగి ఇంటికిపోయినారట. ఇట్లు ఈ ఐదు ఉదాహరణముల చేతనూ ఆచార్య సంబంధ పూర్వకముగనే భగవదాశ్రయణము కర్తవ్యముగాని అది లేనిచో స్వతంత్రముగా భగవంతునితో సంబంధమును పెట్టుకొనుట తగదు అని తేలినది. అట్లే ఈ పాశురములో శ్రీ మధురకవులుగూడ తమకు ఆచార్యులు పరమోద్దేశ్యమని వారిద్వారా భగవద్దర్శనము అభీష్టమనియూ తెలుపుచున్నారు.

**మూలము :**

**తిరితన్దాకిలుమ్ తేవపిరానుడై**
**క్కరియకోల త్తిరువురుక్కాణ్బన్ నాన్**
**పెరియవణ్ కురుకూర్ నకర్ నంబిక్కా**
**ళురియనాయడియేన్ పెత్తనన్మైయే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తిరితన్దాకిలుమ్ | = | (ఆచార్యసేవనుండి కొంతసేపు నేను) వెనుదిరిగినప్పటికినీ |
| తేవపిరానుడై | = | నిత్యసూరులకు మహోపకారకుడైన స్వామియొక్క |
| కరియకోల | = | నీలమై సుందరమగు |
| తిరువురు | = | దివ్యమగు భగవద్విగ్రహమును |
| నాన్‌కాణ్బన్ | = | నేను దర్శించగలను |
| పెరియవణ్ | = | గొప్ప ఔదార్యగుణము కలిగిన |
| కురుకూర్ నకర్‌నమ్బి | = | కురుగూర్ అను మహానగరమందుండు గుణ పూర్ణులైన ఆళ్వారులకు |
| అళురియనాయ్ | = | తగిన దాసుడనైయుండి |
| అడియేన్ | = | నేను |
| పెత్తనన్మైయే | = | భగవన్ లాభము అను మంచి ఫలితమును పొందగలిగితిని. |

**వివరణము :**

**(తిరితన్దాకిలుమ్)** వెనుదిరిగినప్పటికిని అని దీని అర్థము. ఆళ్వారులు, వారి ప్రబంధములు ఇవే తమకు అతి ప్రియమైనవి. వీటితోనే తమ జీవయాత్ర. అదే పద్ధతిలో తిరుగుచూ అనుకోకుండ భగవద్దర్శనములోనికి దిగిననూ అని దీని భావము.

**(తేవపిరానుడైక్కరియకోల ... ఇత్యాది) –** నేను దేవాధిదేవుడైన భగవంతుని దివ్యమంగళ విగ్రహమునే దర్శించగలిగినాను. ఆయన దేవాధిదేవుడు. "పిరాన్" అనగా ఉపకారకుడు. నిత్యసూరులకుగూడ తన దివ్యమంగళవిగ్రహసేవను ప్రసాదించి అనుభవింపజేయు మహోపకారకుడు అని అర్థము. ఈ మధురకవులు భాగవతనిష్ఠయే ముఖ్యమని ఎంచినవారు గనుక ఆ వైకుంఠమునగూడా నిత్యసూరులగోష్ఠిని ముందుగా తలంచుకొని, పిదప, వారికినీ సేవ్యమగు భగవన్మూర్తిని ప్రస్తుతించుచున్నారు. అచటి నిత్యసూరులు **"అహమన్నాదోహమన్నాదః"** అని శ్రుతి చెప్పినట్లు భగవద్దర్శనమునే అమృతమువంటి భోగ్యాహారముగా స్వీకరింతురు. నీలమేఘమువలె సంతాపహరమై సుందరమైనది భగవద్విగ్రహము. తమ ఆచార్యులైన ఆళ్వారులు తిరువాయ్‌మొళ్రి ప్రబంధములో **"కోలమే తామరైక్కణ్ణతోరఞ్జన నీలమే"** అని భగవంతుని వర్ణించి యున్నారు. ఆ వర్ణనను విన్నవారుగనుక వీరును, సౌందర్యము మూర్తీభవించినట్లున్న

పద్మములవంటి నేత్రములు కలిగిన ఓ నీలమేఘశ్యాముడా అని వర్ణించుచున్నారు. తమకు వర్ణనీయము ఆచార్యులైన ఆళ్వారులయొక్క దివ్య విగ్రహమే అయిననూ వారికి అభీష్టమైనందున భగవన్మూర్తి ఇట్టిదట అని వర్ణించుచున్నారు. కొంతకాలము యోగనిష్ఠుడైయుండి ఆ యోగమునుండి భ్రంశమునొందిన మునులు తమ తపస్సమాధికి భంగము కలిగించిన ఊర్వశియొక్క సౌందర్యమును యథాలాపముగా వర్ణించినట్లు వీరుకూడ ఇష్టము లేకున్ననూ భగవత్సౌందర్యమును వర్ణించిరి.

**(కాణ్బన్ నాన్) –** నేను సాక్షాత్కరింపగలిగితిని. ఆళ్వారులను తప్ప ఇతరులను దైవముగా నెంచననియు, ఒకవేళ దర్శింపవలసివచ్చినచో ఆ పరమపద నాథునే దర్శించెదను అనియు భావము.

**(పెరియవణ్ కురుకూర్ నకర్ నమ్బిక్కు) –** మహాగుణపరిపూర్ణులైనవారు మా ఆచార్యులు అని పెరియవణ్+నమ్బి అను పదములు తెలుపుచున్నవి. భగవంతుని ప్రభావముగూడ నన్నాకర్షింపలేదు. కాని వీరి సదుపదేశము నన్ను దాసునిగా చేసినది. కనుక భగవంతునికంటె వీరి ఔదార్యము గొప్పది అని సూచింప బడుచున్నది. శ్రీవైకుంఠనగరముయొక్క పేరెత్తినచో ఆళ్వారులకెంత ఇష్టమో ఈ కురుకాపురముయొక్క పేరెత్తిననూ అందలి ఆళ్వారుల పేరెత్తిననూ తమకు అంత ఇష్టము అని తెలుపుచున్నారు. భగవంతుని యొక్క అనుభవము భాగవతుల పర్యంతము వెళ్ళనిచో పూర్తికాదు. కాని పరమభాగవతులైన మా ఆచార్యులను అనుభవించినపుడు అందులోనే భగవదనుభవముగూడ యిమిడియున్నందున తిరిగి భగవద్గుణానుభవమునకై ప్రయత్నము చేయనవసరము లేదు.

**(ఆళురియనాయడియేన్ పెత్తనన్మైయే) –** తమ స్వరూపము నెరిగిన ఉత్తములైన శిష్యులు వేరే ప్రియము అప్రియము అనునవి లేకుండా ఆచార్యులకు ప్రియమైనదే తమకునూ ప్రియము వారి అప్రియమైనదే తమకునూ అప్రియము అని భావింతురు. మా ఆచార్యులు "తొణ్డీర్ ఎల్లీరుం వారీర్" భక్తులైనవారు అందరునూ రండు అని పిలచి తమ ఉపదేశామృతమును అందరికినీ పంచిపెట్టిన మహోదారులు. వారి యనుగ్రహముచే నేను భగవత్సాక్షాత్కారమును పొందగలిగితినిసుమా! అని సంతోషముగా చెప్పుకొనుచున్నారు.

h h

## పాశురము - 4

ఒకటి, రెండు పాశురములలో వెనుక మధురకవులు భగవంతునికంటె గూడ ఆళ్వారుల నామమును కీర్తించుటయే తమకు అతిప్రియమైనట్లు చెప్పుకొన్నారు. ఒకవేళ భగవంతుని దర్శింపవలసివచ్చిననూ స్తుతించిననూ ఆయన ఆళ్వారులకు ఇష్టమైనవాడు గనుక దర్శించినట్లు చెప్పుకొన్నారు. వారు ఇష్టపడిననూ ఆయనను కీర్తించుటకు నీకేమి అవసరము అన్నచో, నాలో ఎన్నో దోషములున్ననూ వాటిని క్షమించి నన్ను స్వీకరించిన మహోదారులైన మా ఆళ్వారులు అంగీకరించిన భగవద్విషయమును నేను మాత్రము కాదనగలనా? అనియూ వెనుక సమాధానము నిచ్చియున్నారు. ఐతే మీలోగల దోషములేవి? ఇతరులందరునూ తిరస్కరించిన మిమ్ములను ఆ స్వామి దగ్గరకు తీసిన విధమేది? అను ఆశంకకు ఈ నాలుగవ పాశురమున సమాధానమిచ్చుచున్నారు.

**మూలము :**

**నన్మైయాల్మిక్క నాన్మఱైయాళర్కళ్**
**పున్మైయాక క్కరుతువరాతలిల్**
**అన్నైయా యత్తనా యెన్నై యాణ్డిడుమ్**
**తన్మైయాన్ శడకోప నెన్నమ్బియే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| నన్మైయాల్ | = | సద్గుణసంపత్తినిబట్టి |
| మిక్క | = | గొప్పవారైన |
| నాన్మఱైయాళర్కళ్ | = | చతుర్వేదసారమును గ్రహించిన పెద్దలు |
| పున్మైయాక | = | (నన్ను) అతి పాపిష్ఠునిగా |
| కరుతువర్ | = | తిరస్కరించిరి |
| ఆతలిల్ | = | ఆ దోషములనే హేతువుగా భావించి |
| అన్నైయాయ్ | = | తల్లివలెనూ |
| అత్తనాయ్ | = | తండ్రివలెనూ |
| యెన్నైయాణ్డిడుమ్ | = | నన్ను రక్షించునటువంటి |

| | | |
|---|---|---|
| తన్మైయాన్ | = | స్వభావము కలవారైన |
| శడగోపన్ | = | నమ్మాళ్వారులు |
| ఎన్నమ్బియే | = | నాకు సర్వవిధముల రక్షకులైనవారు |

**వివరణము :**

చతుర్వేదసారమును గుర్తించి బ్రహ్మవేత్తకు ఉండవలసిన సద్గుణములన్నియు పూర్తిగా కలిగిన పెద్దలందరునూ, నా దోషములను చూచి, ఛీ అని అసహ్యించుకొని దూరముగా నన్ను తరిమికొట్టిరి. అట్టి స్థితిలో ఈ ఆళ్వారులొక్కరు తప్ప నన్ను దగ్గరకు తీసి అనుగ్రహించినవారు మరెవ్వరునూ లేరు. నాకు తల్లివలెనూ, తండ్రివలెనూ, ప్రియమునూ హితమునూ చేకూర్చినవారు యీ ఆళ్వారులొక్కరే.

**(నన్మైయాల్ మిక్క)** – దయ, జ్ఞానము, వైరాగ్యము, సత్యనిష్ఠ మొదలగు ఆత్మగుణములు గలవారు పెద్దలెందరో కలరు. అందరునూ ఉత్తమపురుషులే అనదగును. ఎదుటి వ్యక్తిలో గుణదోషములు రెండునూ కలిసియున్నపుడు దోషములను వదలి గుణములను గ్రహించి దగ్గరకు తీయువారు ఉత్తములు. వారిలోగూడ (మిక్క) అత్యుత్తములు ఎవరనగా ఎదుటివ్యక్తిలో మంచి అనదగినది అణుమాత్రమైన లేకున్ననూ పూర్తిగా దోషములే ఉన్ననూ అట్టివ్యక్తినిగూడ అనుగ్రహించగలవారు.

**(నాన్మఱైయాళర్కళ్)** – హితమును ప్రబోధించు చతుర్వేదములలోని సారమును అవగాహన చేసుకొని **"పరోపకారః పుణ్యాయ"** అని చెప్పబడినట్లు దోషములను గూడ లెక్కించక పరోపకారమును చేయు మహాత్ములు, "తమకు అనుకూలురనియూ, తమను బాధించిన శత్రువులనియూ" తారతమ్యమునుగూడ గమనింపక పరులకు ఉపకారమును చేయుటయే వేదఘోషితమైన ప్రధాన సారాంశమని భావించునట్టి మహానుభావులు లోకమున ఎవరైన కలరా అని సందేహింప పనిలేదు. అట్టి మహానుభావులు సీతాదేవి, కూరత్తాళ్వానులు, ప్రహ్లాదుడు మొదలైనవారు ఇద్దరు ముగ్గురు కలరు. "పాపానాంవా, శుభానాంవా" అని చెప్పినట్లు తనను బాధించిన రాక్షసస్త్రీలనుగూడ హనుమంతుని బారినుండి రక్షించినది సీతాదేవియే కదా! శైవుడగు రాజునాశ్రయించి తమకు చెప్పరాని అపకారమును చేసిన "నాలూరాన్" అను వ్యక్తికూడ నావలెనే మోక్షమును పొందవలెనని అతనికి

నరకము రావద్దని భగవత్సన్నిధిలో ప్రార్థించిన మహోదారులు కూరత్తాళ్వానులు. ఇక ప్రహ్లాదుడు తనను వధించుటకై చండామార్కాది పురోహితులు ప్రయోగించిన “కృత్య” అనబడు క్షుద్రశక్తి భగవద్భక్తుడగు తనపై ప్రభావమును చూపలేక వెనుదిరిగిపోయి ప్రయోగించినవారినే చంపబోయినపుడు భగవంతుని ప్రార్థించి వారిని రక్షింపమని వేడుకొన్నాడు. అట్లే తన తండ్రియగు హిరణ్యకశిపుడు భగవంతుని విషయమున చేసిన అపచారములనన్నింటినీ క్షమించమని నరసింహస్వామిని ప్రార్థించినాడు. ఇట్లు తమను ద్వేషించినవారిపైగూడ అనుగ్రహించిన మహాగుణము కలవారు ఈ మహానుభావులు. ఇంతటి మహాగుణము కలవారుకూడా నాలోని దోషములను చూచి వీడు మూర్తీభవించిన పాపరాశి సుమాయని అసహ్యించుకొని నన్ను దూరము కొట్టిరి. ఇట్లు ఎవరికినీ పనికిరానివాడనైన నన్ను “మనము చేరదీయనిచో యిక వీనికి వేరు గతిలేనందున శాశ్వతముగా నరకమున పడిపోవున”ని ఎంచి పరమదయాళువులై తల్లి తండ్రి మొదలగు సర్వవిధ బంధువులు చేయు ఉపకారములను వీరొక్కరే చేసి అనుగ్రహించిరి. **“త్రీన్‌లోకాన్ సంపరిక్రమ్య”** అన్నట్లు శ్రీరాముడు తాను ప్రయోగించిన బ్రహ్మాస్త్రమునకు సర్వలోకములలోనూ దిమ్మదిరిగి అందరునూ త్రోసివేయగా వేరు గతిలేక తిరిగివచ్చి ఆశ్రయించిన కాకాసురుని రక్షించినట్లు, నన్నునూ వీరొకరే రక్షించగలిగిరి.

**(అణ్డిదుమ్ తన్మైయాన్) –** రక్షించుటయే సహజస్వభావముగా కలవాడు. అగ్నికి ఉష్ణత్వమువలెను, నీటికి చల్లదనమువలెను వీరికి పరదుఃఖములను సహింపలేని దయాగుణమే సహజస్వభావము. పేరుప్రతిష్ఠలకనియో ఎదుటివ్యక్తివలన ప్రత్యుపకారమునపేక్షించియోగాక నిర్హేతుకముగా ఉపదేశించి నన్ననుగ్రహించిరి.

**(శడగోపన్) –** జన్మసమయమున తమపై ప్రసరించిన శఠము అనబడు దుష్ట వాయు ప్రభావమును తోసిపుచ్చుటచే శఠకోపులు అని ప్రసిద్ధిచెందిన వీరు నాలోని సర్వపాపములను తొలగించిరి అనుటకు సూచనగా ఇచట ఈ “శడగోపన్” పదము ప్రయోగింపబడినది.

**(ఎన్నమ్బియే) –** తల్లి చేసిన మేలును తండ్రి చేయలేడు. తండ్రి చేసిన మేలును తల్లి చెయ్యదు. ఆచార్యుడు చేసిన మహోపకారమును తల్లిదండ్రులిద్దరునూ చేయలేరు. కాని యీ ఆళ్వారులు ఒక్కరే వారందరునూ చేసిన మేలును నాకు

కలిగించిరి. ఏనాడో ఎండిపోయిన పాత నదినికూడా జలపూర్ణమై ప్రవహించునట్లు వర్షించిన మేఘమువలె దయాపరిపూర్ణులైన వీరు జ్ఞానలేశరహితమై శుష్కించిన నా హృదయమును మధురోపదేశములచే జ్ఞానపరిపూర్ణమగునట్లు చేసిరి. ఒక్కొక్క గుణమును బట్టి మాత్రము దృష్టాంతము అని చెప్పదగిన తల్లి తండ్రి మొదలగు వారెవ్వరునూ వీరికి సంపూర్ణముగా ఉపమానము కాజాలరు. మధురకవుల ఆచార్యనిష్ఠ ఇట్టిది అనుటకు ఈ పాశురము ప్రధాన సాక్షి.

h h

## పాశురము - 5

వీరు తమను గురించి పెద్దలందరూ అసహ్యించుకొనదగి పాపాత్మునిగా వెనుక చెప్పుకొనియున్నారు. తమలోగల అట్టి పాపమేదో ఇందు తెలుపుకొనుచూ ఇట్టి తమను ఆళ్వారులు అనుగ్రహించిన పద్ధతినిగూడ వివరించుచున్నారు.

**మూలము :**

**నమ్బినేన్ పిఱర్ నన్ పొరుళ్ తన్నైయుమ్**
**నమ్బినేన్ మడవారైయుమున్నెలామ్**
**శెమ్పొన్ మాడత్తిరుక్కురుకూర్ నమ్బి**
**క్కన్బనాయడియేన్ శతిర్త్తేనిన్ఱే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మున్నెలామ్ | = | పూర్వకాలమునందు అంతయును |
| పిఱర్ నన్ పొరుళ్ | = | పరమాత్మయొక్క ఉత్తమ ద్రవ్యమగు ఆత్మను |
| నమ్బినేన్ | = | నాది అని ఆశపడితిని అనగా అపహరించితిని |
| మడవారైయుమ్ | = | పతివ్రతలగు స్త్రీలను |
| నమ్బినేన్ | = | అపహరించితిని |
| శెమ్పొన్మాడ | = | ఎర్రని బంగారపు మేడలుగల |
| తిరుక్కురుకూర్ నమ్బిక్కు | = | కురుకాపురమునకు స్వామియగు ఆళ్వారులకు |
| ఇన్ఱే అన్బనాయ్ | = | ఈనాటికి ప్రియభక్తుడనై |

| | | |
|---|---|---|
| అడియేన్ | = | దాసుడనగు నేను |
| శతిర్త్తేన్ | = | సమర్థుడనైతిని |

**వివరణము :**

**(నమ్బినేన్...ఇత్యాది) –** నేను చేసిన పాపములు ఎట్టివనగా – పరమాత్మకు చెందిన ఆత్మవస్తువునే అపహరించుట నా మొదటి దోషము. ఇక్కడ పిఱర్ అనగా పరుడు. అనగా సర్వస్మాత్ పరుడైన పరమాత్మ అని అర్థము. బద్ధ, ముక్త, నిత్య అనబడు త్రివిధ ఆత్మవర్గమునకంటె పరమాత్మ అత్యధికుడు గదా! కనుకనే ఆయన పురుషోత్తముడు అని **"ఉత్తమః పురుషస్త్వన్యః"** అని భగవద్గీతలో చెప్పబడినది. అట్టి పరమాత్మకు చెందిన మంచి వస్తువు ఏదనగా, కౌస్తుభరత్నమువలె అతిప్రియమై జ్ఞానానందరూపమైన ఆత్మవస్తువు. (పొరుళ్) అనగా ద్రవ్యము. తార్కికులు మొదలగువారు పృథి అప్ తేజో వాయు ఆకాశకాల దిగాత్మలు మరియు మనస్సు అను ఇవి తొమ్మిది ద్రవ్యములనియూ, వీటిలో ఆత్మయే ప్రధానమనియూ తెలిపి యున్నారు. పరమాత్మకు శేషభూతమైన నా ఆత్మను నేను స్వతంత్రుడననియూ, భగవంతుడు నా యజమాని కాడనియూ భావించుటయే నేను చేసిన ఆత్మాపహారమను మహాదోషము. **"కిం తేన న కృతం పాపం చోరేణ ఆత్మాపహారిణా"** అని చెప్పబడినట్లు సర్వదోషములయొక్క సమాహారరూపమగు ఈ ఆత్మాపహారమునకంటే మించినది మరొకటి లేదు. తక్కిన ఆళ్వారులుకూడ "వన్ కళ్వన్" అతి క్రూరుడైన చోరుడు అని ఆత్మాపహారియగు పాపిష్ఠునిగూర్చి చెప్పియున్నారు. లోకమున అపహరింపబడిన వస్తువుయొక్కయూ, దాని యజమానియొక్కయూ గొప్పతనమునుబట్టి, ఆ చౌర్యమునకు వేయదగిన శిక్షగాని, ప్రాయశ్చిత్తముగాని మిక్కిలి గొప్పదిగా నుండును. చండాలుని ఇంటిలోని ద్రవ్యమునపహరించుటకంటె బ్రాహ్మణద్రవ్యమునపహరించుట మహాదోషము. కట్టెపుల్లలను అపహరించిన దోషమునకంటె రత్నాపహారదోషము గొప్పదియేకదా! ఇపుడు ఈ ఆత్మనపహరించుట రెండు విధములుగ చూచిననూ మహాదోషమే. అది పరమాత్మకు చెందిన వస్తువు మరియు కౌస్తుభమువలె అమూల్యమైన వస్తువు.

**(నమ్బినేన్ మడవారైయుమ్) –** ఉత్తమశీలముగల పరస్త్రీలనుగూడ చెర బట్టితిని. ఈశ్వరుని వస్తువునే అపహరించిన నాకు ఇది సామాన్యమైన పాపమే.

రాజభవనములోని రత్నమునే అపహరించిన గజదొంగకు బీదవాని గుడిసెలోని కట్టెలమోపు నపహరించుట కష్టమేమియు కాదుగదా! ఎప్పటినుండి ఈ పాపమును చేయుచుంటిరి అని అడగనవసరము లేదు. **(మున్నెలామ్)** అనాదికాలముగా నేను చేయుచున్న పాపములిట్టివే. ఈశ్వరుడు నిత్యమైనట్లు నా స్వరూపముగూడ నిత్యమే గదా! మరియు కాలము అనాది. ఏనాటినుండియో నాలో ఈ ప్రకృతిసంబంధముచే పాపప్రవృత్తి ఏర్పడినది. కనుక గడచిపోయిన కాలమంతయూ పాపప్రవృత్తియే నా జీవయాత్ర. సరే! మీలోని పాపములు ఇట్లనంతమై యుండవచ్చునుగాని మిమ్ములను ఈ ఆళ్వారులు నిర్హేతుకముగా అనుగ్రహించుట ఎట్లు జరిగినది. అను ప్రశ్నకు పైన సమాధానమియ్యబడుచున్నది.

**(శెమ్‌పొన్ మాడత్తిరుక్కురుకూర్ నమ్బిక్కన్బునాయ్) –** ఆళ్వారులకు ఆవాసమైన కురుకాపురము మేలిమి బంగారముతో నిర్మింపబడిన మేడలు కలిగి సర్వభోగ భాగ్యములతో తులతూగుచున్నది. క్షుద్రభోగములకు పూర్వము అలవాటు పడియున్న నేను ఆ భోగములకు కావలసిన ధనమును సంపాదించుటకై ఐశ్వర్యములతో విలసిల్లు ఆ కురుకాపురమున దొంగతనమునకై ప్రవేశించితిని. అందుగల బంగారపు మేడలను దోచుకొనుటకై బయలుదేరితిని. క్షుద్ర భోగములపై వ్యసనరూపమైన సంగమేర్పడుట, దానికి తోడు ధనార్జనకై చౌర్యము చేయుట, అందులో కూడా ఆళ్వారుల నివాసమైన నగరములోనే భగవన్మూర్తినిగూడ అపహరించుటకు వెనుకాడకపోవుట, ఇదంతయూ నా భ్రష్టచరిత్రమగు వృత్తాంతము అని మధురకవులు తమ నైచ్యమును అనుసంధించుకొనుచున్నారు. లౌకిక క్షుద్ర భోగములకు లోబడినవాడు ఎట్టి దుస్థితికి దిగజారునో తెలుపుటకు నిదర్శనముగా భోజచరిత్రము అను కావ్యములోని ఈ క్రింది శ్లోకమును ఉదాహరింపదగును.

**భిక్షో! మాంస నిషేవణం కిముచితం? కిం తేన మద్యం వినా**
**మద్యం చాపి తవ ప్రియం? ప్రియమహో వారంగనాభిస్సహ**
**వారస్త్రీరతయే కుతస్తవ ధనం? చౌర్యేణ ద్యూతేన వా**
**చౌర్యద్యూత పరిశ్రమోపి భవతామ్, భ్రష్టస్య కా వా గతిః.**

విజ్ఞానవంతుడు ఉత్తమధార్మికుడు రాజనీతిజ్ఞుడునైన పరిపాలకుడునగు భోజరాజు ఒకప్పుడు వేశ్యాలోలుడై మద్యపానాది దుర్వ్యసనములకు లోనై రాజ్య

వ్యవహారమును పట్టించుకొనలేదట. అపుడు మంత్రులందరునూ కలిసి ఈ విషయమును కాళిదాసునకు చెప్పి ఏ విధముగానైననూ రాజును ఇట్టి దుష్ప్రవృత్తి నుండి మరలునట్లు చేయుమని కోరినారట. సరేనని అంగీకరించిన కాళిదాసు ఒకనాడు సన్యాసి వేషమును వేసుకొని భిక్షాందేహి అనుచు రాజభవన ప్రాంగణము నకు వచ్చినాడట. ఆ సమయమున భోజరాజు రహస్యముగా వేశ్య ఇంటికి బయలుదేరి వెళ్ళుచున్నాడు. ఈ కపట సన్యాసి "అయ్యా! నాకు ఆకలియగుచున్నది. తినుటకు కొంచెము మాంసమును పెట్టు"మని యాచించెనట. అపుడు రాజు కోపముతో **"భిక్షో! మాంసనిషేవణం కిముచితం?"** సన్యాసివగు నీవు మాంసమును తినుట ధర్మమా? అని గద్దించి అడిగినాడట. అందులకు బెదరకుండా ఈ కపట సన్యాసి **"కింతేన మద్యం వినా"** ఓ రాజా! వట్టి మాంసమునందు రుచి ఏమి కలదు? కనుక నేను మద్యమునుగూడ త్రాగుదును అన్నాడట. తిరిగి రాజు ఆశ్చర్యముతో **"మద్యం చాపి తవప్రియం?"** ఓహో! నీవు మద్యపానముకూడ చేయుదువా? అని అడిగెను. అందులకు సమాధానముగా కపట సన్యాసి **"ప్రియమహోవారాంగనాభి స్సహ"** ఔను, మద్యము నాకిష్టమే. పైగా వారకాంతలతో కలసి త్రాగుట నాకు మహానందము అని చెప్పినాడు. రాజునకు ఇంకా ఆశ్చర్యమైనది. **"వారస్త్రీ రతయే కుతస్తవధనం?"** ఎంతో ధనము ఉన్నగాని వారకాంతలు చేరనీయరుగదా! వారికి యిచ్చుటకు నీకంత ధనమెక్కడిది? అని ప్రశ్నించెను. **"చౌర్యేణ ద్యూతేనవా"** "అట్టి ధనమును దొంగతనముగానో, జూదమాడియో నేను సంపాదించుకొందును" అనియూ సన్యాసి బదులు చెప్పెను. మద్యమాంస సేవనము వారస్త్రీ సంగమము ఇట్టి దుర్వ్యసనములేగాక సన్యాసివగు నీలో జూదమాడుట, దొంగతనము చేయుట మొదలగు దుర్లక్షణములు కూడ కలవా? **"చౌర్యద్యూత పరిశ్రమోపి భవతామ్?"** అని రాజు ప్రశ్నించగా **"భ్రష్టస్య కావాగతిః"** అని సన్యాసి సమాధానమిచ్చెను. అన్ని విధముల భ్రష్టుడైనవానికి వేరే మంచి మార్గముండునా? అని దీని భావము. భోజరాజు కపటసన్యాసి చెప్పిన సమాధానములన్నియూ తనకు అన్వయించి యుండుటను గమనించి సిగ్గుపడి వేశ్యాగృహ ప్రయాణమును మానుకొని లోనికి పోవుచుండగా కాళిదాసు తన నిజస్వరూపమును తెలిపి ఇకముందు ఇట్టి దుర్వ్యసనములకు లోనుకాకుండా "భ్రష్టుడు" అను అపవాదును తెచ్చుకొనకుండా రాజ్యమును పాలించుమని మెత్తమెత్తగా మందలించినాడట.

మధురకవులు పూర్వజన్మలలో తెలిసియో తెలవకనో చేసిన తమ పాపము లన్నింటినీ తలంచుకొని ఆత్మాపహారము చేసితిననియూ, పరస్త్రీలను చెరబట్టితి ననియూ, కురుకాపురమువంటి పుణ్యక్షేత్రములలోనే అర్థార్జనకై చౌర్యమునకు సమకట్టితిననియూ తెలుపుకొని ఇట్లు అన్ని విధములుగా భ్రష్టుడనైన నన్ను పెద్దలు ఎవరునూ దయచూడక పోగా "ఛీ" అని తరిమికొట్టిరనియూ, అట్టిస్థితిలో ఆళ్వారులు నాపై తమ దివ్య కటాక్షమును ఒక్కసారిగా ప్రసరింపజేసి తమ అనుగ్రహమునకు పాత్రుడగునట్లు చేసిరి. వారి కటాక్షప్రభావముచే అనాదిగా నేను చేసిన పాపములన్నియు పటాపంచలై నాలో అహంకార మమకారాదులు పోయి సంపూర్ణ వైరాగ్యము కలిగి నేరుగా తదీయ శేషత్వమును అవలంబించి ఆళ్వారులకు దాసుడను కాగలిగితిని అనియు తెలిపిరి.

**(అడియేన్ శదిర్తేన్)** – భగవంతుని గుణములు ఆకర్షింపగా ఆచార్యులైన ఆళ్వారులు **"గుణైర్దాస్యముపాగతః"** అన్నట్లు భగవంతునికి దాసులైరి మరియు **"అడియేనుళ్ళాన్"** అని తమను నేను భగవద్దాసుడను అని లోకమునకు చాటుకొనిరి. ఇపుడు ఈ మధురకవులుకూడ ఆళ్వారుల ఔదార్యమునకు మహోపదేశమునకు పరవశులై ఆళ్వారుల విషయమున తమ విషయమున "నమ్బి" "అడియేన్" అని రెండు పదములను అద్భుతముగా ప్రయోగించిరి. ఆచార్యులను భగవంతునివలె సద్గుణ పరిపూర్ణునిగా భావించవలెననియూ, ఆచార్యులు పిలచినపుడు (అడియేన్) అయ్యా దాసుడను అని శిష్యుడనువర్తించవలెననియూ ఒక మంచి గుణపాఠమును ఇందుమూలమున మనకు నేర్పినవారైరి.

**(శతిర్త్తేన్)** – నాలోని ఆ భ్రష్టలక్షణములు ఎటు పోయినవో! ఈనాడు భగవంతునికి శేషభూతుడగుటయేగాక అంతకంటె మహోన్నతమగు భాగవతోత్తములైన ఆచార్యులయందు దృఢమగు నిష్ఠను పొందగలిగితిని. ఇదియే నాలో ఏర్పడిన ఉత్తమ సామర్థ్యము, గొప్ప పరిణామము.

h h

## పాశురము - 6

ఆళ్వారుల దివ్యకటాక్షము పడినవెంటనే తమలోని పాపరాశి అంతయూ క్షణములో పటాపంచలైపోయి దివ్యజ్ఞానమును పొందగలిగిన పెద్ద మార్పు తమలో కలిగినట్లు వెనుక చెప్పియున్నారు. నారదుని దృష్టి పడినంతనే క్రూరుడైన క్షత్రబంధువు యొక్క జీవతములో గొప్ప మార్పు వచ్చినట్లే వీరిలో కలిగిన ఈ మార్పుకూడా అని గ్రహింపదగును. ఐతే ఆళ్వారులు మిమ్ములను అంతగా అనుగ్రహించిననూ అనాదిగా మీకు ప్రాప్త విషయములతో ఏర్పడిన ప్రగాఢ సంబంధమునుబట్టి తిరిగి మీ మనస్సు వాటిపైకి మరలకుండునా? అను ప్రశ్నకు సమాధానముగా ఈ ఆరవపాశురము వచ్చినది. ఇందు ఆళ్వారుల స్వభావము నా మనస్సు తిరిగి అటువైపు పోకుండునట్లు బంధించినది అని తెలుపుచున్నారు. భగవద్భక్తులైనవారు ఒక్కొక్కపుడు తమ తపోనిష్ఠకు భంగము కలిగి యోగభ్రష్టులైనట్లు వినుచున్నాము. మధ్యలో అట్లు సమాధిభంగము పొందినవారు తిరిగి ఉత్తమ భక్తకుటుంబమున జన్మించి, ఆ పూర్వపు నిష్ఠను కొన సాగించి ఉజ్జీవింతురని శ్రీకృష్ణ పరమాత్మ **"శుచీనాం శ్రీమతాం గేహే, యోగభ్రష్టోభి జాయతే"** అని భగవద్గీతలో చెప్పియున్నాడు. భగవత్కృపకు పాత్రులైన వారిలోకూడా అట్టి సమాధిభంగము కలుగుటకు వీలున్నదేమో కాని మా ఆళ్వారుల కృపకు పాత్రుడ నైన నాకు అట్టి దుస్థితి ఏర్పడదు అని ఈ పాశురమున దృఢముగా చెప్పుచున్నారు.

**మూలము :**

**ఇన్ఱు తొట్టు మెழుమైయు మెమ్బిరాన్**
**నిన్ఱుతన్ పుకழ் ఏత్త వరుళినాన్**
**కున్ఱమాడ త్తిరుక్కురుకూర్ నమ్బి**
**ఎన్ఱుమెన్నై యికழ் విలన్ కాణ్మినే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| ఇన్ఱు తొట్టుమ్ | = | నేటినుండియును |
| ఎழుమైయుమ్ | = | ఏడేడు జన్మలవరకునూ (అనగా సర్వకాలమునూ) |
| ఎమ్బిరాన్ | = | నాకు మహోపకారులు వీరే |
| నిన్ఱు | = | స్థిరముగా నిలచియుండి |

| | | |
|---|---|---|
| తన్‌పుకழ் | = | తమయొక్క దివ్యమగు కీర్తిని |
| ఏత్త | = | స్తుతించునట్లు |
| అరుళినాన్ | = | అనుగ్రహించినారు |
| కున్ఱమాడ | = | పర్వతములవంటి మేడలుగల |
| త్తిరుక్కురుకూర్ | = | కురుకాపురమునందలి |
| నమ్బి | = | సద్గుణపూర్ణులైన ఆళ్వారులు |
| ఎన్ఱుం | = | ఏనాటికినీ |
| ఎన్నైయికழ் విలన్ | = | నన్ను విడచిపెట్టరు |
| కాణ్‌మినే | = | మీరే ప్రత్యక్షముగా చూడుడు. |

**వివరణము :**

**(ఇన్ఱు తొట్టుమ్)** – ఆళ్వారుల అనుగ్రహమునకు పాత్రుడనైన యీ రోజు నుండియే రాబోవు సర్వకాలములందునూ మార్పులేని విధముగా నేను ఉత్తమగతిని పొందగలిగితిని. భగవంతుని విషయమున, ఉపాసనాది సాధనమును అనుష్ఠించిన సమయము ఒకటి, పిదప ఫలితము లభించిన సమయము మరొకటి అని భేదమున్నది. ఆళ్వారుల విషయమునందు మాత్రము అట్టి కాలభేదము లేకుండా వారి అనుగ్రహము కలుగుట, నేను ఉజ్జీవించుట రెండునూ ఒకే సమయమున జరిగినవి. పాశురములో **(ఎழுమైయుమ్)** ఏడేడు జన్మములు అనియున్ననూ భవిష్యత్తులో రాబోవు కాలమంతయునూ అనియే దాని భావము.

**(ఎమ్బిరాన్)** – "పిరాన్" అనగా ఉపకారకుడైన స్వామి. ఆళ్వారులు భగవంతుని గురించి "పిరాన్ పెరునిలంకీండవన్" అను పాశురమున తమకు మహోపకారకుడైన స్వామి భగవంతుడని చెప్పుకొన్నారు. కాని నాకు ఈ ఆళ్వారులే మహోపకారకులని ఉపకారస్మృతి కలిగియుందును.

**(నిన్ఱుతన్ పుకழ் ఏత్త)** – నాలో తిరిగి మార్పు కలగకుండునట్లుగా స్థిరమగు విశ్వాసము కలిగి తమయొక్క దివ్యవైభవమును స్తుతించగల శక్తిని వారు నాకు అనుగ్రహించినారు. ఒక లౌకిక ఫలితము కొరకై భగవంతుని స్తుతించి ఫలితము లభించినవెంటనే ఆయనను మరచిపోవునట్టి భక్తులవలె కాక దృఢముగా నేను తిరిగి మరలిపోని విధముగా ఆళ్వారులచే ఆకర్షింపబడితిని అని భావము.

**(అరుళినాన్)** - నాలో ఇట్టి మార్పునకు వారి నిర్హేతుక కృపయే కారణము. **(కున్ఱమాడత్తిరుక్కురుకూర్ నమ్బి)** ఆళ్వారులు తాము అవతరించిన గ్రామమును **"కున్నం పోల్ మణిమాడనీడు తిరుక్కురుకూర్"** అని వర్ణించియున్నారు. పర్వతముల వలె ఎత్తయిన మణిమయ భవనములు కలిగినది కురుకాపురము అని వారు వర్ణించిన విధముగనే వీరు కూడ ఆ నగరములోని మేడలను పర్వతములవలె మహోన్నతము లైనవి అని వర్ణించుచున్నారు.

**(ఎన్ఱుమెన్నై యికళ్ విలన్ కాణ్మినే)** - నా ఆత్మయున్నంతవరకు ఇతర విషయములపైకి నా మనస్సును పోనియ్యకుండునట్లు నన్ను గట్టిగా పట్టుకొనినారు. నాలోని దుర్గతిని గమనించి ఇట్లు నన్ననుగ్రహించిన వీరు తిరిగి నన్ను లౌకిక విషయములపైకి పోనిత్తురా! వారి శ్రీపాదములు తప్ప వేరు గతి లేదని నమ్మిన నన్ను నీ త్రోవను నీవు చూచుకొమ్మని విడిచిపెట్టుదురా!

**(కాణ్మినే)**- అట్లు ఎన్నటికినీ జరుగదు. మీరే ప్రత్యక్షముగా వేచిచూడుడు.

h h

## పాశురము - 7

ఏ కారణము లేకుండనే నిరవగ్రహమగు అనుగ్రహముతో తమ దాసునిగా స్వీకరించిన ఆళ్వారుల మహౌదార్యమును వెనుక కీర్తించి నావలెనే వారి అనుగ్రహము నకు అందరునూ పాత్రులు కావలసియుండగా, వారికి అట్టి అవకాశము లభించ కుండుటకు కారణమేమైయుండునా అని ఎంచి, ఈ లోకులు వారి ప్రభావమును గుర్తించలేక వారి నాశ్రయించలేకపోవుచున్నారని తలంచి, ఆళ్వారుల వైభవమును అందరికినీ తెలియినట్లు అష్టదిక్కులలోనూ చాటిచెప్పెదను అని ఈ ఏడవ పాశురమున చెప్పుచున్నారు.

**మూలము :**

**కణ్డుకొణ్డెన్నై క్కారిమాఱప్పిరాన్**
**పణ్డై వల్వినై పాత్తియరుళివాన్**
**ఎణ్డిశైయుమఱియ వియమ్బుకేన్**
**ఒణ్డమిళ్ చ్చడ కోపనరుళైయే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| కారిమాఅప్పిరాన్ | = | కారి అను భక్తుని కుమారులైన మారన్ అను నామాంతరము కలిగిన మహోపకారకులైన ఆళ్వారులు |
| ఎన్నై కణ్డు కొణ్డు | = | నన్ను కటాక్షించి |
| పణ్డై వల్వినై | = | సంచితమగు సర్వపాపములను |
| పాత్తియరుళినాన్ | = | నాశనమైపోవునట్లు అనుగ్రహించినారు |
| ఎణ్డిశైయుమఱియ | = | ఎనిమిది దిక్కులలోను అందరును తెలుసుకొనగలుగునట్లు |
| ఒణ్డమిళ్ | = | సుందరమగు తమిళభాషలో ప్రబంధములు రచించిన |
| శడకోపన్ | = | నమ్మాళ్వారులయొక్క |
| అరుళైయే | = | అనుగ్రహమునే (కరుణనే) |
| వియమ్బుకేన్ | = | చాటిచెప్పెదను. |

**వివరణము :**

**(కణ్డుకొణ్డెన్నై)** – నన్నుద్ధరించవలెనని ఆళ్వారులు నాపై తమ దివ్యకటాక్షమును ప్రసరింపజేసిరి. నేను కనపడినదే తడవుగా నిధి దొరికినట్లుగా భావించి కనపడకుండపోయిన పుత్రుని లభించుకొన్న తండ్రివలె నన్ను తమ దయకు పాత్రుని చేసుకొనిరి. ఆళ్వారుల ప్రభావము ఎట్టిదోగూడ అసలే ఎరుగని నన్ను దగ్గరకు తీసుకొనుట వారి మహౌదార్యమే కదా!

**(కారిమాఅప్పిరాన్)** – కారి అని నమ్మాళ్వారులయొక్క తండ్రిగారికి పేరు. మారన్ అని ఆ తండ్రి ఈ ఆళ్వారులకు పెట్టిన పేరు. కారి అను భక్తుని కుమారులైన మారన్ అనబడు ఈ ఆళ్వారులు నా ఒక్కనిపైననే అసాధారణముగా కృపను వర్షించిన మహోపకారకులు. "సుహృదం సర్వభూతానాం" అన్నట్లు భగవత్కృప సర్వసాధారణమైనది. ఆళ్వారుల కృప అట్లుగాక నాకు మాత్రమే దక్కినది.

**(పణ్డై వల్వినై పాత్తియరుళినాన్)** – నేను ఇప్పటివలె ఉజ్జీవించుటకు ప్రతిబంధకములుగా నిలచిన ప్రబలములైన పూర్వపాపములు ఎన్నో ఉన్నవి. అనాదిగా బాహ్య సుఖములను పొందుటకై చేసిన పాపములు, శూర్పణఖవలె అక్రమ మార్గముగా భగవంతుని పొందవలెనని అహంకారముతో చేసిన పాపములు, భగవత్సేవయే ఉత్తమ పురుషార్థమని యెంచి భాగవత సేవకు దూరమైన పాపములు,

ఇట్టి పాపములు లెక్కలేనన్ని నాలోనుండినవి. వాటికి ప్రాయశ్చిత్తమును చేసు కొనుటకుగాని, శిక్షననుభవించితీర్చుకొనుటకుగాని ఎన్ని యుగములైననూ చాలదు. అట్టి ప్రబలములైన పాపములను సర్వనాశనమైపోవునట్లు చేసి తన దివ్య గుణములను మధురముగా పాడుకొనునట్లు నన్ననుగ్రహించినారు.

**(ఎణ్డిశై యుమతియ వియమ్బుకేన్) –** పెద్దలు చిన్నలు అను తారతమ్యము లేకుండా ఎనిమిది దిక్కులలోనుండువారుకూడ తెలుసుకొనగలుగునట్లు గట్టిగా చాటి చెప్పుదును. మా ఆళ్వారులు **"తొండీర్ ఎల్లీరుం వారీర్"** భగవంతునిపై రుచి కలవారందరునూ రండు అని ఆహ్వానించిరి. ఇపుడు నేను ఈ ఆళ్వారుల ప్రభావ మును తెలుసుకొనగోరిన అభినివేశము గల వారందరునూ రండు అని పిలిచెదను.

**(ఒణ్డమిழ் శడకోపనరుళైయే) –** తమిళ దివ్య ప్రబంధములను ప్రసాదించిన ఆళ్వారుల కృప ఎంతటిదో లోకమునకు చాటెదను. వీరి కృప భగవంతుని కృపవంటిది కాదు. అంతకన్నను గొప్పది. ఆయనగూడ ఉపేక్షించిన నన్ను అనుగ్రహించిన వీరి వైభవమును గుర్తించగలవారందరును రండు అని చాటిచెప్పెదను. వీరు సుందరమైన ద్రవిడభాషలో పలు దివ్యప్రబంధములను రచించిరి. పాలవలె అతి భోగ్యములై గాయకులైన భక్తులు ప్రేమతో పాడుకొనదగిన తిరువాయ్‌మొழி మొదలగు దివ్యప్రబంధములను రచించి ఉజ్జీవించుటకై లోకమునకు అందించిన దివ్యకృపయే నావంటి సామాన్యునిగూడ అనుగ్రహించినది. అట్టి వారి కృపకు సాటి మరియొకటి కలదా!

h h

## పాశురము - 8

ఆళ్వారులయొక్క కృపను అష్టదిక్కులలోను వ్యాపించునట్లు ప్రచారము చేయుదునని వెనుకటి పాశురమున చెప్పియున్నారు. అట్లు సర్వజనులునూ దానివలన ఉజ్జీవించుటకు ఆ కృపలోగల అతిశయమెట్టిది? అనగా, ఆ అతిశయ మును ఇందు వివరించుచున్నారు. చిదచిదీశ్వరులు అను తత్త్వత్రయమునకంటె మిక్కిలి గొప్పది యీ ఆళ్వారుల కృప అని యిందు వివరించుచున్నారు.

**మూలము :**

> **అరుళ్ కొణ్డాడు మడియ వరిన్బుఱ**
> **అరుళినా నవ్వరుమఱై యిన్ పొరుళ్**
> **అరుళ్ కొణ్డాయిర మిన్తమిழ் ప్పాడినా**
> **నరుళ్ కణ్డీరివ్వులకినిల్ మిక్కతే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| అరుళ్ కొణ్డాడుమ్ | = | భగవంతుని నిర్హేతుక కృపను ప్రస్తుతించునటువంటి |
| అడియవర్ | = | పరమభాగవతులు |
| ఇన్బుఱ | = | మిక్కిలి సంతోషించునట్లుగా |
| అవ్వరుమఱైయిన్ | = | తెలుసుకొనుటకు సాధ్యముకాని ఉపనిషద్విద్యయొక్క |
| పొరుళ్ | = | రహస్యార్థమును |
| అరుళినాన్ | = | అనుగ్రహించినటువంటి నమ్మాళ్వారులు |
| అరుళ్కొణ్డు | = | భగవత్కృపను ఆధారముగాగొని |
| ఆయిరం | = | వెయ్యి పాశురములుగల |
| ఇన్తమిழ் | = | మధురమైన ద్రవిడ ప్రబంధమును (తిరువాయ్మొழிని) |
| పాడినాన్ | = | రచించినారు |
| అరుళ్ | = | అట్టి ఆళ్వారుల కృప |
| ఇవ్వుల కినిల్ | = | ఈ ప్రపంచమంతటికంటె |
| మిక్కతే | = | గొప్పది |
| కణ్డీర్ | = | చూచితిరా. |

**వివరణము :**

భగవంతుని అనుగ్రహమువల్లనే తాము అందరమూ ఉజ్జీవించగలిగినట్లు పదుగురు ఆళ్వారులు తమ ప్రబంధములలో చెప్పుకొనియున్నారు. వారందరునూ నమ్మాళ్వారులవలె **"మయర్వఱ మదినలమరుళినన్"** నాలోని అజ్ఞానమంతయు తొలగించి భక్తిరూపమగు జ్ఞానమును ఆ పరమాత్మయే మాకు కలిగించినాడు అని భగవత్కృపయే తమ ఉజ్జీవనమునకు హేతువైనట్లు తెలుపుకొన్నవారే. నమ్మాళ్వారులే మరొకచోట **"అతువుమవనతిన్నరుళ్"** అనియునూ **"అరుళ్ పెఱువారడియార్**

**తమ్మడియార్"** అనియునూ చెప్పుకొనియున్నారు. భగవంతుడు నా హృదయమున స్థిరప్రతిష్ఠను పొందినాడు. ఇట్లాయన ప్రేమించి నా హృదయములోనుండుటకు నా ప్రయోజకత్వమేమియును కారణము కాదు. అందులకు ఆయనయొక్క నిర్హేతుకమైన దయయే కారణము అనియునూ అట్టి దయకు పాత్రులైన భక్తులకు నేను దాసుడను అనియునూ ఆ పాశురములకు అర్థము. మరియు విప్ర నారాయణులు అనబడు తొండరడిప్పొడి ఆళ్వారులు కూడా తమ తిరుమాలై ప్రబంధమున **"అనైక్కు అన్ఱరుళైయీన్ద"** అనియునూ **"నిన్నోడు మొక్కవళ్రిపద అరుళినాయ్"** అనియునూ తెలిపియున్నారు. ఆనాడు గజేంద్రుని రక్షించుటకై తన కృపను ప్రసరింపజేసినవాడు అనియునూ, తనతో సమానముగా తన భక్తులైనవారిని గూడ అర్చించవలెను అనీ అదియే సద్గతికి మార్గము అని దయతో తెలిపితివి అనియునూ, వారి పాశురములకర్థము. ఇట్లే పోయ్ఘై, పూదత్త, పేయాళ్వారులునూ, పెరియాళ్వారులునూ తమ ప్రబంధములలో భగవత్కృపావైభవమును ఉగ్గడించి యున్నారు. వీరేకాక ఆచార్యులలో శ్రీ వేదాంతదేశికులు మొదలైనవారు దయా శతకము మొదలగు స్తోత్రములను ప్రసాదించి అపారమగు భగవంతుని దయను కొనియాడియున్నారు. మహర్షులు మొదలగువారు భగవంతుని అనుగ్రహము కలుగుటకు కారణముగా కర్మ జ్ఞాన భక్తులను స్వప్రయత్నముతో సంపాదించు కొన్నవారు కలరు. వారివలెగాక కేవలము భగవదనుగ్రహమే తమకు ఉజ్జీవన హేతువైనట్లు భావించినవారు ఈ ఆళ్వారులందరునూ. ఇట్టి ఈ పరమ భాగవతు లందరునూ **(ఇన్బుఱ)** మిక్కిలి ఆనందించునట్లుగా మా ఆచార్యులైన నమ్మాళ్వారులు వేదములకు చివరనుండు ఉపనిషద్వాక్యములలో అతి రహస్యమగు తత్త్వసారము నంతయూ అందరికినీ తెలిసివచ్చునట్లు తమ ప్రబంధములో దయతో అనుగ్రహించి యున్నారు. దివ్యగుణ సంపన్నులైన ముముక్షువులు అందరికినీ ఉపనిషద్విద్యయే మహైశ్వర్యమువంటిదిగదా. **"సాహిశ్రీః అమృతాసతాం"** అను యజుర్వేద వాక్యము బ్రహ్మజ్ఞానులైనవారికి ఈ ఉపనిషద్విద్యయే గొప్ప సంపద వంటిది అని తెలుపుచున్నది. ఉపనిషత్తులు **"సర్వరసః"** అనియూ **"రసోవై సః"** అనియూ పరమాత్మను పరిపూర్ణ ఆనందస్వరూపునిగా నిరూపించి **"ఏషహ్యేవ ఆనందయాతి"** ఆ పరమాత్మయే ఆశ్రితులకు ఆ మహానందరూపమగు మోక్షమును ప్రసాదించగలవాడు అని చెప్పు చున్నవి. అట్టి ఉపనిషద్రహస్యమును తెలుసుకొనుటకు వీలులేని సామాన్య మానవులు కూడ ఉజ్జీవించుటకై ఆ ఉపనిషత్సారమును తిరువాయ్మొళ్రి ప్రబంధరూపమున

మా ఆళ్వారులు లోకమునకనుగ్రహించిరి. ఈ ప్రబంధము వీరు తమ బుద్ధిబలముతో రచించినట్టిది కాదు. **(అరుళ్‌కొణ్డు)** భగవంతుడిచ్చిన దివ్యజ్ఞానమే ఈ గ్రంథరచనకు వీరికి ప్రేరకమైనది. ఒక విధముగా వీరి నాలుకపై భగవంతుడే ఆవేశించి తన వైభవమును తానే పాడుకొన్నాడు అని చెప్పవచ్చును. అనంతమైన వేదార్థమును సంగ్రహించి ఇరువదినాలుగువేల శ్లోకములలో వాల్మీకి మహర్షి తెలిపిన విధముగా నమ్మాళ్వారులును తమ వెయ్యి పాశురములలో పాడుకొనుటకు వినుటకును మధుర మైన విధముగా లోకమున వర్ణాశ్రమ భేదములు లేకుండా అందరునూ అనుసంధించుకొను విధముగా ఈ ప్రబంధమును ప్రసాదించినారు. భగవంతుని యొక్క కృపకూడ దీనిముందు అత్యల్పమే అని చెప్పదగినంత గొప్పది మా ఆళ్వారుల యొక్క కృప. ఈశ్వరుడే "వీరిని దయచూడరాదు" అని విడిచిపెట్టిన మావంటి వారినికూడ మా దుర్గతిని చూచి సదుపదేశముచేత ఉజ్జీవింపజేసినందున వీరి కృప ఎంత గొప్పదియో యీ ప్రత్యక్ష నిదర్శనమునుబట్టియే తెలుసుకొనవచ్చును.

**(ఇవ్వులకినిల్ మిక్కతే)** – చిదచిదీశ్వరరూప తత్త్వత్రయ సముదాయ రూపమైన ఈ ప్రంచమంతటికంటె గూడ మహోన్నతమైనది వారి కృప. భగవంతునిపై తమకు కలిగిన భక్త్యావేశమునకు మా ఆచార్యులైన ఆళ్వారులు "అదనిల్ పెరియ ఎన్నవా" అని చెప్పుకొనియున్నారు. ప్రళయమున సమస్త జగత్తును తన పొట్టలో నుంచుకొన్న భగవంతునిగూడ మ్రింగివేయగల యంతటిది నా భక్త్యావేశము అని వారు చెప్పుకొనిరి. కాని వారు నాపై చూపిన కృపా విశేషము అంతకంటె కూడ పెద్దది అని నేను భావింతును.

**(కణ్డీర్)** – మా ఆళ్వారుల కృపా వైభవము ఎంతటిదో చూచితిరా అని యీ పాశురమునకు భావము. ఈ సందర్భమున సాహిత్యపరముగా ఒక కవి చెప్పిన మధురమైన శ్లోకము గుర్తుకు వచ్చును.

**శ్లో॥ గిరిర్మహాన్, గిరేరబ్ధిః, అబ్దేరపి నభో మహత్ ।**
**నభసోపి పరంబ్రహ్మ, తతోప్యాశా మహీయసీ ॥**

లోకమున పెద్ద వస్తువేది అని ప్రశ్నించినపుడు ఒకడు (గిరిర్మహాన్) హిమాలయమో మేరుపర్వతమో చాలా పెద్దది అని సమాధానమిచ్చెను. అపుడు మరియొక బుద్ధిమంతుడు (గిరేః అబ్ధిః) పర్వతమునకంటెగూడ పెద్దది అతి

విశాలమైనది సముద్రము కలదు అని సమాధానమిచ్చెను. అంతట మరొక ప్రతిభావంతుడు (అబ్ధేరపి నభో మహత్) ఆ సముద్రమునకంటెగూడ అతి విశాలమైనది ఆకాశము గలదు. అది నేలపైన, సముద్రముపైనగూడ వ్యాపించి యున్నందున సముద్రముకంటె పెద్దదిగదా! దానిని మించినది మరొకటి లేదు అని శలవిచ్చినాడు. తదనంతరము ఒక వేదాంతవేత్తయగు విద్వాంసుడు (నభసోపి పరంబ్రహ్మ) ఆ ఆకాశముతో సహా ప్రపంచమునంతయు సృష్టించిన పరమాత్మ ఎంతో పెద్దవాడు కలడు అని శాస్త్రప్రమాణముతో వాదించినాడు. వీరందరి వాదములను తలక్రిందులు చేయుచు ఈ శ్లోకమును రచించిన కవి (తతోప్యాశా మహీయసీ) అని లోకానుభవమునుబట్టి తన తీర్పును చెప్పినాడు. ఆ పరబ్రహ్మమునుగూడ అమాంతముగా మ్రింగివేయగలంతది మానవుని ఆశ సుమా! దానికి మించినది మరొకటి ఏదియు లేదు అని యీ కవియొక్క తీర్పునకు తాత్పర్యము.

ఇదే పద్ధతిలో ఈ మధురకవులు తమ ఆచార్యుల భక్త్యావేశమునకంటె వారిలో నున్న కృపావిశేషము ఎంతో గొప్పది అని వర్ణించిరి.

h h

## పాశురము - 9

**మూలము :**

**మిక్కవేతియర్ వేతత్తినుట్పొరుళ్**
**నిఱ్కప్పాడి యెన్నెఞ్జుళ్ నిఱుత్తినాన్**
**తక్కశీర్చ్చడ కోప నెన్నమ్బిక్కాళ్**
**పుక్కకాతలడిమైప్పయనన్రే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| మిక్కవేతియర్ | = | ఉత్తమప్రమాణమైన వేదమును అధ్యయనము చేసినవారియొక్క |
| వేతత్తిన్ | = | వేదమునందలి |
| ఉట్పొరుళ్ | = | రహస్యార్థమును |

| | | |
|---|---|---|
| నిఱ్కప్పాడి | = | శ్రోతల హృదయములో నిలుచునట్లు తమ ప్రబంధ మున గానముచేసి |
| ఎన్నెఞ్జుళ్ | = | నా మనస్సునందు |
| నిఱుత్తినాన్ | = | నిలిపినవాడైన |
| తక్కశీర్ | = | తగిన భక్త్యాది గుణములుగల |
| శడకోపన్ | = | నమ్మాళ్వారులు అనెడు |
| ఎన్నమ్బిక్కు | = | మా స్వామికి |
| ఆళ్పుక్కాతల్ | = | దాసుడను కావలెనను కోరిక |
| అడిమైప్పయన్ అన్ఱే | = | కైంకర్యమను ప్రయోజనమును కలిగియున్నదిగదా! |

**వివరణము :**

ఆళ్వారుల దయకు మించినది అనగా పెద్దది మరొకటి లేదు అని వెనుక చెప్పియున్నారు. ఆ గొప్పతనమేమనగా నాలో గల నైచ్యము అనబడు అయోగ్యతను కూడా లెక్కచేయక సకల వేదసారమైన భాగవతశేషత్వము అను రహస్యార్థమును నా మనసునకుగూడ పట్టునట్లు వారు ఉపదేశించుటయే. ఇట్టి ఉపకారమును చేసినవారి దయకు సాటి మరేమున్నది? అని ఈ పాశురమున వివరించుచున్నారు. భగవంతుని విషయమునందు తమ ఆచార్యులైన నమ్మాళ్వారులు కూడ **"నీశనేన్ నిఱై వొన్ఱుమిలేన్ ఎన్కణ్ పాశంవైత్త పరం శుడర్చ్చోది"** అని భగవంతుని విషయమున ఆయన గొప్పతనమును చెప్పియున్నారు. సర్వజ్ఞులైన నిత్యసూరులచేత సేవింపబడు ఆ స్వామిని గూర్చి నీచుడను అగతికుడను అగు నా విషయమున ఎంతో ప్రేమను – వాత్సల్యమును చూపియున్నాడు గదా అని తన నైచ్యమును అనుసంధించుకొని వారు చెప్పగా, ఈ మధురకవులు అదేచ్ఛాయలో తమ నైచ్యమును చెప్పుకొని ఆ ఆచార్యులు తమనభిమానించిన ఔదార్యమును ఇచట వివరించిరి.

**(మిక్కవేతియర్)** ఇంద్రియ గోచరములు కాని అపూర్వ విషయములను ఎన్నింటినో బోధించుటచేత వేదము ప్రమాణశ్రేష్ఠమైనది. అట్టి వేదమునకు చెందిన అనేక శాఖలను సంపూర్ణముగా అధ్యయనము చేసిన మహానుభావులు ఎందరో కలరు. వారందరునూ ఎన్నో నియమములు పాటించి ఎంతోకాలము శ్రమపడి వేదాంగము లను నేర్చుకొని తెలుసుకొనగలిగిన అతి నిగూఢమగు వేదసారార్థము ఒకటి కలదు. భగవంతుడు సర్వస్వామి అనియూ, జీవరాశి అంతయూ ఆయనకు శేషభూతమైనది

అనియూ వేదమునందు పైకి స్ఫురించు వాస్తవార్థము. దాని అంతరార్థమైన సారము– ఆ భగవంతునికి దాసులైనవారికి శేషభూతుడైయుండుట అనబడు తదీయ శేషత్వమే అని పెద్దలు చెప్పుచున్నారు.

**శ్లో॥ న్యగ్రోధబీజే వటవత్ ప్రణవే శబ్దజాలవత్ ।**
**సిద్ధే తదీయ శేషత్వే సర్వార్థాః సంభవంతి హి ॥**

అను శ్లోకము ఇందులకు ప్రమాణము. మర్రిగింజలో విశాలమగు చెట్టుగా పరిణమించగల శక్తి ఇడిమియున్నట్లు ఓంకారమునందు సమస్తవేదరాశియొక్క శక్తి ఇమిడియున్నట్లు భగవచ్ఛేషత్వమునకంటె అత్యుత్తమమైన భాగవతశేషత్వమునందు సర్వవేదార్థములును ఇమిడియున్నవి అని ఆ శ్లోకమునకు తాత్పర్యము. ఈ మహోన్నతమైన వేదసారమును అనగా తదీయశేషత్వమును గ్రహించగలుగుట సామాన్యులగు నెవరికినీ సాధ్యముకాదు.

**(వేదత్తి నుట్పొరుళ్ నిఱ్కప్పాడి)** – ఇట్టి మహావిషయమును నా హృదయములో నిలుచునట్టుల తమ దివ్యప్రబంధములో ఈ ఆళ్వారులు వివరించియున్నారు. వీరు ప్రసాదించిన వెయ్యి పాశురములుగల తిరువాయ్‌మొழி ప్రబంధమున ఉన్న **"పయిలుం శిడరొళి"** మరియు **"నెడుమార్కడిమై"** అను రెండు దశకములు ఈ సారార్థమునే ప్రతిపాదించుచున్నవిగదా!

**(ఎన్నెఞ్జుళ్ నిఱుత్తినాన్)** – పరుపుబండను తొలచి అందు నీరు నిలచునట్లు చేయువారివలె మా ఆచార్యులు రాతివంటి నా మనస్సునుకూడ తొలచి అందులో ఈ రహస్యార్థము పట్టునట్లు బోధించిరి.

**(తక్కశీర్చడకోపన్)** – తిరువాయ్‌మొழி ప్రబంధమును వెయ్యి పాశురములలో రచించిన మా ఆళ్వారులు భగవత్కవులు. భగవంతుని స్తుతించుటకు తగిన జ్ఞాన, భక్తి, వైరాగ్యాది మహాగుణములు వారిలో సంపూర్ణముగా నున్నవి. నిత్యసూరులకు అధిపతి భగవంతుడు అని చెప్పినట్లు భగవంతుని స్తుతించు కవులకు శిఖామణి అనదగినవారు ఈ ఆళ్వారులు అని భావము. ఈ విషయమునే ఆళ్వారులు కూడ **"ఏఱ్కుమ్ పెరుమ్ పుకழ் వానవరీశన్ కణ్ణన్ తనక్కు ఏఱ్కుమ్ పెరుంపుకழ் వణ్ కురుగూర్ శడగోపన్"** అని తామే చెప్పుకొనియున్నారు. కృష్ణుని మహాగుణములను స్తుతించుటకు తగిన జ్ఞానశక్తినీ, వాక్శక్తినీ కలవారు గనుక యీ శఠగోపులే

భగవత్కవులు అనుటలో సందేహము లేదు. "శ్రీశైలేశాష్టకమ్" అను ఎనిమిది శ్లోకముల చిన్నస్తోత్రమును రచించిన ఎరుంబియప్పా అనబడు ఆచార్యులవారుగూడా ఆ స్తోత్రమునకు చివర ఇదే విషయమును తెలియజేయు శ్లోకమును కూర్చియున్నారు.

**శ్లో॥ శఠరిపురేక ఏవ కమలాపతి దివ్య కవిః**
**మధురకవి ర్యథాచ శఠజిమ్మునిముఖ్య కవిః ।**
**యతికుల పుంగవస్య భువి రంగ సుధాకవిరాట్**
**వరవరయోగినో వరదరాజ కవిశ్చ తథా ॥**

శఠగోపమునీన్ద్రులొక్కరే శ్రియఃపతిని వర్ణించగలిగిన మహాకవి. ఆ శఠగోపులను వర్ణించగలవారునూ మధురకవులు ఒక్కరే. అట్లే రామానుజులను వర్ణింగలిగిన మహాకవులు తిరువరంగత్తముదనార్ అనబడు శ్రీరంగామృత కవీంద్రులు ఒక్కరే. అదే విధముగా శ్రీవరవరమునీన్ద్రుల వైభవమును వర్ణింగల మహాకవులు ఎరుంబియప్పా అనబడు వరదరాజకవి అను సంస్కృతనామధేయముగల ఆచార్యులవారు ఒక్కరే అని పై శ్లోకమునకు భావము.

**(ఎన్నమ్బిక్కు)** – నావంటి అజ్ఞానులనుగూడ ఉజ్జీవింపజేయగలిగిన సౌశీల్యాది మహాగుణములు పుష్కలముగా కలవారు మా ఆచార్యులొక్కరే.

**(ఆళ్‌పుక్కకాతల్)** – ఇట్టి ఆళ్వారుల విషయమున నాకు ఏర్పడిన అనన్యభక్తి **(అడిమైప్పయన్ – అన్ఱే)** – ఈ భక్తియే నాకు ఇచ్చుటనే వారి సన్నిధిలో నిత్యకైంకర్య మనబడు మహాఫలితమును లభింపజేసినది. ఇదియే ఇచటగల విశేషము. నాలో వారిపై భక్తి అంకురించుట తత్ఫలమగు వారి కైంకర్యము నాకిచ్చుటనే సంపూర్ణముగా లభించుట, ఇట్టి ప్రయోజన లాభము భగవద్విషయమునందు లేదు. ఆయనపై భక్తి కలుగుట, ఆ భక్తిని జీవితాంతము కొనసాగించుకొనిపోయినపుడే దేహత్యాగానంతరము అర్చిరాది మార్గముగా శ్రీవైకుంఠమునకు పోయి అచ్చట ఈ భక్తికి ఫలితమగు భగవత్కైంకర్య సామ్రాజ్యమును పొందుట జరుగును. ఇట్లు భగవద్భక్తి కలిగిన పిదప ఫలితమును లభించుకొనుటకు ఎంతో విలంబము కలదు. మా ఆచార్యులు కూడా **"తయరఱు శుడరడి తొழுదు ఎழு ఎన్మననే"** అని తమ మనస్సునకు భక్తి ప్రబోధమును చేసిన పిదప వెయ్యి పాశురములను పూర్తిచేసిన అనంతరమే **"మునియే నాన్ముకనే"** అనబడు నూరవ దశకమునుగూడ విన్నవించుట

పూర్తికాగా అపుడు భగవంతుడు వారికి శరీరవియోగమును కలిగించి దివ్యధామమును చేర్చుకొని అచట తన కైంకర్యమును ప్రసాదించెను. నేను అట్లుగాక ఈ శరీరముతోనే ఇచ్చటనే నాకు కలిగిన భక్తికి ఫలితముగా మా ఆచార్యుల కైంకర్యమును పొందగలిగితిని.

**(అన్రే)** – ఇది ప్రత్యక్షమైన వాస్తవము కదా! అని భావము.

h h

## పాశురము - 10

వెనకటి పాశురములలో ఆళ్వారులు తమను తీర్చిదిద్ది చేసిన మహోపకార మును ఘనముగా చెప్పుకొనియున్నారు. వారి ఉపకారమును తలంచుకొన్నపుడు వారి పాదసన్నిధిలో తాముచేయు సేవ దానికి సరియగు ప్రత్యుపకారము అసలే కాజాలదు. అట్టి స్థితిలో తాము వారి ఋణమును తీర్చుకొనుటకై మార్గాంతర మేదియు లేనందున కృతజ్ఞతను ప్రకటించుకొనుటయే తమ కర్తవ్యమని ఈ పదవ పాశురములో చెప్పుకొనుచున్నారు.

ఆచార్యుడు సదుపదేశరూపమున చేసిన మహోపకారమునకు తగిన ప్రత్యుపకారము ఏదైన ఉండునా! ఉండదా! అని ఆలోచించువారికి – లేదు అనియే ఈ క్రింది దర్మశాస్త్ర శ్లోకము సమాధానమిచ్చుచున్నది.

**శ్లో॥ కృత్స్నాం వా పృథివీం దద్యాత్ ।**
**న తత్తుల్యం కథంచన ॥**

తనకు భగవత్తత్త్వమును ఉపదేశించిన ఆచార్యునికి భూమండలమునంతయు ప్రతిఫలముగా దానముచేసి ముట్టజెప్పిననూ సరిపోదు అని దీనియర్థము. ఆచార్యుడు తనకు ఉపదేశరూపముగా అందించిన లక్ష్మీనారాయణరూపమగు దివ్య మిథున మును గదా! అట్లు వారి ఉపదేశములచే తాను లభించుకున్న ఆ దివ్యదంపతిరూప మహానిధికి సాటిగా మరియొక దివ్యదంపతి రూపమగు మహానిధి తనవద్దనున్న ఎడల ఈ శిష్యుడు దానిని వారికి సమర్పించి బదులుకు బదులుగా ఆచార్యుల ఋణమును తీర్చుకొనగలిగియుండవచ్చును. కాని అట్టి మరియొక వస్తువు అసలే అసంభవము గనుక ఇతడు ఏనాటికినీ ఆచార్యఋణమును తీర్చుకొనజాలడని గ్రహింపవలెను.

కనుక ఈ శిష్యుడు ఆచార్యులకు యావదాత్మభావిగా ఋణగ్రస్తుడుగనే ఉండక తప్పదు. వారి విషయమున కృతజ్ఞతను నిత్యము ప్రకటించుకొనుట తప్ప ఇతనికి మార్గాంతరము లేదు. ఈ విషయమునే మధురకవులు ఈ పాశురములో నమ్మాళ్వారులను గురించి విన్నవించుకొనుచున్నారు.

**మూలము :**

**పయినన్ఱాకిలుమ్ పొఙ్గలరాకిలుమ్**
**శెయల్ నన్ఱాక త్తిరుత్తిప్పణి కొళ్వాన్**
**కుయిల్నిన్ఱార్ పొழిల్ శూழ் కురుకూర్నమ్బి**
**ముయల్కిన్ఱేనున్ఱన్ మొయ్కழల్కన్పైయే.**

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పయనన్ఱాకిలుమ్ | = | నావలన ఎట్టి ప్రయోజనము లేకున్ననూ |
| పొఙ్గలర్-ఆకిలుమ్ | = | నాలో శిష్యలక్షణమగు అనుకూలవృత్తి లేకున్ననూ |
| శెయల్నన్ఱాక | = | మంచినడవడి కలుగునట్లుగా |
| తిరుత్తి | = | నన్ను దిద్దుబాటు చేసి |
| పణికొళ్వాన్ | = | నా కైంకర్యమును స్వీకరించిన |
| | | (ఇది నమ్బి అను పై పదముతో అన్వయించును) |
| కుయిల్నిన్ఱార్ | = | కోకిలలతో నిండియున్న |
| పొழిల్శూழ் | = | ఉద్యానములతో చుట్టబడియున్న |
| కురుకూర్ | = | కురుకాపురమునకు |
| నమ్బి | = | స్వామియైన ఓ శఠకోప మునీన్ద్రా! |
| ఉన్ఱన్ | = | దేవరవారియొక్క |
| మొయ్కழల్కు | = | దివ్యమైన శ్రీపాదముల విషయమున |
| అన్పైయే | = | భక్తిభావమునే |
| ముయల్కిన్ఱేన్ | = | నిత్యము నేను కాంక్షింతును. |

**వివరణము :**

నావలన తమకు ఎట్టి ప్రయోజనము లేకున్ననూ, కనీసము నాలో విధేయత మొదలగు శిష్యలక్షణములు లేకున్ననూ, సదుపదేశముతో నాలో మంచి నడవడిని

కలిగించి తీర్చిదిద్దినవారు మా శఠకోపమునీన్ద్రులు, కురుకాపురమున వేంచేసియుండు వారియొక్క శ్రీపాదములయందు నాకు నిరంతరమగు భక్తి నిలచియుండుగాక! అని కోరుటకంటె నేను ప్రార్థించవలసినది మరేమియు లేదు అని ఈ పాశురమున మధురకవులు తమ కృతజ్ఞతా భావమును ఆవిష్కరించుకొనుచున్నారు. (కృతం జానాతి-కృతజ్ఞః) చేసిన ఉపకారమును మరువకుండ నిత్యము తలంచుకొనుటయే కృతజ్ఞత అనబడును.

**(పయనన్ఱాకిలుమ్ పొఙ్గలరాకిలుమ్) –** లోకమునందు ఒకడు మరొకనికి ఉపకారము చేసినపుడు ఆ రెండవవానివలన తనకు ఏదైన ప్రయోజనము లభించునని ఆశపడును. నావలన అట్టి ప్రత్యుపకారములేవియు మా ఆచార్యులపేక్షింపలేదు. స్వార్థభావన అణుమాత్రముకూడ లేకుండనే నాకుపదేశముగావించిరి. పైగా శిష్యునిలో ఉండవలసిన నమ్రత, సేవాభావము మొదలైన లక్షణములు కూడ నాలో లేవు. ఐననూ కేవలము నాయొక్క దుర్గతినే తాము గమనించి పరమకృపతో వారు నన్ను ఉజ్జీవింపజేసిరి. ఇట్లు ప్రయోజనము లేకున్ననూ ఎదుటివ్యక్తిలో యోగ్యత లేకున్ననూ ఉపదేశించినవారు ఎవరైన కలరా అని విచారించినపుడు రావణునికి హితోపదేశము చేసిన సీతాదేవియే మనకు దృష్టాంతముగా కనపడును. వాడు చేసిన అపచారమునకు శ్రీరాముని కంటబడినచో సర్వనాశమును పొందునే అను దయతో ఆ మహాదేవి ద్రోహియగు రావణునికికూడ **"మిత్ర మౌపయికం కర్తుం"** రామునితో స్నేహమును చేయుము. నీ లంకారాజ్యమును క్షేమముగా చూచుకొనుము అని ఉపదేశించినది.

ఒకడు చెడిపోవుచున్నపుడు బాగుపరచవలెనను సద్భావము కల దయా మయులు ఈ లోకమున కూడ కొందరుందురు. ఒకడు తన ఇంటి ముఖద్వారమును దొడ్డితలుపునూ కూడా బీగము వేసుకొని ఇంటిలో నిదురపోవుచున్నాడు. అపుడా ఇంటిలో అనూహ్యముగా అగ్నిజ్వాలలు వ్యాపించగా చూచినవారు లోపలనున్నవానిని కాపాడుటకై ఎంతగానో ప్రయత్నింతురు. దానివలన తమకు ఒరిగిన ప్రయోజన మేమియు లేకపోవచ్చును. మరియు లోపలనున్నవాడు తనను రక్షించమని ప్రార్థించి యుండకపోవచ్చును. అయిననూ అతని ప్రాణరక్షణమునకై ఆరాటపడు దయా మయులవలెనే మా ఆచార్యులైన ఆళ్వారులు కూడా నేను సంసారమునపడి దుర్గతిని అనుభవించుచున్న స్థితిని చూచి నిర్హేతుకమైన కృపతో బ్రహ్మోపదేశమును చేసి నన్ను కాపాడిరి.

**(శెయల్ నన్టాక)** – శెయల్ అనగా చేష్ట–చేత–నడవడి అని అర్థము. నాలో ఎటువంటి నడవడి లేకున్ననూ తమయొక్క (శెయల్) సదనుష్ఠానముచేతనే నాలో మార్పును కలిగించిరి. **(తిరుత్తిప్పణికొళ్వాన్)** ఇట్లు నన్ను సరిదిద్ది నావల్ల కైంకర్యము స్వీకరించినవారు ఆళ్వారులు. **"తీర్న్ద వడియవర్ తమ్మై త్తిరుత్తి ప్పణి కొళ్ళవల్ల"** అని చెప్పబడినట్లు తననాశ్రయించినవారిలో గల ప్రతిబంధకములను అన్నింటినీ, అనగా, అజ్ఞానము, కర్మసంబంధము, స్థూల సూక్ష్మ శరీరములు మొదలగు వాటి నన్నింటినీ తొలగించివేసి పరిశుద్ధుని గావించిన పిదపనే భగవంతుడు స్వీకరించునట. వీరు అట్లుగాక ఉన్నదున్నట్లుగా నన్ను తమదగ్గరకు చేర్చుకొని ఉపదేశముతో ఉజ్జీవింపజేసిరి. ప్రేమతో నా సేవలను స్వీకరించిరి.

**(కుయిల్ నిన్టార్ పొழిళ్శూழ்)** – కురుకూరునకు చుట్టూ గల తోటలన్నియు మధురముగా నినదించు కోకిలలతో నిండియున్నవి. కోకిలలుగూడా ఆళ్వారులచే నావలెనే దిద్దుబాటు చేయబడినవి కాబోలు. ఆళ్వారులు తమ ప్రబంధమున **'కాణవారాయ్'** అని (నాకు దర్శనమునియ్యవా! అని) ఒకచోట నాక్రోశించిరి. మరియొకచోట **'యార్ నిగర్ అగల్వానత్తే'** (పరమపదమునందుగూడ నాకు సాటియైన పరమభక్తులు కలరా?) అని ఉద్ఘోషించిరి. ఈ కోకిలలు ఆ ద్రావిడ పదములను విని అట్లే తాముగూడ పంచమస్వరములో "కాణవారాయ్" – "యార్నిగర్ అగల్వానత్తే" అని ఉద్ఘోషించుచున్నవి. ఈ కోకిలలు గురువువద్ద నేర్చుకొన్న పాఠమును గట్టిగా వల్లించు శిష్యులవలె ఘోషించుచున్నవి. అట్టి ఉద్యానములతోను మధురకోకిలల నాదములతోనూ ఒప్పుచున్న కురుకాపురమునందు వేంచేసియున్న సద్గుణపూర్ణులైన మా ఆచార్యులు నావంటి చేతనులనే కాక తిర్యగ్జంతువులను కూడ ఉజ్జీవింపచేసినారు.

**(ముయల్ కిన్డ్రేనున్టన్ మొయ్కழల్కన్పైయే)**– ఓ శఠగోపమునీన్ద్రా! దేవరవారి శ్రీపాదసన్నిధిలో నాకు నిరంతరమైన భక్తివరలు గాక అని ప్రార్థించుచున్నాను. ఇట్లు కృతజ్ఞతను ప్రకటించుకొనుటకంటె మరేవిధమగు ప్రత్యుపకారమును చేయగల శక్తి నాలో లేదు అని భావము.

h h

## పాశురము - 11

ఫలశ్రుతి అనబడు ఈ చివరి పాశురమున ఎవరు యీ ప్రబంధమును సాదరముగా అభ్యసించగలరో అట్టివారికి ఈ జన్మాంతమున లభించు స్థిరనివాసము పరమపదమునందే అని ఫలితమును వివరించుచున్నారు.

**మూలము :**

**అన్బన్దన్నై యడైన్దవర్ కట్కెల్లా**
**మన్బన్ తెన్కురుకూర్ నకర్నమ్బిక్కు**
**అన్బనాయ్ మదురకవి శొన్నశొల్**
**నమ్బువార్ పతి వైకున్దమ్ కాణ్మినే.**

**ప్రతిపదార్థము :**

అన్బన్దన్నై = వాత్సల్యగుణశాలియగు పరమాత్మను
అడైన్దవర్ కట్కెల్లామ్ = ఆశ్రయించినవారందరికినీ
అన్బన్ = ప్రేమపాత్రుడైన
తెన్ కురుకూర్ నకర్ నమ్బిక్కు = దక్షిణకురుకాపుర స్వామికి
అన్బనాయ్ = ప్రేమపాత్రుడైన
మదురకవిశొన్నశొల్ = మధురకవియాళ్వారులు చెప్పిన ఈ ప్రబంధమును
నమ్బువార్ = సాదరముగా అభ్యసించువారందరికినీ
పతి = నివాసస్థానము
వైకున్దమ్ = వైకుంఠలోకమే సుమా
కాణ్మినే = గుర్తింపుడు.

**వివరణము :**

ఈ పాశురమునందు మూడు అన్బన్ అను పదములు కలవు. మొదటి అన్బన్ అను పదము పరమాత్మకు, రెండవ పదము నమ్మాళ్వారులకు, మూడవపదము మధురకవులకును అన్వయించును. ఈ పదమునకు ప్రేమించువాడు, ప్రేమపాత్రుడు అని రెండువిధములుగా అర్థమును చెప్పుకొనవచ్చును. ఇందు మొదటిపదములో ఫలానవారికి ప్రియుడు అనియో ఫలానవారిని ప్రేమించువాడు అనియో వివరించి

చెప్పనందున పరమాత్మ అందరికినీ ప్రియుడనియూ అందరినీ ప్రేమించువాడనియూ గ్రహింపవలెను.

శ్రీమద్రామాయణమునందు చెప్పబడినట్లు **"రిపూణామపి వత్సలః"** శత్రువులపై గూడ వాత్సల్యమును చూపువాడగుటచేతను, భారతములో చెప్పబడినట్లు **"సర్వేషామేవ లోకానాం పితా మాతాచ మాధవః"** భగవంతుడు సర్వలోకములకును తల్లియు, తండ్రియు ఐనందునను, జితంతాస్తోత్రమున చెప్పబడినట్లు **'దేవానాం దానవానాంచ సామాన్యం అధిదైవతమ్'** దేవతలకు రాక్షసులకునూ పక్షపాతములేకుండ ఆశ్రయింపదగిన దైవము ఈ పరమాత్మయే గనుకనూ, ఇందలి మొదటి అన్బన్ అను పదము భగవంతుని బోధించునని గ్రహింపదగును. దీనినిబట్టి భగవంతుని ప్రేమ అందరిపైననూ సమానముగా వర్తించునని తేలినది.

**(తన్నై యడైన్దవర్ కట్కెల్లా మన్బన్ తెన్‌కురుకూర్ నకర్ నమ్బి) –** ఇక నమ్మాళ్వారులలో గల ప్రేమ భగవంతుని ప్రేమవలె అందరిపైననూ వర్తించునట్టిది కాదు. మరేమనగా ఈ ఆళ్వారులే **"పరమనై పయిలుం తిరువుడయార్ యవర్ అవర్ ఎన్నైయాళుం పరమర్"** అని చెప్పుకొన్నట్లు భగవద్దాస్యము అనబడు మహాసంపదకలవారెవరో వారే నాకు రక్షకులు అని భావించినవారు కనుక భగవద్భక్తులపైననే వీరికి అతిప్రీతి అని తేలినది. తమవలెనే ఎవరు భగవత్పాదార విందములే శరణమని నమ్మిరో వారికి నేను చరమావధి దాసుడను అని ఈ ఆళ్వారుల నిశ్చితాభిప్రాయము. కనుకనే **"అడి యారడియార్ తమ్మడియారడియార్"** అని చెప్పుకొనిరి. కులశేఖరులవలె **"తద్భృత్యభృత్య పరిచారకభృత్యభృత్య భృత్యస్యభృత్య"** అన్నట్లు తమను దాస్యములో చివరిమెట్టుగా భావించిన భాగవత నిష్ఠాపూర్ణులు కురుకాపురాధీశులైన ఈ నమ్మాళ్వారులు.

**(అన్బనాయ్ మతురకవి) –** కొందరు భక్తులైయుండగా వారికి భక్తులైనవారు ఆళ్వారులు కాగా వారిని ఆచార్యులుగా ప్రేమించినది యీ మధురకవులు. కొందరిలో గల భగవద్భక్తి నిష్ఠకంటెను, ఆళ్వారులలోగల భాగవతనిష్ఠ అతిశ్లాఘ్యమైనదిగా గ్రహింపదగును. స్వార్థముగా ఏదైన పురుషార్థమునపేక్షించువారు భగవంతుని ఆశ్రయింప దగును. అట్లుగాక భగవత్ప్రీతియే తనకు పురుషార్థమని భావించువారు భగవంతునికి ప్రియులైన భాగవతులను ఆశ్రయింపదగును. భగవంతుడు **"జ్ఞానీత్వాత్మైవ మే**

**మతమ్"** అనియూ **"మమ ప్రాణాహి పాండవాః"** అనియూ తన భక్తులను ప్రాణసమానులుగా భావించువాడు గదా! కనుక వారినాశ్రయించుట భగవంతునికి అతి ప్రియమగును. ఇక ఆ ఈశ్వర ప్రీతికొరకును, ఈ భాగవతుల ప్రీతికొరకును కైంకర్యమును చేయదలంచువాడు సదాచార్యులని ఆశ్రయింపదగును. ఆచార్యుని యందు పరిపూర్ణ భక్తిప్రపత్తులు కలిగియున్నచో భగవంతుడు భాగవతులు కూడ ఇతనిని ప్రేమతో కటాక్షింతురు. **'ఆచార్యవాన్'** – అనగా సదాచార్యులనాశ్రయించి ఉజ్జీవించుచున్నాడు అని మెచ్చుకొందురు. అట్టి ఆచార్యనిష్ఠకు ప్రథమోదాహరణమైన వ్యక్తి ఈ ప్రబంధ రచయిత మధురకవి అని భావము.

మొట్టమొదటిసారిగా తనను దగ్గరకు తీసి తనకు తెలియని ఆత్మ స్వరూపమును భగవత్స్వరూపమును మధురోపదేశములతో ఉపకరించినవాడు ఈ ఆచార్యుడే. పిదప తాను భగవంతుని ఆశ్రయించినపుడు గూడ స్వామి తనను అనుగ్రహించునట్లు పురుషకారమును చేసి సహాయపడినది ఈ ఆచార్యుడే. మరియు తనయొక్క ఉత్తమానుష్ఠానముచే ఈ శిష్యుని నడత కూడ సన్మార్గమున కొనసాగునట్లు శిక్షను గరపినవాడు ఈ ఆచార్యుడే. చివరకు వైకుంఠమును చేరిన పిదప మోక్షదశలో కూడ యీ యీ విధముగా కైంకర్యమును చేయుమని బహుముఖముగా భగవత్సేవా ఫలమును గరపెడువాడుకూడ ఈ ఆచార్యుడే. ఇన్ని ఉపకారములను చేసిన ఉత్తమాచార్యులగు ఆళ్వారులపై పూర్ణభక్తి కలిగిన మధురకవులు చెప్పిన దివ్యప్రబంధమే ఇది. ఇందు ప్రతిపాదింపబడిన సారతమమగు ఆచార్యనిష్ఠయందు విశ్వాసము కలిగి దీనిని పఠించుట మంచిది. అట్టి ఆచార్యనిష్ఠలో పూర్ణమగు అవగాహన లేకున్ననూ వాఙ్మాత్రము చేతనే ఈ ప్రబంధమునభ్యసించిననూ అట్టివారు **"సోధ్వనః పారమాప్నోతి తద్విష్ణోః పరమంపదమ్"** అని కఠోపనిషత్తులో నిరూపింపబడిన వైష్ణవ దివ్యధామమును స్థిరనివాసముగా పొందగలరు.

ఇచట ఫలశ్రుతిని చెప్పుటలో ఆళ్వారులు వేంచేసియుండు కురుకాపురమును ప్రాప్యముగా చెప్పక వైకుంఠమునే ప్రాప్యముగా చెప్పుటలో కారణమేమి? వీరికి ప్రధానోద్దేశ్యము ఈ ఆళ్వారులేగాని ఆ వైకుంఠనాథుడు కాదుగదా! అన్నచో సమాధాన మేమనగా ఈ కురుకాపురమున ఆళ్వారులకుకూడ ఆరాధ్యదైవమైన ఆదిదేవుని ప్రభావము, ఈ ఆళ్వారులయొక్క ప్రభావము రెండునూ సమానస్థాయిలో నున్నవి.

వైకుంఠమందట్లుగాక ఈ ఆళ్వారులు చెప్పినట్లు **"అడియార్ నిలాకిన్ట వైకుందమో"** అనియూ **"వానవర్ నాడు"** అనియూ ప్రశంసింపబడినందున ఆళ్వారుల అభిప్రాయ ప్రకారము భక్తులైన నిత్యసూరులకే అచట భగవంతునికంటె ప్రాధాన్యము గోచరించుట చేత దానిని నిత్యసూరుల నగరముగనే కీర్తించియుండుటచేతనూ ఆ మహాభాగవతులైన నిత్యసూరుల దివ్యస్థానమే ఈ గ్రంథమును పఠించువారికినీ ప్రాప్యమైన పరమపదము అని భావింపవలెను.

ఇచట **నమ్బి తిరువఝుదివళనాడు దాసర్** అను ఆచార్యులు మరియొక విధముగా అర్థస్వారస్యమును వివరించిరి. అది ఏమనగా-**"నమ్బువార్ పతివైకున్దమ్"** ఈ ప్రబంధముననుసంధించువారు ఎచ్చట నివసింతురో అదియే శ్రీవైకుంఠము. ఇట్లు చెప్పుటకు ప్రమాణమేమనగా నమ్మాళ్వారులు తిరువాయ్‌మొలో ఐదవశతకమున మూడవ దశకమున చివరకు ఫలశ్రుతిని చెప్పుచూ **"ఉరైక్క-వల్లార్కు, వైకున్దమ్ ఆకుమ్ తమ్-ఊరెల్లామ్"** అని ప్రసాదించుటయే. ఈ ప్రబంధమును పఠించువారికి వారు నివసించుస్థానమే శ్రీవైకుంఠమువలె పరమపవిత్రమగును అని ఆచార్యులైన ఆళ్వారులు చెప్పినందున ఆ విధముగనే వీరును భక్తులు వసించు స్థలమే వైకుంఠమగును అన్నట్లు ఫలమును చెప్పియుండవచ్చును. పూర్వము పెత్తి అను ద్రవిడ నామముగల ఒక ఆచార్యులు పరాశరభట్టరువారి కాలమున శ్రీరంగమునందు కొనసాగిన మహావైభవము గుర్తించి "శ్రీరంగమునకు శ్రీవైకుంఠమునకు గల అడ్డుగోడ తొలగిపోయినదనియూ, ఇపుడు శ్రీరంగమే శ్రీవైకుంఠము అనవచ్చును గనుక శ్రీరంగమునకు శ్రీవైకుంఠమునకు భేదములేదనియూ, శ్రీరంగమునకు తమ ప్రభావముచే ఇట్టి మహావైభవమును సంపాదించిపెట్టిన పరాశరభట్టరువారి ఘనతయే ఇందుకు కారణమనియూ ప్రశంసించిరట. అట్టి భట్టరువారి కాలమున శ్రీరంగము నకు కలిగిన మహోన్నతదశను నమ్బిళ్లైగారు పలుమారులు కీర్తించుచుండిరి. అదే విధముగా భగవత్‌భాగవతాచార్యసమృద్ధిగల దివ్యదేశమేదైననూ శ్రీవైకుంఠమేనని భావము.

C